
'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 37

సోమవారం 29-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




**జాక్స్ ధమాకా..**

గుజరాత్‌పై 201 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన బెంగళూరు - 14లో



**కేవైసీతోనే పెట్టుబడులు**

కేవైసీ స్థితిని చెక్ చేసుకోవాల్సిందే.. వ్యాలిడేట్ ఉండాల్సిందే - 15లో



**బాద్‌షాల అరాచకాలు కన్పించలేదా?**

మన దేశ రాజులను కించపర్చిన రాహుల్.. నవాబులు, సుల్తాన్ల అరాచకాలపై నోరుమెదపడం లేదని ప్రధాని మోదీ మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



**అసమానతలు తొలగేదాకా..**

సమాజంలో అసమానతలు ఉన్నంతకాలం రిజర్వేషన్లు ఉంటాయని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అన్నారు.

వివరాలు 11లో ▸



**ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ రాజీనామా**

ఆప్‌తో పొత్తును వ్యతిరేకిస్తూ ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ పదవికి అర్వీందర్ సింగ్ లవ్లీ రాజీనామా చేశారు.

వివరాలు 6లో ▸



**బాలీవుడ్ నటుడు అరెస్ట్**

మహాదేవ్ బెట్టింగ్ యాప్ స్కామ్ కేసులో బాలీవుడ్ నటుడు సాహిల్ ఖాన్‌ను అరెస్ట్ చేసినట్లు ముంబై సిట్ తెలిపింది.

వివరాలు 6లో ▸



మండుటెండలో మధ్యాహ్నం 2:30 గంటలకు.. తిరుపతి జిల్లా వెంకటగిరిలో ఎండను సైతం లెక్క చేయకుండా సీఎం వైఎస్ జగన్ సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

"

డబ్బులు మీ అకౌంట్లోకి, మీ చేతికే పంపితే అది జగన్ పాలన! అదే డబ్బులు తన అకౌంట్లోకి, తన జేబులోకి, తన పెత్తందారీ స్నేహితుల జేబుల్లోకి వేసుకుంటే అది బాబు పాలన! చంద్రబాబుకు ఓటు వేస్తే ప్యాకేజీ స్టార్‌కు, రామోజీరావుకు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణకు, టీవీ 5 నాయుడికి, వదినమ్మకి మనీ ట్రాన్స్‌ఫర్ అవుతుంది. బాబుది ఈనాడు, ఈటీవీ, ఆంధ్రజ్యోతి, టీవీ 5లో మాత్రమే కనిపించే గ్రాఫిక్స్, మోసాల పాలన.

రాష్ట్రాన్ని విడగొట్టిన వాళ్లు.. ఇంటింటి అభివృద్ధిని చెడగొట్టిన వాళ్లు.. అబద్ధాలే పునాదులుగా, మోసాలే అలవాటుగా, కుట్రలు, వెన్నుపోట్లు నైజంగా, గుంపులు గుంపులుగా జెండాలు జత కట్టి వస్తున్నారు. ఈ పేదల వ్యతిరేకులు, మోసగాళ్లకు ఓటుతో పోలింగ్ బూత్‌లో బుద్ధి చెప్పేందుకు మీరంతా సిద్ధమేనా?

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

# ఓటుతో మోసగాళ్లకు వేటు

## తాడిపత్రి, వెంకటగిరి, కందుకూరు ఎన్నికల సభల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- నా 58 నెలల పాలనలో ఏం చేశానో చెబుతా.. నీ 14 ఏళ్ల పాలనలో చేసిందేమిటో చెప్పగలవా బాబూ?
- నీలా బడాయిలు చెప్పకుండా నా ప్రోగ్రెస్ రిపోర్టు ప్రజలకే అందజేశా
- నేను రూపాయిస్తే నువ్వు రెండు రూపాయిలిస్తానంటావా?

10లో

- నువ్వేం చేశావో చెప్పకోలేక నా పథకాల గురించి మాట్లాడతావ్ ఏమిటయ్యా?
- జన్మభూమి కమిటీలను మళ్లీ తెస్తానని చెప్పే ధైర్యముందా?
- జగన్ తెచ్చిన స్కీమ్‌లను రద్దు చేస్తానని చెప్పే ధైర్యం ఉందా?
- చంద్రబాబుది అబద్ధాలు, మోసాల ఫ్యాక్టరీ.. ఆయన్ను నమ్మటం అంటే.. పులినోట్లో తల దూర్చటమే
- డబ్బులు మీ ఖాతాల్లోకి పంపితే అది జగన్ పాలన
- బాబుకు ఓటేస్తే ఆయన స్నేహితులకే డబ్బులు ట్రాన్స్‌ఫర్

### మండుటెండల్లోనూ జన సునామీ

మేనిఫెస్టో ప్రకటించాక సీఎం జగన్ చేపట్టిన మలివిడత ప్రచారానికి జన నీరాజనం

తాడిపత్రి, వెంకటగిరి, కందుకూరు సభలకు పోటెత్తిన జనసంద్రం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రసంగాలకు భారీ జనస్పందన

11లో

### ఫ్యాక్ట్‌చెక్

## డిజిటల్ టెక్నాలజీకి అర్థం తెలుసా రామోజీ..



- అవి జిరాక్సు కాపీలు కాదు.. ఈ–స్టాంపులు
- పలు రాష్ట్రాల్లో అమల్లో ఉంది
- నేషనల్ స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ద్వారా అమలు

5లో

## యువత ఆశలకు బాబు సమాధి

జగన్ పాలనలోనే ఉగాది

- చంద్రబాబు ఇచ్చింది కేవలం 37 వేల ఉద్యోగాలే
- జగన్ పాలనలో 2.3 లక్షల రెగ్యులర్ పోస్టుల భర్తీ
- అత్యధిక ఉద్యోగావకాశాల కల్పనలో దేశంలోనే ఏపీకి 4వ స్థానం
- బాబు హయాంలో నిరుద్యోగిత రేటు 5.3 శాతం
- జగన్ పాలనలో అది 4.1 శాతానికి తగ్గుదల

16లో

## మేనిఫెస్టోలో చెప్పిన దానికి మించి కాపులకు భారీ ఆర్థిక సాయం

- కాపులకు ఏడాదికి రూ.2,000 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు సాయం చేస్తామని హామీ
- ఐదేళ్లలో కాపులకు డీబీటీ, నాన్ డీబీటీ కలిపి రూ.34,005.12 కోట్లు సాయం.. రూ. 24 వేల కోట్లు అదనంగా సాయం
- కాపులను నిలువునా మోసం చేసిన చంద్రబాబు
- ఐదేళ్లలో బాబు కేటాయించింది రూ.1,340 కోట్లే

12లో





## జగన్.. రేపు నిన్ను చంపితే ఏమవుతుంది?



నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం సభలో చంద్రబాబు వివాదాస్పద వ్యాఖ్యలు

- బహిరంగంగానే బరితెగించిన టీడీపీ అధినేత.. సీఎం జగన్‌పై కుతంత్రం!
- జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక భౌతికంగా నిర్మూలించే కుట్ర
- కొద్దిరోజుల క్రితం 'ఆ దున్నపోతును మనిషికి ఒక రాయి తీసుకుని కొట్టండి' అంటూ వ్యాఖ్య.. ఆ తర్వాతే విజయవాడలో సీఎంపై హత్యాయత్నం
- మరో సభలో.. గాజు గ్లాసు తీసుకుని పొడవమంటూ కేడర్‌కు సైగలు
- తాజాగా.. జగన్ నిన్ను చంపితే ఏమవుతుందంటూ బహిరంగ ప్రసంగం
- గతంలో 'గాలిలో వస్తాడు..గాలిలోనే పోతాడు' అంటూ కూడా వ్యాఖ్య
- ఓటమి భయంతో ఇష్టానుసారం బాబు బరితెగింపు మాటలు
- మరోవైపు.. తన పాలన నచ్చితే ఓటేయమని అభ్యర్థిస్తున్న జగన్
- జగన్‌కు ప్రాణహాని ఉందని ఈసీకి ఫిర్యాదు చేసేందుకు వైఎస్సార్‌సీపీ ఏర్పాట్లు

3లో

### ఏమన్నా చెప్పండి.. మేనిఫెస్టోలో పెట్టేద్దాం

మోసపు హామీలతో ప్రజలను ఆకర్షించేందుకు చంద్రబాబు పాట్లు

3లో

### టీడీపీది చీటింగ్ సిక్స్

సంక్షేమం వల్ల జనం సోమరులై పోతారని టీడీపీ గగ్గోలు పెట్టింది

ఇప్పుడేమో సూపర్ సిక్స్ అంటూ ప్రజల్ని మభ్యపెడుతోంది

సీపీఎం నేత శ్రీనివాసరావు

11లో

## మే నెల పింఛన్ బ్యాంకు ఖాతాలో జమ

1వ తేదీనే పింఛను పంపిణీ మొదలు.. జూన్ నెలకూ ఇదే విధానం

- ఆధార్‌తో బ్యాంకు ఖాతా అనుసంధానం అయిన వారందరికీ ఈ విధానంలోనే..
- అనారోగ్యంతో పింఛను పొందుతున్న వారు, మంచం/వీల్‌చైర్‌కే పరిమితమైన వారికి ఇంటివద్దే పంపిణీ
- దివ్యాంగులు, అమరజవానుల భార్యలకూ ఇంటి వద్దే పింఛను
- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా కొత్త మార్గదర్శకాలు
- రాష్ట్రంలో మొత్తం 65.49 లక్షల మంది లబ్ధిదారులు.. దాదాపు 48.92 లక్షల మందికి బ్యాంకు ఖాతాలో జమ

2లో



- ఖాతాలో జమ అయిన వెంటనే బ్యాంకు నుంచి మెసేజ్
- ఎవరికి ఎలా పింఛన్ ఇస్తారన్న వివరాలు సచివాలయాల్లో ప్రదర్శన

### అవ్వాతాతలకు బాబు బ్యాచ్ తెచ్చిన కష్టాలు

- ప్రతి నెలా 1నే వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛను అందిస్తున్న సీఎం జగన్
- పచ్చ బ్యాచ్‌కు కంటగింపు
- ఈసీకి చంద్రబాబు సన్నిహితుల ఫిర్యాదు
- వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచాలన్న ఈసీ
- అయినా ఫిర్యాదులు ఆపని చంద్రబాబు బ్యాచ్
- మే, జూన్ నెలల పింఛను బ్యాంకు ఖాతాల్లో జమకు ఈసీ ఆదేశం
- అన్ని ఊర్లలో బ్యాంకులు ఉండవు

2లో



## ఆర్థిక కేటుగాళ్లకు టీడీపీ అడ్డా

మాల్యా, నీరవ్ మోదీ వారసులు సుజనా, రఘురామకృష్ణరాజు, సీఎం రమేశ్, గంటా

బ్యాంకులకు దాదాపు రూ.4,563 కోట్లు ఎగ్గొట్టిన వైనం

వీళ్లు ఎక్కడున్నా చంద్రబాబు మనుషులే.. ఆయన కోసం పనిచేయడమే లక్ష్యం

I లో

## క్లుప్తంగా...

### నేటితో నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు సోమవారం మధ్యాహ్నం 3గంటలకు ముగియనుంది. రాష్ట్రంలో 25 లోక్‌సభ స్థానాలకు మొత్తం 503 నామినేషన్లకు, 175 అసెంబ్లీ స్థానాలకు 2,705 నామినేషన్లకు ఆమోదం తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణలకు గడువు ముగిసిన అనంతరం ఏయే నియోజకవర్గానికి ఎంతమంది అభ్యర్థులు పోటీలో ఉన్నారనేది తేలుతుంది. ఏ నియోజకవర్గంలో అయినా 16మందికి పైగా అభ్యర్థులు పోటీలో ఉంటే అక్కడ రెండు ఈవీఎంలతో పోలింగ్ నిర్వహిస్తారు. ఒక ఈవీఎంలో 16 గుర్తులకు మాత్రమే అవకాశం ఉంది.

### టికెట్లు అమ్ముకున్న సంస్కృతి చంద్రబాబుది

- మంత్రి ధర్మాన ప్రసాదరావు
- వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి అనుచరులు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నిజాయితీని అవమానించి టికెట్లను డబ్బులకు అమ్ముకున్న నీచ సంస్కృతి చంద్రబాబుదని మంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలో ఆదివారం మంత్రి సమక్షంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అనుచరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు ఒకపక్క, కొడుకు లోకేశ్ మరోపక్క టికెట్లు అమ్ముకుని వ్యాపారం చేసుకున్నారే తప్ప నిజాయితీపరుల్ని విస్మరించారని చెప్పారు. డబ్బులకు సీట్లు అమ్ముకున్న వారిని శాసనసభకు పంపిస్తే పేదప్రజలపై ఏం మాట్లాడగలరని ప్రశ్నించారు. సూపర్‌-6 పేరుతో మరోసారి మోసం చేసేందుకు చంద్రబాబు ప్రయత్నం చేస్తున్నారని, మోసపోయేందుకు ఎవరూ సిద్ధంగా లేరన్నారు. పార్టీలో చేరిన వారిలో ప్రధానంగా సూర్యనారాయణ, అప్పారావు, బాట్న భాస్కరరావు, శిమ్మ సూర్యనారాయణ, దాలిరాజు, రాజు, కునుకు గోవింద్, కృష్ణవేణి, ప్రసాద్, కునుకు గోవింద్, గొర్లె రామారావు, రామారావు తదితరులున్నారు.



హామీలెవరూ నమ్మట్లేదు! గతంలో చెప్పినట్లు ఇవి కూడా అబద్ధాలనుకొని వెళ్లిపోతున్నార్సార్!

## అవ్వాతాతలకు

# బాబు బ్యాచ్ తెచ్చిన కష్టాలు

- రాష్ట్రవ్యాప్తంగా పింఛనుదారులను ఇబ్బందుల్లోకి నెట్టిన చంద్రబాబు అండ్ కో
- ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే ఠంఛనుగా పింఛను అందిస్తున్న సీఎం జగన్
- పచ్చ బ్యాచ్‌కు కంటగింపుగా మారిన ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ
- కేంద్ర ఎన్నికల సంఘానికి బాబు సన్నిహితుల ఫిర్యాదు
- వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచాలన్న ఎన్నికల సంఘం
- ఈ నెలలోసచివాలయాల ద్వారా పంపిణీ.. కొందరికి ఇంటి వద్ద పంపిణీ
- అయినా ఫిర్యాదులు ఆపని చంద్రబాబు బ్యాచ్
- అధికారులను బ్లాక్‌మెయిల్ చేసేలా ఎల్లో మీడియా కథనాలు
- తాజాగా మరోసారి ఆదేశాలు జారీ చేసిన ఎన్నికల సంఘం
- మే, జూన్ నెలల పింఛను బ్యాంకు ఖాతాల్లో జమకు నిర్ణయం
- అన్ని ఊర్లలో బ్యాంకులు ఉండవు
- వ్యయప్రయాసలకోర్చి మండల కేంద్రం లేదా పట్టణానికి వెళ్లక తప్పని పరిస్థితి



సాక్షి, అమరావతి: ఎన్నికల కోడ్‌ను అడ్డంపెట్టుకొని తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ నాయకులు రాష్ట్రంలోని లక్షలాది అవ్వాతాతలు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారు. వీరికి జీవనాధారమైన ప్రభుత్వ పింఛను అందకుండా కుట్రలు పన్నుతున్నారు. సీఎం జగన్ వలంటీర్ల ద్వారా 65,49,864 మంది అవ్వాతాతలు, దివ్యాంగులు, ఇతర పింఛను లబ్ధిదారులకు నెలనెలా ఠంఛనుగా ఒకటో తేదీనే వారున్న చోటునే పింఛను అందిస్తున్నారు. గత ఐదేళ్లుగా నిర్విఘ్నంగా ఇంటి వద్దే పింఛను అందుతుండటం చంద్రబాబు నేతృత్వంలోని ఎల్లో బ్యాచ్‌కు కంటగింపయింది. దీంతో బాబు బ్యాచ్ ఎన్నికల సంఘానికి చేసిన ఫిర్యాదుల కారణంగా పింఛన్ లబ్ధిదారులు గత నెలలో సచివాలయాలకు వెళ్లి పింఛను డబ్బు తీసుకోవాల్సి వచ్చింది. అయినా చంద్రబాబు బ్యాచ్ పచ్చ కళ్లు చల్లబడకపోవడంతో వీరికి మరిన్ని కష్టాలు వచ్చి పడ్డాయి. చంద్రబాబు హయాంలో పింఛను మంజూరవడమే గగనమైతే, ఆ వచ్చే కాస్త పింఛను కోసం అవ్వాతాతలు, దివ్యాంగులను నానా అగచాట్లకు గురిచేసే వారు. అందులోనూ కమీషన్లు గుంజేవారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత అవ్వాతాతలు, దివ్యాంగులు, ఇతర పింఛన్‌దారుల అవస్థలకు చెల్లుచీటీ పాడారు. సంతృప్త స్థాయిలో అర్హులందరికీ ఎప్పటికప్పుడే కొత్త పింఛన్ల మంజూరు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2.66 లక్షల మంది వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే ఠంఛనుగా పింఛను ఇంటి వద్దే అందించేవారు. సీఎం జగన్ చేపట్టిన ఈ అద్భుత కార్యక్రమంతో గత 58 నెలలుగా పింఛనుదారులు ఎటువంటి ఇబ్బందీ లేకుండా వారి డబ్బులు అందుకున్నారు. ఇదే చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు, ఎల్లో బ్యాచ్, ఎల్లో మీడియాకు మింగుడు పడలేదు. ఎన్నికల కోడ్ నెపంతో వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్ల పంపిణీపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, చంద్రబాబుతో సన్నిహిత సంబంధాలున్నాయన్న ఆరోపణలు ఉన్న రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ తదితరులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశారు. దీంతో పింఛన్ల పంపిణీలో వలంటీర్లను పూర్తిగా దూరంగా ఉంచాలని నెల కిత్రమే ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. డీబీటీ విధానంలో లేదంటే శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులు ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్ద పంపిణీ చేయాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో అధికారులు ఈ ఏప్రిల్ నెల పింఛను డబ్బును సచివాలయాల వద్ద పంపిణీ చేస్తూనే, విభిన్న దివ్యాంగులు, కదల్లేక మంచానికి లేదా వీల్‌చైర్‌కే పరిమితమైన వారికి, తీవ్రమైన అనారోగ్యాల కారణంగా పింఛన్లు పొందుతున్న వారు, సైనిక సంక్షేమ పింఛన్లు పొందుతున్న యుద్ధ వీరుల వృద్ధ వితంతువులకు వారి ఇంటి వద్దే పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీ ఈ నెల 3న మొదలు పెట్టి 8వ తేదీకల్లా పూర్తిచేశారు. సచివాలయాలకు వెళ్లి పింఛను డబ్బు తీసుకొనే క్రమంలో పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు.

### చల్లారని పచ్చ కళ్లు

ఏప్రిల్ నెలలో పింఛను లబ్ధిదారులను నానా అగచాట్లకు గురి చేసినప్పటికీ, పచ్చ కళ్లు చల్లబడలేదు. కేంద్ర ఎన్నికల సంఘానికి మళ్లీ ఫిర్యాదులు చేయడంతో పాటు రాష్ట్రంలో ఉన్నతాధికారులందరినీ బ్లాక్‌మెయిల్ చేస్తూ, వ్యక్తిగతంగా వారి ప్రతిష్ట దిగజార్చేలా టీడీపీ అనుకూల మీడియాలో పింఛన్ల పంపిణీపై రకరకాల తప్పుడు కథనాలు ఇచ్చారు. దీంతో రాష్ట్రంలో పింఛన్ల పంపిణీపై పలు సూచనలు చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎన్నికల సంఘం సూచనలకు అనుగుణంగా లబ్ధిదారులకు నేరుగా డబ్బుల పంపిణీకి బదులు బ్యాంకుల్లో జమ చేసేలా అధికారులు మళ్లీ మార్పులు చేయాల్సి వచ్చింది. 48,92,503 మంది అవ్వాతాతలు, ఇతరుల పింఛన్ డబ్బులు ఆధార్ నంబర్‌తో అనుసంధానమై ఉన్న వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతాయి. మే, జూన్ రెండు నెలల పాటు వీరు కుటుంబంలో లేదా తెలిసిన వారిలో ఎవరో ఒకరి వెంటబెట్టుకొని బ్యాంకుల దాకా వెళ్లి ఆ డబ్బులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. గత నెలలో సచివాలయాల్లో డబ్బు తీసుకున్న వీరికి ఇప్పుడు బ్యాంకులకు వెళ్లాలంటే పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా ఉంటుంది. సాధారణంగా అన్ని గ్రామాల్లో బ్యాంకులు ఉండవు. బ్యాంకులో పని ఉంటే సమీపంలోని పెద్ద పంచాయతీలకో, మండల కేంద్రాలు, లేదా పట్టణాల్లోని బ్యాంకులకు వెళ్లాలి. ఈ రెండు నెలలూ పింఛను కోసం అవ్వాతాతలకు ఈ అవస్థలు తప్పవు. మండుటెండల్లో ఎవరో ఒకరిని వెంటబెట్టుకొని ఆటోలోనో, బస్సులోనో పక్క ఊరు లేదా పట్టణాల్లోని బ్యాంకులకు వెళ్లి డబ్బు తెచ్చుకోవాలి. దీని కోసం ఒక కుటుంబంలో ఇద్దరు ఒకట్రెండు రోజులు పనులు మానుకొని, డబ్బు ఖర్చు పెట్టుకొని వెళ్లిరావాల్సి ఉంటుంది. వీరు కాకుండా విభిన్న దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో పింఛను పొందే వారు, మంచం లేదా వీల్‌చైర్‌కు పరిమితమైన వారు, యుద్ధ వీరుల వృద్ధ వితంతువులతో పాటు బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం లేని వారు, అసలు బ్యాంకు ఖాతాలే లేని వారికి శాశ్వత ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2.66 లక్షల మంది వలంటీర్లు ఐదు రోజుల్లో నిర్వహించే కార్యక్రమాన్ని ఇప్పుడు అందుబాటులో ఉన్న శాశ్వత ఉద్యోగుల ద్వారా వారి ఎన్నికల విధులకు ఆటంకం కలగకుండా ఇంటి వద్దే పంపిణీ చేసేందుకు 20 రోజుల దాకా సమయం పట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి నిర్ణయం వల్ల ఒక గ్రామంలో రోజుకు కొందరికి అంది, మరికొందరికి అందకపోతే పింఛనుదారులలో అలజడి రేగే అవకాశమూ ఉందని అధికారులు అంటున్నారు. అయినప్పటికీ, సకాలంలో పింఛన్ల పంపిణీకి చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

### గత చంద్రబాబు ప్రభుత్వంలో పింఛనుదారులకు అన్నీ కష్టాలే..

2014 – 19 మధ్య రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో పింఛనుదారులు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. అవ్వాతాతలు, దివ్యాంగులు పింఛను మంజూరు కోసం ఆఫీసుల చుట్టూ ఏళ్ల తరబడి కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఉండేది. పింఛన్ల మంజూరు మొదలు, తొలగింపులు వంటి వాటిని కూడా జన్మభూమి కమిటీలకే చంద్రబాబు అప్పగించారు. ఆ జన్మభూమి కమిటీల్లో గ్రామాల్లో ఎన్నికల్లో ఓడిపోయిన టీడీపీ నేతలే పూర్తిగా ఉండడంతో వాళ్లు టీడీపీకి ఓటు వేసిన వారికి లేదా లంచాలు ఇచ్చిన వారికే కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. ప్రత్యర్థి పార్టీల సానుభూతిపరులకు పింఛన్లు మంజూరయ్యేవే కావు. ఒక వేళ అప్పటికే ఎవరికైనా మంజూరై ఉంటే నిర్దాక్షిణ్యంగా తొలగించారన్న ఆరోపణలున్నాయి. పింఛన్లు మంజూరైన వారు కూడా ఆ డబ్బు కోసం ఎదురు చూడాల్సి వచ్చేది. ఊరిలో ఎప్పుడు పింఛను పంపిణీ జరుగుతుందో తెలియక ప్రతి రోజూ ఆఫీసు దాకా వచ్చి ఎండలో కూర్చొని ఉసూరుమంటూ తిరిగి వెళ్లే పరిస్థితి ఉండేది.

## రాజ్యాంగబద్ధ సంస్థలను కించపరిచేలా ఈనాడు రాతలు

- ఎన్నికల సంఘం – కార్యనిర్వాహక వ్యవస్థ మధ్య అగాధం సృష్టించే పన్నాగం
- ఈసీ ఆదేశాలు పాటించినా సీఎస్ పనితీరుపై తప్పుడు కథనాలు
- తక్షణం ఈ కథనాలపై చర్యలు తీసుకోవాలి
- ఎన్నికల సంఘానికి పౌర సంఘాల ఫిర్యాదు

సాక్షి, అమరావతి: రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన ఎన్నికల సంఘం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) నేతృత్వంలో పనిచేసే కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య అగాధం సృష్టించడం, వాటిని కించపరచడమే లక్ష్యంగా ఈనాడు దురుద్దేశపూర్వక కథనాలను ప్రచురిస్తోందంటూ పౌర సంఘాలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. రెండు వ్యవస్థల ప్రతిష్టను దిగజార్చి, ప్రజల్లో చులకన చేసే లక్ష్యంతో పెన్షన్ల పంపిణీపై 'ఎవరి ఆధీనంలో ఎవరు' అంటూ కథనాన్ని ప్రచురించారంటూ ఏపీ ఇంటిలెక్చువల్ అండ్ సిటిజన్స్ ఫోరం, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ఫోరం ఆదివారం ఫిర్యాదు చేశాయి. ఈ సందర్భంగా ఏపీ ఇంటిలెక్చువల్ అండ్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు పి. విజయబాబు మాట్లాడుతూ.. ఈనాడు కథనం ప్రజల్లో అపోహలు సృష్టించేలా ఉందన్నారు. ఎన్నికల సంఘం పారదర్శకత, సమగ్రత, నిబద్ధతను ఈ కథనం ప్రశ్నించేదిగా ఉందన్నారు. ఈ కథనాన్ని ప్రచురించిన ఈనాడుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ తరహా వార్తలు పత్రికా విలువలను, నైతికతను దిగజార్చేలా ఉన్నందున, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కూడా జోక్యం తీసుకొని చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ఫోరం అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు మాట్లాడుతూ.. పింఛన్ల పంపిణీపై ఎన్నికల సంఘం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, వాటిని కార్యనిర్వాహక వ్యవస్థ కూడా పాటించిందని చెప్పారు. అయినప్పటికీ, ఈ రెండు వ్యవస్థల మధ్య సమన్వయం లేదనే విధంగా ఈనాడు కథనం ఉండటం శోచనీయమన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న సమయంలో ఎన్నికల సంఘం ఇస్తున్న ఆదేశాలను సీఎస్ తూచ తప్పకుండా పాటిస్తున్నప్పటికీ, ఆయన పనితీరుపై అపోహలు కల్పించేలా తప్పుడు కథనాలను ప్రచురిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని కొన్ని మీడియా సంస్థలు ప్రభుత్వాలను దించి వేయడం, వాటికి అనుకూలమైన పార్టీలను అందలం ఎక్కించడం అనే రాజ్యాంగ విరుద్ధమైన బాధ్యతను భుజాలకెత్తుకున్నాయని కృష్ణంరాజు విమర్శించారు. ప్రభుత్వాల పనితీరుపై ఎన్నికల సమయంలో ప్రజలే వారి నిర్ణయాన్ని ప్రకటిస్తారని, కానీ వారి నిర్ణయాన్ని ప్రభావితం చేసేలా తప్పుడు కథనాలను ప్రచురించడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

## మే నెల పింఛను బ్యాంకు ఖాతాలో జమ

**1వ తేదీనే పింఛను పంపిణీ మొదలు.. జూన్ నెలకూ ఇదే విధానం**

సాక్షి, అమరావతి: మే, జూన్ నెలల పింఛన్ డబ్బును ఈసారి లబ్ధిదారులకు నేరుగా నగదు రూపంలో కాకుండా డీబీటీ విధానంలో వారి బ్యాంకు ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీఎస్) విధానంలో లబ్ధిదారుల ఆధార్ నంబరు అనుసంధానమై ఉన్న బ్యాంకు ఖాతాలో నేరుగా పింఛను డబ్బు జమ చేస్తుంది. అయితే, విభిన్న దివ్యాంగ లబ్ధిదారులు, తీవ్రమైన అనారోగ్య కారణాలతో పింఛన్లు పొందుతున్న వారు, మంచం లేదా వీల్‌చైర్‌కు పరిమితమైన వారు, సైనిక సంక్షేమ పింఛన్లు పొందుతున్న యుద్ధవీరుల వృద్ధ వితంతువులకు మాత్రం గత నెలలో మాదిరిగానే గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగులు ఇంటి వద్దకే వచ్చి పింఛను డబ్బు ఇస్తారు. ఈ రెండు నెలల్లోనూ ఒకటో తేదీ నుంచే పింఛను డబ్బు పంపిణీ చేస్తారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం సూచనలకు అనుగుణంగా పింఛన్ల పంపిణీ విధానంలో మార్పులు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఆదివారం ఆదేశాలు చేశారు. అనంతరం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'మే ఒకటో తేదీ నుంచి పంపిణీ చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 65,49,864 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం పింఛన్ల పంపిణీకి నిధులు విడుదల చేస్తుంది. అందులో 48,92,503 మంది (74.70 శాతం) లబ్ధిదారుల పింఛన్ డబ్బులు ఆధార్ నంబర్‌తో అనుసంధానమై ఉన్న వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతాయి. లబ్ధిదారులకు ఒకటో తేదీనే డీబీటీ విధానంలో డబ్బులు జమ చేయగానే, ఆ సమాచారం బ్యాంకు నుంచి ఎస్ఎంఎస్ రూపంలో అందుతుంది. విభిన్న దివ్యాంగ వర్గానికి చెందిన లబ్ధిదారులు, తీవ్రమైన అనారోగ్యాల కారణంగా పింఛన్లు పొందుతున్న వారు, మంచం లేదా వీల్‌చైర్‌కు పరిమితమైన వారు దాదాపు 16,57,361 మంది (25.30 శాతం)కి మే ఒకటి నుంచి ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ జరుగుతుంది. పింఛన్ లబ్ధిదారులలో ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో వారికి డబ్బు అందేలా క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, బ్యాంకులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, ఎవరికి పింఛను డబ్బులు బ్యాంకు అకౌంట్లలో జమ చేస్తారు, ఎవరికి ఇంటి వద్దే పంపిణీ చేస్తారన్న వివరాలతో కూడిన జాబితాలను సోమవారం సాయంత్రం లేదా మంగళవారం ఉదయం గ్రామ, వార్డు సచివాలయాల్లో నోటీసు బోర్డులో కూడా ఉంచనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

### నేడు సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభలు ఇలా..

- ఉదయం చోడవరంలోని కొత్తూరు జంక్షన్‌లో సీఎం సభ
- మధ్యాహ్నం అంబాజీపేట బస్టాండ్ రోడ్డులో..
- 3 గంటలకు పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో..

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం మూడు నియోజకవర్గాల్లో నిర్వహించే ప్రచార సభల్లో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం తెలిపారు. 29వ తేదీన సీఎం జగన్ పాల్గొనే ఎన్నికల ప్రచార సభల షెడ్యూల్‌ను తలశిల రఘురాం ఆదివారం ప్రకటించారు. ఆ వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 10 గంటలకు అనకాపల్లి జిల్లా చోడవరంలోని కొత్తూరు జంక్షన్‌లో జరిగే ప్రచార సభలో సీఎం జగన్ పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అమలాపురం పార్లమెంట్ పరిధిలోని పి.గన్నవరం నియోజకవర్గంలో ఉన్న అంబాజీపేట బస్టాండ్ రోడ్డులో జరిగే సభలో.. మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు పార్లమెంట్ పరిధిలోని పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో జరిగే ప్రచార సభలో ముఖ్యమంత్రి జగన్ పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.

# సకుటుంబ సపరివార సమేతంగా

## ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ కుటుంబం

- కడప బాధ్యతల్లో వైఎస్ సోదరులు రవీంద్రనాథ్, సుధీకర్, మధుకర్
- వివిధ నియోజకవర్గాలు, మండలాల బాధ్యతలో ఇతర కుటుంబ సభ్యులు
- ఇంటింటి ప్రచారంలో సీఎం జగన్ సతీమణి భారతమ్మ, వైఎస్ సమతారెడ్డి, చవ్వా సునీతారెడ్డి
- సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమాన్ని వివరిస్తూ ప్రచారం
- మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని అభ్యర్థన
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని వినతి

**ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఎదురు లేని వైఎస్సార్ కుటుంబం**

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో వైఎస్సార్ కుటుంబానికి ఇప్పటివరకు ఎదురే లేదు. కడప పార్లమెంటు నుంచి 1989లో తొలిసారి వైఎస్సార్ ఎంపీగా ఎన్నికయ్యారు. వరసగా నాలుగు పర్యాయాలు ఆయనదే విజయం. 1989 నుంచి 2019 వరకు 10 సార్లు కడప పార్లమెంటుకు ఎన్నికలు జరగ్గా, అన్ని ఎన్నికల్లో జిల్లా ప్రజానీకం వైఎస్ కుటుంబానికే పట్టం కట్టారు. నాటి నుంచి నేటి వరకు వైఎస్ కుటుంబ సభ్యులే ప్రాతినిధ్యం వహిస్తున్నారు.



ఇనగలూరులో మహిళలతో మాట్లాడుతున్న వైఎస్ భారతమ్మ

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ కుటుంబానికి కంచుకోట అయిన వైఎస్సార్ జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఘనవిజయానికి ఆయన కుటుంబమంతా కదిలింది. పులివెందుల అసెంబ్లీ స్థానంలో సీఎం వైఎస్ జగన్‌కు, కడప ఎంపీ స్థానంలో వైఎస్ అవినాశ్‌రెడ్డి, పార్టీ ఇతర అభ్యర్థులకు గత ఎన్నికల్లోకంటే ఎక్కువ మెజార్టీతో గెలిపించే బాధ్యతలను కుటుంబ సభ్యులు భుజాన వేసుకున్నారు. అందరూ కలిసి ప్రణాళిక ప్రకారం జిల్లా ప్రజల ముందుకు వెళ్తున్నారు. వైఎస్సార్ సోదరులు, సమీప బంధువులు నియోజకవర్గాలు, మండలాల వారీగా ప్రచార బాధ్యతలు తీసుకున్నారు. సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతమ్మ సహా మరికొందరు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్తూ విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందించిన సంక్షేమం, సాధించిన అభివృద్ధి, సుపరిపాలనను వివరిస్తూ గత ఎన్నికలకంటే మరింత ఎక్కువ మెజార్టీతో ఘనవిజయాన్ని అందించాలని ప్రజలను కోరుతున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, సామాన్యుల ఉన్నతే లక్ష్యంగా, విశేష పారిశ్రామిక ప్రగతి సాధించిన సీఎం వైఎస్ జగన్‌ను, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కోరుతున్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రజలందరినీ కుటుంబ సభ్యులుగా భావించారని, మరోమారు ఎమ్మెల్యేగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, కడప ఎంపీగా వైఎస్ అవినాశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.

### కుటుంబ సభ్యులకు బాధ్యతలిలా..

వైఎస్సార్ సోదరులు వైఎస్ రవీంద్రనాథరెడ్డి, వైఎస్ సుధీకర్‌రెడ్డి, వైఎస్ మధుకర్‌రెడ్డి కడప నియోజకవర్గ బాధ్యతలు తీసుకున్నారు. పులివెందుల నియోజకవర్గంలోని పులివెందుల మున్సిపాలిటీకి వైఎస్ మనోహర్‌రెడ్డి, లింగాలకు వైఎస్ అభిషేక్‌రెడ్డి, తొండూరుకు వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి ఇన్‌చార్జిలుగా ఉన్నారు. పులివెందుల రూరల్, కొండాపురం మండలాలకు చవ్వా దుష్యంత్‌రెడ్డి, జమ్మలమడుగుకు చవ్వా జగదీష్‌రెడ్డి ప్రచార బాధ్యతలు చేపట్టారు. వేముల మండల ఇన్‌చార్జిగా డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి, సింహాద్రిపురానికి గండ్లూరు వీరశివారెడ్డి, చక్రాయపేటకు వైఎస్ కొండారెడ్డి, వేంపల్లెకు వైఎస్సార్ మేనల్లుడు యువరాజ్‌రెడ్డి ప్రచార బాధ్యతలు తీసుకున్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ విజయం కోసం సీఎం వైఎస్ జగన్ సతీమణి భారతమ్మ, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి సతీమణి వైఎస్ సమతారెడ్డి, సోదరి వైఎస్ శ్వేతారెడ్డి, చవ్వా సునీతారెడ్డి, వైఎస్ తేజారెడ్డి, దివ్య (వైఎస్సార్ మేనకోడలు) విస్తృతంగా పర్యటిస్తున్నారు. వీరంతా ఇప్పటికే పులివెందుల, కడప, మైదుకూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో పర్యటించారు.

### జగన్ చెబితే చేస్తారు.. చంద్రబాబు చెప్పినా చేయరు: వైఎస్ భారతమ్మ

పులివెందుల/తొండూరు: సీఎం వైఎస్ జగన్ చెబితే చేస్తారని, చంద్రబాబు చెప్పినా చేయరని సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతమ్మ చెప్పారు. రాష్ట్ర ప్రజలందరిదీ కూడా ఇదే అభిప్రాయమన్నారు. ఆమె ఆదివారం వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని తొండూరు మండలం ఇనగలూరులో ప్రజలతో మమేకమయ్యారు. పులివెందులలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాశ్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ప్రజలతో మాట్లాడారు. తమకు సీఎం జగన్ వల్ల అన్ని పథకాలూ అందుతున్నాయని అక్కడున్న వారంతా చెప్పారు. తమ కుటుంబాలన్నీ ఎంతో సంతోషంగా ఉన్నాయని, తమ ఓట్లు వైఎస్సార్‌సీపీకే అని బదులిచ్చారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు భారతమ్మ స్పందించారు. పులివెందుల నియోజకవర్గంలో ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గత ఎన్నికల్లోకంటే మరింత ఎక్కువ మెజార్టీని ఇస్తారని చెప్పారు. ఇందుకు వారే నిదర్శనమంటూ ప్రజలను చూపించారు. అక్కడున్న ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డికి లక్ష ఓట్ల మెజార్టీని అందిస్తామంటూ నినదించారు. మేనిఫెస్టో గురించి భారతమ్మ మాట్లాడుతూ ఇప్పుడున్న పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఆ పథకాలకు సీఎం జగన్ మరింత మెరుగులు దిద్ది అందిస్తారని చెప్పారు. పులివెందుల అంటే వైఎస్ కుటుంబానికి బలమని, 40 ఏళ్లుగా ప్రజలు ఆదరిస్తున్నారని, వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేమన్నారు. ఆమెతో పాటు వైఎస్ సమత, వైఎస్ మధురెడ్డి కోడలు చైతన్య, డాక్టర్ చందన ఉన్నారు.



మైదుకూరులో మహిళకు ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్ మధుకర్



పులివెందులలో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్ ప్రమీలమ్మ



వేంపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న యువరాజ్, సతీష్‌కుమార్, రవికుమార్ తదితరులు



వేములలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఈసీ దినేష్



పులివెందుల ఎన్నికల ప్రచారంలో వైఎస్ మనోహర్



ప్రొద్దుటూరులో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి సతీమణి సమతారెడ్డి



జమ్మలమడుగు మండలం గూడెం చెరువులో పవన్, సుధాకర్, చవ్వా జగదీష్

క్లుప్తంగా...

## చంద్రబాబును నమ్మి.. నట్టేట మునగొద్దు

**ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య**



**మైలవరం:** చంద్రబాబును నమ్మి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు మరోసారి మోసపోవద్దని ఎమ్మార్పీఎస్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య సూచించారు. ఎన్టీఆర్ జిల్లా, మైలవరంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ. 'తన ప్రభుత్వం వల్ల మీ కుటుంబాలకు మేలు జరిగితేనే తనకు ఓటు వేయండి' అని అడుగుతున్న దమ్మున్న ధీశాలి సీఎం జగన్ కావాలో.. దళితులను నిలువునా మోసం చేస్తున్న బాబు కావాలో తేల్చుకోవాలని పిలుపునిచ్చారు. 1996నుంచి ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇస్తానని, మందకృష్ణలాంటి కొంతమందిని అడ్డుపెట్టుకుని అధికారంలోకి వస్తూ నిరంతరం మోసం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. మందకృష్ణ మాదిగ ప్రధాని మోదీ వద్ద మాదిగలను తాకట్టు పెట్టే విధంగా వ్యవహరిస్తున్నాడన్నారు. లౌకికవాద ప్రభుత్వం ఒక్క జగన్‌కు మాత్రమే సాధ్యమని నమ్మినందునే ఏపీ ఎమ్మార్పీఎస్ వైఎస్సార్‌సీపీకి మద్దతు పలుకుతుందని స్పష్టం చేశారు. సీఎం జగన్ గెలుపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల గెలుపు అని అన్నారు. సామాన్యుడు, బీసీ అయిన సర్నాల తిరుపతిరావును గెలిపించి సీఎం జగన్‌కు బహుమతిగా ఇవ్వాలని కోరారు.

## చంద్రబాబు వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాలి

**వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి నౌడు వెంకటరమణ ధ్వజం**



**సాక్షి, అమరావతి:** సీఎం వైఎస్ జగన్‌ను చంపేస్తే ఏమవుతుందంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి నౌడు వెంకటరమణ అన్నారు. బాబుకు ఏమైనా అంతర్జాతీయ కిల్లర్ లైసెన్స్ ఇచ్చారా? అని నిలదీశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఆదివారం వెంకటరమణ మీడియాతో మాట్లాడారు. బాబు సభ్య సమాజంలో ఉండదగిన వ్యక్తి కాదన్నారు. ఇటీవల రాళ్లతో కొట్టండి అని ఆయన అనగానే విజయవాడలో సీఎం జగన్‌పై హత్యాయత్నం జరిగిందని గుర్తు చేశారు. మరోవైపు లోకేశ్ సైతం టీడీపీ కార్యకర్తలు ఎన్ని కేసుల్లో ముద్దాయిలుగా ఉంటే అంత బాగా పార్టీ కోసం పనిచేసినట్లు అంటున్నారని మండిపడ్డారు. సీఎం జగన్ ఒక వ్యక్తి కాదని.. ఒక శక్తి, వ్యవస్థ అనే విషయం తెలుసుకోవాలన్నారు. పేద ప్రజలే సీఎం జగన్‌ను కాపాడుకుంటారన్నారు. ప్రజలు ఆయనకు అనుకూలంగా ఎలా తీర్పునిస్తారో వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు చూస్తారన్నారు. సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టో పేదల జీవితాలను మెరుగుపరిచేలా ఉందన్నారు. ఎన్ని లక్షల కోట్ల హామీలైనా ఇచ్చేద్దాం.. తాను సంపద సృష్టిస్తానులే అని బాబు అంటున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు ఎంత సంపద సృష్టించారని అడుగుతుంటే సమాధానం రావడం లేదన్నారు. రోజుకో అబద్ధం చెప్పే ఆయనను ప్రజలు నమ్మరని తేల్చిచెప్పారు.

# ఏమన్నా చెప్పండి.. మేనిఫెస్టోలో పెట్టేద్దాం

**ప్రజలను ఆకర్షించేందుకు బాబు పాట్లు**



**ఇప్పటికే సూపర్ సిక్స్ పేరుతో తొలిదశ మేనిఫెస్టో**

- దాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో మేనిఫెస్టోతో సంబంధంలేకుండా రకరకాల హామీలు
- ఆఖరి నిమిషంలోనూ నోటికొచ్చిన హామీలిచ్చేందుకు తంటాలు

**సాక్షి, అమరావతి:** మాయ మాటలతో ప్రజలను వంచించడంలో తనకు తానే సాటైన చంద్రబాబు ఇంకా అదే ప్రయత్నంలో తలమునకలై ఉన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలను బుట్టలో వేసుకునేందుకు అమలు కాని అనేక హామీలను నోటికొచ్చినట్లు ఇచ్చేస్తున్న ఆయన ఇంకా అలాంటివేమైనా ఉన్నాయా అని తెగ అన్వేషిస్తున్నారు. ప్రజల దృష్టిని ఆకర్షించే విషయాలు ఏమైనా ఉంటే చెప్పాలని పార్టీ నాయకులు, తన మద్దతుదారులను కోరుతున్నారు. ఎవరైనా అలాంటివి చెబితే వాటిని కూడా మేనిఫెస్టోలో పెట్టేయడానికి తంటాలు పడుతున్నారు. 2014లో ఇలాగే 600కి పైగా హామీలను ఎడాపెడా ఇచ్చేసి ప్రజలను మాయచేసి ఆ తర్వాత వాటన్నింటినీ బుట్టదాఖలు చేశారు. చివరికి మేనిఫెస్టోనే మాయం చేశారు. ఈ ఎన్నికల్లోనూ సూపర్ సిక్స్ అంటూ ఇప్పటికే మళ్లీ కొత్త హామీలిచ్చేశారు. 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ' పేరుతో వాటిని ప్రజల్లోకి వదిలారు. ముందస్తు మేనిఫెస్టో పేరుతో ఆరునెలల క్రితమే దాన్ని విడుదల చేశారు. మరోవైపు.. సీఎం వైఎస్ జగన్ అమలుచేస్తున్న అమ్మఒడి, రైతుభరోసా వంటి పథకాల పేర్లు మార్చి వాటిని అమలుచేస్తానని అందులో పేర్కొన్నారు. అలాగే, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కొన్ని హామీలను కూడా కాపీకొట్టి అందులో పెట్టారు. అయితే, బాబు మాయా చరిత్రేమిటో తెలిసిన ప్రజలు దానికి కనీసం స్పందించలేదు. జనం తాను చెబితే నమ్మడంలేదని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌తో కలిసి ఉమ్మడి మేనిఫెస్టోకు రూపకల్పన చేస్తున్నట్లు కొద్దిరోజులుగా చెబుతున్నారు. తాజాగా.. బీజేపీని కూడా కలుపుకుని మూడు పార్టీల పేరుతో మేనిఫెస్టో విడుదల చేయడానికి కసరత్తు చేస్తున్నారు. కానీ, 2014 ఎన్నికల్లోనూ ఇదే కూటమి పేరుతో ప్రధాని మోదీ, పవన్ తన ఫొటో కలిపి, తాను సంతకం చేసి మరీ చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేశారు. అధికారంలోకి వచ్చాక దాన్ని చెత్తబుట్టలో పడేయడంతో ప్రజలు కూడా 2019లో ఆయన్ని చెత్తలోకి నెట్టేశారు. ఇప్పుడు మళ్లీ అదే కూటమి పేరుతో ప్రజలను వంచించేందుకు నానాపాట్లు పడుతున్నారు.

**'సూపర్ సిక్స్'తో సంబంధంలేకుండా ఎడాపెడా హామీలు..**

ఈ క్రమంలోనే తన 'సూపర్ సిక్స్'తో సంబంధం లేకుండా చంద్రబాబు మరికొన్ని హామీలను ఎన్నికల సభల్లో ఎడాపెడా ఇచ్చిపారేశారు. అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీ నిర్వహిస్తానని, దీనికి సంబంధించిన ఫైలుపైనే తొలి సంతకం చేస్తానని ఊదరగొడుతున్నారు. యువతను ఆకర్షించే లక్ష్యంతో వారికి ఉద్యోగాల ఆశ కల్పించేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. 2014లోనూ ఇలాగే రైతు రుణాలను బేషరతుగా మాఫీచేస్తానని, తొలి సంతకం దానిపైనే చేస్తానని నమ్మబలికారు. కానీ, రుణమాఫీ చేయకుండా తూతూమంత్రంగా ఏదో చేశామంటే చేశామనిపించడంతో చంద్రబాబు మాటలు నమ్మి పంట రుణాలు కట్టని రైతులను బ్యాంకులు ముప్పతిప్పలు పెట్టాయి. వారి రుణాలు పెరిగిపోయి అష్టకష్టాలు పడ్డారు. అలాగే, బెల్టు షాపులు రద్దుచేస్తామని చెప్పి తొలి సంతకం చేసినట్లు చెప్పినా ఆ పని చేయకపోయినా ప్రతి గ్రామంలోనూ బెల్టు షాపులను ఇంకా పెంచేశారు. ఇలా ఇచ్చిన ప్రతి హామీని బుట్టదాఖలు చేసిన బాబు మేనిఫెస్టో అమలులో సూపర్ ట్రాక్ రికార్డు ఉన్న వైఎస్సార్‌సీపీపై అడ్డగోలుగా విమర్శలు చేస్తుండడం గమనార్హం.

### వైఎస్సార్‌సీపీని కాపీ కొట్టేందుకే బాబు మేనిఫెస్టో ఆలస్యం..

99 శాతం హామీలు అమలుచేసి మీకు మేలు జరిగితేనే నాకు ఓటేయాలని కోరుతున్న వైఎస్ జగన్‌ను ఒక్క హామీ కూడా అమలు చేయకుండా మోసం చేసిన చంద్రబాబు ప్రశ్నిస్తుండడాన్ని ప్రజలు వింతగా చూస్తున్నారు. ఇప్పటికే ముందస్తు మేనిఫెస్టో విడుదల చేసి ఆ తర్వాత కూడా ఎడాపెడా హామీలిచ్చిన చంద్రబాబు తుది మేనిఫెస్టోను ఒకట్రెండు రోజుల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిజానికి ఇది ఎప్పుడో విడుదల చేయాల్సివున్నా వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో కోసం ఎదురు చూశారు. తన మేనిఫెస్టోలో లేని అంశాలు అందులో ఏమైనా ఉంటే వాటిని కాపీ కొట్టే ఉద్దేశంతో ఆలస్యం చేశారు. గత ఎన్నికల్లో రూ.3 వేల పెన్షన్ హామీని అలాగే కాపీకొట్టి చివరి రెండు నెలలు ఇచ్చి ప్రజలను వంచించే ప్రయత్నం చేసినా ప్రజలు పట్టించుకోలేదు. ఇప్పుడు కూడా అదే ప్రయత్నంలో ఉండడం విశేషం. తాజాగా.. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో విడుదలవడంతో తాను కూడా మేనిఫెస్టో ఇచ్చేందుకు చంద్రబాబు రెడీ అవుతున్నారు. ఈలోపు ఇంకేమైనా ఉంటే చెప్పాలని వాటిని మేనిఫెస్టోలో పెట్టేస్తానని చెబుతుండడంపై సాధారణ జనం నవ్వుకుంటున్నారు.

## మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

**వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత**



**సాక్షి, అమరావతి:** మోసానికి బ్రాండ్ అంబాసిడర్ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత విమర్శించారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను చంద్రబాబు 'మాయ ఫెస్టో' అని విమర్శించడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం జగన్ చెయ్యగలిగినవి మాత్రమే 2019 మేనిఫెస్టోలో పెట్టి అంతకన్నా ఎక్కువ పథకాలను అమలు చేశారని తెలిపారు. మళ్లీ ఇప్పుడు ప్రజా మేనిఫెస్టోను ప్రజల ముందుకు తీసుకొచ్చారని చెప్పారు. ఆమె ఆదివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'సీఎం వైఎస్ జగన్ చేసేదే చెబుతాడు.. చెప్పింది చేస్తాడని ప్రజల విశ్వాసం. విశ్వసనీయత అనే పదానికి అర్థం సీఎం వైఎస్ జగన్. 2014లో చంద్రబాబు ఇచ్చిన 600 హామీలు ఏమయ్యాయో ఆయనే చెప్పాలి. కనీసం టీడీపీ మేనిఫెస్టోను ఆ పార్టీ వెబ్‌సైట్‌లో ఉంచే ధైర్యం కూడా లేని చంద్రబాబుకు మా పార్టీ మేనిఫెస్టోను విమర్శించే అర్హత లేదు. రైతులు, డ్వాక్రా మహిళలు, యువత, అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేశారు. రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు అంటే నమ్మకం లేదు. ఆయన ఎంత మభ్యపెట్టాలని చూసినా జనం పట్టించుకోవడం లేదు. అయినా కూటమి పేరుతో కొత్త అబద్ధాలతో ముందుకు వస్తున్న చంద్రబాబుకు ప్రజలు మరోసారి బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.' అని పోతుల సునీత చెప్పారు.

## మాదిగలంతా బాబు అండ్‌కోను ఓడించాలి

**ఎమ్మార్పీఎస్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాకర్ మాదిగ పిలుపు**



**నందిగామ:** మాదిగల ద్రోహులు టీడీపీ, జనసేన, బీజేపీలను ఘోరంగా ఓడించేందుకు మాదిగలంతా సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ ఆంధ్ర వ్యవస్థాపక అధ్యక్షుడు దొండపాటి సుధాకర్ మాదిగ పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహన్ రావుకు తాము సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. గత పదేళ్లుగా అధికారంలో ఉండి బీజేపీ ఎస్సీ వర్గీకరణను కనీసం పట్టించుకోలేదని చెప్పారు. ఇప్పుడు మరోసారి అధికారమిస్తే వర్గీకరణ చేస్తామంటూ హామీ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మార్పీఎస్ నేతలు కనక పూడి వెంకటరత్నం, కోండ్రు రాజారావు, యద్దనపూడి లక్ష్మణ్, కోట సత్యానందం, గద్దల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# మా మేనిఫెస్టోలో ఏమీ లేకపోతే భయమెందుకు బాబూ?

**సీఎం జగన్ గత ఎన్నికల్లో ఇచ్చిన 99% హామీలను అమలు చేశారు**



- తాజా మేనిఫెస్టోపై అన్ని వర్గాల ప్రజల్లో చర్చ
- సీఎంను చంపేయాలని చంద్రబాబు రంకెలేస్తున్నారు
- ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించాలి
- ఎగ్గొట్టేందుకే రోజుకో హామీ: వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల ధ్వజం

**సాక్షి, అమరావతి:** వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఏమీ లేకపోతే చంద్రబాబుకు అంత భయమెందుకని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి నిలదీశారు. సీఎం జగన్‌ను దూషించడమెందుకని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99% అమలు చేసి మేనిఫెస్టోకు ప్రాముఖ్యత తెచ్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. సీఎంను ఉద్దేశించి నిన్ను చంపేస్తే ఏమవుతుందని బాబు తాజాగా ఒక బహిరంగసభలో రంకెలేశారని గుర్తు చేశారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించాలన్నారు. ఆయన సభ్య సమాజంలో ఉండటానికి పనికిరాని వ్యక్తని ధ్వజమెత్తారు. బాబుకు అంతర్జాతీయంగా కిల్లర్ లైసెన్స్ ఇచ్చారేమోనని విరుచుకుపడ్డారు. మొన్న రాళ్లతో కొట్టండని ఆయన అనగానే విజయవాడలో సీఎం జగన్‌పై హత్యాయత్నం చేశారని గుర్తు చేశారు. రోజురోజుకూ దిగజారిపోతున్న ఆయనకు ఎన్నికల్లో ప్రజలు తగిన తీర్పు ఇవ్వడం ఖాయమన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సజ్జల ఆదివారం మీడియాతో మాట్లాడారు.

**చిన్న మెదడు చితికిందా బాబూ?**

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ సీఎం వైఎస్ జగన్ అమలు చేయడంతో 2024 ఎన్నికల మేనిఫెస్టోపై అన్ని వర్గాల ప్రజల్లో చర్చ జరిగింది. ఇచ్చిన మాటపై నిలబడకపోతే రాజకీయాల్లోనే ఉండకూడదన్నది సీఎం వైఎస్ జగన్ సిద్ధాంతం. ప్రజల్లో విశ్వసనీయతను నిలబెట్టుకోవడానికే మేనిఫెస్టోను అత్యంత బాధ్యతాయుతంగా రూపొందించి, విడుదల చేశారు. బాబులా రోజూ ఆడిన అబద్ధమే మార్చి మార్చి చెబుతుంటే విశ్వసనీయత ఎలా వస్తుంది? వచ్చే ఐదేళ్లలో రాష్ట్రాన్ని, అన్ని వర్గాల ప్రజలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్తామో చెప్పడమే మేనిఫెస్టో లక్ష్యం. అలా కాకుండా తాయిలాలతో అరచేతిలో వైకుంఠం చూపించేది మేనిఫెస్టో కాదు. వైఎస్ జగన్ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత మేనిఫెస్టోకి ఒక కొత్త అర్థం వచ్చింది. మేనిఫెస్టో అంటే ఇది అని ప్రజలు చెప్పుకుంటున్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన సీఎం జగన్‌ను.. పాత హామీలు ఏమయ్యాయంటూ 14 ఏళ్లు సీఎంగా ఉండి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన బాబు ప్రశ్నించడం విడ్డూరం. గత ఎన్నికల్లో సీఎం జగన్ 750 హామీలు ఇచ్చారని బాబు చెబుతుండటం చూస్తుంటే ఆయన చిన్న మెదడు చితికిపోయిందేమోనని అనిపిస్తోంది. 2014 ఎన్నికల్లో 600కిపైగా హామీలు ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన 15 నిమిషాల్లోనే మేనిఫెస్టోను టీడీపీ వెబ్‌సైట్ నుంచి మాయం చేశారు. ఆ హామీల మాట దేవుడెరుగు.. ఇంటింటికీ ముఖ్యమైన హామీలు అంటూ లేఖలు పంపిన వాటిలోనూ ఒక్కటంటే ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేశారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి మద్యనిషేధానికి తూట్లు పొడిచిన బాబు ఇప్పుడు మద్యనిషేధం గురించి మాట్లాడటం విడ్డూరం. మద్య నియంత్రణలో ప్రభుత్వం విజయం సాధించింది. సీపీఎస్ రద్దు చేయలేని పరిస్థితుల్లోనే ఉద్యోగుల సంక్షేమం కోసం జీపీఎస్ తెచ్చాం.

**మేనిఫెస్టోను చెత్తలో వేయడం చంద్రబాబుకు వెన్నుపోటుతో పెట్టిన విద్య**

మేనిఫెస్టో అంటే ప్రజలకు, నాయకుడికి, పార్టీకి మధ్య బంధం లాంటిది. నేను ఇది చేస్తాను అంటే చేసి చూపిస్తారనేలా ఉండాలి. ఎన్నికలు రాగానే అరచేతిలో వైకుంఠం చూపించి.. మిమ్మల్ని ఎక్కడికో తీసుకెళ్తానని చెప్పి..ఎన్నికలు అయ్యాక మేనిఫెస్టోను చెత్తబుట్టలో వేయడం చంద్రబాబుకు వెన్నుపోటుతో పెట్టిన విద్య. 2019లో సీఎం జగన్ ఇచ్చిన హామీలను నిలుపుకున్నాక ప్రజలకు కూడా మేనిఫెస్టో సీరియస్‌నెస్ ఏంటో తెలుస్తోంది. మేనిఫెస్టోకు అర్థం వచ్చింది. ఇదే భావనపైనే మా ధీమా, మా నమ్మకం.

### అప్పుడు శ్రీలంకని.. ఇప్పుడు హామీలు ఇవ్వడం మోసం కాదా?

సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక కరోనాతో రెండేళ్లు ఆర్థిక కష్టాలతోపాటు అదనపు ఖర్చుల రూపంలో రూ.60 వేల కోట్ల భారం పడింది. అయినా సరే అన్ని సంక్షేమ పథకాలను ఆపకుండా అమలు చేశారు. సచివాలయాలు, వలంటీర్ల ద్వారా అత్యంత పారదర్శకంగా పథకాలను అమలు చేస్తేనే ఏడాదికి రూ.70 వేల కోట్లు వ్యయమవుతోంది. ఇప్పుడు బాబు ఇస్తున్న హామీల అమలుకు ఏడాదికి రూ.1.50 లక్షల కోట్లు అవసరం. సీఎం బటన్ నొక్కుతూ రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చుతున్నారని ఆరోపించిన బాబే ఇప్పుడు ఏటా అదనంగా రూ.80 వేల కోట్లు వ్యయమయ్యే హామీలు ఇవ్వడం మోసం కాదా? ఎలాగూ అమలు చేసేది లేదు కదా అనే రోజుకో వాగ్దానాన్ని బాబు ఇచ్చుకుంటూ పోతున్నారు. ఎన్నికల తేదీ నాటికి ఇంకెన్ని హామీలు ఇస్తారో.. వాటి అమలుకు ఏ రూ.2 లక్షల కోట్లు అవసరమవుతాయో కూడా తెలియడం లేదు.

# జగన్.. రేపు నిన్ను చంపితే ఏమవుతుంది?

**నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం సభలో చంద్రబాబు వివాదాస్పద వ్యాఖ్యలు**

**సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, నెల్లూరు:** ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను ఎదుర్కొనే సామర్థ్యం, ధైర్యంలేక కొట్టుమిట్టాడుతున్న చంద్రబాబుకు కళ్ల ముందే ఓటమి స్పష్టంగా కనిపించడంతో చేసేదిలేక తీవ్ర నిరాశ, నిస్పృహలతో బహిరంగ సభల్లో ఇష్టమొచ్చినట్లు నోరు పారేసుకోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాళెం సభలో.. 'జగన్‌మోహన్‌రెడ్డి.. రేపు నిన్ను చంపితే ఏమవుతుంది'.. అంటూ ఆయన బరితెగించి చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాలను ఆయన ఎటువైపు తీసుకెళ్తున్నారనే ఆందోళన సాధారణ ప్రజలు, మేధావులు, తటస్థులు వ్యక్తంచేస్తున్నారు. జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకే ఆయన్ను భౌతికంగా నిర్మూలించేందుకు చంద్రబాబు ఏదైనా కుతంత్రం పన్నుతున్నారేమోనని అనుమానిస్తున్నారు. ఎందుకంటే.. ఇటీవలే తాడికొండలో జరిగిన సభలో 'ఆ దున్నపోతును మనిషికి ఒక రాయి తీసుకుని, ఏది దొరికితే అది తీసుకుని కొట్టండి'.. అంటూ సీఎంపై దాడికి పురికొల్పేలా మాట్లాడారు. ఆ తర్వాతే విజయవాడ సింగ్‌నగర్‌లో బస్సుయాత్ర చేస్తున్న జగన్‌పై హత్యాయత్నం జరిగింది. ముఖ్యమంత్రిని దున్నపోతు అంటూ సంబోధించడం, రాయిపెట్టి కొట్టాలనడం ఒక మాజీ ముఖ్యమంత్రి స్థాయికి తగునా అని మేధావులు సైతం ప్రశ్నిస్తున్నారు. మరో సభలో.. గాజు గ్లాసు తీసుకుని పొడవమంటూ ఆయన సైగల ద్వారా చెప్పడం చూసి రాష్ట్ర ప్రజలు నివ్వెరపోయారు. ఇప్పుడు ఏకంగా జగన్‌ను నేరుగా ఉద్దేశిస్తూ నిన్ను చంపితే ఏమవుతుంది అని మాట్లాడడంతో చంద్రబాబు మనసులో దురుద్దేశం ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఆయన ఆ మాట అన్నారంటే జగన్‌పై ఎంత కసి, కక్ష ఉన్నాయో తెలుస్తోందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని చంపేయాలని ప్రతిపక్ష నేత మాట్లాడడం తగదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏ విషయంలోనూ వైఎస్ జగన్‌ను దీటుగా ఎదుర్కోలేని పరిస్థితుల్లో ఇలాంటి మాటలు మాట్లాడుతున్నట్లు స్పష్టమవుతోంది. సీఎంని పదేపదే వ్యక్తిగతంగా దూషించడం, దాడులకు ప్రోత్సహించేలా వ్యాఖ్యలు చేస్తుండడం, చివరికి ఇంకా దిగజారి చంపమని చెప్పడం బాబు మానసిక దౌర్బల్యాన్ని సూచిస్తోందంటున్నారు. ఆయన ప్రతి సభలోనూ, ప్రతి సమావేశంలోనూ జగన్‌పై విద్వేషం వెళ్లగక్కుతూనే ఉన్నారు. సీఎంను సైకో అంటూ దిగజారుడుగా సంబోధిస్తూ తన అక్కసు, కడుపుమంట చల్లార్చుకుంటున్నారు.

**బాబు తీరుతో టీడీపీ కేడర్‌లో ఆందోళన..**

అలాగే.. జగన్ తన పాలనలో మంచి జరిగిందనుకుంటేనే తనకు ఓటేయాలని కోరుతుంటే బాబు మాత్రం 'చంపండి.. పొడవండి.. రాళ్లు విసరండి.. గాలిలో వస్తాడు, గాలిలో పోతాడు'.. అంటూ మాట్లాడడాన్ని టీడీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. వైఎస్ జగన్ తన పాలనలో తాను చేసిన పనులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి చక్కగా చెబుతున్నారని, చంద్రబాబు వైఫల్యాలు ఆయన గతంలో విడుదల చేసిన మేనిఫెస్టోను చూపించి దాన్ని అమలుచేయలేదని చెబుతున్నారని వీటిపై మాట్లాడకుండా అదే పనిగా తిట్టడంవల్ల ఉపయోగం ఉండదని భావిస్తున్నారు. జగన్ తన మేనిఫెస్టోను, టీడీపీ మేనిఫెస్టోను పోల్చిచూపడం, అందులోని అంశాలను వివరించి చెప్పే విధానం ప్రజల్లోకి బాగా వెళ్తోందనే అభిప్రాయం టీడీపీ నేతల్లో వ్యక్తమవుతోంది. తమ పార్టీ మేనిఫెస్టోలో చెప్పిన విషయాలను అమలుచేయలేదనే విషయాన్ని చాలా సూటిగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని, దీనికి కౌంటర్ ఇచ్చే పరిస్థితి తమ పార్టీకి లేకుండాపోయిందనే వాపోతున్నారు.

**టీడీపీని రద్దు చేయాలి: ఎమ్మెల్యే ప్రసన్న**

బుచ్చిరెడ్డిపాళెంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై కోవూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సీరియస్ అయ్యారు. చంద్రబాబు తన పాలనా దక్షత కన్నా.. కుట్రలు, కుతంత్రాలు, హత్యలను నమ్ముకుని రాజకీయం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ సుమోటోగా తీసుకుని చంద్రబాబుపై కేసు నమోదు చేసి, టీడీపీని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు సుమోటోగా కేసు ఫైల్ చేయాలని కోరారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రాణాలకు హాని ఉందని చంద్రబాబు వ్యాఖ్యలతో అర్థమవుతోందన్నారు.

**వేమిరెడ్డీ.. బాబు వ్యాఖ్యలను సమర్థిస్తున్నావా?**

బాబు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సమయంలో ఎంపీ, ఎమ్మెల్యేగా టీడీపీ తరఫున పోటీచేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి దంపతులు పక్కనే ఉన్నప్పటికీ వారు వారించకుండా మౌనంగా ఉండిపోవడంపై నెల్లూరు జిల్లా వాసులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నైతిక విలువలుంటే ఇలాంటి హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న బాబు పార్టీ నుంచి తప్పుకోవాలని, లేదంటే బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

### దారుణంగా పడిపోయిన చంద్రబాబు ఇమేజ్

సీఎం జగన్ హుందాగా మాట్లాడుతుంటే.. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు ఇంత నీచస్థాయికి దిగజారి మాట్లాడుతుండడం సాధారణ ప్రజానీకంలోనూ చర్చనీయాంశమైంది. ఇప్పటికే ప్రజల్లో, జాతీయ స్థాయి రాజకీయ పక్షాల దృష్టిలో నమ్మదగని నేతగా ముద్రపడిన చంద్రబాబు ఇమేజ్ దారుణంగా పడిపోయింది. ప్రజలే కాదు.. ఏ రాజకీయ పక్షం ఆయన్ను నమ్మే పరిస్థితిలేదు. ప్రస్తుతం ఎన్డీఏతో పొత్తు పెట్టుకున్నా ఆయన్ను బీజేపీ పెద్దలు నమ్మడంలేదని టీడీపీ నేతలు వాపోతున్నారు. చంద్రబాబు నిలకడలేని స్వభావం, అవకాశవాద వైఖరి, ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం ద్వారా తన స్థాయిని దిగజార్చుకున్నారు. ఈ వైఖరే ఆయన్ను ప్రజల్లో మోసగాడిగా నిలబెట్టింది.

### ఓటమి భయంతోనే ఇలా..

బాబు తన పాలన, తన విధానాల గురించి కాకుండా కేవలం ఎదురుదాడి చేయడం, దూషించడంవల్ల ఉపయోగం ఏమిటని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు.ఆయన ప్రసంగాలు ప్రజలకు నమ్మకాన్ని కలిగించేలా ఉండడం లేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. హద్దులు దాటిపోయి చేస్తున్న ఆరోపణలు, దూషణలు చంద్రబాబులో ఉన్న అసహనం, భయాన్ని చూపుతున్నాయని, ఓటమి భయంతోనే ఆయన అలా మాట్లాడుతున్నారని తటస్థులు సైతం చెబుతున్నారు. తాను చేసిందేమీ లేక చెప్పుకోలేకపోవడం, ఏం చేస్తానో చెప్పలేకపోవడం, ఆయన చెప్పే ఇతర విషయాలను జనం పట్టించుకోకపోవడంతో జీవిత చరమాంకంలో ఓటమి భయంతోనే ఇలా చేస్తున్నట్లు చెబుతున్నారు. అదే సమయంలో ఆయన విద్వేషపూరిత ప్రసంగాలవల్ల రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య నెలకొనే పరిస్థితి ఏర్పడుతోంది.

# ముస్లింలు మద్యం తాగుతారు

- చంద్రబాబు వివాదాస్పద వ్యాఖ్యలు
- ఆత్మీయ సమావేశంలో విస్తుపోయిన నేతలు



**నెల్లూరు సిటీ:** నెల్లూరులో ఆదివారం నిర్వహించిన ముస్లిం సోదరుల ఆత్మీయ సమావేశంలో టీడీపీ అధినేత చంద్రబాబు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన మాటలపై సమావేశానికి హాజరైనవారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ ముస్లింలు మద్యం తాగుతారు.. కానీ తక్కువగా తాగుతారు.. వైఎస్సార్‌సీపీ కల్తీ మద్యం సరఫరా చేస్తూ మీ ప్రాణాల మీదకు తెస్తోంది.. అని వ్యాఖ్యానించారు. ఆయన మాటలతో కొంతసేపు ఆ ప్రాంగణం సైలెంట్‌గా ఉండిపోయింది. ముస్లింలను ఉద్దేశించి మద్యం తాగుతారనడం వారిని ఆగ్రహానికి గురిచేసింది. ఎన్డీఏలో ఉన్నా ముస్లింలకు అన్యాయం జరగకుండా కాపాడతామన్నారు. ముస్లింలకు టీడీపీ హయాంలో న్యాయం జరిగిందా లేక వైఎస్సార్‌సీపీ హయాంలో న్యాయం జరిగిందా అని ఆలోచించాలని కోరారు. హైదరాబాద్ నగరం ప్రపంచపటంలో ఉందంటే దానికి తన చొరవే కారణమని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కుతున్నారే తప్ప సంపదను సృష్టించడంలేదని విమర్శించారు. అబ్దుల్ కలామ్‌ను రాష్ట్రపతి చేశానని ఆయన చెప్పారు.

**జగన్‌ను ఇంటికి సాగనంపాలి**

**గూడూరు:** రాష్ట్రానికి శనిలా పట్టుకున్న సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపుదామని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలు జిల్లా గూడూరులో నిర్వహించిన టీడీపీ ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. జగన్ దుర్మార్గుడు, అహంకారి, సైకో అని దుయ్యబట్టారు. రాష్ట్రంలో విధ్వంసం, దోపిడీ, భూమాఫియాకు పాల్పడ్డాడని విమర్శించారు. బటన్ నొక్కితే అభివృద్ధి జరగదని, సంపద సృష్టించాలని చెప్పారు. పాలు ఇచ్చే ఆవును ఓడించి తన్నే దున్నపోతును తెచ్చుకున్న ప్రజలు.. అందుకు ఈ ఐదేళ్లలో మూల్యం చెల్లించారని చెప్పారు. దళితులను అన్ని రకాలుగా మోసం చేశాడని, సబ్‌ప్లాన్ నిధులు 25 వేల కోట్లు దారిమళ్లించాడని ఆరోపించారు. అమరావతిని రాజధానిగా కొనసాగిస్తానని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చి గెలిచిన తరువాత మూడు ముక్కలాట ఆడాడని విమర్శించారు.

**కోట్ల వర్గీయుల దుమ్మా**

చంద్రబాబు ప్రచారం నేపథ్యంలో తెలుగుదేశంలో విభేదాలు బట్టబయలయ్యాయి. చంద్రబాబు సభకు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి వర్గీయులు దూరంగా ఉన్నారు. కోడుమూరు, గూడూరు, సి.బెలగల్, కర్నూలు మండలాల నుంచి కోట్ల వర్గీయులు ఎవరూ పాల్గొనలేదు.



యుద్ధాలు పెద్దలవి; యుద్ధ మరణాలు పేదలవి.
- జీన్ పాల్ సార్త్రే



సాక్షి
సోమవారం, 29 ఏప్రిల్ 2024

# పేరులో అభిమానముంది!

జపనీస్ భాషలో 'కా' అంటే మంచి, సాధ్యం అని అర్థాలున్నాయట. 'ఫుకా' అంటే చెడు, అనంగీకారం అని అర్థమట. 'కాఫుకా' అని వాటిని జోడించినప్పుడు, మంచి చెడుల వ్యతిరేకతను కలుపుకొని, ఒక కొత్త సందిగ్ధమైన అర్థాన్ని ఇవ్వడం ఆ పదాన్ని మరింత ఆకర్షణీయం చేస్తోంది. అయితే, 'కాఫ్కా ఆన్ ద షోర్' అని తన నవలకు పేరు పెట్టడానికి హరూకీ మురకామీకి ఉన్న ముఖ్య కారణం, ఈ అసందిగ్ధత కన్నా కూడా ఫ్రాంజ్ కాఫ్కా మీద ఉన్న అభిమానమే. కాఫ్కాను జపనీస్ భాషలో కాఫుకా అని రాస్తారు. ఈ నవల్లో ప్రధాన పాత్ర అయిన పదిహేనేళ్ల బాలుడు కాఫ్కా తమూరా తనకున్న శాపం నుంచి తప్పించుకోవడానికి ఇల్లు వదిలి పారిపోతాడు. కాఫ్కా సుప్రసిద్ధ కథ 'మెటమార్ఫసిస్' స్ఫూర్తితో, అందులో ఉన్నట్టుండి తెల్లారి నిద్ర లేచేసరికల్లా ఒక పెద్ద పురుగుగా మారిపోయే గ్రెగర్ జామ్జా స్ఫురించేలా 'సాంసా ఇన్ లవ్' అనే కథను కూడా రాశారు మురకామీ.

అమెరికాలో పుట్టిన స్విట్జర్లాండ్ జర్నలిస్ట్ దీనా లీ కూంగ్ తను రాస్తున్న నవల్లో ఒక వివేకవంతుడైన వృద్ధుడి పాత్రకు ఏకంగా వాల్టేర్‌నే భూమ్మీదికి దింపారు. 'నువ్వు చెప్పేదానితో నేను అంగీకరించలేకపోవచ్చు, కానీ నువ్వు చెప్పే హక్కు కోసం నా చివరిదాకా పోరాడుతాను' అన్న ఫ్రెంచ్ తత్వవేత్తగా వాల్టేర్ సుప్రసిద్ధులు. పిల్లాడి ఉబ్బసం సమస్య, భర్త దూరంగా ఉండటం, గ్రామంలోని సమస్యలు– ఇవన్నీ తీర్చడానికి పద్దెనిమిదో శతాబ్దపు గొప్ప మెదళ్లలో ఒకటైన వాల్టేర్ ఉన్నట్టుండి కిటికీలోంచి ఊడిపడితే? జీవితాన్ని సంపూర్ణంగా జీవించడం ఎలాగో సరళంగా చెప్పిపోతే? అదే దీనా రాసిన 'ఎ విజిట్ ఫ్రమ్ వాల్టేర్' నవల అవుతుంది.

రచయితలు తమ అభిమానాన్ని రకరకాలుగా చాటుకుంటారు. ఏకంగా తమకు నచ్చిన రచయితలను టైటిల్‌లోకే తెచ్చేయడం అనేది ఆ అభిమానంలో ఇంకో లెవెల్; గరిష్ఠ స్థాయి. రచయితలు లేదా వారి రచనలు లేదా వారిని స్ఫురించేలా చేసే ఏదో ఒకటి శీర్షికగా మారడం అనేది అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. ఒకటి, ఇందాక చెప్పుకొన్నదే; దాచుకోలేని అభిమాన ప్రదర్శన. రెండోది, సాహిత్య లోకంలో దీని ద్వారా కొత్త అటెన్షన్ దొరుకుతుంది. మూడో కారణం, దీనికిదే ఒక సంకేతం అవుతుంది. తద్వారా వెల్లడించాల్సిన విషయం ఇట్టే పాఠకులకు వెళ్లిపోతుంది. ఉదాహరణకు నాజీల మారణహోమంలో తనవారిని కోల్పోయిన వెతుకులాటను ప్రతిబింబిస్తూ రాసిన పుస్తకానికి అమెరికా కాలమిస్ట్ డేనియల్ మెండెల్‌సన్ 'ద లాస్ట్: ఎ సెర్చ్ ఫర్ సిక్స్ ఆఫ్ సిక్స్ మిలియన్' అని పేరు పెట్టారు. దీనికి స్ఫూర్తి, గతించిన కాలాన్ని వెతుక్కుంటూ ఫ్రెంచ్ రచయిత మార్సెల్ ప్రూస్ట్ రాసిన ఆత్మకథాత్మక క్లాసిక్ నవల 'ఇన్ సర్చ్ ఆఫ్ లాస్ట్ టైమ్'. ఈ నామకరణాన్ని ఒక రాజకీయ ప్రకటనగానూ వాడుకున్న రచయితలు ఉన్నారు. సామాజికంగా అనంగీకార లైంగికతను ఎక్స్‌ప్లోర్ చేస్తూ రష్యన్–అమెరికన్ రచయిత వ్లదీమీర్ నబకోవ్ రాసిన 'లోలిటా' ఒక పెనుసంచలనం. అయితే, ఇరాన్‌లో స్త్రీల లైంగికత మీద ఉన్న అణచివేతకు నిరసనగా తన జ్ఞాపకాల పుస్తకానికి ప్రొఫెసర్ అజర్ నఫీసీ పెట్టిన పేరు 'రీడింగ్ లోలిటా ఇన్ తెహ్రాన్'. అలాగే, వివాహ బంధంలోని సంక్లిష్టతను చాటడానికి ఏకంగా రచయిత్రి వర్జీనియా వూల్ఫ్‌నే ఒక ప్రతీకగా చేసుకున్నారు అమెరికన్ నాటక రచయిత ఎడ్వర్డ్ అల్బీ. 'హూ ఈజ్ అఫ్రయిడ్ ఆఫ్ వర్జీనియా వూల్ఫ్?' పేరుతో అల్బీ రాసిన మూడంకాల నాటకం, అటుపై సినిమాగానూ వచ్చి ఎలిజబెత్ టేలర్, రిచర్డ్ బర్టన్ అనితరసాధ్యమైన నటులని చాటింది.

రచయితలు హీరోలను సృష్టిస్తారు. ఆ కల్పిత హీరోల వల్ల సమాజంలో నిజమైన హీరోలు ఆవిర్భవిస్తారు. అయితే మైకేల్ పాలిన్ నవల 'హెమింగ్వేస్ చైర్'లో రచయితే హీరోగా కనబడతాడు. 'ఓల్డ్ మాన్ అండ్ ద సీ' రచయితగా సుప్రసిద్ధుడైన హెమింగ్వే అంటే ఈ నవలలోని అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్‌కు వెర్రి అభిమానం. తను చేరాల్సిన హోదాను తన్నుకుపోవడమే కాకుండా, నమ్మకంగా పనిచేస్తున్న వాళ్లను తొలగిస్తూ, ప్రైవేటైజేషన్ చేయడానికి పూనుకుంటాడు కొత్తగా వచ్చిన పోస్ట్‌మాస్టర్. దానికి తలొగ్గడమా, తన హీరో హెమింగ్వేలా ఎదిరించి నిలబడటమా? దీన్నే సరదాగా చెప్పారు ఆంగ్ల నటుడు, కమెడియన్, రచయిత అయిన మైకేల్ పాలిన్. అదే హెమింగ్వేను కాలంలో ప్రయాణం, సమాంతర విశ్వాలను మేళవిస్తూ రాసిన 'ది హెమింగ్వే హోక్స్' నవలలోనూ ప్రతీకగా వాడుకున్నారు సైన్స్ ఫిక్షన్ రచయిత జో హాల్డ్‌మాన్.

ఫ్రెంచ్ సాహిత్య దిగ్గజం గుస్తావ్ ఫ్లాబర్ట్ పేరు మీదుగా ఆంగ్ల రచయిత జూలియన్ బార్న్స్ రాసిన 'ఫ్లాబర్ట్స్ ప్యారట్', మరో ఫ్రెంచ్ మహారచయిత హొనొరే డె బాల్జాక్ పేరుమీద చైనీస్–ఫ్రెంచ్ రచయిత దాయి సిజీ రాసిన 'బాల్జాక్ అండ్ ద లిటిల్ చైనీస్ సీమ్‌స్ట్రెస్', అమెరికా పౌర యుద్ధం నేపథ్యంలో ఇటాలియన్ సాహిత్య శిఖరం డాంటే స్ఫురించేలా మాథ్యూ పెర్ల్ రాసిన 'ద డాంటే క్లబ్' నవల– ఇలాంటివన్నీ ఆయా రచయితలు తమ అభిమాన రచయితలకు రాసుకున్న ఆత్మీయ లేఖలే. అంతెందుకు; గాంధీ, బుద్ధ లాంటి మాటల్ని ఒక ప్రతీకగా వాడుకున్న సృజనాత్మక ప్రక్రియలు మన దగ్గర కూడా లేకపోలేదు. అందుకే ఇదేదో ఇప్పుడు కొత్తగా మొదలైన ట్రెండ్ అనీ కాదు, ఒక భాషకు పరిమితం అనీ కాదు. కాకపోతే ఈ ట్రిబ్యూట్‌గా రాస్తున్న నవలలు కూడా ఒరిజినల్స్ స్థాయిలో ప్రసిద్ధం అవుతుండటమే వాటి గురించి మాట్లాడేట్టు చేస్తోంది!

# హింసకు కళాత్మక ప్రతీకారం!

కామెంట్



కరణ్ థాపర్

న్యూయార్క్‌లోని చౌటక్వా ఇన్‌స్టిట్యూషన్‌లో రెండేళ్ల క్రితం ఆగస్టు 12న ఉపన్యాసం ఇచ్చేందుకు సిద్ధమౌతున్న భారత సంతతి రచయిత సల్మాన్ రష్దీ అతి పాశవికంగా పదిహేను కత్తిపోట్లకు గురయ్యారు. చావు తప్పి కన్ను పోగొట్టుకున్న ఆ ప్రాణాపాయం నుండి మెల్లగా కోలుకుంటున్న స్థితిలో ఉన్న రష్దీ... నాటి ఘటనపై తాజాగా 'నైఫ్: మెడిటేషన్స్ ఆఫ్టర్ యాన్ అటెంప్టెడ్ మర్డర్' పుస్తకం రాశారు. భయంకరమైన ఆ దాడి గురించి ఈ పుస్తకంలో సల్మాన్ రష్దీ నేరుగా పాఠకులతో సంభాషించారు. నేటికీ వెంటాడుతున్న తన బాధను, అంతఃసంఘర్షణలను బహిర్గతం చేస్తూ... నెమ్మదిగానే అయినా ఆత్మవిశ్వాసంతో తనెలా కోలుకున్నదీ హృద్యంగా వివరించారు. అదొక గొప్ప మానవీయ పద స్వరీకరణ.


మునుపటి తన కళాఖండాల మాదిరిగా కాకుండా, తన తాజా పుస్తకం 'నైఫ్: మెడిటేషన్స్ ఆఫ్టర్ యాన్ అటెంప్టెడ్ మర్డర్'లో... దాదాపుగా తనను చంపినంత పని చేసిన ఆనాటి భయంకరమైన దాడి గురించి సల్మాన్ రష్దీ నేరుగా పాఠకులతో సంభాషించారు. సన్నిహితంగా, నిజాయితీగా, ఒప్పించే ప్రయత్నంలో విశ్వాసాన్ని చొరగొనే విధంగా, తన అనిశ్చిత స్థితిని పంచుకుంటూ, తన బాధను, అంతఃసంఘర్షణలను బహిర్గతం చేస్తూ, నెమ్మదిగానే అయినా ఆత్మవిశ్వాసంతో నిలకడైన ప్రయాణంగా తనెలా కోలుకున్నదీ చక్కగా వివరించారు. అదొక గొప్ప మానవీయ పద స్వరీకరణ. పూర్తిగా వ్యక్తిగతమైనది. రష్దీ కంటే సల్మాన్‌గానే ఆయన ఎక్కువగా మాట్లాడారని చెప్పొచ్చు.

ఆయన తన పైన జరిగిన దాడి(2022) గురించి రాస్తారని నాకు కచ్చితంగా తెలుసు. అయినా ఒక నవలా రచయిత రాయకుండా ఎలా ఉండగలరు? నాకెప్పుడో తెలుసు అని నేను అనడం ఒక పాఠకుడి అంచనాగా మాత్రమే. దాడి ప్రభావాన్ని తనెలా మానసికంగా తట్టుకుని నిలబడ్డారన్న దానిపై పుస్తకంలో రష్దీ చేసిన విశదీకరణ ఆయన ప్రయత్నబలం ఎంత పటిష్ఠమైనదో చెబుతోంది. ''జరిగిన దానిని అర్థం చేసుకునేందుకు, దానిని అధిగమించేందుకు, నాదిగా అలవాటు చెందేందుకు, ఒక బాధితుడిగా మాత్రమే ఉండటాన్ని నిరాకరించేందుకు నేను ఎంచుకున్న మార్గం ఈ రాయటం అన్నది కావచ్చు. హింసకు నేను చెప్పే సమాధానం కళ'' అంటారు రష్దీ.

ఈ పుస్తకం రష్దీ ప్రతిస్పందన అయితే, పుస్తకపు శీర్షిక రష్దీ ఉద్దేశపూర్వకమైన ఎంపిక. అతి దారుణంగా ఆయనపై కత్తిపోట్ల దాడి జరిగింది. కత్తి అన్నది తుపాకీకి చాలా భిన్నమైనది. ''కత్తిపోటు ఒక విధమైన హత్తుకోలు. మనిషికి దగ్గరగా వచ్చి పొడిచే ఆయుధం. కత్తిపోట్లు అతి సమీప నేరాలు'' అంటారు రష్దీ. అయితే కత్తి ఒక ఉపకరణం కూడా. ఉపయోగించే దాన్ని బట్టి ఆయుధమో, సాధనమో అవుతుంది. ఆ కోణంలో చూస్తే భాష కూడా పదునైన కత్తి వంటిదే.


''భాషే నా కత్తి'' అని చెబుతారాయన. ''నేనొకవేళ అనుకోకుండా ఒక అవాంఛనీయమైన కత్తి పోరాటంలో చిక్కుకున్నట్లయితే, ఎదురుదాడికి నేను తిప్పే కత్తి బహుశా నా భాషే కావచ్చు. నా ప్రపంచాన్ని నేను పునర్నిర్మించుకోటానికి, తిరిగి నా అధీనంలోకి తెచ్చుకోటానికి నేను వాడే పరికరం అదే కావచ్చు'' అంటారు.

దాడి గురించి రష్దీ వర్ణన సూక్ష్మ సునిశితంగా, వెన్నులో వణుకు పుట్టించేలా, ఆ ఘటనను అదే రీతిలో తిరిగి చూపించినట్లుగా ఉంది.



కత్తి దాడిలో కుడికన్నును కోల్పోయిన సల్మాన్ రష్దీ

''నేను ఇప్పటికీ ఆ క్షణాన్ని నెమ్మదిగా కదిలే దృశ్యంలా చూడగలను. అతడు ప్రేక్షకుల నుంచి ఒక్క ఉదుటున దుమికి పరుగున నన్ను సమీపిస్తున్నప్పుడు నా కళ్లు అతడిని అనుసరించాయి. దూకుడుగా పడుతున్న అతడి ప్రతి అడుగును నేను గమనిస్తున్నాను. చప్పున నేను నా కాళ్లపై లేవటం నాకు తెలుస్తూ ఉండగా అతడి వైపు తిరిగాను. ఆత్మరక్షణగా నా ఎడమ చేతిని పైకి లేపాను. ఆ చేతిపై అతడు తన కత్తిని దిగపొడిచాడు.''





రష్దీ కొత్త పుస్తకం 'నైఫ్'

బాధితుడిలా కాకుండా, జరుగుతున్న దానిని బయటి నుంచి చూస్తున్న వ్యక్తిగా... ''అతడు చాలా పాశవికంగా పోట్లు పొడుస్తున్నాడు. పొడు స్తున్నాడు, కత్తిని నాపై తిప్పుతున్నాడు. కత్తి దానికదే ప్రాణం కలిగి ఉన్నట్లుగా నాపై విరుచుకుపడింది'' అని రష్దీ రాశారు.

రష్దీ స్పృహ కోల్పోయినట్లు లేదు. జరుగుతున్న దాడి ఎలాంటిదో తెలుస్తూనే ఉన్న దిగ్భ్రాంత స్థితిలో ఆయన ఉన్నారు. ''నేలపై పడి ఉన్న నేను నా శరీరం నుంచి కారుతున్న రక్తపు మడుగును చూస్తూ ఉండటం నాకు గుర్తుంది. చాలా రక్తం. అప్పుడు నాకు అనిపించింది: 'నేను చనిపోతున్నాను' అని. కానీ అదేమీ నాకు భయం కలిగించ లేదు. ఊహించనిది జరుగబోతున్నట్లుగానూ లేదు. బహుశా అలా జరిగే అవకాశం ఉంది అనుకున్నాను. జరగవలసిందే జరిగిపోతున్నదనే ఆలోచన.''

ఆ సమయంలో రష్దీ గ్రహించని విషయం ఏంటంటే, బతికి బట్టకట్టాలని ఆయన గట్టిగా నిర్ణయించుకున్నారు. ''నా క్రెడిట్ కార్డులు ఈ జేబులో ఉన్నాయి. ఇంటి తాళాలు మరో జేబులో ఉన్నాయి'' అని, ఆ స్థితితో ఎవరైతే తన పట్ల శ్రద్ధ వహిస్తున్నారో వారితో అస్పష్టంగా చెబుతున్నారు. ''ఇప్పుడు వెనక్కు తిరిగి చూసుకుంటే, నా బొంగురు గొంతు దైనందిన వస్తువుల గురించి పట్టింపుతో ఉందంటే, నేననుకోవటం నా దేహంలోని ఒక భాగం – లోలోపలి పోరాడే భాగం – చనిపోయేందుకు సిద్ధంగా ఏమీ లేదని; ఆ క్రెడిట్ కార్డులు, ఇంటి తాళాలు మళ్లీ ఉపయోగించాలన్న ఉద్దేశంతో ఉందని, 'బతుకు, బతుకు' అని నాతో గుసగుసలాడుతోందని'' అంటారు రష్దీ.

ఆయన శరీరంపై పదిహేను కత్తిపోట్లు పడ్డాయి. మెడ, కుడి కన్ను, ఎడమ చెయ్యి, కాలేయం, పొత్తి కడుపు, నుదురు, చెంపలు, నోరు, ఇంకా... తల నుంచి కింది భాగమంతటా. 'బీబీసీ' ప్రతినిధి ఎలాన్ యెన్టోబ్‌తో మాట్లాడుతూ, మెత్తగా ఉడికించిన గుడ్డును తన పైచెంప మీద ఉంచినట్లుగా తన కుడికన్నుకు అనిపించిందని రష్దీ అన్నారు. ఆ కన్ను పోవటం అనే తీవ్రమైన కలత గురించి పుస్తకంలో ఆయన మనోభావనతో కాక ఉన్నది ఉన్నట్లుగానే మాట్లాడారు. ''ఇప్పుడు కూడా, ఇది రాస్తున్నప్పుడు ఈ నష్టంతో సర్దుకుని పోవడం నా వల్ల కావటం లేదు. అది శారీరకంగా కష్టమైనది. మానసికంగా మరింత కష్టమైనది. ఇది నా జీవితాంతం ఇలాగే ఉండిపోతుందని అంగీకరించడం నిస్పృహను కలిగిస్తోంది'' అని రాశారు రష్దీ.

మెక్రాన్ (ఫ్రాన్స్ అధ్యక్షుడు), బైడెన్ (అమెరికా అధ్యక్షుడు), ఆఖరికి రష్దీ అంటే ఎప్పుడూ ఇష్టపడని బోరిస్ జాన్సన్ (ఆ సమయంలో బ్రిటన్ ప్రధాని) కూడా రష్దీపై దాడి జరగటం పట్ల భయాన్ని, ఆందోళనను వ్యక్తం చేశారు. ''అతని పోరాటం మా పోరాటం'' అని మెక్రాన్ ప్రముఖంగా ప్రకటించారు. కానీ రష్దీ జన్మించిన దేశంలో, తన జన్మభూమి అని రష్దీ చెప్పుకునే దేశంలో మౌనమే అధికారిక ప్రకటన అయింది. ''నను గన్న నా భారతదేశానికి, నాకు లోతైన ప్రేరణ అయిన భారతదేశానికి ఆ రోజున మాటలే దొరకలేదు'' అన్నారు రష్దీ.

ఎంత సిగ్గుచేటు!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

### ఎప్పటికీ శత్రుత్వమేనా?



'శాశ్వత శత్రువులం' అన్న భ్రమలో ఉండి, అంతు లేని హింసకు పాల్పడే బదులుగా, ఇండియాలోని ఆరోగ్య, విద్యా సౌకర్యాల నుంచి చాలామంది పాకిస్తానీలు లబ్ధి పొందవచ్చు. ఘర్షణ అంతమైతే ఇరుదేశాల ప్రజలకూ లాభిస్తుంది. (19 ఏళ్ల పాకిస్తానీ అమ్మాయి ఆయేషాకు చెన్నైలో గుండె మార్పిడి జరిగిన నేపథ్యంలో.)

- హుసేన్ హక్కానీ, పాకిస్తాన్ మాజీ రాయబారి

### అనుకున్నంత లేదు!



పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని చాలా స్థానాల్లో తిరిగాను. ఎన్నికల ఫలితాలను అంచనా వేయడం లేదుగానీ ఒక్క విషయం మాత్రం కచ్చితంగా చెప్పొచ్చు. మందిరం 'వేవ్' అయితే లేదు. - నకుల్ సింగ్ సహానీ, ఫిలింమేకర్

### ఒక జాగ్రత్త



మీరు పంపేది జనాలు చదవకూడదని అనుకుంటే, విషయాన్ని ఈ-మెయిల్ బాడీలో రాయడం కాకుండా పీడీఎఫ్‌గా అటాచ్ చేయండి.

- పాల్ గ్రాహమ్, కంప్యూటర్ శాస్త్రవేత్త

### కదులుతారా?



ఎన్నికల రోజు గ్రామీణ భారతంలో పండుగ రోజు. ఎన్నికల రోజు నగర భారతంలో సెలవు రోజు.

- రాజేశ్ సహానీ, ఇన్వెస్టర్

### ఇక్కడ చెల్లిపోతుందా?



నెస్లే కంపెనీ తన సెరెలాక్‌లో ఇండియాలో చక్కెర కలుపుతోంది, యూరప్‌లో కలపడం లేదు; లేస్ ఇండియాలో పామ్ ఆయిల్ వాడుతోంది, యూఎస్‌లో వాడట్లేదు; కిట్-కాట్ ఇండియాలో 16.2 శాతం పాలు, 4.5 శాతం కొకోవా వాడుతుండగా, ఆస్ట్రేలియాలో 25 శాతం పాలు, 22 శాతం కొకోవా వాడుతోంది. ఏ దేశస్థులదైనా ఆరోగ్యం ఒకటే కదా! విదేశీ కంపెనీలు భారతీయులకు నాసిరకం ఉత్పత్తులు ఇవ్వడం ఆగాలి.

- రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

### అర్థమైపోయిందా?



నేను ఏ పార్టీకి ఓటు వేశాననేది చెప్పనేలేదు. 'అభివృద్ధి, స్థిరమైన ప్రభుత్వం, అవినీతిరహిత ప్రభుత్వానికి' వేశానని చెప్పగానే, చాలామంది నన్ను విమర్శిస్తూ కామెంట్లు పెట్టారు. స్థిరమైన ప్రభుత్వం అంటే ఏదో కాంగ్రెస్ మద్దతుదారులకు కూడా తెలుసన్నమాట!

- ఐశ్వర్య ముద్గిల్, వ్యాఖ్యాత

# ఒక దేశం – ఒకే పువ్వు

ఎవరో ఒక కొత్త చట్టం తీసుకొచ్చారు
వీచే ముందు గాలులు అనుమతి తీసుకోవాలని
వీచే ముందు గాలులు తమ దిశ, దశ ఏమిటో ఎటో
వివరాలు తెలియజేయాలని ఎవరో కొత్త చట్టం తెచ్చారు
గాలులు ఎంత దూరం పోవాలనుకున్నాయో /అవి ఎంత వేగంగా వీచాలనుకున్నాయో
వివరాలు సమర్పించనిదే అనుమతి దొరకదని
ఎవరో కొత్త చట్టం తెచ్చారు /ఇప్పుడిక్కడ సుడి గాలులకు అనుమతి లేదు
మేం కడుతున్న ఆ పేక మేడల్ని /సంరక్షించాల్సిన బాధ్యత మాపై ఉంది

అందువల్ల ఈ చట్టాలు /సత్వరమే అమల్లోకొస్తున్నాయి!
తమ చుట్టాలకు అనుగుణంగా /ఎవరో ఇక్కడ కొత్త చట్టాలు తెచ్చారు
ఒడ్డును తాకే కెరటాలక్కూడా ఒక హెచ్చరిక!
ఎగిసెగిసి పడటం మళ్ళీ తిరిగి వెళ్ళడం
బలం పుంజుకుని మళ్ళీ నీటి పిడికిళ్ళతో తిరిగి రావడం
ఇవన్నీ ఇప్పుడిక కుదరదు /తిరుగుబాట్లు, ఉద్యమాలు, హోరెత్తి పోవడాలు నిషిద్ధం
ఎంతటి ఉధృతి ఉన్నా బుద్ధిగా ఒడ్డు లోపల మాత్రమే
నిశ్శబ్దంగా ప్రవహించాల్సి ఉంటుంది!

తోటలోని మొక్కలన్నీ ఒకే విధంగా పూయాలని
పూచే పూల రంగు కూడా ఒకటిగానే ఉండాలని
కొత్త చట్టం అమలులోకొచ్చింది /ఒకే రంగు మాత్రమే కాదు
ఏ పువ్వు రంగు ఎంత గాఢంగా ఉండాలో కూడా
వారు నియమించిన వారి అధికారులే నిర్ణయిస్తారట
ఒక దేశం – ఒకే పువ్వు!!
ఈ చట్టాలు చేసిన గౌరవనీయులకు ఎవడు చెప్పాలి?
తోటలో అన్ని మొక్కల పూలూ ఒకే రకంగా ఉండవని
పూలన్నీ ఒకే రంగులో అసలే ఉండవని – ఉండడానికి వీలే లేదని –
ఒక రంగులో అనేక రంగులుంటాయని కూడా /వారికి ఎవడు చెప్పాలి?

గాలులు, కెరటాలు ఎవరి చట్టాలకూ లొంగవనీ
గాలి ఎవరి పిడికిలిలోనో ఖైదీగా ఉండదని
కెరటం ఎవరి జీఓలతోనో వెనక్కి మళ్ళదని
ఎంతటి వారైనా సరే, వాటిని గమనిస్తూ
వాటికి అనుగుణంగా బతకాల్సిందే తప్ప /మరో మార్గం లేదని!
లేకపోతే, అవి సృష్టించే సునామీలో /అడ్రసు లేకుండా గల్లంతు కావల్సిందేనని
నామ రూపాలు లేకుండా నశించాల్సిందేనని /వారికి ఎవరైనా చెప్పండి!
కనీస గౌరవమైనా... కాపాడుకొమ్మని!!

- డాక్టర్ దేవరాజు మహారాజు

# సామాజిక న్యాయపాలనే గెలిపిస్తుంది!

అభిప్రాయం



ప్రొ॥ గాలి వినోద్ కుమార్

ఇటీవల విశాఖపట్టణంలో ఓ దళిత మేధావుల సమావేశంలో పాల్గొన్నప్పుడు ఏపీ ముఖ్యమంత్రిపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో 90 శాతం దళితులు, క్రైస్తవులు ఉన్నారు. జగన్ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇచ్చే విధంగా అసెంబ్లీ తీర్మానం చేసిన కారణంగా, ఎస్సీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు ఈ ఎన్నికల్లో ఆయనకు మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. నయా మనువాది చంద్రబాబు నాయుడుకీ, అతని కూటమికీ ఓటు వేయకుండా తిరిగి రెండవసారి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలనే దృక్పథంతో దళిత సమాజం ఉందనేది వారి మాటల సారాంశం.

విద్యా, వైద్య రంగాల్లో దేశంలో ఎక్కడా లేని విధంగా విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారు జగన్. ఒకసారి ఒక కుటుంబం ఉన్నత చదువులు చదివితే, ఆ కుటుంబం ప్రభుత్వ రాయితీల కోసం ఎదురు చూసే పరిస్థితి ఉండదు. ఆదాయం పెరగడం మూలంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ముఖ్యంగా సబ్సిడీ బియ్యం, వృద్ధాప్య పింఛన్లు, గృహ నిర్మాణ పథకాలపై ప్రభుత్వ భారం తగ్గిపోతుంది. పదేళ్ల కాలంలో 40 శాతం, మరో పది సంవత్సరాల కాలంలో మరో 50 శాతం మొత్తం 20 సంవత్సరాల కాలంలో 90 శాతం సబ్సిడీ పథకం కింద లబ్ధి పొందే వారు, అభివృద్ధి పథకాల కింద లబ్ధిపొందే వారు అభివృద్ధి చెంది ఈ పథకాలను అంటే పెన్షన్ పథకం, సబ్సిడీ పథకాలు వద్దనే స్థాయికి ఈ కుటుంబాలు ఎదిగి పోతాయి. వీటిపై ప్రభుత్వం ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లో 90 శాతం బడ్జెట్ తగ్గిపోతుంది.

సామాజిక న్యాయాన్ని దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారు. ఇందుకు కొన్ని ఉదాహరణలు చూద్దాం.

తాజాగా ఎన్నికల కోసం వైఎస్సార్‌సీపీ ప్రకటించిన ఎంపీ సీట్లలో 11 సీట్లనూ; అసెంబ్లీ సీట్లలో 48 సీట్లనూ బీసీలకు కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు మొత్తం కలిపి 100 అసెంబ్లీ సీట్లు కేటాయించారు. ఇది దేశంలోనే ఓ రికార్డు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాలలో కూడా ఇంత ప్రాతినిధ్యం ఆ యా వర్గాలకు ఇవ్వడం కనిపించదు. అలాగే ఇటీవల 18 ఎమ్మెల్సీ స్థానాలకు గాను 11 సీట్లు బీసీలకు కేటాయిస్తే దేశంలోని బీసీలందరూ ఆశ్చర్య పోయారు. పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టి చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదించి చరిత్రను తిరగరాశారు.





గత ఏప్రిల్ 11న చేపట్టిన మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలో 25 మందితో కూడిన మంత్రివర్గంలో ఏకంగా 17 పదవులను (70 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకే అవకాశం కల్పించడం ద్వారా సరికొత్త సామాజిక మహా విప్లవాన్ని సీఎం జగన్ ఆవిష్కరించారు. నామినేటెడ్ పోస్టులలో 50 శాతాన్ని వెనుకబడిన వర్గాలకు ఇచ్చారు. అలాగే కాంట్రాక్టు పనులలో వారికి 50 శాతం కోటా కేటాయిస్తూ అసెంబ్లీలో చట్టం చేశారు.

56 బీసీ కులాల కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు 56 చైర్మన్లు, 672 డైరెక్టర్ల పోస్టులకు గాను మొత్తం 100 శాతం బీసీలకే కేటాయించారు. ఫలితంగా ఆ కులాలలో నాయకత్వ లక్షణాలు పెరిగాయి.

రాజ్యసభలో మొత్తం 9 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులు ఉంటే... అందులో నలుగురు బీసీలు. శాసనసభ స్పీకర్; శాసన మండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్ పదవుల కేటాయింపు కూడా జగన్ సామాజిక న్యాయ దృష్టికి నిదర్శనంగా నిలిచాయి. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గిస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. కానీ ఆ మేర బీసీలకు జరిగే నష్టాన్ని పూరించడానికి పార్టీ పరంగా అదనంగా 20 శాతం ఆ వర్గానికి పెంచి మొత్తం 44 శాతం స్థానాలను బీసీలకు కేటాయించారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో మొత్తం 13 జిల్లా పరిషత్‌లను వైఎస్సార్‌సీపీ గెలువగా అందులో తొమ్మిది పదవులను (70 శాతం) ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే కేటాయించారు. మండల పరిషత్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 635 మండల పరిషత్ అధ్యక్ష పదవులను గెలిస్తే అందులో ఈ వర్గాలకు 442 స్థానాలు (67 శాతం) కేటాయించారు.


చివరగా ముగించే ముందు మూడు రాజధానుల అంశం కూడా పరిపాలన విభజనలో భాగంగా నేను చూస్తాను. సంపద సృష్టి జరగాలన్నా, సంపద పంపిణీ జరగాలన్నా ఒకే ప్రాంతం / లేదా సిటీ అభివృద్ధి చెందితే జరగదు. అందుకే కోస్తాంధ్రా, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలు అభివృద్ధి చెందే విధంగా శాసన రాజధానిగా అమరావతి, కార్యనిర్వహణ రాజధానిగా విశాఖపట్నం, న్యాయ రాజధానిగా కర్నూలును చేయాలని జగన్ సంకల్పించారు. అభివృద్ధి చెందిన దేశాల అభివృద్ధి నమూనా కూడా ఇదే. ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబడాలంటే జగన్‌మోహన్ రెడ్డి రెండవసారి ముఖ్యమంత్రి కావాలని తెలంగాణ సామాజిక న్యాయ కోవిదులు కూడా ఆశిస్తున్నారు.

వ్యాసకర్త ఉస్మానియా, తెలంగాణ విశ్వవిద్యాలయాల మాజీ డీన్–ఫ్యాకల్టీ ఆఫ్ లా

# దగ్ధం చేసే నవ్వు

ఇది తమిళ కంబ రామాయణంలోంచి సంగ్రహించిన విషయం. అశోక వనంలో సీతాదేవి కూర్చొని ఉండగా రావణాసురుడు వచ్చి తనను వివాహమాడి లంకకు మహారాణివై దర్జాగా బతకమని అంటాడు. అందుకు సమాధానంగా సీతాదేవి ఓ గడ్డిపరకను అతని ముందు వేసి ఓ నవ్వు నవ్వుతుంది. ఈ నవ్వు వెనుక ఓ అంతరార్థం ఉంది.

సీతారాముల పెళ్ళప్పుడు అందరికీ వర్తమానం పంపారు. కానీ పరమేశ్వరుడికి మాత్రం ఆహ్వానం పంపలేదు. ఇందుకో కారణం ఉంది. పరమేశ్వరుడు అన్ని చోట్లా వ్యాపించి ఉన్నాడు కదా! అందువల్ల ఆహ్వానాన్ని ఎక్కడికి పంపాలో తెలియకపోవడంవల్లే ఆహ్వానం పంపలేదట. అంతే తప్ప మరొకటి కాదు. కానీ పరమేశ్వరుడు సీతాదేవికి జరగబోయే పెళ్ళి విషయం తెలుసుకుని అది తిలకించడానికి పరుగుపరుగున వచ్చాడు. కానీ ఏమైందంటే, పరమేశ్వరుడు అక్కడికి వచ్చే లోపు సీతారాముల పెళ్ళి తంతు ముగిసిపోయింది. సీతారాములు పెళ్ళికి వచ్చిన పెద్దలకు నమస్కరించి వారి నుంచి ఆశీస్సులు పొందుతున్నారు.



జ్యోతిర్మయం

పరమేశ్వరుడిని చూసిన సీతారాములు అందరికీ నమస్కరించినట్టే ఆయన పాదాలకూ నమస్కరించారు. సీతాదేవి పరమేశ్వరుడితో 'మీరు మమ్మల్ని ఆశీర్వదిస్తే చాలు. అదే మాకు మహత్తర కానుక. మరేవీ మాకు అక్కర్లేదు' అని ఎంతో వినయంగా నెమ్మదైన స్వరంతో చెప్పింది. ఆమె చెప్పిన మాటలన్నీ విన్న పరమేశ్వరుడు 'అలా చెప్పకు. నా వద్ద విలువైన దొకటి ఉంది. అది నీకు కానుకగా ఇస్తాను. భవిష్యత్తులో అది నీకు ఉపయోగపడుతుంది' అంటాడు. సీతాదేవి 'అదేమిటి' అంటుంది. శివుడు ఓ చిన్న నవ్వు నవ్వి 'అదా, అది నా నవ్వు' అంటాడు.

ఆ నవ్వు అమూల్యమైన కానుక ఎలా అవుతుందని సీత ఆలోచనలో పడుతుంది. అది పరమేశ్వరుడు గ్రహించి 'సీతా! నువ్వు ఏమనుకుంటున్నావో నాకు అర్థమైంది. నా నవ్వుకే త్రిపురం దగ్ధమైంది. అలాంటి నవ్వుని నీకు కానుకగా ఇస్తున్నాను' అన్నాడు.

శివుడి నవ్వుకి త్రిపురం దగ్ధమైనట్టు, శివుడు తనకు ప్రసాదించిన నవ్వుతో లంక నాశనమవుతుందని చెప్పడానికే సీతాదేవి అశోకవనంలో ఆ నవ్వు నవ్వినట్టు మహాకవి కంబన్ తన రామాయణంలో రాశాడు.

- యామిజాల జగదీశ్



గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: బ.పంచమి ఉ.5.37 వరకు, తదుపరి షష్ఠి తె.4.27 వరకు (తెల్లవారితే మంగళవారం), నక్షత్రం: పూర్వాషాఢ రా.2.28 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: ప.12.22 నుండి 1.54 వరకు, దుర్ముహూర్తం: ప.12.23 నుండి 1.11 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.44 వరకు, అమృతఘడియలు: రా.9.40 నుండి 11.32 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు, యమగండం: ఉ.10.30 నుండి 12.00 వరకు, సూర్యోదయం: 5.40, సూర్యాస్తమయం: 6.14.

## క్లుప్తంగా...

### లోకేశ్‌కు మహిళ ఝలక్

- లోకేశ్ ఎదుట జై జగన్ అంటూ నినాదాలు

**తాడేపల్లిరూరల్:** గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం మోరంపూడిలో టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్‌కు ఓ మహిళ ఝలక్ ఇచ్చారు. జై జగన్.. జిందాబాద్ జగన్.. అంటూ లోకేశ్ ముందే ఆమె గట్టిగా నినాదాలు చేయడంతో ఆయన కంగుతిన్నారు. లోకేశ్ శనివారం రాత్రి మోరంపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని చర్చి చుట్టూ ఉన్న ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించకుండా ఒకచోటకు అందరిని పిలిపించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం, బూతులు తిట్టడమే ధ్యేయంగా లోకేశ్ ప్రసంగించారు. అనంతరం స్థానిక మహిళలను తమ సమస్యలు చెప్పాలని కోరగా, మోరంపూడి నాగలక్ష్మి అనే మహిళ తమకు డ్రైనేజీ సమస్య ఉందని తెలిపారు. అంతటితో ఆగకుండా డ్రైనేజీలు కట్టించాలని కోరుతూ జై జగన్.. జిందాబాద్ జగన్.. అని ఆమె గట్టిగా నినాదాలు చేయడంతో ఒక్కసారిగా నారా లోకేశ్‌తోపాటు టీడీపీ నాయకులు అందరూ కంగుతిన్నారు. ఈ వీడియో ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీంతో ఈ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినవారిని టీడీపీ శ్రేణులు బెదిరిస్తున్నారు.

### ముస్లిం రిజర్వేషన్లపై మిమ్మల్ని ఎలా నమ్మాలి బాబు..

- ముస్లిం యునైటెడ్ ఫ్రంట్, ముస్లిం జేఏసీ అధ్యక్షుడు మహమ్మద్ కలీం

**లక్ష్మీపురం:** బీజేపీ జాతీయ నాయకత్వం ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని బహిరంగంగా ప్రకటిస్తుంటే, మరోవైపు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అదేం లేదంటూ.. ముస్లిం సామాజిక వర్గాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్, ముస్లిం జేఏసీ అధ్యక్షుడు మహమ్మద్ కలీం ధ్వజమెత్తారు. స్థానిక సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ ప్రధాని మోదీ, అమిత్ షా, పీయూష్ గోయల్ ముస్లిం రిజర్వేషన్లపై బీజేపీ వైఖరి బహిరంగంగా ప్రకటించారని గుర్తు చేశారు. అయితే తెలుగుదేశం సామాజిక మాధ్యమాల ద్వారా రిజర్వేషన్లపై వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరుతున్నారన్నారు. ఒక పార్టీ అనుకూలమంటూ మరో పార్టీ వ్యతిరేకమంటూ ఇంకో పార్టీ మౌనం వహిస్తూ, మూడు పార్టీలు మూడు విధాలుగా ఉంటే ముస్లిం సమాజం ఎలా మిమ్మల్ని నమ్మాలని ఆయన ప్రశ్నించారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల అగ్ర నాయకులు ముస్లిం రిజర్వేషన్లపై ఉమ్మడి మేనిఫెస్టోలో స్పష్టంగా ప్రకటించాలని మహమ్మద్ కలీం డిమాండ్ చేశారు.

### వైఎస్సార్‌సీపీకి విద్యార్థిని విరాళం

- మూడేళ్ల పాకెట్ మనీ రూ.20 వేలు అందజేత



**తెనాలి:** వైఎస్సార్‌సీపీకి ఓ విద్యార్థిని రూ.20 వేల విరాళం అందజేసి అభిమానాన్ని చాటుకుంది. గత పథకాలన్నీ కొనసాగిస్తామంటూ సీఎం జగన్ తాజా మేనిఫెస్టోలో ప్రకటించినందుకు కృతజ్ఞతగా గుంటూరు జిల్లా కొల్లిపర మండలం చెముడుపాడుకు చెందిన ఎంసీఏ విద్యార్థిని సిద్దెల జ్వలిత.. మూడేళ్లుగా దాచుకున్న తన ప్యాకెట్ మనీ రూ.20 వేలను స్థానిక గంగానమ్మపేట పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు అందించింది. సీఎం జగన్ విద్యారంగంలో చేసిన సంస్కరణల ఫలితంగానే తనలాంటి ఎందరో పేదింటి పిల్లలు ఉన్నత చదువులు చదువుతున్నారని జ్వలిత చెప్పారు. పేద కుటుంబానికి చెందిన తాను విద్యాదీవెన/వసతి దీవెనతో డిగ్రీ పూర్తి చేసి, ఇప్పుడు ఎంసీఏ చేస్తున్నానని చెప్పింది. సీఎం జగన్ మరోసారి అధికారంలోకి రావాలనేది తన ఆకాంక్షగా తెలిపింది.


### వైద్యులకు రక్షణ చట్టం తెచ్చిన ఘనత వైఎస్సార్‌దే

- ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశోకన్

**విజయనగరం ఫోర్ట్:** ఏపీలో వైద్యులు, ఆస్పత్రులకు తొలిసారిగా రక్షణ చట్టాన్ని 2008లో మాజీ సీఎం దివంగత వైఎస్సార్ తీసుకురాగా, ఆ తర్వాత 23 రాష్ట్రాల్లో అదే చట్టాన్ని అందుబాటులోకి తెచ్చారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.వి.అశోకన్ తెలిపారు. విజయనగరంలో నిర్మించిన ఐఎంఏ నూతన భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మీడియాతో మాట్లాడారు. ఏపీలో అమలవుతోన్న వైద్యుల రక్షణ చట్టం దేశమంతా తీసుకురావాల్సిన అవసరముందన్నారు. హెల్త్ మేనిఫెస్టోను రూపొందించి 250 మంది ఎంపీలకు అందజేశామని, మిగిలిన వారికి కూడా అందజేస్తామని చెప్పారు. ఆయుర్వేదం, యునాని, హోమియో, నేచురోపతిలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని, దీనిని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు వైద్య రంగానికి 2.5% నిధులు కేటాయించాల్సి ఉందని, దీనిని క్రమేణా 5.5%కు పెంచాలని కోరారు. ఈఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయచంద్రనాయుడు మాట్లాడుతూ.. అందరికీ వైద్యం అందాలనే ఉద్దేశంతో హెల్త్ మేనిఫెస్టోను రూపొందించినట్లు చెప్పారు. సింగిల్ విండో రిజిస్ట్రేషన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# డిజిటల్ టెక్నాలజీకి అర్థం తెలుసా రామోజీ

## అవి జిరాక్సు కాపీలు కాదు.. ఈ-స్టాంపులు




**పాతికేళ్ల క్రితం...**

- రైల్వే ప్రయాణంలో టీసీ టికెట్ చూపించమని అడిగితే... చిన్న అట్టముక్కలాంటి టికెట్ చూపించేవాళ్లం. ఇప్పుడు సెల్ ఫోన్లో డిజిటల్ కాపీ చూపిస్తున్నాం. టీసీల దగ్గర కూడా ఓ అట్ట దానికి తగిలించిన కాగితాలు ఉండేవి. దాన్లో ఉన్న పేర్లపై టిక్కులు పెట్టుకునేవారు. ఇప్పుడు వారి చేతుల్లోకి ట్యాబ్‌లు వచ్చాయి.
- బ్యాంకుల్లో విత్‌డ్రాయల్‌కు గాని, డిపాజిట్ చేయడానికి గాని వెళ్తే పని పూర్తవడానికి ఓ పూట పట్టేది. నేడు మన చేతుల్లోకి ఏటీఎం కార్డులు వచ్చాయి. క్షణాల్లో డబ్బులు డ్రా చేసుకోవచ్చు, డిపాజిట్ చేసుకోవచ్చు. అసలు బ్యాంకులకే వెళ్లకుండా ఈ-బ్యాంకింగ్ ద్వారా ఇంటి వద్ద నుంచే లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. అసలు పాసు పుస్తకాలనే బ్యాంకులు ఇవ్వడం మానేసాయి. మన చేతిలో ఉన్న ఆ చిన్న కార్డులోనే మన వివరాలన్నీ పొందుపరిచి ఉంటాయి. ఆ కార్డు ద్వారానే మన లావాదేవీలన్నీ క్షణాల్లో తెలుసుకోవచ్చు.
- ఒకప్పుడు మన వాహన రిజిస్ట్రేషన్, లైసెన్సు, ఇన్సూరెన్సు పత్రాలు కాగిత రూపంలో ఉండేవి. వాటిని ఓ పర్సులాగా బైండ్ చేయించుకునే వాళ్లం. ఇప్పుడు ఓ బెత్తెడంత డిజిటల్ ప్లాస్టిక్ కార్డు చాలు. అందులోనే మన వాహనం పుట్టుపూర్వోత్తరాలు ఉంటాయి.
- వ్యవసాయ భూములు వివరాల కోసం ప్రాథమికంగా చూసేది అడంగల్–బి ఫారం. ఒకప్పుడు దీన్ని పొందాలంటే వారాలు, నెలలు పట్టేది. ఇప్పుడది మీ చేతుల్లో సెల్ ఫోన్ ఉంటే చాలు క్షణాల్లో తెలుసుకోవచ్చు. ఏ ఈ-సేవ కేంద్రానికి వెళ్లినా ప్రింట్ కూడా తీసుకోవచ్చు.

గత పాతికేళ్లుగా ప్రపంచమంతా విస్తరించిన డిజిటల్ విప్లవం ద్వారా ఇవన్నీ సాధ్యమయ్యాయి. ప్రపంచగతినే మార్చేసిన ఈ సాంకేతికతను రిజిస్ట్రేషన్ల శాఖ కూడా అందిపుచ్చుకుంది. స్టాంపు పేపర్లపై జరిపే లావాదేవీలను డిజిటల్ రూపంలోకి మార్చి తన సర్వర్లో నిక్షిప్తం చేస్తుంది. దాన్నే మనకు అందిస్తుంది. అంతేగానీ అవి జిరాక్సు కాపీలు కాదు. ప్రతి డిజిటల్ కాపీపై క్యూఆర్ కోడ్ ముద్రించి ఉంటుంది. దాన్ని స్కాన్ చేస్తే చాలు. మన ఆస్తి రిజిస్ట్రేషన్ వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి. ఈ నూతన సాంకేతిక విధానాన్నే ఈ-స్టాంపింగ్ అంటున్నాం. ఇంత గొప్ప సాంకేతిక వ్యవస్థను వ్యతిరేకిస్తున్నది ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, అతని తాబేదారు రామోజీ రావు మాత్రమే. ప్రజల్లో గందరగోళం సృష్టించడానికి చంద్రబాబు పిచ్చికూతలు కూస్తే... దాన్ని వ్యాప్తి చేయడానికి రామోజీ పచ్చిరాతలు రాస్తున్నాడు.

– సాక్షి, అమరావతి

### సాంకేతికత అందిపుచ్చుకోవడం తప్పా గురివిందా

సాంకేతికత అభివృద్ధి చెందిన కొద్దీ ప్రభుత్వ వ్యవస్థల్లో జరిగే మార్పుల్ని కూడా రామోజీ పత్రిక తప్పుదోవ పట్టిస్తూ పచ్చ పైత్యం పరాకాష్టకు చేరిందని నిరూపించుకుంటోంది. అనేక రాష్ట్రాల్లో అమలవుతున్న ఈ-స్టాంపింగ్ విధానంలో జారీ అయ్యే స్టాంపు పత్రాలను జిరాక్స్ కాపీలని తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో అలజడి సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. నాన్-జ్యుడీషియల్ స్టాంప్ పేపర్ల వినియోగం చాలా రాష్ట్రాల్లో తగ్గిపోయింది. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పనిచేసే నేషనల్ స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ వివిధ రాష్ట్రాల్లో ఈ-స్టాంపింగ్ విధానాన్ని అమలు చేస్తోంది. టెక్నాలజీ పెరుగుతున్న నేపథ్యంలో అభివృద్ధి చెందిన దేశాల్లో మాదిరిగా డిజిటల్ స్టాంపుల వినియోగం తప్పనిసరి అనే ఉద్దేశంతో ఈ-స్టాంపింగ్ వ్యవస్థను చాలా ఏళ్ల క్రితమే కేంద్రం ప్రవేశ పెట్టింది. అదే సమయంలో నాన్-జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లను పూర్తిగా రద్దు చేయలేదు. ప్రజల్లో అవగాహన కోసం స్టాంప్ పేపర్లు, ఈ-స్టాంపింగ్ వ్యవస్థ రెండింటినీ అందుబాటులో ఉంచింది. మన రాష్ట్రంలోనూ ఏడాదిన్నరగా నేషనల్ స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ అనుమతించిన కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా ఈ-స్టాంపులను జారీ చేస్తోంది. ఇవి జిరాక్స్ కాపీలని చెప్పడం అంటే కేంద్ర ప్రభుత్వ విధానాన్ని తప్పు పట్టడమే. ఆస్తి కొనుగోళ్ల వ్యవస్థను గతం కంటే పారదర్శకంగా చేయడాన్ని వ్యతిరేకించడమేకాకుండా సాంకేతికాభివృద్ధిని కూడా తప్పుదోవ పట్టించే స్థాయికి రామోజీ దిగజారిపోయారు.

### ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లపై తప్పుడు ప్రచారం

అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్డ్ ప్రైమ్ రిజిస్ట్రేషన్ల విధానంపైనా ఈనాడు తన పైత్యపు రాతలు రాసింది. ఆన్‌లైన్‌లోనే రిజిస్ట్రేషన్లు చేసుకునే క్రమంలో కార్డ్ ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌ను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అభివృద్ధి చేసింది. దీని ద్వారా వినియోగదారులు డాక్యుమెంట్ రైటర్లపై ఆధారపడకుండానే రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లోనే మోడల్ డాక్యుమెంట్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకునే వెసులుబాటు కల్పించింది. రిజిస్టర్ చేసుకునే ఆస్తి, వివరాలను ఎవరికివారే పూర్తి చేసుకునే డేటా ఎంట్రీ విధానం ఇందులో భాగమే. అంటే గతంలో మాదిరిగా తమ ఆస్తి డాక్యుమెంట్‌ను డాక్యుమెంట్ రైటర్లు కాకుండా తామే తయారు చేసుకోవచ్చు. ఇలా తయారు చేసుకున్న డాక్యుమెంట్‌ను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేసి ప్రింట్ ఇస్తారు. దీనిపైనా ఎల్లో మీడియా విష ప్రచారం చేసి రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక డాక్యుమెంట్లు ఇవ్వకుండా జిరాక్స్ పత్రాలు ఇస్తారనే దుష్ప్రచారం చేస్తోంది. జిరాక్స్ పత్రాలనే ప్రచారం ప్రజల్లో భయాందోళనలు సృష్టించడానికి ఎల్లో మీడియా, కొందరు డాక్యుమెంట్ రైటర్లు చేసేదే తప్ప నిజానికి అది స్టాంప్ పేపర్ల కంటే అత్యంత భద్రమైన ఆన్‌లైన్ విధానం. ఇటీవల కార్డ్ ప్రైమ్ అమలుకు సంబంధించి జారీ అయిన మెమోను ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమలు కోసం జారీ చేసిందిగా పేర్కొంటూ దుష్ప్రచారానికి తెర దీశారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని అధికారులు కోరుతున్నారు.

# బరితెగించిన టీడీపీ గూండాలు

- పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ ఇంట్లోకి చొరబడి రాళ్లు, కర్రలతో దాడి
- తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ నేతలు
- హోటల్, షాపుపైనా దాడి చేసి విధ్వంసం సృష్టించిన టీడీపీ నేతలు
- తమకు అడ్డొస్తే ఎవరినైనా అంతమొందిస్తామంటూ హెచ్చరికలు
- చిత్తూరు జిల్లా బోయకొండ క్రాస్ వద్ద ఘటన



గాయపడిన కొండపల్లి మోహన్, సుబ్బు

**చౌడేపల్లె(చిత్తూరు జిల్లా):** ఎన్నికల సమయం దగ్గర పడుతున్నకొద్దీ టీడీపీ గూండాలు పేట్రేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లల్లోకి చొరబడి విచక్షణారహితంగా దాడులు చేస్తున్నారు. తాజాగా శనివారం రాత్రి చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలంలోని బోయకొండ క్రాస్ వద్ద ఓ వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిలోకి టీడీపీ నాయకులు, గూండాలు చొరబడి రాళ్లు, కర్రలతో విధ్వంసానికి పాల్పడ్డారు. అడ్డువచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలపైనా విచక్షణారహితంగా దాడి చేశారు. అక్కడే ఉన్న షాపు, హోటల్‌నూ ధ్వంసం చేశారు. ఈ ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల కథనం మేరకు.. బోయకొండ క్రాస్ వద్ద ఉన్న తన ఇంట్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు, రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ లడ్డూ రమణ, అతని కుటుంబ సభ్యులు, అనుచరులు శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం గురించి మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో టీడీపీ నాయకులు గువ్వల రమేశ్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, మణికంఠ, సునీల్‌కుమార్, ఆదిశేషు, సుబ్రమణ్యం, గణ కారులో లడ్డూ రమణ ఇంటి వద్దకు దూసుకువచ్చారు. పెద్దగా కేకలు వేస్తూ.. దూషిస్తూ రమణ ఇంటిలోకి ప్రవేశించి రాళ్లు, కర్రలతో వైఎస్సార్‌సీపీ నేతలపై దాడి చేసి.. హత్యాయత్నానికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న కూల్‌డ్రింక్ షాపు, హోటల్‌లోకి కూడా చొరబడి అందులోని వస్తువులను, ఫ్రిడ్జ్‌లను ధ్వంసం చేశారు. తమకు అడ్డు వస్తే ఎవరినైనా అంతమొందిస్తామంటూ హెచ్చరికలు జారీ చేశారు. భయాందోళనకు గురైన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ నేతలు లడ్డూ రమణ, మోహన్, ప్రసాద్, చరణ్, సుబ్బు, వెంకటరెడ్డిని చికిత్స నిమిత్తం మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై హత్యాయత్నానికి పాల్పడిన టీడీపీ నేతలు గువ్వల రమేష్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, మణికంఠ, సునీల్‌కుమార్, ఆదిశేషు, జె.సుబ్రమణ్యం, గణపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. అలాగే టీడీపీ నేతలు ప్రతిగా ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుతో లడ్డూ రమణతో పాటు మరికొందరిపైనా పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



అమ్మవారికి పూజ చేస్తున్న జస్టిస్ వెంకట శేషసాయి, జస్టిస్ మన్మథరావు



జస్టిస్ శ్రీనివాసరెడ్డి

# వైభవంగా శ్రీలలితా పారాయణం

**హాజరైన హైకోర్టు న్యాయమూర్తులు**

**విజయవాడ కల్చరల్:** విజయవాడ మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాలలో జయహో భారతీయం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నూతన తెలుగు సంవత్సరం సందర్భంగా మహా శ్రీలలితా పారాయణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. సర్వశక్తి స్వరూపిణి శ్రీలలితాదేవికి రుత్వికులు వల్లభ జోస్యుల పవన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి కుంకుమార్చన చేశారు. హాజరైన వందలాదిమంది మహిళలు ఐదుసార్లు లలితా పారాయణం, ఖడ్గమాలా స్తోత్రం, సౌందర్యలహరి పారాయణం నిర్వహించారు. 26 రకాలైన పూలతో అమ్మవారిని అర్చించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి, జస్టిస్ మన్మథరావు, జస్టిస్ శ్రీనివాసరెడ్డి, ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అనంత లక్ష్మి తదితరులు హాజరయ్యారు. తొలుత నాట్యాచారిణి మంజూష బృందం నవదుర్గలు, అన్నమాచార్య సంకీర్తనలకు చేసిన నృత్యం ఆకట్టుకుంది.

### దుర్గమ్మ సేవలో జస్టిస్ శ్రీనివాస్

**ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తికి ఈవో కేఎస్ రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఈవో అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.



జస్టిస్ వి.శ్రీనివాస్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్, కర్ణాటక లోకాయుక్త జస్టిస్ బీఎస్ పాటిల్, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సౌత్ జోన్ జ్యుడిషియల్ మెంబర్ జస్టిస్ పుష్పసత్యనారాయణ ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. – తిరుమల



కుటుంబ సభ్యులతో జస్టిస్ పుష్ప సత్యనారాయణ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్

# భారీగా టీడీపీ మద్యం పట్టివేత

**గన్నవరం మండలంలో 58,032 సీసాల గోవా మద్యం స్వాధీనం**



**గన్నవరం:** కృష్ణాజిల్లా గన్నవరం మండలంలోని మెట్లపల్లి శివారుల్లో టీడీపీ నేతలు ఎన్నికల్లో పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన గోవా మద్యం నిల్వలను ఆదివారం పోలీస్, ఎక్సైజ్, ఎస్ఈబీ అధికారులు పట్టుకున్నారు. అక్రమంగా మద్యం నిల్వచేసిన టీడీపీ నేతను అదుపులో తీసుకుని విచారిస్తున్నారు. పోలీసుల సమాచారం ప్రకారం.. మెట్లపల్లి శివారులో గన్నవరం మాజీ సర్పంచి, టీడీపీ నేత గూడపాటి తులసీమోహన్ సోదరుడైన దుర్గాప్రసాద్‌కు చెందిన శ్రీనివాస గార్డెన్స్‌లో భారీగా మద్యం నిల్వచేసినట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందింది. వీరి ఆదేశాల మేరకు హనుమాన్‌జంక్షన్ సీఐ నరసింహమూర్తి, ఎక్సైజ్ స్క్వాడ్ ఎస్ఐ రామాంజనేయ, సెబ్ అధికారులు సంయుక్తంగా గార్డెన్స్‌లోని గెస్ట్‌హౌస్‌పై దాడిచేశారు. అక్కడ గోవా రాష్ట్రానికి చెందిన స్టీకర్స్‌తో మొత్తం 1,210 కేసుల్లో 58,032 క్వార్టర్ సీసాల మద్యం నిల్వల్ని గుర్తించి సీజ్ చేశారు. వీటివిలువ సుమారు రూ.75 లక్షలు ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. ఆత్కూరు ఎస్ఐ పైడిబాబు కేసు నమోదు చేశారు. అక్రమంగా మద్యం నిల్వచేసిన శ్రీనివాస గార్డెన్స్ యాజమాని, టీడీపీ నేత గూడపాటి దుర్గాప్రసాద్‌ను, వాచ్‌మెన్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీస్, ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

**టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ, నేతల్లో ఆందోళన**

ఎన్నికల్లో పంపిణీ చేసేందుకు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఈ మద్యం కొనుగోలు చేసి ఇక్కడ నిల్వ చేసినట్లుగా అనుమానిస్తున్నారు. శనివారం అర్ధరాత్రి గూడ్స్ వాహనంలో ఇక్కడికి తీసుకొచ్చిన ఈ మద్యాన్ని ఇక్కడినుంచి గ్రామాలకు పంపేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిసింది. మద్యం పట్టుబడ్డడంతో యార్లగడ్డతో పాటు ఆ పార్టీ నేతల్లో ఆందోళన మొదలైంది. అధికారులు దాడిచేసిన విషయం తెలుసుకున్న యార్లగడ్డ వర్గానికి చెందిన టీడీపీ నేతలు పొట్లూరి బసవరావు, జాస్తి శ్రీధర్‌బాబు, దొంతు చిన్నా, కేసరపల్లి ఎంపీటీసీ సభ్యుడు శొంఠి కిషోర్ గంటల వ్యవధిలోనే ఆ గ్రామానికి చేరుకున్నారు.

# వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

**ప్రకాశం జిల్లా పొదిలిలో శ్రావణి ఎస్టేట్ ఏరియా నుంచి 200 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు సమక్షంలో పార్టీలో చేరాయి. కృష్ణా జిల్లా తాడిగడపలో జనసేన, టీడీపీ నుంచి 50 కుటుంబాలు మంత్రి జోగి రమేష్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరాయి.** – పొదిలి/పెనమలూరు



పొదిలిలో వైఎస్సార్‌సీపీలో చేరిన 200 కుటుంబాలతో చెవిరెడ్డి భాస్కరరెడ్డి, అన్నా రాంబాబు



జనసేన, టీడీపీ నుంచి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించిన మంత్రి జోగి రమేష్

### గంగవరం పోర్టులో ప్రభుత్వ వాటాను అమ్మేసిన సీఎం జగన్

**పీసీసీ అధ్యక్షురాలు షర్మిల**

**సీతంపేట(విశాఖ ఉత్తర):** గంగవరం పోర్టులో ప్రభుత్వ వాటాను కేవలం రూ.600 కోట్లకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. 30 ఏళ్ల తర్వాత మళ్లీ ప్రభుత్వం చేతికి వచ్చేలా వైఎస్సార్ డిజైన్ చేస్తే.. ఆయన కొడుకు వైఎస్ జగన్ మాత్రం ప్రభుత్వ వాటాను అమ్మేశారని చెప్పారు. వైఎస్సార్ ఆశయాలను జగన్ నిలబెడుతున్న వ్యక్తో, కాదో ప్రజలే ఆలోచించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం విశాఖ అక్కయ్యపాలెం మహారాణిపార్లర్ కూడలిలో జరిగిన రోడ్‌షోలో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ల్యాండ్‌మాఫియా, లిక్కర్ మాఫియా సరిపోదన్నట్టు కంటైనర్‌లో డ్రగ్స్ మాఫియాతో రాష్ట్రం మద్యాంధ్రప్రదేశ్ అయిందని షర్మిల ఆరోపించారు. కాగా, శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఆమె మాట్లాడుతూ వైఎస్ జగన్ మూడు రాజధానులంటూ ఒక్క రాజధానిని కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు.

# పెమ్మసానీ.. బహిరంగ చర్చకు సిద్ధమా?

- ఎవరో స్క్రిప్ట్ రాసిస్తే నువ్వు చదువుతున్నావ్..
- చంద్రబాబు, ధూళిపాళ్లలా అడ్డగోలు సంపాదన కాదు నాది
- మే 13న రిటర్న్ ఫ్లైట్ టికెట్ ఇచ్చి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు
- గుంటూరు లోక్‌సభ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కిలారి రోశయ్య



**పట్నంబజారు:** ఎవరో స్క్రిప్ట్ రాసిస్తే చదువుతున్నావ్.. చేబ్రోలులో 750 ఎకరాల్లో మైనింగ్ చేశానని, రూ.2 వేల కోట్ల అవినీతి చేశానని ఆరోపిస్తున్నావ్.. ఆ ఆరోపణ నిజమేనని నిరూపించగలవా.. అసలు అధికారులు ఎన్ని ఎకరాల్లో అనుమతి ఇచ్చారో తెలుసా నీకు.. లేకపోతే నీ దగ్గర ఉన్న రూ.5,700 కోట్లు టేబుల్‌పై పెట్టి వెళ్తావా.. నీకు దమ్ముంటే దీనిపై బహిరంగచర్చకు సిద్ధమా అని గుంటూరు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య సవాల్ విసిరారు. డబ్బులున్నాయన్న అహంకారంతో ఇష్టారీతిన మాట్లాడితే ప్రజలు సహించరని హితవు పలికారు.ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎంపీ అభ్యర్థిని గతంలో చిత్తూరు జిల్లా నుంచి దిగుమతి చేసుకున్న టీడీపీ ఇప్పుడు అమెరికా నుంచి దిగుమతి చేసుకుందని విమర్శించారు. తనపై ధూళిపాళ్ళ నరేంద్ర రాసిచ్చిన స్క్రిప్ట్‌ను పెమ్మసాని చదువుతున్నారని చెప్పారు. 30 ఏళ్లలో ఏ ఎమ్మెల్యే చేయలేని అభివృద్ధిని తాను చేసి చూపించానన్నారు. చంద్రబాబు లక్షణాలు పుణికిపుచ్చుకున్నట్లు వ్యవహరిస్తున్న పెమ్మసాని.. ఎంపీ కాగానే అభివృద్ధి చేస్తానని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాను స్థానికుడునని, కష్టపడి సంపాదించి కోట్లాది రూపాయలు ట్యాక్సులు భారతదేశంలో కట్టానని చెప్పారు. అమెరికాలో సంపాదించి అక్కడ ట్యాక్సులు చెల్లించిన పెమ్మసాని ఇక్కడకు వచ్చి అభివృద్ధి చేస్తానని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. తాను చంద్రబాబు, ధూళిపాళ్ళలా అడ్డగోలుగా సంపాదించే వ్యక్తిని కాదని, కిలారి అంటే ప్రతి ఒక్కరికి తెలుసని చెప్పారు. మే 13వ తేదీన పెమ్మసానికి రిటర్న్ ఫ్లైట్ టికెట్ ఇచ్చి పంపటం తథ్యమన్నారు.

# బీసీలంతా వైఎస్సార్‌సీపీకి వెన్నెముక

- యాదవుల్లో ఇద్దరిని రాజ్యసభకు పంపించాం
- ఇద్దరిని ఎమ్మెల్సీలు.. మరో ఇద్దరిని మంత్రులను చేశాం
- ఇద్దరికి లోక్‌సభ .. ఐదుగురికి ఎమ్మెల్యే సీట్లిచ్చాం
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి



యాదవుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

**నక్కపల్లి:** బీసీలంటే వైఎస్సార్‌సీపీకి వెన్నెముకలాంటి వారని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వారిని వాడుకోకుండా రాజకీయ పదవుల్లో వారికి సముచిత స్థానం కల్పిస్తున్నామని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం సారిపల్లి పాలెం వద్ద ఆదివారం యాదవ సామాజికవర్గ ఆత్మీయ సమావేశం జరిగింది. సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదని, పార్టీకి బ్యాక్‌బోన్‌లాంటి వారని సీఎం వైఎస్ జగన్ గుర్తించారన్నారు. ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావును రాజ్యసభ సభ్యులుగా ఎంపిక చేశామన్నారు. అనిల్‌కుమార్ యాదవ్‌కు మంత్రి పదవి ఇవ్వడంతోపాటు, నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించామన్నారు. కారుమూరి నాగేశ్వరరావుకు మంత్రి పదవి ఇవ్వడంతోపాటు, ఆయన కుమారుడు సునీల్‌కు ఏలూరు పార్లమెంటరీ స్థానంలో పోటీ చేసే అవకాశం కల్పించామన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో యాదవ సామాజిక వర్గానికి చెందిన ఐదుగురికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చిన ఘనత కూడా జగనన్నదేనన్నారు. ఉత్తరాంధ్రలో ఎన్.రామారావు, వంశీకృష్ణను ఎమ్మెల్సీలను చేశామన్నారు. విశాఖ మేయర్ పదవిని, వీఎంఆర్‌డీఏ పదవిని యాదవులైన హరివెంకటకుమారి, విజయనిర్మలకు ఇచ్చామన్నారు. ఇవేకాకుండా కార్పొరేటర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు వంటి ఎన్నో పదవులను యాదవులకు ఇచ్చామన్నారు. కురుక్షేత్రం వంటి ఎన్నికల సంగ్రామంలో కృష్ణ భగవానుడు అర్జునుడి పక్షాన నిలిచినట్టు యాదవులంతా వైఎస్సార్‌సీపీ పక్షాన నిలబడాలని కోరారు.

**క్లీన్‌స్వీప్ ఖాయం: యనమల**

ఇటీవల పార్టీలో చేరిన యనమల రామకృష్ణుడి సోదరుడు యనమల కృష్ణుడు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేయడం ఖాయమన్నారు. మిగిలిన ముఖ్యమంత్రుల్లా పదవిలోకి వచ్చాక మోసం చేసే వ్యక్తి జగనన్న కాదన్నారు. మాట ఇస్తే కట్టుబడి ఉంటారన్నారు.

## పాక్ బోటులో రూ.600 కోట్ల డ్రగ్స్

- గుజరాత్ తీరంలో ఐసీజీ స్వాధీనం
- అందులోని 14 మంది సిబ్బంది నిర్బంధం

**అహ్మదాబాద్:** గుజరాత్ తీరం సమీపంలో పాకిస్తాన్‌కు చెందిన బోటులో రూ.600 కోట్ల విలువైన 86 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు భారత తీర రక్షక దళం(ఐసీజీ) తెలిపింది. బోటులోని 14 మంది పాకిస్తానీలను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించింది. గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్(ఏటీఎస్), నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్‌సీబీ)ల సమన్వయంతో ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించింది. నిఘా వర్గాల సమాచారం మేరకు ఐసీజీకి చెందిన ఈ నెల 14న రాజ్‌రతన్ నౌక తోపాటు విమానాల ద్వారా గస్తీ చేపట్టి అనుమానాస్పద బోటును గుర్తించామని, అందులోని వారు ఎలాంటి ప్రతిఘటన లేకుండా లొంగిపోయారని తెలిపింది. పడవలో తనిఖీలు చేపట్టి రూ.600 కోట్ల విలువైన సుమారు 86 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని, అందులోని 14 మంది సిబ్బందిని పోర్‌బందర్‌కు తరలించినట్లు తెలిపింది. పట్టుబడిన డ్రగ్స్ వివరాలను మాత్రం ఐసీజీ వెల్లడించలేదు.

## మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసు... నటుడు సాహిల్ ఖాన్ అరెస్ట్



**ముంబై:** మహాదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణం కేసులో బాలీవుడ్ నటుడు సాహిల్ ఖాన్‌ను అరెస్ట్ చేసినట్లు ముంబై సైబర్ సెల్ ప్రత్యేక దర్యాప్తు విభాగం(సిట్) ఆదివారం తెలిపింది. ముందస్తు బెయిల్ కోసం సాహిల్ ఖాన్ పెట్టుకున్న అర్జీని బాంబే హైకోర్టు తిరస్కరించింది. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో ఉన్న సాహిల్‌ను శనివారం అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించింది. దాదర్‌లోని కోర్టు అతడిని మే ఒకటో తేదీ వరకు రిమాండ్‌కు అప్పగించినట్లు తెలిపింది. మహాదేవ్ బెట్టింగ్ యాప్‌కు సంబంధించి రూ.15 వేల కోట్ల కుంభకోణం జరిగిందంటున్న ముంబై పోలీసులు సాహిల్ తదితర 32 మందిపై కేసు పెట్టారు. ఇద్దరిని అరెస్ట్ చేశారు. మనీ లాండరింగ్ కోణంలో విచారణ చేపట్టిన ఈడీ కూడా ఇద్దరిని అరెస్ట్ చేసింది. కాగా, స్టైల్, ఎక్స్‌క్యూజ్‌మి వంటి హిందీ చిత్రాల్లో నటించిన సాహిల్ ఫిట్‌నెస్ నిపుణుడిగా పేరు తెచ్చుకున్నారు.

## బస్సు, ట్రక్కు ఢీ: ఆరుగురు మృతి

**ఉన్నావ్:** ఉత్తరప్రదేశ్‌లో సంభవించిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా మరో 20 మంది గాయాల పాలయ్యారు. హర్దోయి–ఉన్నావ్ రహదారిపై జమల్దీపూర్ గ్రామ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ఘటన చోటుచేసుకుంది. సుమారు 35 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ముందున్న ట్రక్కును పక్క నుంచి బలంగా ఢీకొట్టింది. ఘటన అనంతరం బస్సు డ్రైవర్ పరారు కాగా ట్రక్కు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్షతగాత్రులైన 20 మంది ప్రయాణికులను కాన్పూర్, ఉన్నావ్ ఆస్పత్రులకు తరలించారు.

## రాజ్యాంగాన్ని మార్చేందుకే 400 సీట్లు : పవార్

**పుణె:** కేంద్రంలో మళ్లీ అధికారం చేపట్టి రాజ్యాంగాన్ని మార్చేందుకే బీజేపీ ఈ లోక్‌సభ ఎన్నికల్లో 400 కుపైగా సీట్లు సాధించాలనుకుంటోందని ఎన్‌సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ ఆరోపించారు. పుణెలోని సస్వాడ్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో పవార్ మాట్లాడారు. గతంతో పోలిస్తే ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలు భిన్నమైనవని, దేశ భవిష్యత్తు పథాన్ని నిర్ణయించేవని తెలిపారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను జైల్లో పెట్టిన బీజేపీ నేతలు నియంతృత్వ పోకడలతో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని రక్షించుకోవాలంటే బీజేపీని ఓడించాల్సిన అవసరం ఉందని పవార్ అన్నారు.

## దర్యాప్తు సంస్థలతో బీజేపీ రాజకీయం చేస్తోంది

**ఆనాడు కాంగ్రెస్ అదే పనిచేసింది: మాయావతి**

**మొరైనా(ఎంపీ):** గతంలో కాంగ్రెస్ పార్టీ చేసినట్లే బీజేపీ సైతం కేంద్ర దర్యాప్తు సంస్థలతో రాజకీయం చేస్తోందని బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లోని మొరైనా పట్టణంలో ఆదివారం ఎన్నికల ప్రచారర్యాలీలో మాయావతి మాట్లాడారు. '' ఈవీఎంల ట్యాంపరింగ్‌లేకుండా స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగితే బీజేపీ విజయం సాధించడం అంత సులువు కాదు. గత రెండేళ్లలో పేదరికం, నిరుద్యోగం, ధరలు మరింత పెరిగాయి. వీటిని కట్టడిచేయడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైంది. అందుకే అత్యంత నిరుపేదలకు కేంద్రం రేషన్ ఇస్తోంది. ఈ తరుణంలో వారికి కావాల్సింది రేషన్ కాదు ఉపాధి. అవినీతి సమసిపోలేదు. బీజేపీ, కాంగ్రెస్.. ఈ రెండింట్లో ఏదీ అధికారంలోకి రాకుండా అడ్డుకునే బాధ్యత మీరు తీసుకోండి. బీఎస్పీకి ఓటేయండి'' అని ఓటర్లనుద్దేశించి అన్నారు. '' బీజేపీ తన సమయాన్ని, శక్తినంతా పెట్టుబడిదారులకు లాభాలు తెచ్చిపెట్టేందుకే ఖర్చుచేస్తోంది. వాళ్లంటేనే బీజేపీకి ఇష్టం. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల కోసం కాంగ్రెస్ పనిచేయకపోవడం వల్లే బీఎస్పీ ఆవిర్భవించింది'' అని మాయావతి అన్నారు.

# రెండు దశల్లో మహిళలు 8 శాతమే



**న్యూఢిల్లీ:** టికెట్ల కేటాయింపులో మహిళలకు పెద్దపీట వేస్తున్నామంటూ రాజకీయ పార్టీలు చెబుతున్న మాటలన్నీ నీటి మూటలేనని స్పష్టమవుతోంది. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలని తరచూ చెప్పే పార్టీలు ఆ విషయంలో మాత్రం చొరవ చూపడం లేదు. సార్వత్రిక ఎన్నికల్లో మొదటి రెండు దశల పోలింగ్ ముగిసింది. మొత్తం 2,823 మంది అభ్యర్థులు పోటీచేశారు. వీరిలో మహిళల సంఖ్య ఎంతో తెలుసా? కేవలం 8 శాతం. మొదటి దశలో 135 మంది, రెండో దశలో 100 మంది మహిళలు.. అంటే మొత్తం 235 పోటీపడ్డారు. అత్యధికంగా మొదటి దశలో తమిళనాడు నుంచి 76 మంది, రెండో దశలో కేరళ నుంచి 24 మంది పోటీ పడ్డారు. మొదటి రెండు దశల్లో కాంగ్రెస్ పార్టీ 44 మంది, బీజేపీ 69 మంది మహిళలను రంగంలోకి దింపాయి. సార్వత్రిక ఎన్నికల్లో మహిళల ప్రాతినిధ్యం తగ్గిపోతోందని, రాజకీయ పార్టీలు వారికి సముచిత వాటా ఇవ్వడం లేదని, వివక్ష స్పష్టంగా కనిపిస్తోందని సామాజిక కార్యకర్తలు, రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. పార్టీలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే మహిళా రిజర్వేషన్ చట్టం అమల్లోకి వచ్చేదాకా వేచి చూడాల్సిన అవసరం లేదని అంటున్నారు. టికెట్ల కేటాయింపుల్లో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు. జనాభాలో సగం వరకు ఉన్న మహిళలకు రాజకీయాల్లో ఆ మేరకు ప్రాతినిధ్యం లేకపోవడం ఏమిటని అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇష్తికార్ అహ్మద్ అన్సారీ ప్రశ్నించారు. మహిళల విషయంలో హామీలను ఆచరణలో అమలు చేసి చూపాలని పార్టీలను కోరారు. రాజకీయాల్లో అతివలకు సమాన అవకాశాలు కల్పించడానికి పార్టీలు నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ పదవుల్లో ఎక్కువ మంది మహిళలకు అవకాశం కల్పిస్తే వారు చట్టసభల్లో అడుగు పెట్టడానికి ఆస్కారముంటుందన్నారు. బ్రిటన్‌లోని లేబర్ పార్టీ తరహాలో రాజకీయ పార్టీల నిర్మాణంలో, పదవుల్లో మహిళలకు రిజర్వేషన్ ఉండాలని ఢిల్లీ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుశీల రామస్వామి పేర్కొన్నారు.

# బాద్‌షాల అరాచకాలు కన్పించ లేదా?

**రాహుల్‌పై మోదీ ధ్వజం**



**బెళగావి/సిర్సీ/దావణగెరె:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. మన దేశానికి చెందిన రాజులు, మహారాజులను కించపర్చిన రాహుల్ నవాబులు, నిజామ్‌లు, సుల్తాన్లు, బాద్‌షాలు సాగించిన అరాచకాలపై మాత్రం నోరుమెదపడం లేదని మండిపడ్డారు. కేవలం బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాలతో లబ్ధి పొందడానికి రాహుల్ ఆరాటపడుతున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం కర్ణాటకలోని బెళగావి, దావణగెరె, ఉత్తర కన్నడ జిల్లాలోని సిర్సీ, హోస్పేట్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ మాట్లాడారు. మన దేశ చరిత్ర, స్వాతంత్య్ర పోరాట గాథలను కాంగ్రెస్ పార్టీ పాలనలో బుజ్జగింపు, ఓటు బ్యాంకు రాజకీయాలను దృష్టిలో పెట్టుకొని రాశారని, ఆ పాపాన్ని రాహుల్ గాంధీ ఇప్పటికీ కొనసాగిస్తున్నారని విమర్శించారు. భారతదేశ రాజులు, మహారాజులు పేద ప్రజలపై క్రూరమైన అణచివేత, దౌర్జన్యాలకు పాల్పడ్డారని, ఆస్తులు, భూములు బలవంతంగా లాక్కున్నారంటూ రాహుల్ ఇటీవల ఆరోపించారని గుర్తుచేశారు. ఛత్రపతి శివాజీ, కిత్తూరు రాణి చెన్నమ్మ వంటి గొప్ప పాలకులను రాహుల్ అవమానించారని చెప్పారు. దేశ చరిత్రలో నవాబులు, నిజామ్‌లు, సుల్తాన్లు, బాద్‌షాలు సాగించిన అఘాయిత్యాలు, దారుణాల గురించి మాట్లాడాలంటే కాంగ్రెస్ రాజకుమారుడి నోటికి తాళం పడుతోందని ఎద్దేవా చేశారు. మొఘల్ రాజు ఔరంగజేబు మన ఆలయాలను అపవిత్రం చేశాడని, కూల్చివేశాడని అన్నారు. అలాంటి ఔరంగజేబును ఆరాధించే పార్టీలతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుందని ఆక్షేపించారు. ఔరంగజేబు దుశ్చర్యలపై రాహుల్ ఏనాడూ మాట్లాడలేదన్నారు. రాజులు, మహారాజులు మన దేశానికి ఎన్నో సేవలు చేశారని, వారి త్యాగాలు మరువలేమని పేర్కొన్నారు. రాజులకు వ్యతిరేకంగా మాట్లాడడానికి ఉన్న ధైర్యం సుల్తాన్లకు వ్యతిరేకంగా మాట్లాడడానికి రాహుల్‌కు లేదని విమర్శించారు. కాంగ్రెస్ ఓటు బ్యాంకు మైండ్‌సెట్ ఆ పార్టీ మేనిఫెస్టోలో కనిపిస్తోందని వెల్లడించారు. ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్‌ఐ) మద్దతు తీసుకుంటోందని ఆరోపించారు. వయనాడ్‌లో నెగ్గడానికి పీఎఫ్‌ఐకి లొంగిపోతారా? అని రాహుల్‌ని ప్రశ్నించారు.

**ప్రజల ఓట్లతోనే నాకు ధైర్యం**

ఓటు బ్యాంకు రాజకీయాలు మరింత నీచంగా, విధ్వంసకరంగా తయారవుతున్నాయని నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ చివరి క్షణం వరకూ ఎన్నో అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు. ఆలయ నిర్మాణం జరగకుండా కాంగ్రెస్, దాని కోటరీ 70 ఏళ్లపాటు కుట్రలు సాగించాయని దుయ్యబట్టారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన మరుసటి రోజే అయోధ్యలో ఆలయ నిర్మాణంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా, అప్పటి పాలకులు ఆ పని చేయలేదన్నారు. నిర్ణయం తీసుకొని, అమలు చేయడానికి 56 అంగుళాల ఛాతీ(మోదీ) కావాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వ సొమ్ముతో గానీ, పన్ను చెల్లింపుదార్ల డబ్బుతో గానీ ఆ ఆలయం నిర్మించలేదని, శ్రీరాముడి భక్తుల విరాళాలతోనే ఆలయ నిర్మాణం జరిగిందని వివరించారు. రామమందిర ప్రాణప్రతిష్టకు హాజరు కావాలంటూ ఆహ్వానం అందజేస్తే కాంగ్రెస్ తోపాటు కొన్ని పార్టీలు తిరస్కరించాయని గుర్తుచేశారు. ఆ పార్టీలను ఎన్నికల్లో తిరస్కరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో బీజేపీకి మద్దతు పలకాలని, మరింత బలం చేకూర్చాలని కోరారు.

**వారసత్వ పన్నును ఆమోదించను**

కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే వారసత్వ పన్నుతో ఆస్తులు పోగొట్టుకోవాల్సి వస్తుందంటూ ప్రజలను ప్రధానమంత్రి అప్రమత్తం చేశారు. పిల్లల కోసం ఆదా చేసుకున్న డబ్బులను సైతం లాక్కుంటారని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు 45 శాతం ఆస్తులను మాత్రమే బదిలీ చేసే అవకాశం ఉంటుందని, మిగతా 55 శాతం ఆస్తులను కాంగ్రెస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, ఓటు బ్యాంక్‌కు కట్టబెడుతుందని పేర్కొన్నారు. అయితే, తాను జీవించి ఉన్నంతకాలం ఇలాంటి వారసత్వ పన్ను ఆమోదించే ప్రసక్తే లేదని మోదీ తేల్చిచెప్పారు. మీ ఉద్దేశాలు వదిలేసుకోండి అంటూ కాంగ్రెస్ పార్టీకి హితవు పలికారు. కర్ణాటకలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హిందువులపై దాడులు పెరిగిపోయాయని ప్రధానమంత్రి అన్నారు.

**2014 కంటే ముందు బ్రోకర్ల రాజ్యం**

కొన్ని దేశాలు, సంస్థలు మన దేశం, మన ప్రభుత్వం బలహీనపడాలని కోరుకుంటున్నాయని, అలాగైతే లాభపడొచ్చని, ఆటలు సాగించుకోవచ్చని భావిస్తున్నాయని మోదీ చెప్పారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతుండడం ఆయా దేశాలకు, సంస్థలకు ఇష్టం లేదన్నారు. భారత్ బలమైన దేశంగా ఎదగడం కొందరికి కంటగింపుగా మారిందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఉంటే అవినీతికి పాల్పడడం, దోచుకోవడం సాధ్యం కాదని కొన్ని దుష్టశక్తులు భావిస్తున్నాయని పేర్కొన్నారు. 2014 కంటే ముందు బ్రోకర్ల రాజ్యం నడిచిందని, ఢిల్లీ పవర్ కారిడార్లలో వారే అధికారం చెలాయించారని గుర్తుచేశారు. ఢిల్లీలోని హోటళ్లలో సంవత్సరాల తరబడి తిష్ట వేసి లాబీయింగ్ చేస్తూ ఉండేవారని తెలిపారు. 2014లో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పవర్ కారిడార్లను శుద్ధి చేసే ప్రక్రియ చేపట్టామని వివరించారు. బ్రోకర్లకు, లాబీయిస్టులకు అక్కడ స్థానం లేకుండా చేశామని చెప్పారు. బీజేపీని అణగదొక్కడం సాధ్యం కాదన్న సంగతిని కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు తెలుసుకోవాలన్నారు.

# మూడో ఆర్థికశక్తిగా ఎదగడం ఖాయం

**ప్రధానిగా ఎవరున్నా జరిగేది అదే**

**అతిశయోక్తిగా చెప్పడంలో మోదీ మాస్టర్స్ చేశారు**

**మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం వ్యాఖ్య**

**ఇంటర్వ్యూ**



అతిశయోక్తి కలబోసి చెప్పడంలో ప్రధాని మోదీ ఆరితేరారని మాజీ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత పి.చిదంబరం వ్యాఖ్యానించారు. పీటీఐతో ప్రత్యేక ముఖాముఖి సందర్భంగా దేశార్థిక వ్యవస్థ, సీఏఏ, ఆర్టికల్ 370పై ఆయన వ్యక్తపరిచిన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

**మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదగడంపై..**

''అంకగణితం ప్రకారం చూస్తే దేశంలో కొనుగోలు శక్తి, వస్తు వినియోగం విపరీతంగా పెరుగుతోంది. ప్రపంచంలోనే అధిక జనాభాగత జనభారతంలో ఏటా స్థూలజాతీయోత్పత్తి(జీడీపీ) పెరగడం అత్యంత సహజం. ఇందులో తానేదో చేసినట్లు అతిశయోక్తితో చెప్పడం మోదీకే చెల్లింది. ప్రధానిగా ఎవరున్నా సరే ఇప్పుడున్న వేగంతో జీడీపీ దూసుకెళ్తే త్వరలోనే భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుంది. ఆపడానికి వీలులేని అంకగణిత సాధ్యాలను ఆయన తన గ్యారెంటీలుగా ప్రకటించుకుంటున్నారు. అతిశయోక్తిగా చెప్పడంలో మోదీ మాస్టర్ డిగ్రీ చేశారు. జీడీపీ లెక్కల్లో చూస్తే 2004లో ప్రపంచంలో భారత్ 12వ స్థానంలో ఉండేది. 2014లో ఏడో స్థానానికి ఎగబాకింది. 2024లో ఐదో స్థానానికి వచ్చేసింది. జీడీపీ లెక్కల ప్రకారం భారత ఎకానమీ పురోగమనం ఖాయం. ప్రధానిగా ఎవరున్నా ఇది ఆగదు. ఇందులో ఎలాంటి మేజిక్ లేదు. అత్యధిక జనాభా కారణంగానే ఇది సాధ్యమవుతోంది. వాస్తవానికి జీడీపీ వృద్ధి అనేది దేశ సర్వతోముఖాభివృద్ధిని అస్సలు సూచించదు. తలసరి ఆదాయం మాత్రమే దేశాభివృద్ధికి సరైన గీటురాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్) సంస్థ తలసరి ఆదాయ లెక్కల ప్రకారం భారత్ ర్యాంక్ దారుణంగా 136 వద్దే ఆగిపోయింది''

**నిర్మలా సీతారామన్ పోటీపై..**


నిర్మల మొదట్నుంచీ ప్రత్యక్ష ఎన్నికలను ఎదుర్కోలేదు. రాజ్యసభకే ఎన్నికయ్యారు. ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ టికెట్ ఆఫర్ చేసినా ఆమె తిరస్కరించారు. ఎందుకంటే ఆమెకు దేశంలో ఏ రాష్ట్రంలోనూ స్థానికంగా రాజకీయ బలం లేదు. ఓడిపోతానని ఆమెకు తెలుసు. ఇంతకుమించి ఆమె రాజకీయ భవితవ్యంపై నేను మాట్లాడదల్చుకోలేదు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా సమకూర్చుకున్న సొమ్ముతో బీజేపీ ఖజానా నిండిపోయింది. ఎక్కువ నిధులతో అలరారుతోంది.

**సీఏఏ, ఆర్టికల్ 370లపై..**

'' స్వదేశం వదిలి శరణార్థులుగా భారత్‌కు 2014 డిసెంబర్ 31లోపు అఫ్గానిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చిన హిందువులు, బౌద్ధులు, సిక్కులు, పార్శీలు, జైనులు, క్రైస్తవులకు సీఏఏ చట్టం కింద భారత ప్రభుత్వం పౌరసత్వం కల్పిస్తోంది. అయితే పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)కు కాంగ్రెస్ మొదట్నుంచీ వ్యతిరేకం. ప్రస్తుతం సీఏఏ సంబంధ కేసులు సుప్రీంకోర్టులో విచారణలో ఉన్నాయి. తీర్పులు రావాల్సి ఉంది. కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలోకి వస్తే జమ్మూకశ్మీర్‌కు మళ్లీ పూర్తి రాష్ట్ర హోదా కల్పిస్తుంది. మోదీ సర్కార్ ఆర్టికల్ 370ను రద్దుచేయడం, దానిని సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్ విభేదిస్తోంది. కానీ ఇప్పుడు అది చట్టంగా మారిందికాబట్టి ఏం చేయలేం. - కోల్‌కతా

## నాడు వ్యతిరేకించి.. ఇప్పుడు సమర్థిస్తున్నారు

**రిజర్వేషన్లపై మోహన్ భాగవత్ వ్యాఖ్యలను తప్పుబట్టిన రాహుల్**



**డామన్/కటక్:** రిజర్వేషన్లను ఆర్‌ఆర్‌ఎస్ మొదట్నుంచీ సమర్థిస్తూ వస్తోందంటూ ఆ సంస్థ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. డయ్యూ డామన్, దాద్రా నగర్ హవేలీ కేంద్ర పాలిత ప్రాంతంలోని డామన్ పట్టణంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ ప్రసంగించారు. '' ఇప్పుడేమో రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదని భాగవత్ చెబుతున్నారు. మరి అప్పుడేమో తాను రిజర్వేషన్లకు పూర్తి వ్యతిరేకినని ఘంటాపథంగా చెప్పేవారు. రిజర్వేషన్లను వ్యతిరేకించే వాళ్లే బీజేపీతో చేరేవారు. వాళ్లకే బీజేపీ స్వాగతం పలికి అక్కున చేర్చుకుంది. తీరా ఎన్నికల వేళ ఇప్పుడొచ్చి మళ్లీ రిజర్వేషన్లకు మా మద్దతు అంటూ భాగవత్ కొత్త రాగం ఆలపిస్తున్నారు'' అని రాహుల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ''ఈసారి ఎన్నికలు కాంగ్రెస్, ఆర్‌ఎస్‌ఎస్–బీజేపీ మధ్య సైద్ధాంతిక పోరు. రాజ్యాంగ విత్తనం నుంచే దేశంలోని అనేక విభాగాలు ఉద్భవించాయి. పూర్వకాలంలో మాదిరి రాజ్యపాలన సాగించాలని మోదీజీ, ఆర్‌ఎస్‌ఎస్ ఆశ. వీటిని నాశనం చేసి ఆర్‌ఎస్–బీజేపీ రాజుల్లాగా దేశాన్ని పాలించాలనుకుంటున్నారు'' అని ఆరోపించారు. '' ఆర్‌ఎస్‌ఎస్–బీజేపీ వాళ్లకు ఒకే దేశం, ఒకే భాష, ఒక్కడే నేత ఉండే వ్యవస్థ కావాలి. పశ్చిమబెంగాల్ ప్రజలు బెంగాలీ మాట్లాడతారు. అలాగే గుజరాత్ వాళ్లు గుజరాతీ, తమిళులు తమిళమే మాట్లాడతారు. అలాంటపుడు ఒకే భాష, ఒకే నేత విధానంలో హేతుబద్ధత ఎక్కడుంది?'' అని నిలదీశారు. ''డయ్యూ డామన్, దాద్రా నగర్ హవేలీ కేంద్ర పాలిత ప్రాంత అడ్మినిస్ట్రేటర్ పదవిలో మోదీ ప్రఫుల్ పటేల్‌ను 'రాజు' లాగా నియమించారు. ప్రజాభీష్టంతో ప్రఫుల్‌కు పనిలేదు. ఆయన ఏమనుకున్నారో అదే చేస్తారు'' అని ఆరోపించారు.

# రేవణ్ణ, ప్రజ్వల్‌పై లైంగిక వేధింపుల కేసు

**ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసిన కర్ణాటక ప్రభుత్వం**

**శివాజీనగర/యశవంతపుర:** కర్ణాటకలో లైంగిక వేధింపుల వ్యవహారం సంచలనాత్మకంగా మారింది. జేడీ(ఎస్) అధినేత, మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడ కుమారుడు, రాష్ట్ర మాజీ మంత్రి హెచ్.డి.రేవణ్ణ, మనవడు, హసన్ సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై కేసు నమోదైంది. ప్రజ్వల్ రాసలీలలంటూ పలు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కర్ణాటకలో తొలి దశలో 14 లోక్‌సభ స్థానాల్లో ఈ నెల 26న పోలింగ్ జరిగింది. ఆ మరుసటి రోజే ఈ వీడియోలు బయటకు వచ్చాయి. రాష్ట్రమంతటా చర్చనీయాంశంగా మారాయి. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాసలీలల వీడియోలు పొందుపర్చిన పెన్‌డ్రైవ్‌లను హాసన్ నియోజకవర్గంలో బహిరంగ స్థలాల్లో విసిరేసినట్లు సమాచారం. ప్రజ్వల్ రేవణ్ణ హసన్ లోక్‌సభ స్థానం నుంచి పోటీకి దిగారు. తండ్రి కుమారులు రేవణ్ణ, ప్రజ్వల్ రేవణ్ణ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ వారి వంట మనిషి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో హసన్ జిల్లాలోని హొళెనరసిపుర పోలీసులు ఇద్దరు నిందితులపై ఆదివారం కేసు నమోదు చేశారు. ఏ1గా రేవణ్ణ, ఏ2గా ప్రజ్వల్‌ను చేర్చారు. రేవణ్ణ భార్య భవాని తనకు బంధువు అవుతారని, వారి ఇంట్లో వంట మనిషి చేరాక రేవణ్ణ తనను లైంగికంగా వేధించడం ప్రారంభించారని, ప్రజ్వల్ తన కుమార్తెకు వీడియో కాల్స్ చేస్తూ అసభ్యంగా మాట్లాడుతుండేవాడని వంటమనిషి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. .

**విచారణకు 'సిట్'**

నిజానిజాలను నిర్ధారించేందుకు సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. సీఐడీ అదనపు డీజీపీ నేతృత్వంలోని 'సిట్'లో ఇద్దరు మహిళా ఐపీఎస్‌లను సభ్యులుగా నియమించారు. నిందితుడు ప్రజ్వల్ విదేశం వెళ్లినట్లు తెలిసింది. తండ్రి కొడుకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ మహిళా కాంగ్రెస్ నాయకులు ఆదివారం బెంగళూరులో ఆందోళన చేపట్టారు.

# ఎలక్షన్ బీట్

## కేజ్రీవాల్ భార్యకు ములాఖత్ నిరాకరణ



**న్యూఢిల్లీ:** తిహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న అరవింద్ కేజ్రీవాల్‌ను భార్య సునీత కలుసుకునేందుకు జైలు యంత్రాంగం అనుమతి నిరాకరించింది. సోమవారం కలిసేందుకు శనివారమే ఆమె అనుమతి కోరగా అందుకు జైలు యంత్రాంగం ఒప్పుకోలేదని ఆప్ వర్గాలు వెల్లడించాయి. '' మోదీ సర్కార్ ఒత్తిళ్లకు తలొగ్గి కేజ్రీవాల్‌తో సునీత ములాఖత్ కాకుండా జైలు యంత్రాంగం అడ్డుతగులుతోంది. మోదీ సర్కార్ పరిధులు దాటి మరీ అమానవీయంగా ప్రవర్తిస్తోంది. కేజ్రీవాల్‌ను ఒక ఉగ్రవాదిలాగా చూస్తోంది'' అని ఆప్ ఆరోపించింది. కారాగార నిబంధనావళి ప్రకారం విచారణ ఖైదీకి వారానికి రెండు ములాఖత్‌లను అనుమతిస్తారు. ఒకేసారి ఇద్దరు కలవొచ్చు. వారంలో గరిష్ఠంగా నలుగురు కలిసి మాట్లాడొచ్చు. అయితే ఇప్పటికే ఖరారైన షెడ్యూల్ ప్రకారం సోమవారం ఢిల్లీ మహిళా మంత్రి అతిశి, మంగళవారం పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కలవాల్సి ఉంది. '' సునీత, అతిశి పేర్లను 27వ తేదీన ఒకేసారి అధికారులకు ఇచ్చాం. వాళ్లు ఉద్దేశపూర్వకంగా సునీతకు అనుమతి నిరాకరించారు'' అని ఆప్ వెల్లడించింది.

**వివరణ ఇచ్చిన జైలు యంత్రాంగం**

''కేజ్రీవాల్‌ను సునీత ఎప్పటికప్పుడు కలుస్తూనే ఉన్నారు. ఆమెకు మాత్రమే అనుమతి ఇవ్వలేదనే ప్రశ్నే లేదు. కేజ్రీవాల్‌ను 29వ తేదీన కలిసేందుకు అతిశి వారం క్రితమే అనుమతి కోరారు. సునీత మాత్రం ఆలస్యంగా ఆదివారం అనుమతి కోరారు. అందుకే అతిశికే ములాఖత్‌కు అనుమతి మంజూరుచేశాం''అని జైలు యంత్రాంగం వివరణ ఇచ్చింది.

**భరతమాత బిడ్డగా అర్థిస్తున్నా.. ఓటేయండి**

ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల ప్రచారం మొదలెట్టిన సునీత ఆదివారం వెస్ట్ ఢిల్లీ నియోజకవర్గ అభ్యర్థి మహాబల్ మిశ్రాకు ఓటేయాలంటూ రోడ్‌షో చేపట్టారు. '' భరతమాత బిడ్డనైన నేను మిమ్మల్ని ఒక్కటే వేడుకుంటున్నా. కేంద్రంలో నిరంకుశపాలనకు అంతం పలికేందుకు ఆప్‌కు ఓటేయండి. మీ ఓటును ఉన్న విలువను అర్థంచేసుకోండి'' అని అన్నారు.

## రిజర్వేషన్లు రద్దు చెయ్యం: అమిత్ షా

**కాస్‌గంజ్/మైన్‌పురి/ఇటావా:** ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను బీజేపీ రద్దు చేయదు, ఎవరినీ చేయనివ్వదు..ఇదే మోదీ గ్యారెంటీ అని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో 400పైగా సీట్లు గెలుచుకుంటే రిజర్వేషన్లను తొలగిస్తుందంటూ బీజేపీపై ప్రతిపక్షాలు పదేపదే చేస్తున్న ఆరోపణలపై ఆయన ఈ మేరకు స్పందించారు. యూపీలోని కాస్‌గంజ్, మైన్‌పురి, ఇటావాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీల్లో అమిత్ మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలు వెనుకబడిన వర్గాల ప్రజల ప్రయోజనాలను విస్మరించాయని, మోదీ ప్రధాని అయ్యాకనే బీసీలకు హక్కులను కల్పించారని వివరించారు. రెండు పర్యాయాలు ప్రధానిగా ఉన్న మోదీ పార్లమెంట్‌లో పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ రిజర్వేషన్ల జోలికి వెళ్లలేదని ఆయన గుర్తు చేశారు. విపక్షాలు అయోధ్య రామాలయం అంశాన్ని దశాబ్దాలుగా నాన్చుతూ వచ్చాయంటూ.. రామభక్త కరసేవకులపై కాల్పులు జరిపిన వారు కావాలో, రామ మందిరం నిర్మించిన మేము కావాలో నిర్ణయించుకోవాలని ప్రజలను కోరారు. ఏటా వేసవిలో థాయ్‌లాండ్ విహారానికి వెళ్లే రాహుల్ గాంధీ ఒక వైపు, సరిహద్దుల్లోని సైనికులతో 23 ఏళ్లుగా దీపావళి వేడుకలు జరుపుకునే మోదీ మరో వైపు ఉన్నారని వ్యాఖ్యానించారు. ఓటు బ్యాంకుకు గండిపడుతుందనే భయంతోనే అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్టకు ఎస్పీ చీఫ్ అఖిలేశ్, డింపుల్ యాదవ్ దంపతులు రాలేదని మండిపడ్డారు.

## 'జైల్ కే జవాబ్ మే..' పాట మార్చండి

**ఆమ్ ఆద్మీ పార్టీకి ఎన్నికల కమిషన్ ఆదేశం**

**సాక్షి, న్యూఢిల్లీ:** ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జైలు ఊచల వెనక ఉన్న ఫొటోతో 'జైల్ కే జవాబ్ మే హమ్ వోట్ దేంగే...(జైలుకు ఓటుతో బదులిస్తాం)'అంటూ సాగిన ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల ప్రచార పాటలో మార్పులు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. బీజేపీ ఫిర్యాదుపై ఈసీ ఈ మేరకు స్పందించింది. న్యాయవ్యవస్థను చులకన చేయడంతోపాటు బీజేపీని, కేంద్ర దర్యాప్తు విభాగాలను దూషిస్తున్నట్లుగా ఆ పాట అర్థమిస్తోందని, ఇది నియమావళి ఉల్లంఘనే అని తెలిపింది. ఆ పాటను నిషేధించడం లేదని తెలిపింది. అందులో మార్పులు చేసి తిరిగి సమర్పించాలని ఆ నోటీసులో పేర్కొంది. అయితే, దీన్ని బీజేపీ రాజకీయంగా ఆప్ అభివర్ణించింది. తటస్థంగా వ్యవహరించాల్సిన ఈసీ బీజేపీ చేతిలో రాజకీయ అస్త్రంగా మారిపోయిందని విమర్శించింది. ప్రచార గీతాన్ని ఈసీ నిషేధించడం దేశ చరిత్రలోనే తొలిసారని పేర్కొంది. పాటలో ఎక్కడా బీజేపీ ప్రస్తావనే లేదని, ఉల్లంఘన కిందికి రాదని పేర్కొంది. నియంతృత్వం గురించి మాట్లాడితే, అధికార పార్టీని విమర్శించినట్లేనని ఈసీ అంటోందని ఢిల్లీ మంత్రి అతిశీ వ్యాఖ్యానించారు.

## బీజేపీకి కాంగ్రెస్, సీపీఎంల సాయం: మమత

**కలియాచక్:** కాంగ్రెస్, సీపీఎంలపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. బెంగాల్‌లో ఆ రెండు పార్టీలు బీజేపీకి అండగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో తమ టీఎంసీ మాత్రమే రాష్ట్రంలో ఒంటరి పోరు సాగిస్తోందని చెప్పారు. మాల్దా దక్షిణ నియోజకవర్గంలో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో మమత మాట్లాడారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్‌తో ఎలాంటి ఎన్నికల పొత్తు లేదు. సీపీఎం, కాంగ్రెస్ జట్టు కట్టాయి. ఈ రెండు పార్టీలు బీజేపీతో చేతులు కలిపాయి. కాంగ్రెస్, సీపీఎంలు బీజేపీకి రెండు కళ్లు. కాంగ్రెస్‌కు గానీ, సీపీఎంకు గానీ ఓటేస్తే బీజేపీ వ్యతిరేక ఓటుకు గండిపడి ప్రధాని మోదీకి సాయం చేసినట్లే'అని మమత వ్యాఖ్యానించారు. 'సీపీఎంతో పొత్తు వద్దనే షరతుతో బెంగాల్‌లో కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటు చేసుకుందామని భావించాం. అయితే, కాంగ్రెస్ ఒప్పుకోలేదు. కాంగ్రెస్, సీపీఎం నేతలు బీజేపీ మాదిరిగానే మాట్లాడుతున్నారు. టీఎంసీ ప్రభుత్వ ప్రజానుకూల విధానాలపై కుట్ర పన్నుతున్నారు. అందుకే రాష్ట్రంలోఇండియా కూటమి లేదు'అని మమత వివరించారు. ఎన్నికల తర్వాత ఇండియా కూటమి ప్రభుత్వ ఏర్పాటులో టీఎంసీ కీలకంగా వ్యవహరిస్తుందని వెల్లడించారు.

## ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్‌గా లవ్లీ రాజీనామా



**న్యూఢిల్లీ:** సార్వత్రిక ఎన్నికల వేళ విపక్షాల 'ఇండియా' కూటమికి మరో తలనొప్పి మొదలైంది. ఢిల్లీ కాంగ్రెస్ చీఫ్ పదవికి అర్విందర్ సింగ్ లవ్లీ శనివారం రాజీనామా చేశారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీతో పొత్తుకు ఢిల్లీ కాంగ్రెస్ శాఖ వ్యతిరేకమని ఆయన వ్యాఖ్యానించారు. ఢిల్లీ రాష్ట్ర నేతలకు ఇష్టం లేకపోయినా కాంగ్రెస్ అధిష్టానం సూచనల మేరకు ఆప్‌తో కలిపి కూటమిని సమర్థించాల్సి వచ్చిందని, ఇప్పుడు తన రాజీనామాకు అది కూడా ఒక కారణమని అర్విందర్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం తన రాజీనామా లేఖను పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గేకు పంపించారు. '' గతంలో ఇదే ఆప్ కాంగ్రెస్‌పై నిరాధార అవినీతి, తప్పుడు ఆరోపణల బురదచల్లింది. ఆప్ మంత్రివర్గంలో సగం మంది మంత్రులు ఇప్పుడు జైల్లో ఉన్నారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూ బేషరతు మద్దతు పలుకుతూ కేజ్రీవాల్ అరెస్ట్‌వేళ ఆయన ఇంటికి కూడా వెళ్లొచ్చా. నార్త్ ఈస్ట్ ఢిల్లీ కాంగ్రెస్ అభ్యర్థి కన్హయ్య కుమార్ మన పార్టీని కాదని కేజ్రీవాల్‌ను పొగడ్తల్లో ఆకాశానికెత్తేస్తున్నారు. ఇది పార్టీ సిద్ధాంతాలకే విరుద్ధం. ఇది పార్టీ నేతలకేకాదు కార్యకర్తలకు కూడా నచ్చట్లేదు. పాఠశాలలు, ఆస్పత్రులు, మౌలిక సదుపాయాలు ఆప్ హయాంలో అధ్వాన్నంగా తయారయ్యాయి. డీపీసీసీ చీఫ్‌గా నేను తీసుకునే నిర్ణయాలు, నియామకాలను ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి(ఢిల్లీ ఇన్‌చార్జ్) బుట్టదాఖలుచేశారు. 150కిపైగా బ్లాక్‌లకు ఇప్పుడు బ్లాక్ ప్రెసిడెంట్ కూడా లేరు. పార్టీ కార్యకర్తల ప్రయోజనాలు కూడా కాపాడలేని నేను ఈ పదవిలో కొనసాగడంలో అర్థంలేదు'' అని లేఖలో లవ్లీ పేర్కొన్నారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
సోమవారం । 29 । ఏప్రిల్ । 2024





**బంగారు తాపడానికి రూ.లక్ష విరాళం**

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ ఆలయానికి బంగారు తాపడం పనులకు విద్యాధరపురానికి చెందిన చిటికెన వెంకట సత్యనారాయణ కుటుంబం ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించింది.



**వైభవంగా శ్రీలలితా పారాయణం**

విజయవాడకల్చరల్: జయహో భారతీయం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో పీబీ సిద్ధార్థ కళాశాలలో ఆదివారం నిర్వహించిన మహాలలితా పారాయణం వైభవంగా సాగింది.



| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| నందిగామ | 27.5 | 43 |
| జగ్గయ్యపేట | 27 | 42 |
| మచిలీపట్నం | 29 | 36 |
| గుడివాడ | 28 | 42 |

## న్యూస్‌రీల్

### వ్యవసాయ ఉద్యోగుల సేవా సంఘం నూతన కార్యవర్గం



**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** వ్యవసాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖ ఉద్యోగుల సేవా సంఘం నూతన అధ్యక్షుడు పి.వి.సాయి కుమార్ అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఎండీ ఇక్బాల్ ఈ నెల 30న పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో ఆదివారం విజయవాడలో వ్యవసాయ అధికారుల సంఘం భవనంలో వ్యవసాయ శాఖ ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా శ్యాంసుందర్ శ్రీనివాస్, సహాధ్యక్షుడిగా నాగార్జునరావు, ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీమన్నారాయణ, మహేంద్ర బాబు, లలిత్ కుమార్, పాపారావు, భాస్కరరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా డి.ఎస్.ఎన్ శ్రీనివాస్, శివ జ్యోతి, ప్రచార కార్యదర్శిగా జయరావు, కార్యదర్శులుగా ప్రభాకర్ రావు, సీతారామరాజు, సత్యనారాయణ, కొండబాబు, రాజేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఎన్నికల అధికారిగా ఆర్.శ్రీనివాస్, సహఎన్నికల అధికారులుగా సూరిబాబు, శ్రీరాములు వ్యవహరించారు. ఏపీ ఎన్జీఓ పశ్చిమ కృష్ణా జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్, తూర్పు కృష్ణా జిల్లా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ, రాష్ట్ర ఏఈఓల సంఘ అధ్యక్షకార్యదర్శులు వేణుమాధవరావు, కె.వి.సత్యనారాయణ,జిల్లా వ్యవసాయ అధికారుల సంఘ అధ్యక్షుడు రఘురామ్ పాల్గొన్నారు.

### నేటితో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగింపు

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారంతో ముగియనుంది. జిల్లాలోని విజయవాడ పార్లమెంట్, ఏడు నియోజకవర్గాలకు నామినేషన్ల స్వీకరణ ఈ నెల 25న ముగిసింది. 26న నామినేషన్ల పరిశీలన జరిగింది. ఈ పరిశీలనలో విజయవాడ పార్లమెంట్‌కు సంబంధించి 19 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. వీటిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు సంబంధించి నాలుగు, రిజిస్టర్డ్ పార్టీలకు సంబంధించి పది, స్వతంత్ర అభ్యర్థులకు సంబంధించి ఐదు నామినేషన్లు ఆమోదం పొందాయి. జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 106 నామినేషన్లు ఆమోదం పొందాయి. వీటిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు సంబంధించి 27, రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులకు సంబంధించి 39, స్వతంత్ర అభ్యర్థులకు సంబంధించి 40 నామినేషన్లు ఆమోదంపొందాయి. సోమవారంతో నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుంది. ఉపసంహరణ ప్రక్రియ తర్వాత ఎవరెవరు ఎన్నికల బరిలో నిలుస్తారనేది తేలుతుంది. స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను ప్రకటిస్తారు.

### తిరుపతమ్మ సేవలో దేవదాయ శాఖ ఏడీసీ



**పెనుగంచిప్రోలు:** గ్రామంలో వేంచేసిన తిరుపతమ్మవారిని దేవదాయ, ధర్మదాయ శాఖ అడిషనల్ కమిషనర్ టి.చంద్రకుమార్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదాలతో ఆయనను సత్కరించారు. ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈఓ తిరుమలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించిన సీపీ

**జగ్గయ్యపేట అర్బన్:** ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి.రామకృష్ణ ఆదివారం జగ్గయ్యపేట పట్టణ పోలీస్ స్టేషన్, ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్, మండలంలోని గరికపాడు వద్ద ఉన్న అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్‌లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు, పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. బందోబస్తు, ఎన్నికల ఏర్పాట్లపై తీసుకుంటున్న చర్యల గురించి స్థానిక పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. గరికపాడు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తున్న తీరును పరిశీలించారు. వాహనాల తనిఖీకి సంబంధించి నగదు, మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్, జగ్గయ్యపేట, నందిగామ సీఐలు జానకీరామ్, చంద్రశేఖర్, పట్టణ, చిల్లకల్లు ఎస్ఐలు సూర్యభగవాన్, పద్మారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత పోలింగే లక్ష్యం



- శాంతి భద్రతల పరిరక్షణకు పెద్దపీట
- ఓటర్లు నిర్భయంగా ఓటు వేసే పరిస్థితులు కల్పిస్తాం
- అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం
- ఎన్నికల్లో అన్నిరకాల ప్రలోభాలకు అడ్డుకట్ట
- 'సాక్షి'తో ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రామకృష్ణ

**సాక్షి ప్రతినిధి, విజయవాడ:** 'సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. శాంతిభద్రతలను పూర్తి స్థాయిలో పరిరక్షిస్తూ, ఓటర్లు స్వేచ్ఛగా పోలింగ్ బూత్‌కు వెళ్లి, ఓటు వేసేందుకు అవసరమైన కార్యాచరణను ఖరారు చేశాం' అని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి.రామకృష్ణ తెలిపారు. ఇటీవల పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఎన్నికల నిర్వహణపై 'సాక్షి' ప్రతినిధితో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

**ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ**

జిల్లాలో 717 ప్రాంతాల్లో మొత్తం 1,874 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. వీటన్నింటిని జియో మ్యాపింగ్ చేశాం. ప్రతి పోలింగ్‌తో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రణాళికలు రూపొందించాం. ఈవీఎం మిషన్లను ఆయా పోలింగ్ స్టేషన్లకు చేర్చడం, ఎన్నికలు ముగిశాక తిరిగి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇందు కోసం రూట్ మ్యాప్‌ను ఖరారు చేసి, ఎంత మంది పోలీసులు అవసరమన్నది కూడా గుర్తించాం. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఓటింగ్ శాతం పెరిగేందుకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నాం. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీస్ శాఖ పూర్తి సహకారం ఇస్తుందన్న భరోసా ఇస్తున్నాం.

**శాంతి భద్రతల పరిరక్షణ**

ప్రశాంత పరిస్థితులు కొనసాగితే ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఇందు కోసం పోలింగ్‌కు ముందు, పోలింగ్ తరువాత శాంతిభద్రతలకు పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. 487 ప్రాంతాల్లో ఉన్న 965 పోలింగ్ బూతులను సాధారణంగా, 230 ప్రాంతాల్లో ఉన్న 909 పోలింగ్ బూత్‌లను సమస్యాత్మకంగా ఇప్పటికే గుర్తించాం. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టిసారించి అక్కడ సాయుధ బలగాల పహారా ఏర్పాటు చేస్తున్నాం. ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకోవచ్చన్న విశ్వాసాన్ని ఓటర్లలో కల్పించేందుకు జిల్లా అంతటా సివిల్, ఏఆర్, సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నాం. సంఘ విద్రోహ శక్తులను ఉపేక్షించేది లేదు. జిల్లాలో రౌడీషీటర్లను గుర్తించి కౌన్సెలింగ్ చేస్తున్నాం. ఎన్నికల్లో ఆటంకం కలిగించే అవకాశం ఉన్నవారిని గుర్తించి నాన్ బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) నోటీసులు జారీచేస్తున్నాం. తీవ్ర నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వారిపై నిఘాకు షాడో పార్టీలను ఏర్పాటు చేస్తున్నాం. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి కదలికలపై ప్రత్యేకంగా దృష్టి సారించాం.

**ప్రజల ఓటుకు మా భరోసా**

ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకొనేందుకు అవకాశం కల్పించడమే మా ప్రథమ లక్ష్యం. జిల్లాలో ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలోనూ ఓటు వేసేందుకు ఓటర్లు వెనుకంజ వేసే పరిస్థితి లేకుండా చర్యలు తీసుకొంటున్నాం. ఎన్నికల్లో డబ్బు, మద్యం ఇతర ప్రలోభాలకు అడ్డుకట్ట వేస్తున్నాం. రాష్ట్ర, జిల్లాల సరిహద్దుల్లో గట్టి నిఘా ఉంచాం. 11 అంతర్రాష్ట్ర, ఏడు జిల్లా సరిహద్దు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటలూ నిరంతరంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. దీని కోసం జిల్లా పోలీస్ యంత్రాంగం సాంకేతిక వనరులను సమకూర్చుకొంది. ఇప్పటి వరకు రూ.5.76 కోట్ల విలువైన 8.58 కిలోల బంగారం, 33.14 కిలోల వెండితోపాటు, రూ.7.24 కోట్ల నగదును జప్తు చేశాం.

**ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూం**

ఎన్నికల్లో అక్రమాలను అడ్డుకొనేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాం. విజయవాడ సిటీతో పాటు, రూరల్ మండలం, ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటైన సీసీ కెమెరాలను గస్తీకోసం వినియోగించుకుంటాం. తెలంగాణ, జిల్లా సరిహద్దులోని సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంనకు అనుసంధానం చేశాం. ప్రత్యేక ఎన్నికల సెల్ ఏర్పాటు చేసి వాటన్నింటిని పర్యవేక్షిస్తున్నాం. హోంగార్డు నుంచి అన్ని స్థాయిల అధికారులను ఎన్నికలకు సన్నద్ధం చేశాం. పోలీసు పరిశీలకులు సైతం ఏర్పాట్లు భేషుగ్గా ఉన్నాయని ప్రశంసించారు. ఇదే పంథాను చివరి వరకు కొనసాగించి విజయ వంతంగా ఎన్నికల ప్రక్రియను పూర్తిచేస్తాం.



గరికపాడు చెక్‌పోస్టును పరిశీలిస్తున్న సీపీ రామకృష్ణ

రూ.2.53 కోట్ల విలువైన 81,252 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నాం. 5,598 మందిపై బైండోవర్ కేసులు పెట్టాం. 638 మంది రౌడీలు, 687 మంది అనుమానితులు, ఎన్నికల్లో అక్రమలకు పాల్పడిన చరిత్ర ఉన్న 814 మంది, 1,925 మంది అసాంఘిక శక్తులపై నిఘా ఉంచాం.

## పోలింగ్ సజావుగా జరిగేలా కృషి చేయాలి

**ఎన్నికల పరిశీలకులు మంజు రాజ్‌పాల్, నరీందర్ సింగ్ బాలి**



మైక్రో అబ్జర్వర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎన్నికల పరిశీలకులు

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** ఈసీఐ మార్గదర్శకాలను పాటిస్తూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సూక్ష్మ పరిశీలనతో పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా మైక్రో అబ్జర్వర్లు కృషి చేయాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు మంజు రాజ్‌పాల్, నరీందర్ సింగ్ బాలి పేర్కొన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని పలు సూచనలు చేశారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా విధులపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకుని పోలింగ్ ప్రక్రియ సాఫీగా జరిగేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు మైక్రో అబ్జర్వర్లు చర్యలు తీసుకోవాలని కోరారు. పోలింగ్ సమయంలో గుర్తించిన సమస్యాత్మక ఘటనలు, ఉల్లంఘనలను జనరల్ అబ్జర్వర్లకు నివేదించాలని స్పష్టంచేశారు. మాక్ పోలింగ్‌లో అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ పార్టీ, పోలింగ్ ఏజెంట్లు, భద్రతా సిబ్బంది తదితరాలకు సంబంధించి నిశిత పరిశీలన అవసరమని పేర్కొన్నారు.

**పక్కా ప్రణాళికతో పోలింగ్ విజయవంతం**

కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. 717 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,874 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, వాటిలో 878 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు 632 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని చెప్పారు. మాక్‌పోలింగ్, పోలింగ్ మెటీరియల్, పోలింగ్ పార్టీ, ఏజెంట్లు, సీక్రెసీ ఆఫ్ ఓటింగ్, పోలింగ్ స్టేషన్ల లే అవుట్, పోలింగ్ స్టేషన్ల వద్ద ఏర్పాట్లు, 17(ఏ) రిజిస్టర్, ఓటింగ్ మెషిన్ సీలింగ్ తదితర విషయాలపై మైక్రో అబ్జర్వర్లు జాగ్రత్త వహించాలని వివరించారు. ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్లతో ప్రజాస్వామ్య సంప్రదాయాలు, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రాభవాన్ని నిలబెడతామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ శుభం నిఖ్వాల్, డీఆర్ఓ వి.శ్రీనివాసరావు, ఎల్డీఎం కె.ప్రియాంక, శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారి ఎన్.వి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్చరీ ప్రపంచ కప్‌లో సత్తాచాటిన ధీరజ్



**విజయవాడస్పోర్ట్స్:** షాంఘైలో జరిగిన ప్రపంచ కప్ ఆర్చరీ స్టేజ్–1లో విజయవాడ క్రీడాకారుడు బొమ్మదేవర ధీరజ్ అద్భుతమైన క్రీడా నైపుణ్యం ప్రదర్శించి పతకాలు సాధించడం అభినందనీయమని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ చీఫ్ కోచ్, అధ్యక్షుడు చెరుకూరి సత్యనారాయణ పేర్కొన్నారు. ఇండియా నంబర్ –1 ఆర్చర్‌గా ఎదిగిన ధీరజ్ తమ ఓల్గా ఆర్చరీ అకాడమీలోనే 2006 నుంచి శిక్షణ పొందుతున్నాడని తెలిపారు. ఇటీవల షాంఘైలో జరిగిన ప్రపంచ కప్ పోటీల్లో టీం విభాగంలో బంగారు, మిక్స్‌డ్ టీం విభాగంలో కాంస్య పతకాన్ని దేశానికి అందించడం ఆంధ్ర రాష్ట్రానికే గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి విజయవాడ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు.

# సడలిన విశ్వాసం.. కలవని పరివారం

- తెలుగుదేశం పార్టీలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులది ఎవరి దారి వారిదే
- కేశినేని చిన్ని, ఎమ్మెల్యే అభ్యర్థుల మధ్య పెరుగుతున్న అంతరం
- ప్రచారంలో తమ వరకే ఓట్లు అభ్యర్థిస్తున్న అభ్యర్థులు
- విజయవాడ వెస్ట్‌లో సైతం వేర్వేరుగా బీజేపీ, టీడీపీ ప్రచారం
- ప్రచారంలో దూసుకెళ్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని



**సాక్షి ప్రతినిధి, విజయవాడ:** విజయవాడ పార్లమెంట్ పరిధిలో తెలుగుదేశం పార్టీ నాయకుల్లో గందరగోళం ఏర్పడింది. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల మధ్య విశ్వాసం రోజురోజుకూ సన్నగిల్లుతోంది. ఎన్నికల ప్రచారంలో ఈ విషయం స్పష్టమవుతోంది. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు విడివిడిగా ప్రచారం చేస్తున్నారు. తమ వరకే ఓటు వేయాలని ఎమ్మెల్యే అభ్యర్థులు అభ్యర్థిస్తున్నారు. ఎంపీ ఓటు కూడా టీడీపీకే వేయాలని మాట వరసకు కూడా అడగడంలేదు. ఎమ్మెల్యే అభ్యర్థుల తీరును గుర్తించిన ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) విజయవాడ పరిధిలోని మూడు నియోజకవర్గాల్లో సొంత గ్రూపు ఏర్పాటు చేసుకొని ఎమ్మెల్యే అభ్యర్థులతో కలవకుండా, విడిగా ప్రచారం చేసుకొంటున్నారు.

**సొమ్మొకరిది... సోకొకరిది**

ఆయా నియోజకవర్గాల్లో సభలు, సమావేశాల నిర్వహణ, భోజనాలు, ఆర్థిక సాయాలు, వస్తువుల పంపిణీ ఇలా అన్నింటి ఖర్చు కేశినేని చిన్ని భరిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత నాయకులు, బూత్ కమిటీ సభ్యులకు కూడా ఆయనే డబ్బు పంపారని సమాచారం. ఎమ్మెల్యే అభ్యర్థులు మాత్రం తామే ఖర్చుచేస్తున్నట్లు హడావుడి చేస్తున్నారు. 'సొమ్ము మనది.. సోకు వారిదా..' అని చిన్ని రగిలిపోతున్నారు. వారిని నమ్ముకొంటే నట్టేట మునగడం ఖాయమనే భావనతో కొంతమంది నాయకులకు చిన్ని ఫోన్లు చేసి, తన కార్యాలయానికి పిలిపించుకొని ఎమ్మెల్యే అభ్యర్థులతో తనకు సంబంధం లేదని, తనకు పనిచేసి పెట్టాలని వేడుకొంటున్నట్లు తెలిసింది. ఇలా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఒకరిని, ఒకరు నమ్మకుండా వెన్నుపోటు పొడుచుకుంటున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల తీరు పార్టీ పుట్టి ముంచడం ఖాయమని పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి.

**సెంట్రల్‌లో పట్టించుకోని బొండా**

రెండు మూడేళ్ల నుంచి పార్టీ కార్యక్రమాలు ఏమి చేయాలన్నా, కార్యకర్తలకు ఏమి కావాలన్నా అన్నీ తానై చూసుకుంటున్న ఎంపీ అభ్యర్థి చిన్నికి విజయవాడ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమా కనీస గౌరవం ఇవ్వడంలేదు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న బొండా ఉమా కానీ ఆయన తనయులు కానీ ఎమ్మెల్యేగా గెలిపించాలనే ఓటర్లను కోరుతున్నారు. ఎంపీ అభ్యర్థి గురించి ప్రస్తావించడం లేదు. బొండా ఉమాను నమ్ముకొంటే నిండా మునగడం ఖాయనే భావనకు వచ్చిన చిన్ని స్వయంగా తాను, తన కుటుంబ సభ్యులు విడిగా ప్రచారం చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

**తూర్పులోనూ అదే పరిస్థితి**

విజయవాడ ఎంపీ అభ్యర్థి చిన్ని, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. పైకి కలిసి ఉన్నట్లు నటిస్తున్నా లోపల కత్తులు దూసుకుంటున్నారని పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. గద్దెను నమ్ముకుంటే నట్టేట మునగడం ఖాయమని తెలుసుకున్న కేశినేని చిన్ని సొంతంగా ప్రచారం చేసుకుంటున్నారు. గద్దె సైతం ఎంపీ అభ్యర్థిని పట్టించుకోకుండా తన పనితాను చేసుకుంటున్నారు.

**పశ్చిమంలో కలవని ప్రచారం**

విజయవాడ వెస్ట్‌లో బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి, ఎంపీ అభ్యర్థి కేశినేని నాని ఇద్దరూ ప్రచారం చేస్తున్నారు. అయితే వేర్వేరుగా ప్రచారం చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థితో కలిసి ప్రచారంలో పాల్గొంటే, మైనార్టీ ఓట్లకు గండి పడుతుందన్న భయంతో సుజనాతో ప్రచారం అంటే చిన్ని ముఖం చాటేస్తున్నారు. ప్రచారంలో ఎంపీ అభ్యర్థిని ముస్లింలు నిలదీస్తున్నారు. 'బీజేపీతో కలిసిన మీకు, ఓట్లు ఎలా వేస్తాం' అని బహిరంగానే ప్రశ్నిస్తున్నారు. డబ్బుతో గట్టెక్కాలని ఆశపడిన చిన్నికి ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతి ఒక్కరు చుక్కలు చూపిస్తుండంతో విలవిల్లాడుతున్నారు. పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా ఓటమి తప్పదనే భయం ఆయనను వెంటాడుతోంది.

**జోరుగా కేశినేని నాని ప్రచారం**

వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని ప్రచారంలో దూసుకెళ్తున్నారు. తన పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి సమష్టిగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. గడిచిన 58 నెలల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. ప్రచారంలో భాగంగా తమ వద్దకు వచ్చిన ఈ అభ్యర్థులకు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతిస్తున్నారు. రెండు సార్లు ఎంపీగా గెలిచిన అనుభవం విజయవాడ నగరంలో ఆయన చేసిన అభివృద్ధి పనులతో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. తిరువూరు, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో టాటా ట్రస్టు ద్వారా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. తన పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నో అభివృద్ధి పనులకు ఎంపీ నిధులు కేటాయించారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం పెద్ద సంఖ్యలో నీటి ట్యాంకులను సమకూర్చారు. ఇలా తాను చేసిన పనులు ఆయనకు శ్రీరామ రక్షగా నిలిచాయి. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఉత్సాహంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. వారి గెలుపు ఖాయమని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

### వృద్ధులకు ఇంటి వద్దనే పింఛన్లు

**– కలెక్టర్ ఢిల్లీరావు**

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మే ఒకటో తేదీ నుంచి వృద్ధులు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి ఇంటి వద్దనే పింఛన్లు అందజేస్తామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. మిగిలిన వారికి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని పేర్కొన్నారు. ఏ ఒక్కరూ పింఛన్ కోసం సచివాలయాల వద్దకు రావొద్దని సూచించారు. పింఛన్ల పంపిణీలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదివారం డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, గ్రామ/వార్డు సచివాలయ జిల్లా అధికారి కె.అనురాధతో కలిసి క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 2.36 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. మే ఒకటో తేదీ నుంచి డోర్ టు డోర్, డీబీటీ విధానాల్లో పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి పింఛన్లు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. గతంలో మాదిరి గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవారికి ఇంటి వద్దనే నగదు రూపంలో అందజేస్తామన్నారు. మిగిలిన వారికి ఆధార్ కార్డు లింకైన బ్యాంక్ అకౌంట్ ద్వారా పింఛన్ నగదు జమ చేసేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. బ్యాంకు ఖాతాల ద్వారా పింఛన్లు చెల్లించే జాబితా, ఇంటి వద్దకే వెళ్లి నగదు అందించాల్సిన వారి జాబితాలను తక్షణమే రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. బ్యాంక్ ఖాతాల ద్వారా నగదు చెల్లించడంలో జాప్యం లేకుండా చూడాలని లీడ్ బ్యాంకు అధికారులను కోరినట్లు వెల్లడించారు. బ్యాంకు ఖాతా ద్వారా ఏ కారణం చేతనైనా నగదు బదిలీ జరగకపోతే, మూడో తేదీన నగదు రూపంలో ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

**ప్రచార పర్వం**



విజయవాడ తూర్పు: నగరంలోని 9వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్‌కు మద్దతు తెలుపుతున్న ప్రజలు



పెనమలూరు: మండలంలోని కానూరు సనత్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జోగి రమేష్‌కు హారతి ఇస్తున్న మహిళ



విజయవాడ సెంట్రల్: నగరంలోని 60వ డివిజన్ వాంబే కాలనీలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్, ఆయన కుమార్తె సాయి అశ్వితకు హారతితో స్వాగతం పలుకుతున్న మహిళ

## క్లుప్తంగా

### సాహిత్య అకాడమీకి మణిపూర్ ఫిల్మ్ అవార్డు


సాక్షి, అమరావతి: కేంద్ర సాహిత్య అకాడమీకి మణిపూర్ రాష్ట్ర చలనచిత్ర పురస్కారం లభించింది. సుప్రసిద్ధ మణిపూరి రచయిత ప్రకాశ్ సింగ్ జీవిత సాహిత్యాలపై అకాడమీ రూపొందించిన డాక్యుమెంటరీ చిత్రానికి ఉత్తమ జీవిత చరిత్ర, కళా సాంస్కృతిక చిత్రాల విభాగంలో పురస్కారం వరించింది. ఆదివారం ఇంఫాల్‌లో జరిగిన మణిపూర్ చలనచిత్ర పురస్కారాల మహోత్సవంలో ఆ రాష్ట్ర గవర్నర్ అనుసూయా ఉయికే కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ కృత్తి వెంటి శ్రీనివాసరావుకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. అవార్డు లభించిన సాహిత్య అకాడమీ డాక్యుమెంటరీ చిత్రానికి దర్శకత్వం వహించిన ప్రముఖ రచయిత ఆరిబమ్ శర్మకు ఉత్తమ డైరెక్టర్, చోంగ్ తమ్ కమలాకు ఉత్తమ వాయిస్ ఓవర్ పురస్కారాలు దక్కాయి. వివిధ భారతీయ భాషలకు చెందిన సాహితీ ప్రముఖుల జీవన ప్రస్థానంపై ఇప్పటి వరకు సాహిత్య అకాడమీ 172 డాక్యుమెంటరీ చిత్రాలు నిర్మించింది. సాహిత్య అకాడమీ డాక్యుమెంటరీ చిత్రానికి ఒక రాష్ట్ర ప్రభుత్వ చలనచిత్ర పురస్కారం లభించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

### వక్రరేఖలు నవల ఆవిష్కరణ



విజయవాడకల్చరల్: తెలుగు కథానిక మాణిక్యం ముని మాణిక్యం నరసింహారావు అని సాహితీవేత్త కొప్పర్తి రాంబాబు అన్నారు. గుంటూరుకు చెందిన విశ్వనాథ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ముని మాణిక్యం నరసింహారావు రచించిన వక్రరేఖలు నవల ఆవిష్కరణ సభను బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాంబాబు మాట్లాడుతూ.. సున్నితమైన హాస్యానికి చిరునామా ముని మాణిక్యం నరసింహారావు అన్నారు. ఆయన సృష్టించిన కాంతం పాత్ర నేటికీ నిత్య నూతనంగా ప్రకాశిస్తోందని తెలిపారు. ఆయన సాహిత్యం సమకాలీన అంశాలను ప్రస్తావించిందన్నారు. నరసింహారావు కథలతో పాటు చారిత్రక నేపథ్యం కలిగిన వక్రరేఖలు నవలను రచించినట్లు తెలిపారు. శ్రీశ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావు నవలను ఆవిష్కరించారు. యువ కవి అనిల్ డ్యాని సభకు అధ్యక్షత వహించారు. సాహితీవేత్త డాక్టర్ మోదుగుల రవికృష్ణ విశ్వనాథ సాహిత్య అకాడమీ నిర్వహిస్తున్న సాహితీసేవ, ప్రచురించిన పుస్తకాల గురించి వివరించారు. విశ్వనాథ సాహిత్య అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ మద్దినేని సింహకొటిల్య చౌదరి సంస్థ భవిష్యత్ లక్ష్యాలను వివరించారు.

### సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 505.30 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 808.30 అడుగుల వద్ద ఉంది.

# వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

**రెడ్డి సామాజిక వర్గ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్**



ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్, గౌతమ్‌రెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న రెడ్డి సామాజిక వర్గ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీకి శ్రీరామ రక్ష అని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. భవానీపురం సర్ ఆర్థర్ కాటన్ స్కూల్‌లో రెడ్ల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ను రెడ్డి సామాజిక వర్గ ప్రతినిధులు, కార్పొరేటర్లు ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆసిఫ్ మాట్లాడుతూ సామాన్య కార్యకర్త అయిన తనను జగనన్న నమ్మి సీటు ఇచ్చారన్నారు. అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానని, మీ అందరి ఆత్మీయత కావాలని అభ్యర్థించారు. రెడ్డి సామాజిక వర్గం తనకు అన్ని విధాలుగా అండగా నిలబడిందన్నారు. తనను ఇంతగా ఆదరిస్తున్న రెడ్డి సామాజిక వర్గానికి రుణపడి ఉంటానని చెప్పారు. రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ జాతిలో పుట్టిన ఎందరో మహనీయులు పేదలకు గొప్ప సేవలు అందించారన్నారు. మహానేత వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ప్రవేశపెట్టి ప్రాణదానం చేశారన్నారు. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ నాలుగు అడుగులు ముందుకు వేసి పేదలకు సంక్షేమాన్ని అందిస్తున్నారని చెప్పారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ ఆసిఫ్‌ను భారీ మెజారిటీతో గెలిపించి, జగనన్నకు కానుకగా ఇద్దామన్నారు. ఫైబర్ నెట్ చైర్మన్ గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తెచ్చుకోవాల్సిన చారిత్రక అవసరం ఉందన్నారు. సమావేశంలో పార్టీ పరిశీలకుడు గుబ్బా చంద్రశేఖర్, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు కోటిరెడ్డి, చైతన్యరెడ్డి, ఆంజనేయరెడ్డి, నాయకులు నర్సారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# టింబర్ డిపోలో అగ్ని ప్రమాదం

**రూ.40 లక్షల ఆస్తి నష్టం**



మంటలకు పూర్తిగా దగ్ధమైన టింబర్ డిపోలోని కలప

కంచికచర్ల: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జరిగిన షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నికీలలు ఎగిసిపడి సమీపంలోని ఓ టింబర్ డిపోలో మంటలు వ్యాపించి కలపతో పాటు రేకుల షెడ్డు పూర్తిగా దగ్ధమైన సంఘటన కంచికచర్లలో ఆదివారం చోటుచేసుకుంది. ఫైర్ అధికారి తలశిల శ్రీనివాసరావు కథనం మేరకు కంచికచర్లకు చెందిన సజ్జనపు బసవాచారికి చెందిన లక్ష్మీ నరసింహ సామిల్ టింబర్ డిపోలో ఉన్న టేకు, నల్లమద్ది తదితర విలువైన కలపకు నిప్పంటుకుంది. టింబర్ డిపోకు సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుదాఘాతం వల్ల మంటలు వ్యాపించాయి. ఈ మంటలు కింద ఉన్న ఎండు గడ్డికి అంటుకున్నాయి. ఈ మంటలు సమీపంలోని టింబర్ డిపో కలపకు వ్యాపించాయి. పెద్ద పెద్ద మంటలు రావటంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. ఎగిసిపడుతున్న మంటలను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేదు. ఆ తర్వాత జగ్గయ్యపేట నుంచి ఒక ఫైర్ ఇంజిన్, విజయవాడ నుంచి రెండు ఫైర్ ఇంజిన్లతో సహా మొత్తం నాలుగు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే టింబర్ డిపోలో ఉన్న విలువైన కలప పూర్తిగా కాలిపోయింది. ఆస్తి నష్టం విలువ సుమారు రూ.40 లక్షలు ఉంటుందని ఫైర్ అధికారి తెలిపారు. అయితే ఆదివారం సెలవు దినం కావటంతో టింబర్ డిపోలో పనిచేసే సిబ్బంది ఎవ్వరూలేరు. మంటలను అదుపు చేసిన వారిలో ఫైర్ సిబ్బంది బి.శ్రీను, ఎస్‌కే తాజుద్దీన్, బి.సంజీవ్ వర్మ, షేక్ సుభానీ, శ్రీనివాసరావు, జి.రాజశేఖర్, బి.జీవన్, ఎం.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పోరాటాలతోనే కార్మిక వర్గానికి విముక్తి



మేడే చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన కార్మిక సంఘాల నేతలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమరశీల పోరాటాలతోనే కార్మిక వర్గానికి విముక్తి అని వక్తలు పేర్కొన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ జర్నలిస్టు ఆకుల అమరయ్య రచించిన 'మేడే చరిత్ర-ప్రముఖుల ప్రసంగ వ్యాసాలు' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు అధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ సభలో వక్తలు మాట్లాడుతూ.. కార్మిక సంఘాల కార్యక్రమాలు దీర్ఘకాలిక ప్రయోజనాలతో ప్రణాళికాబద్ధంగా ఉండాలన్నారు. దారి దీపం పత్రిక సంపాదకుడు డీవీఎస్ వర్మ మాట్లాడుతూ.. మేడే అంటే ఉత్సవం కాదని, హక్కుల సాధన కోసం జరిగిన పోరాటమని ఆయన గుర్తు చేశారు. ఆ పోరాట స్ఫూర్తితో నేడు కార్మిక వర్గం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ పుస్తకాన్ని పరిచయం చేసిన విశాలాంధ్ర సంపాదకుడు ఆర్వీ రామారావు మాట్లాడుతూ.. భారతదేశంలోని కార్మిక సంఘాలు, దేశంలో అసంఖ్యాకంగా ఉన్న అసంఘటిత తరంగాన్ని సమీకరించడంలో, సంఘటిత పరచడంలో విఫలమయ్యాయన్నారు. ఇటువంటి సంక్షోభ సమయంలో ఈ తరహా పుస్తకాలు రావాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఇఫ్టూ నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ ఈ పుస్తకం కార్మిక వర్గానికి మేలు చేస్తుందని ఆయన చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక వర్గం ఏమి కోల్పోతుందో తెలియజేసి వాళ్లందరినీ ఏకతాటిపై నిలిపేందుకు ఈ మేడే ఉపయోగపడాలని పిలుపు నిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి కొమ్మాలపాటి శరచ్చంద్ర జ్యోతిశ్రీలు మాట్లాడుతూ.. కార్మిక వర్గ భవిష్యత్ కార్యాచరణకు ఇటువంటి పుస్తకాలు తోడ్పడతాయని అభిప్రాయపడ్డారు. తాను పుస్తకం తీసుకొచ్చిన నేపథ్యాన్ని పుస్తక సంపాదకుడు ఆకుల అమరయ్య వివరించారు. కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ నేతలు వెంకట్రావు, చందు జనార్దన్, శీలం వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఉరేసుకుని లిఫ్ట్ మెకానిక్ మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కృష్ణలంకలోని కాటూరి వారి వీధిలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్న కాటూరి నాగేంద్ర(36) లిఫ్ట్ మెకానిక్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈయనకు భార్య గంగమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అతని భార్య నగరంలోని ఓ హాస్పిటల్ ఫార్మసీలో పనిచేస్తుంది. గత మూడు రోజులుగా నాగేంద్ర ఏ పనికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం అతని భార్య డ్యూటీకి వెళ్లగా అతను ఇంటి వద్దనే ఉన్నాడు. సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లిన అతని పిల్లలు ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. చుట్టుపక్కల వారి సహాయంతో కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### చికిత్స పొందుతూ బాపట్ల జిల్లా వాసి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): పురుగుల మందు సేవించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బాపట్ల జిల్లా చుండూరు మండలం చినపరిమి గ్రామానికి చెందిన దాసరి శివ(35)కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈయనకు భార్య ఝాన్సీరాణి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ నెల 23న అతనికి, కుటుంబ సభ్యుల మధ్య గొడవ జరగడంతో వారిపై అలిగి విజయవాడకు వచ్చాడు. వారధి సమీపంలోని సాయిబాబా గుడి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం అతడిని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో..



వెంకటేశ్వరరావు మృతదేహం

కోడూరు: ఓ వ్యక్తి అనుమానాస్పద మృతిపై కోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శిరీష తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా చోడాయపాలెంకు చెందిన నక్కా వెంకటేశ్వరరావు(50) కుటుంబ సభ్యులతో కలిసి నాగాయలంక మండలం దీనదయళపురంలో నివాసముంటున్నాడు. ఓ కార్యక్రమాన్ని పురస్కరించుకొని వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల క్రితం మండలంలోని దింటిమెరక సమీపంలోని కాలువ గట్టు వెంట నివాసముంటున్న బంధువుల ఇళ్లకు వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం వెంకటేశ్వరరావు అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండడంతో కుటుంబీకులు విషయాన్ని పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడు కుమారుడు నక్కా నాగరాజు ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఘటనాస్థలాన్ని అవనిగడ్డ సీఐ శ్రీనాథ్ పరిశీలించి, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు.

# ఇంద్రకీలాద్రిపై సరస్వతీ యాగం



సరస్వతీ యాగంలో పాల్గొన్న ఈవో రామరావు దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సరస్వతీ యాగం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన యాగశాలలో యాగాన్ని ఆలయ అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత గణపతి పూజ, కలశస్థాపన అనంతరం హోమం నిర్వహించగా, ఆలయ ఈవో కెఎస్.రామరావు దంపతులు పాల్గొన్నారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు జరిపించారు.

**ఆలయ ప్రాంగణంలో సూర్యోపాసన సేవ**

లోక కల్యాణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద అర్చకులు సూర్యభగవానుడికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా, పలువురు ఉభయ దాతలు, భక్తులు పాల్గొన్నారు. సేవలో పాల్గొన్న భక్తులను ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

# దుర్గమ్మ సన్నిధిలో వేసవి సెలవుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై వేసవి రద్దీ కనిపిస్తోంది. రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలకు వేసవి సెలవులు ప్రకటించడంతో పాటు ఇంటర్మీడియెట్, పదో తరగతి పరీక్ష ఫలితాలు వెలువడంతో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన రద్దీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. మరో వైపున శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లోనూ ఉభయ దాతలు విశేషంగా పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మొక్కుబడులు చెల్లించుకున్న భక్తులు దేవస్థానం అందిస్తున్న అన్న ప్రసాదాలను స్వీకరించారు. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారికి మహా నివేదన సమర్పించిన అనంతర క్యూలైన్‌లో రద్దీ మరింత పెరిగింది. రద్దీ నేపథ్యంలో భక్తులు ఇబ్బందులకు గురి కాకుండా ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లను ఈవో రామరావు పలు మార్లు పరిశీలించారు. సుముహూర్తాల వేళ ఒక్కటైన నూతన వధూవరులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, వారికి ఉచితంగా అంతరాలయ దర్శనం, వేద ఆశీర్వచనాన్ని అందజేశారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఘాట్‌రోడ్డుతో పాటు మహా మండపం, కనకదుర్గనగర్ వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేసి మంచినీటిని, ఆలయ ప్రాంగణంలో మజ్జిగను పంపిణీ చేశారు. సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం రద్దీ మళ్లీ పెరిగింది. రాత్రి 9 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

# వేదాలను అనుసరించడమే ప్రామాణికం



రాష్ట్ర కమిటీ సభ్యులను సత్కరిస్తున్న గుడివాడ కమిటీ సభ్యులు

గుడివాడటౌన్: మానవజాతి మనుగడకు, పురోభివృద్ధికి పురాణాలను కాకుండా వేదాలను ప్రామాణికంగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ ధర్మపీఠం సభాపతి చంద్రపాటి నాగ వరప్రసాద్ తెలిపారు. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామివారి ప్రాంగణంలో గుడివాడ పట్టణ విశ్వ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్మపీఠం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాజధానిలో ఉన్న ధర్మపీఠాన్ని రాష్ట్ర విభజన అనంతరం సాహితీవేత్తల సహకారంతో మన రాష్ట్రానికి తీసుకురాగలిగామన్నారు. ధర్మపీఠం విస్తరణకు, అభివృద్ధికి పెద్దలు, సాహితీవేత్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సభాపతి రామకృష్ణాచార్యులు, సహ సంచాలకులు పొందూరు స్వరాజ్యలక్ష్మి, చోడ విజయకుమార్, పొన్నాడ ఈశ్వరాచారి, ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు వసుధ బసవేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు భవిరి శంకరనాథ్, వంగిపురపు వీర రాఘవాచారి, పి.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులను గుడివాడ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

# పీజీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో అసైన్‌మెంట్స్ సమర్పించాలి



ఎస్ఆర్ఆర్ కాలేజీలో మాట్లాడుతున్న అంబేద్కర్ వర్సిటీ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అజంతకుమార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2023–24 విద్యా సంవత్సరం పీజీ విద్యార్థులు అసైన్‌మెంట్స్ ఆన్‌లైన్‌లో సమర్పించాలని వర్సిటీ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.అజంతకుమార్ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం పీజీ విద్యార్థులకు ఇండక్షన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. విద్యార్థులకు ఆన్‌లైన్ సేవలు అసైన్‌మెంట్‌లను ఏ విధంగా సబ్మిట్ చేయాలో తెలియజేసేందుకు ఇండక్షన్ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు యూనివర్సిటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రిటైర్డ్ అధ్యాపకుడు టి.పి.బాబు యూనివర్సిటీ అందిస్తున్న కోర్సులు, నైపుణ్యాలను పెంపొందించుకునే విధానాలను వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ధన్‌రాజు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్ సీపీలో చేరిన ముస్లిం మైనార్టీలు



మైనార్టీలకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ 58వ డివిజన్‌కు చెందిన పలువురు ముస్లిం మైనార్టీ పెద్దలు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి కృషి చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ముస్లింలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించిన జగనన్నకు ముస్లిం మైనార్టీలు బాసటగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, షేక్ నాగుల్‌మీరా, బాజీ, సుభాని, బబ్లు, ఇస్మాయేల్, హుస్సేన్, రేష్మ, ఫాతిమున్నీసా, జరీనా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### చెస్ ఓపెన్ ఫిడే రేటింగ్ టోర్నీలో ఆంధ్రా ఆటగాళ్ల హవా



చెస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయవాడ స్పోర్ట్స్: స్పార్క్ చెస్ అకాడమీ మొదటి అంతర్జాతీయ చెస్ ఓపెన్ ఫిడే రేటింగ్ టోర్నమెంట్ నాల్గవ రోజు ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుల హవా కొనసాగింది. ఈ నెల 25న కానూరులోని షామ్‌రాక్ స్కూల్‌లో ప్రారంభమైన పోటీలు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతాయి. మొత్తం పది రౌండ్లు జరిగే పోటీలు ఆదివారం నాటికి ఏడు రౌండ్లు పూర్తయ్యాయి. ఏడో రౌండ్ ముగిసే నాటికి ఎండీ ఇమ్రాన్(విజయవాడ), హరీష్‌సాయిరామ్(విజయవాడ), శ్రీషణ్ముక్‌చంద్ర(తెలంగాణ), శ్రీనివాసరావు(కృష్ణా జిల్లా), అఖిల్‌ప్రసాద్(విశాఖపట్నం), లక్ష్మీచరణ్‌నాయుడు(విజయనగరం), సీతాసాగర్(తూర్పు గోదావరి), మోహిత(గుంటూరు), భావన్(విజయవాడ), ధనుష్(అనకాపల్లి) టాప్ టెన్‌లో కొనసాగుతున్నారు. ఈ పోటీలకు 405 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.





## క్లుప్తంగా

### ఐటీ రంగంలో సవాళ్లను ఎదుర్కోవాలి

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** ఐటీ రంగంలో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే స్కిల్స్‌ను విద్యార్థులు పెంపొందించుకోవాలని మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లోని ఆర్కిటెక్ట్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ ఉడతా అన్నారు. నలంద డిగ్రీ కళాశాలలో 2023–24 వ సంవత్సరంలో 223 మంది ప్లేస్‌మెంట్స్ సాధించినందుకు గాను ఆదివారం సక్సెస్‌మీట్ -2024 నిర్వహించారు. బెంజిసర్కిల్ సమీపంలోని నలంద విద్యానికేతన్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ మీట్‌లో రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎ.విజయబాబు, ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తదితరులు పాల్గొన్నారు.

### విరసం ఆధ్వర్యంలో పుస్తక ఆవిష్కరణ




**విజయవాడకల్చరల్:** విప్లవ రచయితల సంఘం విజయవాడ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్వాతంత్య్ర సమరయోధుల సంఘం భవన్‌లో దేశం కార్పొరేట్లకు (కగార్ యుద్ధంలో హిందూత్వ ఫాసిస్ట్ వ్యూహం) పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభకు విరసం సీనియర్ నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ అధ్యక్షత వహించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్తులను అదాని, అంబానీలకు అప్పజెప్పడానికి బీజేపీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసులపై యుద్ధం ప్రకటించినట్లు తెలిపారు. ప్రజల కోసం కాక కార్పొరేట్ల కోసం పనిచేస్తున్నట్లు చెప్పారు. సిద్దార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌బాబు ఎన్నికల బాండ్లు–ప్రజాస్వామ్యం అంశంగా మాట్లాడుతూ ఎన్నికల బాండ్లలో పారదర్శకత లేకుండా చేశారన్నారు. దేశంలోని నాలుగు ప్రధాన పార్టీలకు బాండ్లు అందినట్లు గుర్తు చేశారు. విరసం సభ్యుడు యుగంధర్ వందన సమర్పణ చేశారు. విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

### యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగ గురువు ప్రభాకర్ అన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో స్ఫూర్తి కుటుంబం, ఆంధ్రప్రదేశ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం యోగ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వస్ఫూర్తి గురువులు అనుగ్రహించిన 'ఆసన ప్రాణాయామ యోగ ప్రక్రియ' (ప్రస్థాన సాధన)లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. నిరంతరం యోగ సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. రిటైర్డ్ రైల్వే కళాశాల అధ్యాపకులు కాదంబరి జ్యోతి 'మనసే అన్నింటికీ మూలం' అని మనసును అదుపులో పెట్టుకోవాలని సూచించారు. మనసుపై నియంత్రణతో శ్రేయస్కర జీవితం గడపవచ్చన్నారు. శిక్షణలో 33 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి కుటుంబం ఏపీ ట్రస్టీ చొప్పరపు నారాయణరావు, గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి, గుణశేఖర్, వలంటీర్లు పాల్గొన్నారు.

### కట్నం వేధింపులపై కేసు నమోదు

**పెనమలూరు:** కట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు సాయినగర్‌కు చెందిన అర్షియాబేగం 2018 సంవత్సరంలో హైదరాబాద్‌కు చెందిన షేక్ అహ్మద్‌షాను వివాహం చేసుకుంది. భార్యభర్తలకు మనస్పర్థలు రావటంతో విడాకులు తీసుకున్నారు. కాగా 2023 సంవత్సరం అక్టోబర్ నెలలో కొండపల్లికి చెందిన రఫీవుద్దీన్‌ను కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. వీరు హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. కాగా భర్త అదనపు కట్నం తీసుకురమ్మని వేధించసాగాడు. పైగా అతను అప్పటికే మూడు వివాహాలు చేసుకొని భార్యలను వదిలేశాడు. అదనపు కట్నం తీసుకురాలేదని భార్యపై దాడి చేసేవాడు. భర్తతో పాటు అత్త షమీమ్, మామ షేక్ మోహిద్దీన్ వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో అత్తింటివారిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

### అంకమ్మతల్లికి కుంకుమ పూజలు

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** మధురానగర్ నేతాజీకాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీ చక్రార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

# మాట తప్పని దమ్మున్న నేత జగనన్న

- మేనిఫెస్టోలో ప్రతి హామీని అమలు చేస్తాం
- గతంలో ఇచ్చిన 99 శాతం హామీలు నెరవేర్చాం
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ తూర్పు అభ్యర్థి దేవినేని అవినాష్



9వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దేవినేని అవినాష్

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశాం కాబట్టే, నేడు దమ్ముగా, ధైర్యంగా ప్రజలను ఓట్లు అడుగుతున్నామని ఆయన అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నగరంలోని 8, 9 డివిజన్ల పరిధిలో ఎన్టీఆర్ సర్కిల్, పటమటలంక, పిటింగుల పేట, శ్రీరామనగర్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు రోడ్డు ప్రాంతాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. మంచి చేసిన వారిని ఆదరించాలని, రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని కోరారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు సక్రమంగా జరిగాయన్నారు. దీంతో ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు.

**గత పాలకులు అభివృద్ధిని విస్మరించారు**

గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే, ఎంపీ, మేయర్, కార్పొరేటర్లు అందరూ ఆ పార్టీ వారే ఉండి కూడా తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. తమ ప్రభుత్వంలో తనకు వ్యక్తిగతంగా ఏ అధికారిక పదవీ లేక పోయినా చిత్తశుద్ధితో పనిచేశానని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సహకారంతో వివక్షకు తావులేకుండా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి చేసి చూపించానన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి తమకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు.

**ప్రతిపక్షాలవి గారడీ మాటలు**

ప్రతిపక్షం టీడీపీ చెప్పేవన్నీ గారడీ మాటలని, వారు ఇచ్చే హామీలన్నీ మోసపూరితమేనని దేవినేని అవినాష్ విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన చరిత్ర చంద్రబాబుకు లేదన్నారు. 2014 ఎన్నికల్లో 650 హామీలు ఇచ్చి ఒక్కటీ అమలు చేయలేదని గుర్తు చేశారు. తూర్పులో తాము చేసిన అభివృద్ధి పనుల ముందు గద్దె రామ్మోహన్ నిస్సిగ్గుగా ఫొటోలకు ఫోజులిస్తూ ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. ప్రజల మద్దతుతో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి ప్రభంజనం సృష్టిస్తుందని అవినాష్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 9వ డివిజన్ ఇన్‌చార్జి వల్లూరు ఈశ్వరప్రసాద్, పార్టీ అధ్యక్షుడు గద్దె కళ్యాణ్‌రామ్, వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్‌లతోపాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## అవినాష్ కుటుంబసభ్యుల ప్రచారం



11వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న దేవినేని క్రాంతి

**పటమట(విజయవాడతూర్పు):** విజయవాడ నగరాన్ని సరికొత్తగా అభివృద్ధి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డికే దక్కుతుందని, నగరం మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని 12వ డివిజన్‌లో దేవినేని సుధీర ప్రచారం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా అవినాష్ నియోజకవర్గంలో రూ.650 కోట్లతో మౌలిక వసతులు కల్పించారని అన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అవినాష్‌ను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని)ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 12వ డివిజన్ ఇన్‌చార్జి మాగంటి నవీన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**అవినాష్‌కు ఒక్కసారి అవకాశం ఇవ్వండి**

**ఆటోనగర్(విజయవాడతూర్పు):** అవినాష్ విజయవాడ తూర్పులో రూ.674 కోట్లతో ఈ ప్రాంతంలో అభివృద్ధి చేశారని, ఆయనకు ఒక్కసారి అవకాశం ఇవ్వండని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి విజ్ఞప్తిచేశారు. ఆదివారం 11 వ డివిజన్ ఏపీఐఐసీ కాలనీలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ తరపున ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతి కాలనీలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఎమ్మెల్యేగా అవినాష్ కు, ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని)కు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ కాలనీలోనే సుమారు రూ.3 కోట్లకు పైగా అభివృద్ధి జరిగిందని చెప్పారు. ఇక్కడ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు వచ్చాయని, తమ ఓట్లు వైఎస్సార్ సీపీకే వేస్తామని స్థానికులు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు 11వ డివిజన్ ఇన్‌చార్జి బాబి, త్రిపురనేని చంద్, మహమ్మద్ ఖాశీం (అబ్బు), త్రిపురనేని చందు, దేవినేని సాంబశివరావు, అబ్దుల్ రషీద్, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి ముస్లిం విద్యార్థులకు వేసవి తరగతులు

**ఆటోనగర్(విజయవాడతూర్పు):** ఆటోనగర్ డిస్పోజల్ మూడవ రోడ్డులోని మదరస దావతుల్ కుర్‌ఆన్ ఇమారత్–ఎ–షర్ ఇయ్యాహ్ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి మే 31 వరకు వేసవి తరగతులు నిర్వహిస్తున్నట్టు మసీద్ గురువు రహీం తెలిపారు. 1 నుంచి 10 తరగతి లోపు విద్యార్థులు ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ● ప్రచారంలో పదనిసలు



తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఓ హోటల్‌లో దోశలు వేస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్

# ఒక్క అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తా

- భ్రమరాంబపురం ఇంటి పట్టాల కల నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే
- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్



22వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో దేవినేని అవినాష్

**కృష్ణలంక(విజయవాడతూర్పు):** ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వండి, తూర్పు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. గత పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న గద్దె రామ్మోహన్ చేయలేని అభివృద్ధిని తాను నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉండి నాలుగేళ్లలో చేసి చూపించానని, మరింత అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యేగా ఒక్కసారి తనను ఆశీర్వదించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కృష్ణలంక, 22వ డివిజన్‌లోని ఫీడర్ రోడ్డు, మెట్లబజార్, సత్యంగారి హోటల్ రోడ్డు, పాత పోస్టాఫీస్ రోడ్డు, కొత మిషన్ రోడ్డు, మార్వాడీ శివాలయం వీధి, గంగానమ్మ గుడి రోడ్డు ప్రాంతాలలో ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, మళ్లీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను వివరించారు. కరపత్రాలు పంపిణీ చేసి సంక్షేమ ప్రభుత్వం రావాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ గడప గడపకు వెళ్తుంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఆయనకు రుణపడి ఉంటామని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని ఎమ్మెల్యే గద్దె గాలికి వదిలేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డివిజన్‌లో కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు, దోబీఖానా, రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చేశామన్నారు. భ్రమరాంబపురం నివాసుల 70 ఏళ్ల కల ఇంటి పట్టాల సమస్యను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్న ఏర్పాటు చేసిన వ్యవస్థలను, సంక్షేమ పథకాలను విమర్శించిన చంద్రబాబు నేడు వాటినే తాను కూడా కొనసాగిస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు అబద్ధపు హామీలను ప్రజలెవ్వరూ నమ్మడం లేదన్నారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని శ్రీనివాస్(నాని)ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నారి వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



చిన్నారి తల్లికి సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యుడు భీమరాజు

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** ప్రమాదవశాత్తు మెట్ల మీద నుంచి జారి పడిపోయి నడుము విరిగి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఏడాదిన్నర వయసుగల చిన్నారి అంకిత్ వైద్య ఖర్చుల నిమిత్తం దీవెన ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందజేసింది. విజయవాడ మధురానగర్‌కు చెందిన నరేష్, పావని దంపతులు ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వారి కుమారుడు చిన్నారి అంకిత్‌కు అనుకోకుండా జరిగిన ప్రమాదానికి నిరుపేదలైన తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. కుటుంబాన్ని పోషించుకోవడమే అంతంత మాత్రంగా ఉన్న తరుణంలో ఈ ప్రమాదాన్ని వారు తట్టుకోలేకపోయారు. కొడుకు అంకిత్‌ను నగరంలోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్‌కు తీసుకువెళ్లి తమ శక్తికి మించి ఖర్చు చేశారు. అయినా ఫలితం కనబడకపోవడంతో చివరికి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారు దీవెన ఫౌండేషన్ సభ్యులను సహాయం కోసం ఆశ్రయించారు. దీంతో ఫౌండేషన్ సభ్యుడు కానిస్టేబుల్ భీమరాజు ఆదివారం ఆస్పత్రికి వెళ్లి రూ.15.500 నగదు అందజేశారు. ఫౌండేషన్ సభ్యులకు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## స్వచ్ఛమైన వేద విద్య అందిస్తున్నాం



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న మాంధాత

**విజయవాడ కల్చరల్:** విలువలతో కూడిన విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కంచికామకోటి పీఠం ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఇన్‌చార్జి లక్ష్మీ మాంధాత తెలిపారు. లబ్బీపేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ శ్రీ కంచికామకోటి పీఠంలో స్వచ్ఛమైన వేద విద్యను అందిస్తున్నామని, ఆయా పాఠశాలల్లో స్వయంగా సంప్రదించాలని సూచించారు. పీఠానికి వేద విద్యార్థులకు మధ్యవర్తులు లేరని ఆమె స్పష్టం చేశారు. పాఠశాలల నుంచి డొనేషన్లు తీసుకుంటున్నట్లు కొంతమంది ప్రచారం చేస్తున్నారని, అటువంటి అవసరం పీఠానికి లేదన్నారు. తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి, విజయవాడ, మహబూబ్‌నగర్, ఇతర ప్రాంతాలలో జంబుకేశ్వరం,నాసిక్‌లో పాఠశాలల నిర్వహణ జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా వివరాలతోకూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో విష్ణుభొట్ల పద్మావతి, వాలంటీర్ శ్రీరామ్ పాల్గొన్నారు.

## కౌంటర్లలో ఈవో ఆకస్మిక తనిఖీలు



ప్రసాదాల విక్రయ కౌంటర్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈవో రామరావు

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మహా మండపం గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్రసాదాల విక్రయ కౌంటర్లతో పాటు 7వ అంతస్తులోని మైక్ ప్రచార కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ప్రసాద విక్రయ కౌంటర్లను తనిఖీ చేసిన క్రమంలో రోజు వారీ విక్రయాలు, ప్రసాదం స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ప్రసాదాల కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులతో మాట్లాడిన ఈవో ఆలయ సిబ్బందికి సూచనలు చేశారు. అమ్మవారి ప్రసాదమైన పులిహోర ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం మైక్ ప్రచార కేంద్రానికి చేరుకుని సిబ్బందితో మాట్లాడారు. ఆలయంలో జరుగుతున్న నిత్యసేవలతో పాటు అన్న ప్రసాదం, మల్లేశ్వర స్వామి వారి దర్శనంతో పాటు అమ్మవారి ఆలయానికి జరిగే బంగారు తాపడం పనుల గురించి భక్తులకు తెలియజేయాలని సూచించారు.

## రాష్ట్రానికి దిక్సూచి వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో

**వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్**



వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో కాపీలను ఆవిష్కరిస్తున్న ఆకుల శ్రీనివాస్ కుమార్

**భవానీపురం(విజయవాడపశ్చిమ):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో రాష్ట్రానికి దిక్సూచి వంటిదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ కుమార్ అన్నారు. విద్యాధరపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మేనిఫెస్టో కాపీలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ చెప్పారంటే..చేస్తారంతే...అన్న నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి నూరు శాతం అమలు చేసిన ఏకైక పార్టీగా వైఎస్సార్ సీపీ దేశంలోనే గుర్తింపు పొందిందన్నారు. అమలు చేయగలిగిన హామీలనే సీఎం జగన్ ప్రకటించారన్నారు. సీఎం జగనన్న పథకాల వలన ఏపీ శ్రీలంకలా మారిపోతుందన్న చంద్రబాబు, అవే పథకాలను కాపీ కొట్టి సూపర్ సిక్స్ పేరుతో ప్రజల్లోకి వెళ్లటం సిగ్గుచేటన్నారు.

# కరోనాలో కంటికి కానరాలేదేమి రామ్మోహనా?

- ప్రజలు కష్టాల్లో ఉంటే నువ్వు ఇంట్లో దాక్కున్నావ్
- ప్రజలకు ముఖం చూపలేక మీ భార్యతో ప్రచారం చేయిస్తున్నావు
- నిన్ను శాశ్వతంగా ఇంట్లోనే ఉంచేందుకు ప్రజలు నిర్ణయించుకున్నారు
- కరోనాలో ప్రజలను ఆదుకున్నది అవినాషే
- ఆ క్రమంలో కరోనా బారిన కూడా పడ్డాడు
- మేమంతా ఆయనకే అండగా ఉంటాం అంటున్న తూర్పు ప్రజలు



కరోనా వ్యాప్తి అరికట్టేందుకు ట్యాంకర్‌తో బ్లీచింగ్ చల్లుతున్న దేవినేని అవినాష్ (ఫైల్)

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** కోవిడ్ 19 ప్రపంచాన్నే వణికించింది. లాక్‌డౌన్ విధించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పనులు లేక నిత్యావసరాలు, కూరగాయలకు డబ్బులు లేక కూలీలు ఎన్నో అవస్థలు ఎదుర్కొన్నారు. కోవిడ్ బారిన పడిన వారిని క్వారంటైన్‌లను తరలిస్తే, ఇతర కుటుంబ సభ్యులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఆ సమయంలో ప్రజలకు దేవినేని అవినాష్ బాసటగా నిలిస్తే, ఎమ్మెల్యే గద్దే రామ్మోహన్ మాత్రం ప్రజలను పట్టించుకోకుండా ఇంట్లోనే దాక్కున్నారని నియోజకవర్గ ప్రజలు అంటున్నారు. ప్రజలకు ఏమైతే నాకేంటి, నా ప్రాణాలు నాకు ముఖ్యం అనేలా వ్యవహరించారని, కరోనా మొదటి వేవ్, రెండో వేవ్‌లో కూడా బయటకు రాలేదని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

**ఏ ముఖంతో వస్తారంటున్న ప్రజలు**

ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోని ఎమ్మెల్యే ఇప్పుడు ఏ ముఖంతో వచ్చి ఓట్లు అడుగుతాడని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పదేళ్ల ఎమ్మెల్యేగా ఉండి ప్రజల సమస్యలను పట్టించుకోలేదని, దీంతో ప్రచారం చేసేందుకు కొన్ని ప్రాంతాలకు తన భార్య అనురాధను పంపించి అసత్య ప్రచారం చేయిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామంటున్నారు. కరోనాలో ఇంట్లో దాక్కున్న వారిని శాశ్వతంగా ఇంట్లోనే కూర్చోపెడతామని తూర్పు ప్రజలు అంటున్నారు.

**ఆపదలో అండగా అవినాష్**

కరోనా కష్ట సమయంలో తూర్పు ప్రజలకు దేవినేని అవినాష్ అండగా నిలిచారు. కాలనీలో బ్లీచింగ్ వాటర్ చల్లించేందుకు ట్యాంకర్‌ను ఏర్పాటు చేశారు. లాక్‌డౌన్‌లో అన్ని డివిజన్‌లలోని నాయకులతో ప్రజలకు నిత్యావసరాలు పంపిణీ చేయించి అండగా నిలిచారంటున్నారు. కరోనా సోకకుండా మాస్కులు, శానిటైజర్లు కూడా పంపిణీ చేయించారని, ఆ క్రమంలో ఆయన కరోనా బారిన కూడా పడ్డాడని గుర్తు చేసుకుంటున్నారు.

**కరోనాలో అండగా నిలిచారు**



కరోనా కష్టకాలంలో దేవినేని అవినాష్ ప్రజలకు అండగా నిలిచారు. ఆపదలో ఉన్న వారికి నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వలంటీర్ల ద్వారా సేవలు అందిస్తే, ఆ వ్యవస్థ సక్రమంగా పనిచేసేలా చూడటంతో పాటు, శానిటైజర్లు, మాస్కులు అందించడం, లాక్‌డౌన్‌లో ఇబ్బందుల్లో ఉన్న వారికి కూరగాయలు, నిత్యావసరాలు అందజేయడం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. – పాల ఝాన్సీలక్ష్మి, మాజీ కార్పొరేటర్

**గద్దె ఇక శాశ్వతంగా ఇంట్లోనే...**



ప్రజల సమస్యలను విస్మరించిన గద్దె రామ్మోహన్‌ను ఇక శాశ్వతంగా ఇంట్లోనే ఉంచాలని ప్రజలు నిర్ణయించుకున్నారు.గద్దె పదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి అన్ని వర్గాలను మోసం చేశారు. ముస్లింలకు షాదీఖానా కట్టలేదు. దళితుల శ్మశాన వాటిక సమస్య తీర్చలేదు. కాల్‌మనీ సెక్స్‌రాకెట్ కేసుల్లో నిందితులు గద్దె రామ్మోహన్ అనుచరులే. రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. – ఎండీ అబీద్, లబ్బీపేట

### విశ్వసనీయతకు ప్రతీక వైఎస్సార్ మేనిఫెస్టో

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** ఐదేళ్ల విలువలకు, విశ్వసనీయతకు ప్రతీకగా వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో నిలిచిందని, రానున్న ఐదేళ్లు అదే విశ్వసనీయత కొనసాగించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ కోశాధికారి తోకల చినవీరోజి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగుదేశం మేనిఫెస్టో ప్రజలను నమ్మించి మోసగించేదిగా ఉందని, ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమం చూసి ఓట్లు వేయమని అడిగిన ధైర్యం జగన్‌మోహన్‌రెడ్డిదని అన్నారు. చంద్రబాబునాయుడికి మేనిఫెస్టో అంటే ప్రజలను మోసం చేసే కరపత్రంగా ఉందని, వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి అది పవిత్ర గ్రంథమని అన్నారు. అన్ని వర్గాలు ఐక్యంగా జగన్‌మోహన్ రెడ్డిని రెండో సారి సీఎంను చేసేందుకు ఎదురు చూస్తున్నారని, దానికి నిదర్శనం ఆదివారం జరిగిన మూడు బహిరంగ సభలేనని అన్నారు.

### కొండలమ్మ సన్నిధిలో భక్తుల సందడి



**గుడ్లవల్లేరు:** వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలో క్యూలో భక్తులు ఆదివారం అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాలపొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు. క్యూలో వచ్చే భక్తులకు మజ్జిగను అందించారు.

### అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



**పెనుగంచిప్రోలు:** గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావటంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువ జాము నుంచే భక్తులు పాలుపొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎండ తీవ్రత తట్టుకోలేక భక్తులు మధ్యాహ్న సమయంతో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు. వేసవి తీవ్రత దృష్ట్యా ఆలయ అధికారులు, గుంటూరుకు చెందిన యలమంచలి అభిరామ్ సౌజన్యంతో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.




వెంకటగిరి బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి




తాడిపత్రి బహిరంగ సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

# ఓటుతో మోసగాళ్లకు వేటు

## తాడిపత్రి, వెంకటగిరి, కందుకూరు ఎన్నికల సభల్లో సీఎం జగన్



### ఇవన్నీ కొనసాగాలంటే మన పార్టీకి ఓటేయండి...

నేను చంద్రబాబు మాదిరిగా సెల్‌ఫోన్ కనిపెట్టానంటూ బడాయిలు చెప్పడం లేదు. ఈ 58 నెలల పాలన ప్రోగ్రెస్ రిపోర్టు మీ ముందు ఉంచి మీరే మార్కులు వేయాలని మీ బిడ్డ అడుగుతున్నాడు. మీ జగన్‌కు మీరు అధికారం ఇవ్వడం వల్లే ప్రతి గ్రామం, ప్రతి పట్టణంలో కనీసం ఆరేడు విప్లవాత్మక కొత్త వ్యవస్థలు ఏర్పాటు చేయగలిగాడు. ఈ వ్యవస్థలన్నీ మీవద్ద ఉన్నాయో లేదో మీరే ఆలోచన చేయండి. అవన్నీ ఇలాగే కొనసాగాలంటే, మన పాలన బాగుందనుకుంటే మన పార్టీకి ఓటు వేయండని మీ బిడ్డ అడుగుతున్నాడు. అమ్మఒడి లాంటి పథకాల ద్వారా పిల్లల్ని ఇలాగే చక్కగా చదివించాలనుకుంటే మళ్లీ మీ అన్నకు అధికారం ఇవ్వండి. పిల్లలు ఇలాగే ఇంగ్లీషు మీడియంలో చదువుకుంటూ ఈ మార్పులు కొనసాగాలంటే మీ బిడ్డకే, ఫ్యాన్‌కు ఓటు వేయాలి. నా అక్కచెల్లెమ్మల కుటుంబాలకు పథకాలు సజావుగా కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై రెండు బటన్లు నొక్కి మీ బిడ్డకు తోడుగా ఉండాలి. చంద్రబాబు మార్కు దోపిడీ, జన్మభూమి కమిటీల రాజ్యం మళ్లీ రాకూడదంటే ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి మరోసారి ఆశీర్వదించాలి.



తాడిపత్రిలో తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన అభిమానులకు సీఎం జగన్ అభివాదం

సాక్షి ప్రతినిధి, అనంతపురం/సాక్షి, తిరుపతి/సాక్షి ప్రతినిధి, నెల్లూరు

కుట్రలు, వెన్నుపోట్లతో కూటమి కట్టి, జెండాలు జతకట్టి వస్తున్న మోసగాళ్లకు ఓటుతో బుద్ధి చెప్పాలని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. '58 నెలల కాలంలో నేను ఏం చేశానో చెబుతా. నీ 14 ఏళ్ల పాలనలో ఏం మంచి చేశావో చెప్పగలవా చంద్రబాబూ? నీ పేరు చెబితే గుర్తుకొచ్చే ఒక్క పథకమైనా ఉందా? జగన్ తెచ్చిన స్కీమ్‌లను రద్దు చేస్తానని చెప్పే ధైర్యం ఉందా? జన్మభూమి కమిటీలను మళ్లీ తెస్తానని చెప్పగలవా? నేను తెచ్చిన పథకాల గురించి మాట్లాడతావ్ ఏమిటయ్యా బాబూ? నేను రూపాయి ఇస్తే.. నువ్వు రెండు రూపాయలు ఇస్తానంటావ్ ఏంటయ్యా చంద్రబాబూ?' అంటూ ధ్వజమెత్తారు. ఒక్కటంటే ఒక్క పథకం పేరు కూడా గుర్తుకురాని ఆ మనిషిని నమ్మగలమా? అని సూటిగా ప్రశ్నించారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో ఆదివారం ఉదయం అనంతపురం జిల్లా తాడిపత్రిలో నిర్వహించిన తొలి ఎన్నికల సభతో మలి విడత ఎన్నికల ప్రచారానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. మిట్ట మధ్యాహ్నం వేళ తిరుపతి జిల్లా వెంకటగిరిలో, సాయంత్రం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కందుకూరులో పోటెత్తిన ఎన్నికల ప్రచార సభల్లో సీఎం జగన్ ప్రసంగించారు. ఆయా సభల్లో ఆయన ఏమన్నారంటే...

### బాబును నమ్మడం అంటే చంద్రముఖిని నిద్ర లేపినట్లే!

మరో రెండు వారాల్లో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి కాదు. ఇవి వచ్చే ఐదేళ్ల పాటు మన ఇంటింటి అభివృద్ధి, పేద కుటుంబాల భవిష్యత్తును నిర్ణయించబోయే ఎన్నికలు. జగన్‌కు ఓటు వేస్తే పథకాలన్నీ యథాతథంగా కొనసాగుతాయి. పొరపాటున చంద్రబాబుకు ఓటు వేస్తే పథకాలన్నింటికి ముగింపు, మళ్లీ మోసపోవటమే. ఇది చంద్రబాబు గురించి చరిత్ర చెప్పిన సత్యం. చంద్రబాబు సాధ్యం కాని హామీలతో మీ ముందుకు వస్తున్నాడు. బాబును నమ్మటం అంటే పులినోట్లో తలకాయ పెట్టడమే అన్నది ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోండి. బాబును నమ్మటం అంటే చంద్రముఖిని నిద్రలేపడమే. వదల బొమ్మాళీ.. వదలా.. అంటూ ప్రతి పేదవాడి ఇంటికి వచ్చి తలుపు తట్టి రక్తం తాగేందుకు వచ్చే ఆ పసుపు పతిని ఆహ్వానించడమే.

### మీ బిడ్డ 130 సార్లు బటన్ నొక్కాడు

నాకు వీరిలా జెండాల పొత్తులు లేవు. నాకు ఉన్న పొత్తు మంచి చేసిన ప్రజలతోనే. నా నమ్మకం ఆ దేవుడి దయపైనే. మేనిఫెస్టో హామీలను నూటికి 99 శాతం అమలు చేసిన తర్వాతనే మీ బిడ్డ మీ దగ్గరకు వచ్చి మీ దీవెనలు, ఆశీస్సులు కోరుతున్నాడు. గతంలో ఎన్నడూ జరగని విధంగా ఏకంగా 130సార్లు మీ బిడ్డ బటన్ నొక్కాడు. రూ.2.70 లక్షల కోట్లు డీబీటీతో అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి పారదర్శకంగా జమ చేశాడు. ఎక్కడా లంచాలు, వివక్ష లేకుండా ఇంటింటికీ అందాయి.

### సచివాలయాల్లో నా తమ్ముళ్లు, చెల్లెళ్లు

దశాబ్దాలుగా మన దగ్గర గవర్నమెంట్ ఉద్యోగాలు 4 లక్షలు మాత్రమే ఉంటే మీ బిడ్డ ఈ 58 నెలల కాలంలో ఇచ్చింది ఏకంగా 2.31 లక్షల ఉద్యోగాలు. నా తమ్ముళ్లు, చెల్లెళ్లంతా ఈరోజు గ్రామ సచివాలయాల్లో కనిపిస్తున్నారు. మెరుగుపడిన ఆస్పత్రులు, బడుల్లో సేవలందిస్తున్నారు. ప్రతి సందర్భంలోనూ నేను ''నా..'' అని ఆప్యాయంగా పిలిచే సామాజికవర్గాలకు ఇందులో ఏకంగా 80 శాతం ఉద్యోగాలు దక్కాయి.

### పౌర సేవలు.. విప్లవాత్మక వ్యవస్థలు

ప్రజలకు అందించే సేవల డెలివరీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. ఎప్పుడూ జరగని విధంగా పౌర సేవలు, పథకాలను నేరుగా ఇంటికే డోర్ డెలివరీ చేశాం. నాడు – నేడుతో బాగుపడ్డ బడులు, ఇంగ్లీషు మీడియం చదువులు కనిపిస్తున్నాయి. మన గ్రామంలోనే విలేజ్ క్లినిక్‌లు కనిపిస్తున్నాయి. ఇంటింటినీ జల్లెడ పడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రతి ఇంటికీ వస్తోంది. గ్రామాల్లోనే ఫ్యామిలీ డాక్టర్ కనిపిస్తున్నాడు. మన గ్రామంలోనే మహిళా పోలీసు కనిపిస్తోంది. రైతన్నచేయి పట్టుకుని నడిపించే రైతు భరోసా కేంద్రం కనిపిస్తోంది. నిర్మాణంలో ఉన్న డిజిటల్ లైబ్రరీలు కనిపిస్తున్నాయి. గ్రామానికే వచ్చిన ఫైబర్ గ్రిడ్ కనిపిస్తోంది. ఇలాంటి వ్యవస్థలన్నీ మీ బిడ్డ 58 నెలల కాలంలోనే తెచ్చి మరోసారి మీ ఆశీస్సులు కోరుతున్నాడు.

### పేదల ఆత్మగౌరవం కాపాడుతూ..

పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ ఇంటికే రూ.3 వేలు పింఛన్, రేషన్ అందజేస్తున్నాం. ఈరోజు ఇంటి వద్దకే క్యాస్ట్ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్ వస్తోంది. ఏది కావాలన్నా గడప వద్దకే వస్తున్న పరిస్థితులు మీరే చూస్తున్నారు. ఈ విప్లవాత్మక మార్పులను ఎవరైనా ఊహించారా? గవర్నమెంట్ డబ్బులు లంచాలు, వివక్ష లేకుండా అందుతాయని గతంలో ఎవరైనా చెబితే నమ్మేవారా? మీ బిడ్డ ప్రభుత్వం వచ్చిన తర్వాత దీన్ని చేసి చూపించాం.

### విద్యా విప్లవం..

పేదింటి పిల్లల చదువుకునే ప్రభుత్వ బడుల్లో చదువులు, ఆహారం అత్యుత్తమంగా ఉండేలా చర్యలు తీసుకున్నాం. పిల్లలు ధరించే యూనిఫాం మొదలు పుస్తకాల దాకా అన్నీ సమకూరుస్తున్నాం. క్లాస్ రూముల్లో డిజిటల్ బోధన, ఐఎఫ్‌పీ ప్యానెల్స్, ట్యాబ్‌లు, మారిన కరిక్యులమ్‌తో విద్యా విప్లవాన్ని తెచ్చాం. ఇదే పాలన మరో పదేళ్లు కొనసాగితే ఇప్పుడు ఒకటో తరగతిలో ఉన్న మీ పిల్లలు 2035 నాటికి టెన్త్ పరీక్ష ఐబీలో పూర్తి చేసి ఐబీ సర్టిఫికెట్‌తో అనర్గళంగా ఇంగ్లీషులో మాట్లాడే పరిస్థితి వస్తుంది. ఎప్పుడూ చూడని విధంగా హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఎంఐటీ లాంటి ప్రఖ్యాత వర్సిటీలు అందించే ఆన్‌లైన్ కోర్సులు మన డిగ్రీలతో అనుసంధానమవుతున్నాయి.

### మహిళా సాధికారతకు దన్నుగా

'అమ్మ ఒడి' అనే కార్యక్రమం గతంలో ఎప్పుడైనా విన్నారా? ఆసరా, సున్నా వడ్డీ, చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, పూర్తి ఫీజులు చెల్లిస్తూ విద్యాదీవెన, ఖర్చుల కోసం వసతి దీవెన, పేదలకు 31 లక్షల ఇళ్ల స్థలాలు, 22 లక్షల గృహ నిర్మాణాలు లాంటివి గతంలో ఎప్పుడైనా జరిగాయా? దిశ యాప్, అక్కచెల్లెమ్మలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏకంగా చట్టం చేయడం లాంటివి గతంలో విన్నారా?

### రైతన్నకు అండగా..

రైతన్నకు పెట్టుబడి సాయంగా పంట వేసే సమయంలో రైతు భరోసా అందించడం గతంలో ఎప్పుడైనా చూశారా?. గ్రామాల్లోనే ఆర్బీకేలు, సున్నా వడ్డీకే పంట రుణాలు, 9 గంటలు పగటిపూటే ఉచిత విద్యుత్, ఇన్‌పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా, దళారీలు లేకుండా పంటల కొనుగోలు, ఎంఎస్పీ లేని పంటలు సైతం కొనుగోలు లాంటివన్నీ చేసి ఈరోజు మీ బిడ్డ ప్రతి రైతన్ననూ మరోసారి ఆశీర్వదించాలని కోరుతున్నాడు.

### 100 సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే

మొట్టమొదటిసారిగా సామాజిక న్యాయానికి మీ బిడ్డ అర్థం చెప్పాడు. చేతల్లో చూపించాడు. నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలకు డీబీటీ, నాన్ డీబీటీలో ఏకంగా 75 శాతం పైచిలుకు లబ్ధి చేకూరింది. నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఏకంగా చట్టం చేశాం. 68 శాతం మంత్రి పదవులు ఆ వర్గాలకే ఇవ్వడం ఓ చరిత్ర. 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలు కలిపి మొత్తం 200 స్థానాలకు గానూ ఏకంగా 50 శాతం అంటే 100 సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే కేటాయించిన చరిత్ర గతంలో ఏ రాజకీయ పార్టీకైనా ఉందా? వలంటీర్లు మళ్లీ ఇంటికే రావాలన్నా, పేదవాడి భవిష్యత్తు మారాలన్నా, పథకాలన్నీ కొనసాగాలన్నా, లంచాలు, వివక్ష లేని పాలన జరగాలన్నా, మన పిల్లల చదువులు, బడులు బాగుండాలన్నా, వ్యవసాయం, ఆస్పత్రులు మెరుగ్గా ఉండాలన్నా ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై రెండు బటన్లు నొక్కాలి. 175కు 175 అసెంబ్లీ, 25కు 25 ఎంపీ స్థానాల్లో ఒక్కటి కూడా తగ్గకుండా గెలిపించాలి. మంచి చేసిన ఫ్యాను మీ ఇంట్లో ఉండాలి. చెడు చేసిన సైకిల్ ఇంటి బయటే ఉండాలి. తాగేసిన టీ గ్లాస్ సింక్‌లో ఉండాలి.



### మోసాల బాబు విఫల హామీలు

- 2014లో ఇదే చంద్రబాబు తాను సంతకం చేసి ప్రధాని మోదీ, దత్తపుత్రుడి ఫొటోలతో ముఖ్యమైన హామీలంటూ ప్రతి ఇంటికీ పంపిన పాంప్లెట్ గుర్తుందా? ఎల్లో మీడియాలో ప్రకటనలతో ఊదరగొట్టారు. మంగళ సూత్రం తెంపుతున్న చేతిని అడ్డుకుంటూ మరో చెయ్యి వస్తుంది. బ్యాంకుల్లో తాకట్టు పెట్టిన బంగారం మీ ఇంటికి రావాలంటే బాబు రావాలన్న అడ్వర్‌టైజ్‌మెంట్లు గుర్తున్నాయా?
- రైతులకు రూ.87,612 కోట్ల రుణాలను మాఫీ చేశాడా?
- రూ.14,205 కోట్ల పొదుపు సంఘాల రుణాలు ఒక్క రూపాయి అయినా మాఫీ చేశాడా?
- ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తామన్నాడు. ఎవరికైనా ఒక్క రూపాయి డిపాజిట్ చేశాడా?
- ఇంటికో ఉద్యోగం లేదంటే నెలకు రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు. ఐదేళ్లలో రూ.1.20 లక్షల నిరుద్యోగ భృతి ఎవరికైనా ఇచ్చాడా?
- అర్హులందరికీ 3 సెంట్ల స్థలం, కట్టుకునేందుకు పక్కా ఇళ్లు అన్నాడు. కనీసం ఒక్కరికైనా ఒక్క సెంటు స్థలం ఇచ్చాడా?
- రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత, పవర్ లూమ్స్ రుణాలన్నీ మాఫీ అన్నాడు. మరి అయ్యాయా?
- ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశాడా?
- సింగపూర్‌కు మించి అభివృద్ధి, ప్రతి నగరంలో హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. తాడిపత్రి, వెంకటగిరి, కందుకూరులో ఎక్కడైనా కనిపిస్తోందా?
- పోనీ ప్రత్యేక హోదా తెచ్చాడా?
- అవే మూడు పార్టీలు మరోసారి కూటమిగా ఏర్పడి సూపర్ సిక్స్, సూపర్ సెవెన్, ఇంటింటికీ కేజీ బంగారం, బెంజ్ కార్లు అంటూ మరోసారి మోసాలకు తయారయ్యాయి.

### జన్మభూమి కమిటీలు మళ్లీ తెస్తానని చెప్పగలవా?

చంద్రబాబు జన్మభూమి కమిటీలను తీసుకొస్తే మీ జగన్ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలను తెచ్చాడు. నువ్వు పెట్టిన జన్మభూమి కమిటీల వ్యవస్థ మీద నీకు నమ్మకం, విశ్వాసం ఉంటే మళ్లీ వాటిని తీసుకొస్తానని చెప్పే ధైర్యం నీకుందా చంద్రబాబు? ఆ విషయం చెప్పే ధైర్యం లేక నేను తెచ్చిన వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థలను కొనసాగిస్తానంటావేమిటి? నువ్వు వస్తే వలంటీర్లకు జీతం పెంచుతానంటావేమిటి?

### జగన్ స్కీమ్‌లను రద్దు చేస్తాననే ధైర్యముందా?

అయ్యా చంద్రబాబూ.. నువ్వు 14 ఏళ్లు పరిపాలించావ్! నేను 58 నెలలే పరిపాలన చేశా. జగన్ అమ్మఒడి తీసుకొస్తే నువ్వు అంతకంటే ఎక్కువ ఇస్తానంటున్నావు. జగన్ చేయూత ప్రవేశపెడితే నువ్వు ఇంకా ఎక్కువమందికి ఇస్తానంటున్నావు. జగన్ రూపాయి ఇస్తే నువ్వు రెండు రూపాయలు ఇస్తానంటావ్! జగన్ తెచ్చిన స్కీమ్‌లను రద్దు చేస్తానని చెప్పే ధైర్యం నీకుందా చంద్రబాబూ? జగన్ తెచ్చిన వలంటీర్, సచివాలయాల వ్యవస్థలను రద్దు చేస్తానని చెప్పే ధైర్యం ఉందా? జగన్ తెచ్చిన రైతుభరోసా కేంద్రాలను తీసేస్తానని చెప్పే ధైర్యం ఉందా? రైతు భరోసా సొమ్ము రద్దు చేసే ధైర్యం బాబుకు ఉందా?





తిరుపతి ఎంపీ అభ్యర్థి ఎం.గురుమూర్తి, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రామ్‌కుమార్‌రెడ్డి, అనంతపురం ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ, తాడిపత్రి ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దారెడ్డిలను గెలిపించాలని కోరుతున్న సీఎం జగన్

### మన అభ్యర్థులను దీవించండి

అనంతపురం ఎంపీ అభ్యర్థి శంకరణారాయణ, తాడిపత్రి ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దారెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి ఎం. గురుమూర్తి, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వై.విజయసాయిరెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌ను మీరంతా ఆశీర్వదించి గొప్ప మెజార్టీతో గెలిపించాలని ప్రార్థిస్తున్నా.

### మనం చేసిన మంచిలో మచ్చుకు కొన్ని..

- ఇంటి వద్దకే రూ.3 వేల పెన్షన్ అనగానే గుర్తుకొచ్చేది మీ జగన్. పూర్తి ఫీజులు చెల్లిస్తూ విద్యాదీవెన, ఖర్చులకు ఇబ్బంది పడకుండా వసతి దీవెన అంటే గుర్తుకొచ్చేది మీ జగన్. అమ్మఒడి అంటే మీ జగన్. అక్క చెల్లెమ్మలకు తోడుగా చేయూత, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, ఆసరా, సున్నా వడ్డీ, 31 లక్షల ఇళ్ల పట్టాలు, 22 లక్షల గృహ నిర్మాణాలు, మహిళా సాధికారత, రైతు భరోసా, ఆర్బీకేలు, విస్తరించిన ఆరోగ్యశ్రీ, జీవనభృతికి ఇబ్బంది లేకుండా విశ్రాంతి సమయంలో ఆరోగ్య ఆసరా, పేదవాడికి మందులు, టెస్టులు అందిస్తూ ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్స్ అంటే గుర్తుకొచ్చేది మీ జగన్.
- స్వయం ఉపాధికి ఊతమిస్తూ మత్స్యకార భరోసా, నేతన్న నేస్తం, వాహనమిత్ర, చేదోడు, తోడు, లా నేస్తం అంటే గుర్తుకొచ్చేది మీ జగన్. ప్రతి గ్రామంలో సచివాలయం, ప్రతి 60-70 ఇళ్లకు ఒక వలంటీర్, ఇంటికే పౌరసేవలు, పథకాలు చూస్తే గుర్తుకొచ్చేది మీ జగన్. నాడు-నేడుతో బాగుపడ్డ ఇంగ్లీష్ మీడియం బడులు, గవర్నమెంట్ హాస్పిటళ్లు చూస్తే గుర్తుకువచ్చేది మీ జగన్. గ్రామంలోనే మహిళా పోలీస్, ప్రతి అక్కచెల్లెమ్మ ఫోన్‌లో దిశ యాప్ చూస్తే గుర్తుకొచ్చేది మీ జగన్.

### తాడిపత్రిలో అగ్రికల్చర్ కాలేజీ

ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దారెడ్డి అన్న, ఎంపీ అభ్యర్థి శంకరన్నపై మీ చల్లని దీవెనలు ఉంచాలని సవినయంగా కోరుతున్నా. కాసేపటి క్రితం పెద్దారెడ్డి అన్న తాడిపత్రి నియోజకవర్గంలో అగ్రికల్చర్ కాలేజీ గురించి ప్రస్తావించాడు. తాడిపత్రిలో అగ్రికల్చర్ కాలేజీని మళ్లీ మన ప్రభుత్వం రాగానే కచ్చితంగా ఏర్పాటు చేస్తామని మాట ఇస్తున్నా. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి మరికొన్ని కూడా ప్రస్తావించారు. అవన్నీ పెద్దారెడ్డి అన్నతో దగ్గరుండి మీకు మంచి చేస్తామని హామీ ఇస్తున్నా.

### మీ బిడ్డ ఎలా చేయగలిగాడు?

నాడూ నేడూ ఇదే రాష్ట్రం, ఇదే బడ్జెట్. అప్పులు కూడా అప్పటి కంటే ఇప్పుడే గ్రోత్ రేటు తక్కువ. మరి మీ బిడ్డ ఎలా బటన్లు నొక్కగలిగాడు? కనీ వినీ ఎరుగని స్కీములు ఎలా ఇవ్వగలిగాడు? అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి ఏకంగా రూ.2.70 లక్షల కోట్లు ఎలా పంపించగలిగాడు? అనేది ఆలోచన చేయమని కోరుతున్నా. ఈ డబ్బంతా చంద్రబాబు పాలనలో ఎవరి జేబుల్లోకి వెళ్లిందో ఆలోచన చేయండి. మన రాష్టానికి వచ్చిన పొత్తుల నాయకులను చూస్తుంటే సుమతీ శతకం ''తెప్పలుగ చెరువు నిండిన కప్పలు పదివేలు చేరు కదరా సుమతీ'' గుర్తుకొస్తోంది. ఇప్పుడు రాష్ట్రంలో తిరుగుతున్న చంద్రబాబు, దత్తపుత్రుడు, వదినమ్మ, ఈనాడు రామోజీ, ఏబీఎన్ రాధాకృష్ణ, టీవీ 5 నాయుడు వీళ్లలో ఎవరైనా ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడైనా నివాసం ఉంటున్నారా? ఎన్నికలు వచ్చాయి కాబట్టి వీరంతా ఆంధ్రప్రదేశ్‌కు వచ్చారు. ఓడిన వెంటనే వీళ్లంతా మళ్లీ హైదరాబాద్‌కు వెళ్లిపోతారు. ఇదీ వాళ్లకు మన రాష్ట్రంతో ఉన్న అనుబంధం. ఈ నాన్ లోకల్ కిట్టీ పార్టీలకు, వాటి సభ్యులకు, నయా ఈస్ట్ ఇండియా కంపెనీ సభ్యులకు మన రాష్ట్రం, మన ప్రజలంటే కేవలం దోచుకునేందుకు.. దోచుకునేది పంచుకునే వనరుల లాంటివి. వీరిలో ఏ ఒక్కరికీ మన రాష్ట్ర ప్రజలకు మంచి చేసిన చరిత్ర లేదు. మేం చేసిన మంచి చూసి మాకు ఓట్లేయాలని అడిగే ధైర్యం లేదు. చంద్రబాబుది అబద్ధాలు, మోసాల ఫ్యాక్టరీ అయితే, ఇంటింటికి చేసిన మంచిని సగర్వంగా చెబుతున్న పార్టీ మనది. ఐదేళ్ల పాలనలో ప్రతి ఇంటికీ చేసిన మంచి ఇదీ అని మీ బిడ్డ సగర్వంగా చెబుతున్నాడు. మీ బిడ్డ వల్ల మీకు మంచి జరిగి ఉంటే తోడుగా, సైనికులుగా నిలవాలని కోరుతున్నా.



వెంకటగిరిలో మండుటెండలోనూ భవనాలపైకి ఎక్కి సీఎం వైఎస్ జగన్‌కు మద్దతు తెలుపుతున్న స్థానికులు



తాడిపత్రిలో భవనాలపై నుంచి సీఎం జగన్ ప్రసంగం వింటున్న మహిళలు

## మండుటెండల్లోనూ...

# జన సునామీ

## మేనిఫెస్టో ప్రకటించాక సీఎం వైఎస్ జగన్ చేపట్టిన మలివిడత ప్రచారానికి జన నీరాజనం

- మండుటెండల్లోనూ తాడిపత్రి, వెంకటగిరి, కందుకూరు సభలకు పోటెత్తిన జనసంద్రం
- సిద్ధం సభలు, మేమంతా సిద్ధం బస్సు యాత్రను తలపిస్తూ జన ప్రభంజనం
- 58 నెలల్లో చేసిన మంచిని వివరించిన వైఎస్సార్‌సీపీ అధినేత
- చంద్రబాబు మోసాలపై నిప్పులు
- సీఎం ప్రసంగాలకు భారీ జనస్పందన..
- మళ్లీ గెలిపించడానికి మేమంతా సిద్ధం అంటూ ప్రజల జయజయధ్వానాలు



తాడిపత్రిలో భవనాలపైకి ఎక్కి సీఎం జగన్ ప్రసంగం వింటున్న స్థానికులు




కందుకూరు సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



కందుకూరులో మండుటెండలోనూ సభకు వచ్చి ఫ్యాన్ గుర్తును ఉత్సాహంగా చూపిస్తున్న వృద్ధురాలు

**సాక్షి, అమరావతి:** ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన ఎన్నికల మలి విడత ప్రచారానికి జనం పోటెత్తారు. సిద్ధం సభలు, మేమంతా సిద్ధం బస్సు యాత్రను తలపిస్తూ వెల్లువలా తరలివచ్చారు. ఆదివారం అనంతపురం జిల్లా తాడిపత్రి, తిరుపతి జిల్లా వెంకటగిరి, శ్రీపొట్టి శ్రీరాములు జిల్లా కందుకూరులో నిర్వహించిన సభలకు మండుటెండల్లోనూ ప్రజలు ప్రభంజనంలా కదిలివచ్చారు. తీవ్ర ఎండను, ఉక్కపోతను ఖాతరు చేయకుండా సీఎం వైఎస్ జగన్ చేసిన ప్రసంగాన్ని ఆసాంతం ఆసక్తితో విన్నారు. గత 58 నెలల్లో చేసిన మంచిని సీఎం వివరించారు. ఈ పథకాలు మళ్లీ కొనసాగాలన్నా.. మరింత మేలు జరగాలన్నా.. పేదింటి భవిష్యత్తు మరింత గొప్పగా మారాలన్నా.. లంచాలు, వివక్ష లేని పాలన కావాలన్నా.. మన పిల్లల బడులు బాగుపడాలన్నా.. ఆస్పత్రులు, వ్యవసాయం మరింత మెరుగుపడాలన్నా మన ప్రభుత్వం మళ్లీ రావాలన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ రెండు బటన్లు ఫ్యాన్ గుర్తుపై నొక్కడానికి మీరంతా సిద్ధమేనా అని సీఎం జగన్ అడగ్గా మేమంతా సిద్ధమేనంటూ దిక్కులు పిక్కటిల్లేలా ప్రజలు నినదించారు. లక్షలాది మంది పిడికిళ్లు ఒక్కసారిగా పైకి లేపడంతో తాడిపత్రి, వెంకటగిరి, కందుకూరు దద్దరిల్లిపోయాయి. వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోను అన్ని వర్గాల ప్రజలూ పూర్తి స్థాయిలో ఆమోదించారనడానికి మూడు సభల్లో ఉవ్వెత్తున ఎగిసిన జనకెరటాలే నిదర్శనమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రచారాలకు జనస్పందన కనిపించడం లేదు. మొన్న సిద్ధం సభలు.. నిన్న మేమంతా సిద్ధం బస్సు యాత్ర.. నేడు మలి విడత ప్రచారంలో తొలి రోజు నిర్వహించిన సభలు గ్రాండ్ సక్సెస్ కావడంతో వైఎస్సార్‌సీపీదే అధికారమని రాజకీయ పరిశీలకులు తేల్చిచెబుతున్నారు.

### తరలివచ్చిన తాడిపత్రి..

ఎన్నికల మలి విడత ప్రచారానికి అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందని తెలుసుకున్న నియోజకవర్గ ప్రజలు గ్రామాలకు గ్రామాలు తరలివచ్చారు. హెలీప్యాడ్ నుంచి సభ జరిగే వైఎస్సార్ సర్కిల్‌కు చేరుకునే వరకూ సీఎం జగన్ కాన్వాయ్ వెంట వేలాది మంది పరుగులు తీశారు. సభా ప్రాంగణానికి ఉదయం 11.55 గంటలకు చేరుకునే సరికి ఇసుకేస్తే రాలనంత స్థాయిలో జనంతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. అప్పటికే 41.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అయినప్పటికీ ప్రజలు లెక్కచేయలేదు. గత 58 నెలలుగా సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో ప్రతి ఇంటా తెచ్చిన విప్లవాత్మక మార్పులను సీఎం జగన్ వివరించారు. 2014–19 మధ్య బీజేపీ, జనసేనతో కూటమి కట్టి చంద్రబాబు చేసిన మోసాలు, అరాచకాలను గుర్తుచేస్తూ.. ఇప్పుడు అదే కూటమి కట్టి అడ్డగోలు హామీలు ఇస్తూ వస్తున్న చంద్రబాబును నమ్మితే పులి నోట్లో తలపెట్టడమేనని చాటిచెబుతూ సీఎం చేసిన ప్రసంగానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సన్మానించి గొర్రెపిల్లను బహూకరిస్తున్న బుర్రా మధుసూదన్ యాదవ్. చిత్రంలో వి.విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు

### కదిలివచ్చిన కందుకూరు

నెల్లూరు జిల్లా కందుకూరులో షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం జగన్ ప్రచార సభ ఉంటుందని తెలుసుకున్న ఆ నియోజకవర్గ ప్రజలు ఉదయం 10 గంటల నుంచే భారీ ఎత్తున కదిలివచ్చారు. దాంతో మధ్యాహ్నం 12 గంటలకే కందుకూరు జనసంద్రంగా మారింది. కందుకూరులో హెలీప్యాడ్ నుంచి సభ జరిగే కేఎంసీ సర్కిల్ వరకూ సీఎం జగన్ కాన్వాయ్ వెంట జనం పరుగులు తీశారు. ఆయనను దగ్గరి నుంచి చూసేందుకు పోటీపడ్డారు. సభా ప్రాంగణానికి సీఎం జగన్ చేరుకునే సరికి సాయంత్రం 4 గంటలైంది. అప్పటికి 42 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంది. అంతటి ఎండలోనూ గంటలకొద్దీ నిలబడ్డ జనం సీఎం జగన్‌ను చూడగానే ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. సీఎం జగన్ ప్రసంగాన్ని జనం శ్రద్ధగా విన్నారు. 'సెల్ ఫోన్ నేనే కనిపెట్టానని చంద్రబాబులా బడాయి మాటలు నేను చెప్పడం లేదు. 58 నెలల పాలన మీద ప్రోగ్రెస్ రిపోర్టు మీ ముందు ఉంచి మార్కులు వేయండి అని మీ బిడ్డ అడుగుతున్నాడు' అని సీఎం జగన్ చేసిన విజ్ఞప్తికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 'మంచి చేసిన ఫ్యాన్ ఇంట్లో ఉండాలి.. చెడు చేసిన సైకిల్ ఇంటి బయటే ఉండాలి.. తాగేసిన టీ గ్లాస్ సింక్‌లోనే ఉండాలి' అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. దీనికి ప్రజలు సైతం శ్రుతి కలపడం విశేషం. మండుటెండల్లోనూ, తీవ్రమైన ఉక్కపోతల్లోనూ మూడు సభలకు పోటాపోటీగా జనం కదిలిరావడం.. ఒకదానికి మించి ఒకటి గ్రాండ్ సక్సెస్ కావడంతో రాబోయేది ఫ్యాన్ సునామీయేనని రాజకీయ విశ్లేషకులు తేల్చిచెబుతున్నారు. ప్రచారం సాగే కొద్దీ వైఎస్సార్‌సీపీ ప్రభంజనం అంతకంతకూ పెరగడం ఖాయమని.. ఇది చూసి పోలింగ్‌కు ముందే కూటమి నేతలు, శ్రేణులు కాడి పారేయడం తథ్యమని స్పష్టం చేస్తున్నారు.

### వెల్లువెత్తిన వెంకటగిరి..

తిరుపతి జిల్లా వెంకటగిరిలో షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 12.30 గంటలకు సీఎం జగన్ ప్రచార సభ ప్రారంభమవుతుందని తెలుసుకున్న వేలాది మంది ప్రజలు వెల్లువలా పోటెత్తారు. 43 డిగ్రీల ఉష్ణోగ్రత, విపరీతమైన ఉక్కపోత ఇబ్బంది పెడుతున్నా వెనుకడుగేయలేదు. సభా ప్రాంగణానికి సీఎం జగన్ చేరుకునే సరికి మధ్యాహ్నం 2.25 గంటలైంది. దాదాపు రెండు గంటలు ఆలస్యంగా వచ్చినా జనం నిల్చున్న ప్రాంతం నుంచి కదల్లేదు. సీఎం జగన్‌ను చూడగానే హర్షధ్వానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి మాత్రమే కాదని.. మన తలరాతలు మారుస్తాయని.. ఎవరి వల్ల మీకు మంచి జరిగింది.. ఎవరితో ఆ మంచి కొనసాగుతుందో ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలని సీఎం వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. దీంతో 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ నినదిస్తూ వేలాది మంది ఒక్కసారిగా జయజయధ్వానాలు చేశారు.

---

## అగ్రవర్ణాల్లోని అక్కచెల్లెమ్మలకూ భరోసా

- ఈబీసీ నేస్తంతో వారికి ఐదేళ్లలో రు.1,877 కోట్లు లబ్ధి
- నవరత్నాలలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా మరింత మేలు.. రానున్న ఐదేళ్లలో నాలుగు విడతల్లో ఒక్కొక్కరికి మరో రూ.60వేల సాయం

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన వారినే కాకుండా అగ్రవర్ణ పేదలను సైతం ఆదుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పెద్ద మనస్సు చాటుకున్నారు. అగ్రవర్ణాల్లో పుట్టినప్పటికీ పేదరికం వారికి శాపం కాకూడదనే గొప్ప ఆలోచనతో ఆయన వారికి కూడా సంక్షేమాన్ని అందించారు. ప్రత్యేకంగా వారికోసం వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకాన్ని అమలుచేశారు. రెడ్డి, కమ్మ, క్షత్రియ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, వెలమలతోపాటు మిగిలిన అగ్రవర్ణాల వారికీ అందిస్తున్నారు. వారి కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్లు కూడా ఏర్పాటుచేసి వారి ఉన్నతికి చేదోడుగా నిలిచారు. వారికి ఆర్థిక భరోసా ఇవ్వడం ద్వారా ఆ కుటుంబాన్ని నిలదొక్కుకునేలా ముందుకు తీసుకెళ్తారనే మంచి ఉద్దేశ్యంతో సీఎం జగన్ తోడ్పాటునందిస్తున్నారు. ప్రధానంగా 45 నుంచి 60 ఏళ్లలోపు వయస్సున్న అక్కచెల్లెమ్మలకు ఈబీసీ నేస్తం పథకం ద్వారా ఆర్థిక సాయం చేస్తున్నారు. ఒక్కొక్కరికి ఏటా రూ.15వేలు చొప్పున అందించి అగ్రవర్ణ అక్కచెల్లెమ్మలకు చేదోడుగా నిలిచారు. ఈ ఐదేళ్లలో ఏడు విడతల్లో ఒక్కొక్కరికి రూ.1.05 లక్షలు అందించారు. ఈ పథకం ద్వారా 4,95,269 మందికి మొత్తం రూ.1,877 కోట్ల ఆర్థిక సాయం అందించడం విశేషం. రానున్న ఐదేళ్లలో నాలుగు విడతల్లో ఒక్కొక్కరికి మరో రూ.60వేలు సాయమందిస్తామని సీఎం జగన్ తన మేనిఫెస్టోలో ప్రకటించడంపట్ల అగ్రవర్ణాల్లోని అక్కచెల్లెమ్మలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

### డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా భారీ లబ్ధి..

ఇక రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు సామాజికవర్గాలకు మాత్రమే కాకుండా ఇతర వర్గాలకు సైతం నవరత్నాలు ద్వారా గడచిన ఐదేళ్లలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా పెద్దఎత్తున ఆర్థిక లబ్ధి అందించడం రికార్డు. డీబీటీ ద్వారా 1,66,45,078 మందికి రూ.43,132.75 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా 2,00,59,280 మందికి రూ.86,969.93 కోట్లు కలిపి మొత్తం 3,67,04,358 మందికి రూ.1,30,102.68 కోట్లు లబ్ధి చేకూర్చడం విశేషం.

---

## అసమానతలు తొలగేదాకా రిజర్వేషన్లు

- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్
- రిజర్వేషన్లకు తాము తొలి నుంచీ అనుకూలంగా ఉన్నట్లు వెల్లడి
- ఈ విషయంలో సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరుగుతోందని వ్యాఖ్య



**బడంగ్‌పేట్(హైదరాబాద్):** సమాజంలో అసమానతలు ఉన్నంతకాలం రిజర్వేషన్లు యథావిధిగా ఉంటాయని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ డాక్టర్ మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. మొదటినుంచీ రిజర్వేషన్లకు సంఘ్ అనుకూలంగా ఉందని వెల్లడించారు. తమ సంస్థ రిజర్వేషన్లకు వ్యతిరేకమంటూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని... అందులో ఏమాత్రం వాస్తవం లేదని ప్రకటించారు. తాను ఓ సమావేశంలో ఆ వ్యాఖ్యలు చేసినట్లు వీడియోను ప్రచారం చేస్తున్నారని.. కానీ అసలు అలాంటి సమావేశం ఏదీ జరగలేదని వివరించారు. ప్రస్తుతమున్న సాంకేతికత, కృత్రిమ మేథ(ఏఐ) ద్వారా జరగని దాన్ని కూడా జరిగినట్లు చూపించడం సాధ్యమవుతోందని వ్యాఖ్యానించారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లో ఏర్పాటు చేసిన విద్యాభారతి విజ్ఞాన కేంద్ర పాఠశాల(సరస్వతి విద్యాపీఠం అనుబంధ సంస్థ)ను ఆదివారం ఆయన చినజీయర్ స్వామితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహన్ భాగవత్ మాట్లాడారు. ప్రపంచాన్ని తెలుసుకొనే మార్గంగా విద్యను ఆయన అభివర్ణించారు. 1952లో సరస్వతీ శిశుమందిర్ చిన్న గదిలో ప్రారంభమైందని.. నేడు దేశవ్యాప్తంగా వేలాది పాఠశాలలు నడుస్తున్నాయని చెప్పారు. దేశం సమస్యల్లో ఉన్నప్పుడు ప్రధాని మోదీ దిశానిర్దేశం చేశారని చినజీయర్ స్వామి కొనియాడారు. భారత్‌ను విశ్వగురువుగా మార్చేందుకు ఆయన ఎనలేని కృషి చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో సంఘ్ అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్, క్షేత్ర ప్రచారక్ సుధీర్, సహ ప్రచారక్ భరత్, ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్, విద్యాభారతి క్షేత్ర అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్‌గుప్తా, విష్ణువర్దన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

---

## చంద్రబాబును పోటీకి అనర్హుడిగా ప్రకటించాలి

- ఆయన అనుచిత వ్యాఖ్యలపై ఈసీకి ఫిర్యాదు చేస్తాం
- మూడుసార్లు సీఎంగా చేసిన వ్యక్తి ఇలాగేనా మాట్లాడేదీ?
- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ధ్వజం



**సాక్షి, అమరావతి:** సీఎం జగన్‌ను చంపేయాలంటూ దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్న చంద్రబాబును ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన అనుచిత వ్యాఖ్యలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు. మూడుసార్లు సీఎంగా పని చేసిన వ్యక్తి ఇలాగేనా మాట్లాడేదీ అని నిలదీశారు. చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని.. అందుకే ఇలా దిగజారి మాట్లాడుతున్నారని నిప్పులు చెరిగారు. 'వైఎస్ జగన్ రేపు నిన్ను చంపితే ఏమవుతుంది?' అంటూ చంద్రబాబు ప్రజల ముందు మాట్లాడటం ఏమిటన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో లేళ్ల అప్పిరెడ్డి ఆదివారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ముసుగు తొలగించి తన నిజస్వరూపం బయటపెడుతున్నారన్నారు. రాళ్లతో కొట్టాలని చంద్రబాబు పిలుపు ఇవ్వగానే విజయవాడలో సీఎం జగన్‌పైన హత్యాయత్నం జరిగిందని గుర్తు చేశారు. చంద్రబాబుకు ఫ్రస్టేషన్ పెరిగిపోతోందని.. ఎన్నికలు సమీపించడంతో మరింత బరితెగిస్తున్నారని మండిపడ్డారు. ఆయన తీరు, మాటలు చూసి ప్రజలు, టీడీపీ శ్రేణులు నివ్వెరపోతున్నాయన్నారు. బాబుకు సమాజంలో తిరిగే అర్హత లేదని తేల్చిచెప్పారు. ఆయనపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. గతంలో కూడా సీఎం జగన్‌ను ఉద్దేశించి 'గాల్లోనే వస్తాడు, గాల్లోనే ఫినిష్ అవుతాడు' అని అన్నారని గుర్తు చేశారు. చంద్రబాబుకు ఏమైనా అంతర్జాతీయ కిల్లర్ లైసెన్స్ ఇచ్చారా? అని నిలదీశారు. నిమ్మగడ్డ రమేష్ పచ్చ కండువా కప్పుకుంటే మంచిదని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యమనే ముసుగులో నిమ్మగడ్డ పనిచేయడం ఎందుకన్నారు. ఆయన నేతృత్వంలోని కమిటీలను ఈసీ అడ్డుకోవాలని కోరారు.

---

## టీడీపీది సూపర్ సిక్స్ కాదు..

# చీటింగ్ సిక్స్

- సంక్షేమంపై జనం సోమరులైపోతారని నిన్నమొన్నటి వరకు టీడీపీ గగ్గోలు పెట్టింది
- ఎన్నికలు వచ్చేసరికి సూపర్ సిక్స్ హామీలతో జనాన్ని మభ్యపెట్టేందుకు సిద్ధమయ్యారు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



**సాక్షి, అమరావతి:** టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించింది సూపర్ సిక్స్ కాదని, అవి చీటింగ్ సిక్స్ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. నిన్నమొన్నటి వరకు పెన్షన్లు, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తే జనం సోమరులైపోతారు, జాతీయసంపద ఆవిరైపోతోందన్న టీడీపీ వాళ్లు ఇప్పుడు సూపర్ సిక్స్‌తో అంతకంటే ఎక్కువ హామీలు ప్రకటించడం మోసం చేయడానికి కాదా అని ప్రశ్నించారు. ఆయన ఆదివారం విజయవాడలోని బాలోత్సవ భవనంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 1,29,528 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చిందని, సూపర్ సిక్స్‌లో మాత్రం 20 లక్షల ఉద్యోగాలు ఎలా కల్పిస్తారో చెప్పలేదని విమర్శించారు. రాజకీయ పార్టీలు ధరలు పెంచకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. రాజధాని వాసులను టీడీపీ త్రిశంకుస్వర్గంలోకి తీసుకెళ్తే రాజధానే లేకుండా చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదని విమర్శించారు. రాజధానికి 33 వేల ఎకరాలు అవసరం లేదని, తక్షణమే ఐదువేల నుంచి ఆరువేల ఎకరాల్లో శాశ్వత భవనాలు నిర్మించాలని తాము గతంలోనే చెప్పామని గుర్తుచేశారు. అదే జరిగి ఉంటే రాజధాని మార్పే అవకాశం ఉండేది కాదన్నారు. రష్యా, చైనా, సింగపూర్, జర్మనీ నమూనాలు అంటూ టీడీపీ ఐదేళ్లపాటు తిరిగి చివరకు సినీదర్శకుడు రాజమౌళితో ప్రజలకు త్రీడీ సెట్టింగులు చూపించిందని ఎద్దేవా చేశారు. కేంద్రంలో బీజేపీకి అనుకూలంగా ఉంటే పునీతులుగా చెబుతున్నారని, వ్యతిరేకంగా ఉంటే ఈడీ, సీబీఐ, ఇన్‌కంట్యాక్స్ దాడులతో అవినీతిపరులనే ముద్ర వేస్తున్నారని చెప్పారు. ప్రస్తుత ఎన్నికలు సామాన్యులకు, సంపన్నులైన బడా కార్పొరేట్లకు మధ్య జరుగుతున్న యుద్ధమని పేర్కొన్నారు.

# మేనిఫెస్టోలో చెప్పినదానికి మించి కాపులకు భారీ ఆర్థిక సాయం

**కాపులకు ఏడాదికి రూ.2 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు సాయం చేస్తామని హామీ**

- ఐదేళ్లలో కాపులకు డీబీటీ, నాన్ డీబీటీ కలిపి రూ.34,005.12 కోట్లు సాయం
- రూ. 24 వేల కోట్లు అదనంగా సాయం
- డీబీటీ ద్వారానే రూ.26,232.93 కోట్లు..
- నాన్ డీబీటీ ద్వారా మరో రూ.7,772.19 కోట్లు ఆర్థిక ప్రయోజనం
- పార్టీలు, సిఫార్సులు, అవినీతికి తావు లేకుండా లబ్ధి
- కాపులను నిలువునా మోసం చేసిన చంద్రబాబు
- ఏటా రూ.1,000 కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.5 వేల కోట్లు సాయం అని బాబు హామీ
- వాస్తవంగా ఐదేళ్లలో బాబు కేటాయించింది రూ.1,340 కోట్లే
- మోసం చేసిన బాబు ఒక వైపు – హామీకి మించి సాయం చేసిన జగన్ మరో వైపు
- ముఖ్యమంత్రిగా జగన్ ఉంటేనే వచ్చే ఐదేళ్లు మరింత ఆర్థిక సాయం



సాక్షి, అమరావతి: ప్రజలకు మేలు చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిది ఎప్పుడూ ముందడుగే. ఏ వర్గానికి చేసిన మేలయినా మేనిఫెస్టోలో చెప్పిన దానికంటే ఎక్కువే చేశారు కానీ, ఒక్క రూపాయి తక్కువ చేయలేదు. రాష్ట్రంలోని కాపు సామాజికవర్గం ప్రజలకు సీఎం జగన్ ఈ ఐదేళ్లలో చేసిన మేలు, కల్పించిన ప్రయోజనాలు ఇప్పటివరకు ఏ ప్రభుత్వమూ చేయలేదు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా కాపులకు చేసిన అన్యాయం అంతా ఇంతా కాదు. 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు కూడా ఆయన సీఎంగా ఉన్న ఐదేళ్లలో చేయకుండా ఆ వర్గ ప్రజలను వంచించారు. కాపు సామాజిక వర్గం ప్రజలను చంద్రబాబు వేధించిన తీరు అందరికీ ఇప్పటికీ కళ్లకు కడుతూనే ఉంటుంది.

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కాపుల దశ తిరిగింది. 2019 ఎన్నికల మేనిఫెస్టోలో కాపు సామాజిక వర్గానికి ఏడాదికి రూ.2,000 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు సాయం చేస్తామని పేర్కొన్నారు. అయితే వాస్తవంగా ఈ ఐదేళ్లలో కాపులకు డీబీటీ, నాన్ డీబీటీ కలిపి చేసిన మొత్తం ఆర్థిక సాయం రూ.34,005.12 కోట్లు. అంటే చెప్పినదానికంటే రూ. 24 వేల కోట్లు ఎక్కువ ఆర్థిక ప్రయోజనం కల్పించారు. డీబీడీ ద్వారానే 65,34,600 ప్రయోజనాల కింద కాపులకు రూ.26,232.93 కోట్లు నేరుగా నగదు బదిలీ ద్వారా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. నాన్ డీబీటీ కింద మరో రూ.7,772.19 కోట్లు ఆర్థిక ప్రయోజనాలను కాపులకు అందించారు. చంద్రబాబు గతంలో ఏడాదికి రూ.1,000 కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.5 వేల కోట్లు కాపులకు సాయం చేస్తానని హామీ ఇచ్చారు. వాస్తవంగా చంద్రబాబు పాలన ఐదేళ్లలో కాపులకు కేవలం రూ.1,340 కోట్లే కేటాయింపులు చేశారు. అంటే ఇచ్చిన హామీని నెరవేర్చనేలేదు. రూ.5 వేల కోట్లలో పావు వంతే కేటాయింపులు చేసి, కాపు వర్గాలను మోసం చేశారు. అంతే కాదు.. కాపు రిజర్వేషన్ల కోసం ఉద్యమం చేసిన వారిపై చంద్రబాబు తన పాలనలో ఉక్కుపాదం మోపారు. ఆఖరికి కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంను, వారి కుటుంబసభ్యులను ఇంట్లోనే నిర్బంధించడంతో పాటు ఉద్యమకారులపై అనేక కేసులు పెట్టి వేధించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కాపు రిజర్వేషన్ల ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఎత్తివేశారు. అంతే కాకుండా ఏకంగా నలుగురు కాపు వర్గీయులకు మంత్రివర్గంలో స్థానం కల్పించారు. ప్రత్యేకంగా కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. అర్హతగల కాపులందరినీ నవరత్నాల పథకాలకు ఎంపిక చేశారు. సిఫార్సులు, లంచాలకు తావు లేకుండా, పార్టీలకు అతీతంగా కాపు సోదరులు, కాపు సోదరిలకు సీఎం జగన్ భారీ ఆర్థిక సాయం అందించారు. ఈ ఐదేళ్లలో వైఎస్సార్ కాపు నేస్తం కింద 3,58,613 మంది కాపు మహిళలకు రూ.2029.92 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. వచ్చే ఐదేళ్లలో మళ్లీ ఇంత ఆర్థిక సాయం అందుకోవాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఉంటేనే సాధ్యం అవుతుందనేది జగమెరిగిన సత్యం.

**2019 జూన్ నుంచి ఈ ఏడాది (2023) మార్చి వరకు కాపులకు నేరుగా నగదు బదిలీ ద్వారా అందించిన నవరత్నాల లబ్ధి**

| పథకం | కాపు లబ్ధిదారులు | నగదు (రూ.కోట్లలో) |
|---|---|---|
| జగనన్న అమ్మ ఒడి | 4,04,583 | 2,248.36 |
| జగనన్న వసతి దీవెన | 2,08,064 | 387.27 |
| జగనన్న విద్యా దీవెన | 2,51,706 | 1,383.23 |
| జగనన్న విదేశీ విద్యా దీవెన | 60 | 11.29 |
| వైఎస్సార్ రైతు భరోసా | 8,03,219 | 4,891.31 |
| వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు (రైతులు) | 6,51,745 | 124.71 |
| వైఎస్సార్ ఉచిత పంటల బీమా | 4,33,909 | 655.12 |
| రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ | 2,77,568 | 295.74 |
| మత్స్యకార భరోసా | 1,335 | 2.13 |
| వైఎస్సార్ సున్నా వడ్డీ (ఎస్‌హెచ్‌జీ) | 8,77,589 | 437.02 |
| వైఎస్సార్ పెన్షన్ కానుక | 7,45,172 | 9,194.07 |
| వైఎస్సార్ ఆసరా | 7,16,734 | 2,747.58 |
| వైఎస్సార్ బీమా | 8,150 | 143.14 |
| వైఎస్సార్ కాపు నేస్తం | 3,58,613 | 2,029.92 |
| వైఎస్సార్ నేతన్న నేస్తం | 2,577 | 34.97 |
| జగనన్న చేదోదు (రజక, టైలర్, నాయీబ్రాహ్మణ) | 18,019 | 69.33 |
| వైఎస్సార్ వాహన మిత్ర | 25,046 | 130.00 |
| వైఎస్సార్ ఆరోగ్య ఆసరా | 36,507 | 29.53 |
| అగ్రిగోల్డ్ | 24,617 | 21.43 |
| తెల్ల రేషన్ కార్డుదారులకు ప్రత్యేక కోవిడ్ సాయం | 2,12,101 | 21.21 |
| వైఎస్సార్ ఆరోగ్య శ్రీ | 1,62,364 | 586.83 |
| ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు నేరుగా చెల్లింపు | 1,35,236 | 780.11 |
| జగనన్న తోడు (వడ్డీ) | 1,79,686 | 8.63 |
| నేరుగా నగదు బదిలీ మొత్తం | 65,34,600 | 26,232.93 |

**నగదుయేతర బదిలీ పథకాల ద్వారా సాయం**

| పథకం | కాపు లబ్ధిదారులు | సాయం (రూ.కోట్లలో) |
|---|---|---|
| జగనన్న తోడు | 1,89,430 | 361.48 |
| జగనన్న గోరుముద్ద | 4,02,076 | 578.43 |
| వైఎస్సార్ సంపూర్ణ పోషణ | 1,50,800 | 417.86 |
| జగనన్న విద్యా కానుక | 4,05,450 | 202.78 |
| ఇంటి స్థలాలు సేకరణ,, చదును వ్యయం | 2,46,080 | 6,152.00 |
| 8వ తరగతి పిల్లలకు బైజూస్‌తో టాబ్‌లు | 45,105 | 59.64 |
| మొత్తం | 14,38,941 | 7,772.19 |
| నగదు, నగదేతర కలిపి మొత్తం | 79,73,541 | 34,005.12 |

## నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం సీఎం జగన్

- ప్రజలను మోసగించడంలో బాబు దిట్ట
- మంత్రి వేణు, వైఎస్సార్‌సీపీ నేత జక్కంపూడి



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి వేణు. చిత్రంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్, జక్కంపూడి రాజా

సాక్షి, రాజమహేంద్రవరం: నమ్మకానికి నిలువెత్తు నిదర్శనం సీఎం జగన్ అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ అన్నారు. రాజమహేంద్రవరంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజమండ్రి ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సంకల్ప యాత్ర ద్వారా ప్రజల కష్టాలు తెలుసుకున్న జగన్.. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాక నవరత్న పథకాలు అమలు చేశారని చెప్పారు. ఆ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వనివి సైతం అమలు చేశారని మంత్రి వేణు కొనియాడారు. గతంలో చంద్రబాబు 600 హామీలిచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని, చివరకు తన మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించారని ఎద్దేవా చేశారు. మళ్లీ ఇప్పుడు సూపర్ సిక్స్ అంటూ వస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలను హెచ్చరించారు.

**అమలు సాధ్యమయ్యే మేనిఫెస్టో**

అన్ని పథకాలూ అమలు చేసేలా వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో రూపొందించారని మంత్రి వేణు, జక్కంపూడి రాజా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. అమ్మ ఒడి సాయాన్ని రూ.15 వేల నుంచి రూ.17 వేలకు, పింఛన్‌ను రూ.3,500కు, వైఎస్సార్ చేయూత రూ.75 వేల నుంచి రూ.1.50 లక్షలకు, వైఎస్సార్ కాపు నేస్తం రూ.60 వేల నుంచి రూ.1.20 లక్షలకు పెంచడం.. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.3 లక్షల రుణం, వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా కొనసాగింపు.. ఇలా అమలు సాధ్యమయ్యే పథకాలనే ప్రస్తావిస్తూ సీఎం జగన్ మేనిఫెస్టో ప్రకటించారని చెప్పారు. ఇలాంటి మేనిఫెస్టోకు రూపకల్పన చేసిన సీఎం జగన్‌కే ప్రజలు పగ్గాలు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

## వైఎస్సార్‌సీపీ గెలుపుతోనే బీసీలకు న్యాయం

విశ్రాంత ప్రొఫెసర్ చింతపల్లి కనకారావు



విలేకరులతో మాట్లాడుతున్న కనకారావు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్‌సీపీ బీసీలకు 100 సీట్లు కేటాయించిందని, ఈ అవకాశం కల్పించిన పార్టీని బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి గెలిపించుకోవాలని విశ్రాంత ప్రొఫెసర్ చింతపల్లి కనకారావు పిలుపునిచ్చారు. రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు ఏ ఒక్క పార్టీ బీసీలకు ఇన్ని సీట్లు కేటాయించలేదన్నారు. ఆదివారం రాజమహేంద్రవరం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీలను సమాజంలో బ్యాక్‌బోన్‌గా గుర్తించిన పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. బీసీలకు సామాజిక న్యాయం కల్పించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని.. పార్టీలను పక్కన పెట్టి ఎస్సీ, మైనారిటీ, బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ఏపీఐడీసీ డైరెక్టర్ కానుబోయిన సాగర్ మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల్లో బీసీలకు గుర్తింపు లేదన్నారు. అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పాలన అందించిన ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను సిటీ ఎమ్మెల్యేగా, మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను రూరల్ ఎమ్మెల్యేగా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను రాజమండ్రి ఎంపీగా గెలిపించాలని కోరారు.

## మేనిఫెస్టోలో రైతుల సంక్షేమానికి పెద్దపీట

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి



సాక్షి, అమరావతి: సీఎం జగన్.. ఎన్నికల మేనిఫెస్టోలో అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట వేసి చరిత్ర సృష్టించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి కొనియాడారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం మరింత పెంచబోతున్నట్టు ప్రకటించిన ధీరోదాత్తుడు సీఎం జగన్ అని ప్రశంసించారు. గత ఐదేళ్లలో రైతుల సంక్షేమానికి రూ.1,84,567 కోట్లు ఖర్చు చేశారని, ఇదే రీతిలో వచ్చే ఐదేళ్లూ మరింత అండగా నిలవనున్నట్టు తాజా మేనిఫెస్టో ద్వారా స్పష్టమవుతోందని చెప్పారు. చంద్రబాబు ఇలా ఎప్పుడైనా రైతులకు మేలు చేశారా? అని ప్రశ్నించారు. సీఎం జగన్ నాయకత్వంలో రాష్ట్రంలో వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. ఈ క్రాప్ ద్వారా పక్కాగా పంటల నమోదు, రైతులపై పైసా భారం పడకుండా పంటల బీమా, సీజన్ ముగియకుండానే పంట నష్టపరిహారం చెల్లింపులతో పాటు.. గత చంద్రబాబు ప్రభుత్వం ఎగవేసిన బకాయిలను సైతం సీఎం జగన్ చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆత్మహత్యలకు పాల్పడిన రైతు కుటుంబాలకు రూ.7 లక్షల చొప్పున పరిహారం అందించారని, కౌలు రైతులకూ రైతుభరోసా ఇచ్చి వారిని ఆదుకున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. చంద్రబాబు లాగా 650 హామీలిచ్చి, ఎన్నికలయ్యాక ఆ మేనిఫెస్టోను కనపడకుండా చేసే స్వభావం సీఎం జగన్‌ది కాదని, అందుకే చేయగలిగినవే మేనిఫెస్టోలో పెట్టారని బ్రహ్మానందరెడ్డి వివరించారు.

**జిల్లా వార్తలు**

# సీనియర్లు సైలెంట్!

**ఉమ్మడి కృష్ణాజిల్లాలో డమ్మీలుగా మారిన 'దేశం' సీనియర్లు**

- దశాబ్దాలపాటు జెండా మోసినా పట్టించుకోకపోవడంతో ఆవేదన
- వలసదారులతో కలిసి పనిచేయలేక మౌనం
- చినబాబు తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న టీడీపీ శ్రేణులు




సాక్షి ప్రతినిధి,విజయవాడ: డబ్బు మూటలతో వచ్చిన వారికే టీడీపీ టికెట్లు కేటాయించడంతో ఆ పార్టీలో అసంతృప్తి రగులుకుంది. ఆది నుంచి పార్టీ కోసం కష్టపడి జెండా మోసిన సీనియర్లను ఎన్నికలు వచ్చే సరికి కూరలో కరివేపాకు తీసేసినట్లు తీసేశారు. పాతవాహనాలను షెడ్‌లోకి నెట్టినట్లు వీరిని ఇంటికే పరిమితం చేశారు. దీంతో చాలా మంది సీనియర్లు కినుక వహించారు. పైకి అభ్యర్థులకు సహకారం అందించినట్లు చెబుతున్నా లోలోన మదనపడుతున్నారు. పార్టీ శ్రేణులు సైతం ఈ పరిస్థితిని జీర్ణించుకోలేకపోతున్నాయి. చంద్రబాబు, చినబాబు తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

- ఆది నుంచి టీడీపీ వెన్నంటి ఉండి, చంద్రబాబుకు విధేయంగా ఉన్న సీనియర్ నేత మైలవరం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి దేవినేని ఉమాకు ఈ సారి ఎన్నికల్లో షాక్ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కు టీడీపీ టికెట్ కేటాయించారు. దీనికి కారణం చినబాబుకు డబ్బు మూటలు అందించటంతోపాటు, రెండు పొరుగు నియోజకవర్గాల అభ్యర్థులకు ఎన్నికల్లో అయ్యే ఖర్చును తానే భరిస్తానని వసంత ఓపెన్ ఆఫర్ ఇచ్చినట్లు చెబుతున్నారు. దీంతో ఉమాను, నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టారని సొంత పార్టీ నేతలే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. హడావుడి చేసే ఉమా ఇప్పుడు తనకు జరిగిన అవమానాన్ని బయటకు చెప్పుకోలేక, తన రాజకీయ బద్ధ శత్రువుతో కలిసి తిరగలేక, కేవలం నామమాత్ర పాత్ర పోషిస్తూ ఇంటికే పరిమితం అవుతున్నారు.
- తిరువూరు నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి శావల దేవదత్తును కాదని, పారాచ్యూట్ నేత కొలికపూడి శ్రీనివాస్‌కు టికెట్ కేటాయించారు. ఇక్కడ పార్టీ ఇన్‌చార్జితోపాటు ఆది నుంచి టీడీపీనే నమ్ముకొని ఉన్న సొంత సామాజిక వర్గం వారే, కనీసం తమకు మాట మాత్రమైనా చెప్పకుండా బలవంతంగా కొలికపూడిని అభ్యర్థిగా రుద్దటంపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. బహిరంగంగానే తాము ఆయనకు సహకరించేది లేదని పేర్కొంటున్నారు.
- జగ్గయ్యపేట నియోజకవర్గంలో సైతం టికెట్ కేటాయింపులో టీడీపీ సొంత సామాజిక వర్గ నేతలకు ప్రతిసారీ అన్యాయం జరుగుతుందనే భావన వ్యక్తం అవుతోంది. అక్కడ ఉన్న టీడీపీ సామాజిక వర్గానికి చెందిన రెండు గ్రూపులు టీడీపీ అభ్యర్థి శ్రీరాం తాతయ్యకు సహాయ నిరాకరణ చేసే విధంగా పావులు కదుపుతున్నాయి. ఓ వర్గం వారు అభ్యర్థి ప్రచారాన్ని బహిరంగానే అడ్డుకోవటం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.
- విజయవాడ నగరంలో పలువురు సీనియర్లు ప్రస్తుతం బరిలో ఉన్న అభ్యర్థులకు సహకరించకుండా సైలెంట్‌గా ఉంటున్నారు.

**బీసీలను పావులుగా వాడుకొని..**

- మచిలీపట్నంలో సీనియర్ నేత మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణకు ఈ సారి ఎన్నికల్లో మొండి చెయ్యి చూపారు. పొత్తుపేరుతో జనసేనకు టికెట్ కేటాయించారు. వైఎస్సార్ సీపీ ఎంపీగా ఉండి, ఎన్నికలకు ముందు పార్టీని వీడి, జనసేనలో చేరిన బాలశౌరికి టికెట్ కేటాయించారు. ఆర్థిక లావాదేవీలు, అధినేతలకు కప్పం కట్టడంతోనే ఆయనకు ప్రాధాన్యం లభించినట్లు చెబుతున్నారు. ఆది నుంచి పార్టీ నమ్ముకొని, కష్టపడి పనిచేసిన బీసీ సామాజిక వర్గానికి చెందిన కొనకళ్ల నారాయణకు తీరని అన్యాయం చేశారని బీసీ వర్గాలు మండిపడుతున్నాయి.
- గన్నవరం నియోజకవర్గంలో పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఇన్‌చార్జిగా పనిచేసి, యాదవ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు పార్టీ ఉనికిని కాపాడారు. ఆయన అనారోగ్యంతో మరణించారు. అనంతరం ఆయన కుటుంబానికి అండగా ఉంటామని, కుమారులను రాజకీయంగా అవకాశాలు కల్పిస్తామని చంద్రబాబు ఊదరగొట్టారు. కనీసం ఇప్పుడు ఆ బీసీ కుటుంబాన్ని పట్టించుకోలేదు. ఇటీవల మచిలీపట్నంలో జరిగిన ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి టీడీపీ ముఖ్య నేతలు ముఖం చాటేశారు. దీంతో యాదవ సామాజిక వర్గం వారు పార్టీ తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ నుంచి పార్టీ మారి డబ్బుమూటలతో వచ్చిన యార్లగడ్డ వెంకటరావుకు టీడీపీ టికెట్ కేటాయించింది. ఈ పరిణామాలను బీసీ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి.
- గుడివాడ నియోజకవర్గంలో టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావుకు టికెట్ కేటాయించలేదు. డబ్బు సంచులతో వచ్చిన ఎన్ఆర్ఐ వెనిగండ్ల రాముకు టికెట్ కేటాయించారు. పైకి మాత్రం కలిసి వెనిగండ్ల రాముతో కలిసి రావివెంకటేశ్వరరావు తిరుగుతున్నా.. ఆయన వర్గీయులు రాము అభ్యర్థిత్వాన్ని తీవ్ర వ్యతిరేకిస్తూనే ఉన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు వర్గీయులు అంటీముట్టనట్లు తిరుగుతున్నారు.
- పెనమలూరులో సైతం పలువురు నేతలు పార్టీ వైఖరి నచ్చక మౌనంగా ఉంటున్నారు. కొంత మంది మంత్రి జోగి రమేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.
- పెడనలో సీనియర్ నేత బూరగడ్డ వేదవ్యాస్‌కు ఈ సారి ఎన్నికల్లో టీడీపీ తరఫున టికెట్ ఇస్తామని నమ్మించి చంద్రబాబు మోసం చేశారు. దీంతో ఆయన పార్టీ వెంటే ఉన్న ఆయన వర్గీయులు మాత్రం బహిరంగానే టీడీపీ అభ్యర్థికి సహకరించబోమని కరాఖండిగా చెబుతున్నారు.

### అగ్ని ప్రమాదాల నివారణపై జీజీహెచ్‌లో మాక్ డ్రిల్

గుంటూరు మెడికల్: పెరుగుతున్న రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని గుంటూరు జీజీహెచ్‌లో అగ్ని ప్రమాదాల నివారణకు మాక్ డ్రిల్ నిర్వహించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. ఆదివారం జీజీహెచ్‌లో ఆకస్మికంగా అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజూ ఆస్పత్రికి ఇన్ పేషంట్లు మూడు వేలనుంచి నాలుగు వేలమంది, అవుట్ పేషంట్‌లు, వారి సహాయకులు పది వేల మందికి పైగా వస్తున్నారని పేర్కొన్నారు. వారి భద్రతకోసం ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించినట్లు చెప్పారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అత్యవసర చర్యల కోసం జీజీహెచ్ ఎలక్ట్రీషియన్(9989742529), ఆర్ఎంఓ(995933 3472), డీసీఎస్ ఆర్ఎంఓ(98669 09973), సీఎస్ఆర్ఎంఓ(9849903088), ఫైర్ స్టేషన్(0863-22340 99), జీజీహెచ్ సూపరింటెండెంట్(9849903 089), జీజీహెచ్ పోలీసు ఔట్ పోస్ట్, ఏపీ ఎంఎస్ఐడీసీ ఏఈ ఎలక్ట్రికల్(94948541 61), డీఈ(89786808 11), జిల్లా ఫైర్ ఆఫీసర్ (9440810051) ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

### ఆహ్లాదకరంగా వన్డే క్రికెట్ ఫ్రెండ్లీ టోర్నీ



పెదకాకాని: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారానికి రెండోరోజుకు చేరింది. 2023- 24లో ఎన్నికైన కమిటీ ఆధ్వర్యంలో ఈ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. మరో రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అసోసియేషన్ ఎలక్షన్స్ నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్‌ను శనివారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ బీవీఎల్ చక్రవర్తి, జస్టిస్ జైసూర్య ప్రారంభించారు. అసోసియేషన్ సెక్రెటరీ అడ్వకేట్ సాయికుమార్, స్పోర్ట్స్ సెక్రటరీ పితాని చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్, లైబ్రరీ సెక్రెటరీ జ్ఞానేశ్వరరావు, ట్రెజరర్ అపర్ణ లక్ష్మి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

### లాజిస్టిక్ వాహనంలో రూ. 14కోట్ల విలువైన ఆభరణాలు



కోట్ల విలువైన బంగారం, వెండిని తరలిస్తున్న వాహనం ఇదే



కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద బంగారాన్ని తూకం వేస్తున్న అధికారులు

- హైదరాబాద్ నుంచి విజయవాడ దుకాణాలకు వెళ్తున్నట్లు సమాచారం
- బిల్లులను తనిఖీలు చేసిన జీఎస్టీ, ఇన్‌కం టాక్స్ అధికారులు

కంచికచర్ల: ఓ లాజిస్టిక్ వ్యాన్‌లో రూ.14 కోట్ల విలువైన బంగారం, వెండిని తరలిస్తుండగా ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో గుర్తించి పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. హైదరాబాద్ నుంచి విజయవాడకు వస్తున్న లాజిస్టిక్స్ వాహనంలో ఆదివారం రూ.14 కోట్ల విలువైన బంగారం, వెండిని తరలిస్తున్నారు. ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీల్లో భాగంగా కంచికచర్ల సమీపంలోని పేరకలపాడు క్రాస్ రోడ్డు వద్ద లాజిస్టిక్ వాహనాన్ని తనిఖీ చేశారు. బంగారం, వెండిని తరలిస్తున్నామని, సంబంధిత బిల్లులు కూడా ఉన్నాయని వాహన డ్రైవర్ అధికారులకు తెలిపారు. ఆ వాహనాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. తహసీల్దార్ వి.సుస్వాగతం జీఎస్టీ, ఇన్‌కంటాక్స్ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వచ్చి బంగారం, వెండిని పరిశీలించి సంబంధించిన బిల్లులను తనిఖీలు చేశారు. ఆ బిల్లులు విజయవాడలోని లలిత, కల్యాణ్, మలబార్ తదితర జ్యూవెలరీ దుకాణాలకు సంబంధించినవిగా ఉన్నాయని అధికారుల ద్వారా సమాచారం. విచారణ అర్ధరాత్రి వరకు కొనసాగింది.

### లలితా సహస్ర నామం.. సర్వదా శుభప్రదం



జయహో భారతీయం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నూతన తెలుగు సంవత్సరం సందర్భంగా విజయవాడ మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాలలో ఆదివారం నిర్వహించిన మహాలలితా పారాయణం వైభవం సాగింది. 26 రకాల పూలతో అమ్మవారికి అర్చన చేశారు. కార్యక్రమంలో పలువురు హైకోర్టు జడ్జిలు, వందలాదిమంది మహిళా భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





మంచిమాట



# చింత - చింతన

**చిత్త వ్యాపారాలే చింత, చింతన. మనస్సు చేత ప్రేరేపితమైన ఇంద్రియ వ్యాపారాలను భద్రపరచేది చిత్తం. విషయాలను, అనుభవాలను, భావోద్వేగాలు మొదలైనవాటిని జ్ఞాపకాల రూపంలో భద్రపరచి దాచి ఉంచేది చిత్తం. దానిలో ప్రతి మనోవ్యాపారం ముద్రితమై ఉంటుంది. ఒకోసారి మర్చి పోయాం అనుకొన్నవి కూడా సందర్భానుసారం బయట పడుతూ ఉంటాయి. అందుకే ఏదైనా మరచి పోతే కళ్ళు మూసుకుని ఆలోచిస్తాం. అప్పుడు జ్ఞాపకాల గది తలుపు తెరుచుకుంటుంది.**

**చింత** అంటే జరిగి పోయిన లేదా జరగబోయే విషయాలను తలుచుకుంటూ బాధపడుతూ వేదన చెందుతూ ఉండటం. పైకి వ్యక్తం చేయక పోయినా మనసు లోపల నిరంతరం అదే విషయం మెదులుతూ సంతోషమన్నది లేకుండా చేస్తుంది. కొంతమంది ముఖాలు చూస్తూనే చెప్ప వచ్చు వాళ్ళు ఏదో విషయంలో చాలా బాధ పడుతున్నారు అని. సాధారణంగా ఆ విషయానికి పరిష్కారం వాళ్ళకి తెలియక పోవటమో, తెలిసినా చేయగలిగే పరిస్థితిలో లేకపోవటమో దానికి కారణం అయి ఉంటుంది. ఆ అనిశ్చితి, అసమర్థత నిరంతరం మనసులో తిరుగుతూ వేదనని కలిగించి కుంగదీస్తాయి. పరిష్కారం దొరికితే కొంత ఉపశమనం కలుగుతుంది. దానిని అమలు చేయగల శక్తి ఉంటే ధైర్యం కలుగుతుంది. వేదన కొంత ఉపశమిస్తుంది. ఇక్కడ అర్థమయ్యే విషయం ఏమంటే ఒక విషయం గురించి తీవ్రంగా ఆలోచించగల శక్తి మనిషి మనస్సుకి ఉంది అని. దానిని ఉపయోగపడని వాటికి వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవచ్చు. అప్పుడు అది చింతన అవుతుంది.

చింతన మనిషిని తాత్త్వికుడిగా పరిణమింప చేస్తుంది. వ్యక్తిగతమైన సమస్యలు, వాటి పరిష్కారాలు అనే స్థాయి దాటి ఏదైనా ఒక అంశం గాని, సిద్ధాంతం గాని, మరేదైనా గాని – దానిని గురించి లోతుగా, అన్ని కోణాలలోనూ, పరిశీలించి, అధ్యయనం చేసి, మూలతత్త్వాన్ని తెలుసుకునేందుకు సహకరిస్తుంది. ఆధ్యాత్మికత, మతం, రాజనీతి, సాంఘిక సామాజిక పరిస్థితులు, కమ్యూనిజం వంటి ఆధునిక సిద్ధాంతాలు – ఒకటేమిటి ఏవైనా కావచ్చు, వాటి మౌలికతత్త్వం తెలుసుకోవటానికి వాటి గురించిన చింతన ఒకటే మార్గం. ఆ విషయానికి సంబంధించిన అంశాలనే నిరంతరం తలుచుకుంటూ, మననం చేస్తూ ఉంటే, పైకి కనపడే అంశానికి మూలమైన సూత్రం, అసలు లక్షణం, సరిగా చెప్పాలంటే బీజం స్ఫురిస్తుంది. దానితో విరాడ్రూపం మనోనేత్రం ముందు కదలాడుతుంది. లోతుపాతులు, మంచిచెడులు, విస్తరణ, పరిమితులు మొదలైన వన్నీ చాలావరకు అర్థం

**చింతన అంటే నిరంతరం ఒక విషయాన్ని గురించి తలచుకుంటూ, మననం చేయటం. ఇది కూడా చిత్తం చేసే పనే అయినా చింతకి చింతనకి మధ్య ఎంతో తేడా ఉంది. నక్కకి నాకలోకానికి ఉన్నంత. లౌకిక స్థాయిలోచింతన మనిషి మేథకి మెఱుగులు పెడుతుంది. ఆలోచనలకి పదును పెడుతుంది. ఒక విషయాన్ని గురించి కూలంకషంగా విశ్లేషించి తగిన నిర్ణయం తీసుకోవటానికి తోడ్పడుతుంది. ఇది వ్యక్తిగతంగా తన సమస్యలని పరిష్కరించుకోవటానికి ఎంతో అవసరం.**


అవుతాయి. ఇతరులు గుర్తించ లేని రహస్యాలు స్ఫురిస్తాయి. శాస్త్రవేత్తలని దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. ఎంతోమంది శాస్త్రవేత్తలు తాము చేసే పరిశోధనల గురించి నిరంతరం ఆలోచిస్తూనే ఉంటారు నిత్యకృత్యాలు నిర్వహిస్తూ కూడా. కొన్నిమార్లు వారికి నిద్రలో కలల రూపంలోనో, పరిసరాల్లో జరుగుతున్న సంఘటనల రూపంలోనో, ఆహారం తీసుకుంటున్నప్పుడో హఠాత్తుగా చేయవలసినది కానీ, పరిష్కారం గాని స్ఫురిస్తుంది. ఆర్కిమిడీస్ దానికి పెద్ద ఉదాహరణ. అతడికి తొట్టిలో స్నానం చేస్తుండగా నీళ్ళలో మునిగినప్పుడు పదార్థం బరువు తగ్గటానికి కారణం స్ఫురించింది. దానికి అతడు దాని గురించి చింతన చేస్తూ ఉండటమే కారణం.

మనిషి దేనిని చింతన చేస్తే దానిగా మారిపోతాడు అన్నది ఆధునిక మనస్తత్వశాస్త్ర పరిశోధకులు నిర్ధారించి చెప్పిన మాట.

సాధకుడు ఏమి పొందాలని అనుకుంటున్నాడో దానిని సిద్ధింపచేసేది చింతన అని ఆధ్యాత్మికవేత్తలు చెప్పే మాట.

– డా. ఎన్. అనంతలక్ష్మి

## గృహస్థాశ్రమ వైశిష్ట్యం



# ఇష్టాయిష్టాలు కలిసాయా!?

గృహస్థాశ్రమ ప్రవేశం చేయడానికి ఒక యువకుడికి, ఒక యువతికి ఉండవలసిన సాధారణ లక్షణాలు ఐదింటిని శ్రీరామాయణం నిర్దేశించింది. వాటిలో మొదటిది శీలం. అంటే స్వభావం. అది పుట్టుకతో వస్తుంది. ఒక్కొక్కరికి ఒక్కొక్క స్వభావం ఉంటుంది. కొంతమందికి సంగీతం, కొంతమందికి ఆధ్యాత్మిక చింతన, మరికొందరికి చిత్రలేఖనం.... అలా అది వారికి బాగా ఇష్టమైన విషయంగా ఉంటుంది. పెళ్ళి సంబంధం చూసేటప్పుడు ఒకరికి ఇష్టమైన విషయం మరొకరికి కూడా ఇష్టమేనా, అయిష్టం లేదు కదా.. అని చూస్తారు. ఆ పరిశీలన పెద్దలు చేస్తారు. తరువాత వయస్సు. ఇద్దరిలో ఎవరు ఎక్కువ ఎవరు తక్కువ అన్నది ఉండదు. రెండు కళ్ళల్లో ఏది మంచిదంటే ఏమని చెప్పగలం? బండి చక్రాలు రెండూ సమన్వయంతో పనిచేయాలి. జీవితం నుండి మొదట ఆయన నిష్క్రమిస్తే.. ఆవిడ పుణ్యకార్యం చేయదు. ఆమె వెళ్ళిపోతే...ఆయన తమ కడుపున పుట్టిన కూతురును కూడా కన్యాదానం చేయలేడు. ఆవిడ నిష్క్రమణతోనే ఆయనకు పుణ్యకార్యం చేసే అధికారం కూడా పోతుంది. అందువల్ల ఇద్దరూ సమానమే. ఇద్దరూ కలిసి ఉంటేనే సౌభాగ్యం, సంతోషం. అంటే వాళ్ళ వయసులో ఎవరు పెద్దయితే గొప్ప అన్నదానికన్నా ప్రధానమైనది– ఒకరు నడిపించాలి, మరొకరు నడవాలి–అనేది. ఇక్కడ నడిపించేవారిది ఎక్కువ, నడిచేవారిది తక్కువ అనుకోకూడదు. అన్వయం జాగ్రత్తగా చేసుకోవాలి. వరుడి వయసు పెద్దదయి ఉండాలి–అన్నారు. వయస్సు అంటే కాలం. కాలం అనుభవానికి, అవగాహనకు గుర్తు. ఎవరు ముందు ప్రపంచంలోకి వచ్చారో.. వాళ్ళఅనుభవాన్ని, అవగాహనను ఎక్కువ సాధిస్తారు. మనం ఎంత చదివాం అన్నదానికన్నా... దానికి అనుభవం ఎంత తోడయింది... అన్నది ప్రధానం. ఒక ఉద్యోగానికి వెడితే అనుభవం ఎంత అన్నదానికి ప్రాధాన్యత ఇస్తారు. అలాగే వివాహం విషయంలో.. లోకజ్ఞానం, లోక ప్రవృత్తిని సరిగా అర్థం చేసుకుని భార్యకు అవగాహన కలిగించగలిగిన వాడయి ఉండాలి.

అనుభవం అన్నమాటలోనే అంతర్లీనంగా ఉండే విషయం – భార్య పట్ల పరమ ప్రేమతో మెలుగుతూ ఆమెకు రక్షకుడయి ఉండాలన్నది. ఆమె గుణాలు, ప్రతిభ ప్రకాశించడానికి ఆయన అవకాశం కల్పించగలగాలి. ఆమె బలహీనతలు... శారీరకం కావచ్చు, నడవడి రీత్యా కావచ్చు... వాటిని కప్పగలగడంతోపాటూ ఆమె గౌరవమర్యాదలు తగ్గకుండా చూడగలగాలి. సంసారాన్ని సాఫీగా నడపడంలో ఆమెకు ఆయన అనుక్షణం అండగా నిలవాలి. ఒక అమాయకురాలైన కూతురు తెలిసీ తెలియక చేసే తప్పులను తల్లిదండ్రులు ఎలా సరిదిద్దుతూ కాపాడుతుంటారో భార్యను అలా కాపాడుకోగలిగి ఉండాలి.

అది భర్త లక్షణం. భార్యది – అంకిత భావం. పిచ్చి ప్రేమ. భర్త ప్రేమకు కారణం ఉంటుంది. భార్య ప్రేమకు కారణం ఉండదు. అనుగమించడం, అంకితభావంలో మసులు కోవడం ఆమె కర్తవ్యం. ఆమెకు ప్రేమను పంచడం, ప్రతి కష్టంలో ఆమెకు రక్షణగా నిలవడం ఆయన బాధ్యత. ఆమెది పాతివ్రత్యం. ఆయనది ఏకపత్నీవ్రతం. అందువల్ల ఎక్కువ తక్కువలను వారి మధ్య పోల్చిచూడకూడదు. కామసంబంధమైన ప్రవత్తి కలిగినా ఆయన దృష్టిలో ఆమె వినా మరొకరికి స్థానం ఉండదు. ఆమెకు ఆయనే సర్వస్వం. ఇది దాంపత్యం. ఇదే గృహస్థాశ్రమం. ఇది సనాతన ధర్మ వైభవం.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బౌద్ధవాణి

# మట్టికుండ నేర్పిన పాఠం



**విదిశా** నగర సమీపంలోని ఒక వ్యాపార కేంద్రం సువర్ణపురి. ఆ పట్టణంలో ప్రజోతుడు పేరున్న ధనిక వ్యాపారి. ప్రజోతునికి మణిమాలుడు అనే కుమారుడు.

అతనూ పెరిగి పెద్దవాడయ్యాడు. తండ్రి వ్యాపారంలో తోడుగా ఉండేవాడు. మణిమాలుడు తమ వ్యాపారాన్ని మరింతగా పెంచాడు. ప్రజోతుడు వృద్ధుడయ్యాడు. కుమారునికి వ్యాపార పద్ధతులు, సుదూర రాజ్యాల ప్రజల తీరుతెన్నులు చెప్పుతూ... కాలం గడపసాగాడు.

అప్పుడప్పుడూ జైన సాధువుల్ని, బౌద్ధ భిక్షువుల్ని పిలిచి దానాలు ఇచ్చేవాడు. నగరంలో కొన్ని ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉండేవాడు. కొన్నాళ్ళకు మణిమాలుడు కూడా పెద్ద వ్యాపారి అయ్యాడు. ధనం పెరిగిన కొద్దీ అతనికి ధనదాహం కూడా పెరిగింది. అక్రమ వ్యాపారాలు సాగించాడు. దానితో ధనం ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. దానధర్మాలు మానాడు. ధనంతోపాటు మానసిక అశాంతీ పెరిగింది. నిద్ర సుఖానికి దూరం అయ్యాడు. భయానికీ, ఉలికిపాటుకూ చేరువయ్యాడు. తండ్రి తన కుమారునిలో పెరిగిపోతున్న అశాంతిని గమనించాడు. ఒకరోజున పిలిచి– ''నాయనా! నీవు నైతికతకి దూరమవుతున్నావు. మనోవేదనకి దగ్గరవుతున్నావు. నీవు ఇక నాతోపాటు బుద్ధ సందేశాలు వినడానికి రా.. ప్రస్తుతం భగవాన్ బుద్ధుడు ఇక్కడకు సమీపంలోనే ఉంటున్నారు'' అని అనునయంగా చెప్పాడు.

అలా... తనతో రెండు మూడుమార్లు మణిమాలుణ్ణి బుద్ధుని దగ్గరకు తీసుకుని వెళ్ళాడు ప్రజోతుడు. ఆ తర్వాత తానే స్వయంగా బుద్ధుని దగ్గరకు వెళ్ళసాగాడు మణిమాలుడు. ఒకరోజు మణిమాలుడు బుద్ధునితో–

''భగవాన్! నేను నా తండ్రిలా దానాలు చేయలేదు. సాధువుల్ని గౌరవించలేదు. వారిని సత్కరించలేదు. వ్యాపారాన్నీ ధర్మబద్ధంగా చేయనూ లేదు. ఇప్పుడే నా తప్పు తెలుసుకున్నాను. కానీ... నాకు ఒక బెంగ ఉంది. మరణానంతరం నా తండ్రికి గానీ, నాకు గానీ స్వర్గం లభిస్తుందా?'' అని అడిగాడు.

అతని ఆంతర్యం గ్రహించాడు బుద్ధుడు. ''మణిమాలా! రేపు వచ్చేటప్పుడు ఒక మట్టికుండ, కొంత వెన్నపూస, కొన్ని గులకరాళ్ళు తీసుకుని రా'' అన్నాడు. మరునాడు అవి తీసుకువచ్చాడు మణిమాలుడు. కుండలో గులకరాళ్ళు పోయించి, వాటిమీద వెన్నముద్ద పెట్టించి,''మణిమాలా! దగ్గరలో ఉన్న తటాకం దగ్గరకు తీసుకుపోయి ఈ కుండను నీటిమీద ఉంచి, కర్రతో పగలగొట్టు. వెన్న మునిగితే నీ తండ్రికి స్వర్గప్రాప్తి, రాళ్ళు తేలితే నీకు స్వర్గప్రాప్తి..'' అని చెప్పి పంపాడు.

మణిమాలుడు గబగబా వెళ్ళి నీటిపై కుండను ఉంచి కర్రతో పగలగొట్టాడు. వెన్న తేలింది. రాళ్ళు మునిగాయి. దానితో ఆందోళనపడుతూ బుద్ధుని దగ్గరకు పరుగున వచ్చి పడ్డాడు. విషయం చెప్పి...''మా ఇద్దరికీ స్వర్గం దక్కే మార్గం ఏమిటి భగవాన్'' అని అడిగాడు.

''నాయనా నీటిలో రాళ్ళు మునగడం వాటి ప్రకృతిధర్మం. నీటిపై తేలడం వెన్న సహజ ధర్మం. అవి వాటి సహజ ధర్మాల్ని తప్పి ఎప్పుడూ ప్రవర్తించవు. అలాగే... మంచి పనులు చేస్తే మనిషికి మనశ్శాంతి. సుఖ నిద్ర, సుఖ జీవనం. అదే స్వర్గం. చెడ్డపనులు చేస్తే మనస్సుకు అశాంతి. దుఃఖం. నిద్రకు దూరం. మనోవ్యథ. అదే నరకం. మంచిగా మానవునిగా, మానవతతో జీవించు. దుఃఖాన్ని ఇచ్చే అకుశల కర్మలు ఆచరించకు. అదే స్వర్గం. ...'' అని చెప్పాడు.

మణిమాలుని మనస్సు తేటపడింది. మట్టికుండ మహోపదేశాన్ని అందించింది. ధర్మబద్ధంగా జీవించడం నేర్చుకున్నాడు. దానాలు చేస్తూ, ధర్మకార్యాలు నెరవేరుస్తూ జీవితం ఆనందంగా కొనసాగించారు.

– డా. బొర్రా గోవర్ధన్

## సినిమా

# హారర్ కామెడీ


• రాశీఖన్నా

**త**మన్నా, రాశీఖన్నా హీరోయిన్లుగా, సుందర్ సి. కీలక పాత్రలో నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'అరణ్మనై 4'. 'వెన్నెల' కిషోర్, శ్రీనివాసులు, ఢిల్లీ గణేష్, కోవై సరళ కీలక పాత్రల్లో నటించారు. తమిళ చిత్ర పరిశ్రమలో 'అరణ్మనై' మూవీ సూపర్ హిట్ ఫ్రాంచైజీగా నిలిచింది. ఈ ఫ్రాంచైజీలో నిర్మించిన తాజా చిత్రం 'అరణ్మనై 4'. అవ్ని సినిమాక్స్‌పై ఖుష్బు సుందర్, ఏసీఎస్ అరుణ్ కుమార్ నిర్మించారు. ఈ మూవీని 'బాక్' పేరుతో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పీ తెలుగులో విడుదల చేస్తోంది. తాజాగా 'బాక్' సెన్సార్ పూర్తి చేసుకుంది.. 'యూ/ఏ' సర్టిఫికెట్ వచ్చింది. మే 3న ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నామన్నారు మేకర్స్. ''హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'బాక్'. మా మూవీ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంది. హిప్‌హాప్ తమిళ అద్భుతమైన సంగీతం అందించారు. ఈ మూవీ నుంచి విడుదలైన 'పంచుకో..' పాటకి అనూహ్యమైన స్పందన వచ్చింది. తమన్నా, రాశీఖన్నాలపై చిత్రీకరించిన ఈ పాట సినిమాకి హైలెట్‌గా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: ఇ.కృష్ణమూర్తి అకా కిచ్చ.

# థగ్‌లైఫ్ కోసం పాట


• కమల్‌హాసన్

**న**టన, నిర్మాణం, డైరెక్షన్, స్టోరీ రైటింగ్.. వంటి విషయాల్లోనే కాదు.. వీలైనప్పుడు కొరియోగ్రాఫర్, గీత రచయితగా తన ప్రతిభను చూపిస్తుంటారు కమల్‌హాసన్. ఇటీవల తన కూతురు, హీరోయిన్ శ్రుతీహాసన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా చేసిన 'ఇనిమెల్' సాంగ్‌కు కమల్‌హాసన్ లిరిక్స్ రాశారు. దర్శకుడు లోకేష్ కనగరాజ్, శ్రుతీహాసన్ యాక్ట్ చేసిన ఈ సాంగ్‌కు శ్రోతల నుంచి మంచి పాజిటివ్ రెస్పాన్స్ లభించింది. తాజాగా కమల్‌హాసన్ మరో పాట రాశారు. అది 'థగ్‌లైఫ్' సినిమా కోసం. 'నాయగన్' (1987) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో వస్తున్న సినిమా ఇది. ఈ సినిమా కోసం ఓ పాటను రాసినట్లు ఇటీవల కమల్‌హాసన్ పేర్కొన్నారు. అంతే కాదు.. ఈ పాట మొత్తం రెండు గంటల్లోనే పూర్తయిందని, చిత్ర మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ ఈ పాటను రికార్డు చేసేశారని కమల్‌హాసన్ పేర్కొనడం విశేషం. త్రిష, 'జయం' రవి, దుల్కర్ సల్మాన్, శింబు ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్న 'థగ్‌లైఫ్' సినిమా వచ్చే ఏడాది విడుదల కానుందని కోలీవుడ్ టాక్.

# మా ఇంటి బంగారం


• సమంత

హీరోయిన్ సమంత కొత్త కబురు చెప్పారు. 'మా ఇంటి బంగారం' అనే టైటిల్‌తో తన తర్వాతి సినిమా తెరకెక్కనున్నట్లు వెల్లడించారు. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్, గ్లింప్స్ వీడియోను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సమంత షేర్ చేశారు. అలాగే 'మా ఇంటి బంగారం' మూవీ సమంత సొంత నిర్మాణ సంస్థ అయిన 'ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్' పతాకంపై తెరకెక్కనుంది. నిర్మాతగా సమంత రూపొందిస్తున్న తొలి చిత్రం కూడా ఇదే కావడం విశేషం. ఈ మూవీలో ఓ సమస్యపై పోరాడే గృహిణి పాత్రలో సమంత నటించనున్నట్లు తెలుస్తోంది. అయితే ఆదివారం సమంత బర్త్ డే (ఏప్రిల్ 28). ఈ సందర్భంగా 'మా ఇంటి బంగారం' సినిమా అనౌన్స్‌మెంట్ వచ్చినట్లు ఊహించవచ్చు. ఇదిలా ఉంటే.. హీరో వరుణ్‌ధావన్‌తో కలిసి సమంత నటించిన 'సిటాడెల్' వెబ్‌సిరీస్ ఇండియన్ వెర్షన్ స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే.

# వాస్తవ ఘటనలతో...


• అక్షయ్ కుమార్

**బా**లీవుడ్ హీరో అక్షయ్‌కుమార్ నటించిన తాజా యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'స్కై ఫోర్స్'. సందీప్ కెవ్లాని– అభిషేక్ కపూర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సారా అలీఖాన్, నిమ్రత్ కౌర్ హీరోయిన్లుగా నటించారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ ముగిసింది. ఈ మూవీ షూటింగ్ దాదాపు వంద రోజులు జరగ్గా, అరవై రోజుల పాటు అక్షయ్‌కుమార్ సెట్స్‌లో పాల్గొన్నారని బాలీవుడ్ సమాచారం. వాస్తవ ఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ సినిమాను జ్యోతిదేశ్‌పాండే, అమర్ కౌశిక్, దినేష్ విజన్ నిర్మించారు. 'స్కైఫోర్స్' చిత్రం అక్టోబరు 2న విడుదల కానుందని బాలీవుడ్ సమాచారం.

# సీతారాముడు ఆన్ సెట్స్


• రణ్‌బీర్ కపూర్

**'రా**మాయణం' ఆధారంగా హిందీలో 'రామాయణ' అనే సినిమా తెరకెక్కుతున్నట్లుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. 'దంగల్' ఫేమ్ నితీష్ తివారి దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా, యశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. అయితే ఈ మూవీ చిత్రీకరణ ఆల్రెడీ మొదలైందని, ప్రస్తుతం రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి షూటింగ్‌లో పాల్గొంటుండగా నితీష్ తివారి కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుపుతున్నారని బాలీవుడ్ సమాచారం. కాగా రాముడి గెటప్‌లో రణ్‌బీర్ కపూర్, సీత గెటప్‌లో సాయిపల్లవి ఉన్న ఫోటోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. అలాగే హిందీ 'రామాయణ' సినిమాను మూడుభాగాలుగా తెరకెక్కిస్తున్నారని, తొలి భాగాన్ని వచ్చే ఏడాది దీపావళి సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని బాలీవుడ్ టాక్. అయితే ఈ సినిమా గురించి పూర్తి స్థాయి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


• సాయిపల్లవి, రణ్‌బీర్

# అలాంటి సన్నివేశాలకు నో



**– మృణాళ్ ఠాకూర్**

'కథకి, పాత్రకి అవసరమైతే గ్లామర్ సన్నివేశాల్లో, ముద్దు సీన్స్‌లో నటించేందుకు సిద్ధం' అనే మాటని ఎక్కువ శాతం హీరోయిన్లు అంటుంటారు. అయితే అలాంటి సన్నివేశాలకు నో అనే కథానాయికలూ లేకపోలేదు. హీరోయిన్ మృణాళ్ ఠాకూర్ కూడా గ్లామర్ సన్నివేశాలు, ముద్దు సీన్స్‌లో నటించేందుకు నో చెబుతాను అంటున్నారు. 'సీతా రామం'(2022) సినిమాతో తెలుగు పరిశ్రమలో ఎంట్రీ ఇచ్చారు ఈ మరాఠీ బ్యూటీ. అందం, అభినయంతో తొలి చిత్రంతోనే సూపర్ హిట్ అందుకున్నారు మృణాళ్. ఆ తర్వాత తెలుగులో నానితో 'హాయ్ నాన్న', విజయ్ దేవరకొండతో 'ఫ్యామిలీ స్టార్' సినిమాల్లో నటించి, తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక అభిమానులను సొంతం చేసుకున్నారామె. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ–''ఇంటెన్స్ కిస్సింగ్ సీన్స్, బెడ్ రూమ్ సన్నివేశాల్లో నటించడం నాకు ఇష్టం ఉండదు. పైగా నేను అలాంటి సీన్స్‌లో యాక్ట్ చేసేందుకు నా తల్లి దండ్రులు కూడా ఒప్పుకోరు. అందుకే మొహమాటం లేకుండా నో చెబుతాను'' అన్నారు.

# నవ్వులే నవ్వులు


• ప్రియదర్శి

**'మ**ల్లేశం, జాతిరత్నాలు, బలగం, ఓం భీమ్ బుష్' చిత్రాల ఫేమ్ ప్రియదర్శి హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. ఈ చిత్రానికి హీరో రానా సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. నిర్మాత నారాయణ్ దాస్ నారంగ్ ఆశీస్సులతో రూపొందనున్న ఈ మూవీతో నవనీత్ శ్రీరామ్ దర్శకునిగా పరిచయమవుతున్నారు. ప్రతిష్ఠాత్మక 'టైమ్స్ పవర్ ఉమెన్ 2024' అవార్డును అందుకున్న జాన్వీ నారంగ్ నిర్మించనున్న ఈ మూవీని అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ''వినోదాత్మకంగా రూపొందనున్న చిత్రమిది. త్వరలోనే ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభించనున్నాం. ఈ మూవీ టైటిల్, నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో తెలియజేస్తాం'' అన్నారు చిత్రయూనిట్. ఈ చిత్రానికి సమర్పణ: సునీల్ నారంగ్, భరత్ నారంగ్, శ్రీ వెంకటేశ్వర ఏషియన్ సినిమాస్ ఎల్ఎల్‌పీ, రానా దగ్గుబాటి(స్పిరిట్ మీడియా).

# గుట్టు చప్పుడు మలుపు తిప్పుతుంది – సంజయ్‌రావ్


• బ్రహ్మాజీ, సంజయ్ రావ్

''**గు**ట్టు చప్పుడు'లో అన్ని వర్గాలను ఆకట్టుకునే అంశాలు ఉన్నాయి. నా కెరీర్‌ని మంచి మలుపు తిప్పే సినిమా అవుతుందనే నమ్మకం ఉంది. అంతేకాదు.. మా టీమ్‌కి సూపర్ సక్సెస్ ఇచ్చే చిత్రం ఇది'' అని నటుడు బ్రహ్మాజీ తనయుడు, హీరో సంజయ్ రావ్ అన్నారు. మణీంద్రన్ దర్శకత్వంలో సంజయ్ రావ్, ఆయేషాఖాన్ జంటగా నటిస్తున్న చిత్రం 'గుట్టు చప్పుడు'. డా.లివింగ్‌స్టన్ నిర్మిస్తున్న ఈ సినిమా టీజర్‌ని హీరో సాయి దుర్గా తేజ్ ఆన్‌లైన్‌లో రిలీజ్ చేయగా, ఆఫ్‌లైన్‌లో బ్రహ్మాజీ రిలీజ్ చేశారు. మణీంద్రన్ మాట్లాడుతూ–''రొమాంటిక్, యాక్షన్, లవ్, ఎంటర్‌టైనర్‌గా 'గుట్టు చప్పుడు' తెరకెక్కుతోంది. ప్రేక్షకుల టిక్కెట్ ధరకు మించిన ఆనందాన్ని ఇచ్చే సినిమా ఇది'' అన్నారు. ''మణీంద్రన్‌తో నాకు 12 సంవత్సరాల అనుబంధం. ఈ చిత్ర కథ చెప్పినప్పుడు ఎగ్జైట్‌గా ఫీలయ్యాను'' అన్నారు లివింగ్‌స్టన్. చిత్ర సంగీత దర్శకుడు గౌర హరి మాట్లాడారు.

# వేట ఆలస్యం


• ఆరోన్ టేలర్

ఆరోన్ టేలర్ జాన్సన్ ప్రధాన పాత్రలో, అరియానా డిబోస్, ఫ్రెడ్ హెచింజర్, క్రిస్టోఫర్ అబాట్, రస్సెల్ క్రోవ్, అలెస్సాండ్రో నివోల కీలక పాత్రల్లో నటిస్తున్న హాలీవుడ్ సూపర్ హీరో ఫిల్మ్ 'క్రావెన్ ది హంటర్'. జేసీ చందర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. కాగా ఈ సినిమాను తొలుత ఆగస్టు 30న విడుదల చేయాలనుకున్నారు. కానీ, డిసెంబరు 13న విడుదల చేయనున్నట్లు ఈ సినిమాను డిస్ట్రిబ్యూట్ చేయనున్న సోనీ పిక్చర్స్ ప్రకటించింది.



## షూటింగ్‌లో భారత్‌కు 21వ ఒలింపిక్ బెర్త్

పారిస్ ఒలింపిక్స్ చివరి క్వాలిఫయింగ్ షూటింగ్ టోర్నీలో భారత మహిళా స్కీట్ షూటర్ మహేశ్వరి చౌహాన్ రజత పతకం సాధించింది. దాంతో భారత్‌కు 21వ ఒలింపిక్ బెర్త్ ఖరారైంది. దోహాలో ఆదివారం జరిగిన స్కీట్ ఈవెంట్ ఫైనల్లో మహేశ్వరి 'షూట్ ఆఫ్'లో 3–4తో ఫ్రాన్సిస్కా క్రొవెట్టో (చిలీ) చేతిలో ఓడిపోయింది. నిర్ణీత 60 షాట్‌ల తర్వాత ఇద్దరూ 54–54తో సమంగా ఉండటంతో విజేతను నిర్ణయించేందుకు 'షూట్ ఆఫ్'ను నిర్వహించారు.

## రేణుక విజృంభణ... భారత్ శుభారంభం

బంగ్లాదేశ్‌తో ఆదివారం సిల్హెట్‌లో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 44 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 145 పరుగులు చేసింది. యస్తిక భాటియా (36 : 6 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (30 : 4 ఫోర్లు), షఫాలీ వర్మ (31 : 3 ఫోర్లు, 1 సిక్స్) ఆకట్టుకున్నారు. అనంతరం బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 101 పరుగులకే పరిమితమైంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రేణుక సింగ్ (3/18), పూజ వస్త్రకర్ (2/25) బంగ్లాదేశ్‌ను కట్టడి చేశారు. రెండో టి20 మంగళవారం జరుగుతుంది.




## ప్రపంచ అండర్-8 చెస్ చాంపియన్ దివిత్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బాలుడు అదుళ్ల దివిత్ రెడ్డి అద్భుతం చేశాడు. అల్బేనియాలో జరుగుతున్న ప్రపంచ క్యాడెట్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో అండర్–8 ఓపెన్ విభాగంలో విజేతగా నిలిచాడు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత దివిత్ రెడ్డి 10 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. దివిత్ 10 గేముల్లో గెలిచి, ఒక గేమ్‌లో ఓడిపోయాడు. ఇదే టోర్నీలో అండర్–12 బాలికల విభాగంలో భారత్‌కే చెందిన ఏఎస్ శ్రావణిక విజేతగా నిలిచింది.

## క్వార్టర్ ఫైనల్లో భారత్




చెంగ్డూ: ఉబెర్ కప్ మహిళల టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత జట్టు వరుసగా రెండో విజయంతో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా సింగపూర్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 4–1తో గెలిచింది. తొలి మ్యాచ్‌లో అష్మిత 15–21, 18–21తో యో జియా మిన్ చేతిలో ఓడిపోయింది. రెండో మ్యాచ్‌లో ప్రియ-శ్రుతి ద్వయం 21–15, 21–16తో జియా ఎన్ హెంగ్-జిన్ యు జియా జోడీపై గెలిచింది. మూడో మ్యాచ్‌లో ఇషారాణి 21–13, 21–16తో ఇన్సిరా ఖాన్‌ను ఓడించింది. నాలుగో మ్యాచ్‌లో సిమ్రన్-రితిక జంట 21–8, 21–11తో యి టింగ్ ఎల్వా-జాన్ మిచెల్లి జోడీపై గెలిచింది. చివరిదైన ఐదో మ్యాచ్‌లో అన్‌మోల్ 21–15, 21–13తో లీ జిన్ మేగన్‌ను ఓడించింది.



క్యాండిడేట్స్ చెస్ టోర్నీ విజేత గుకేశ్‌ను సన్మానించిన తమిళనాడు సీఎం స్టాలిన్, క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి. ఈ సందర్భంగా గుకేశ్‌కు తమిళనాడు ప్రభుత్వం రూ. 75 లక్షలు నజరానా అందజేసింది.

# జాక్స్ ధమాకా...

### రెండే ఓవర్లలో 44 పరుగుల నుంచి 100 నాటౌట్

- 16 ఓవర్లలోనే 201 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన బెంగళూరు
- మెరిపించిన విరాట్ కోహ్లి
- గుజరాత్ టైటాన్స్‌కు ఆరో ఓటమి

బెంగళూరు గెలిచేందుకు 6 ఓవర్లలో 53 పరుగులు చేయాలి. కోహ్లి 69 పరుగులతో... విల్ జాక్స్ 44 పరుగులతో క్రీజులో ఉన్నారు. ఇక్కడ సెంచరీ అయితే గియితే కోహ్లిదే అవుతుంది లేదంటే లేదు! కానీ ఎవరూ ఊహించని విధంగా జాక్స్ రెండే ఓవర్లలో సెంచరీ పూర్తి చేశాడు. మోహిత్ శర్మ వేసిన 15వ ఓవర్లో జాక్స్ 4, 6, నోబాల్ 6, 2, 6, 4, 0లతో 29 పరుగులు సాధించాడు. రషీద్ ఖాన్ వేసిన 16వ ఓవర్లో తొలి బంతికి కోహ్లి ఒక పరుగు తీసి జాక్స్‌కు స్ట్రయిక్ ఇచ్చాడు. జాక్స్ వరుసగా 6, 6, 4, 6, 6లతో 28 పరుగులు పిండుకొని సంచలన శతకం సాధించి అబ్బురపరిచాడు. జాక్స్ 29 బంతుల్లో 44 పరుగులు చేయగా... ఆ తర్వాత 12 బంతుల్లో ఏకంగా 56 పరుగులు సాధించి సెంచరీ మైలురాయిని అందుకోవడం విశేషం.

అహ్మదాబాద్: మళ్లీ బౌలర్ డీలా... బంతేమో విలవిల... బ్యాట్ భళా! అంతే మరో 200 పైచిలుకు స్కోరు... దీన్ని 16 ఓవర్లలోనే ఛేదించిన తీరు చూస్తుంటే ఈ వేసవి వడగాడ్పులతో వేడెక్కించడమే కాదు... ఐపీఎల్ సిక్సర్లతో కిక్ ఎక్కిస్తోంది! ప్లే ఆఫ్స్ రేసుకు దాదాపు దూరమనుకున్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఇంటాబయటా పరుగుల హోరెత్తిస్తోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 9 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై జయభేరి మోగించింది. 201 పరుగుల లక్ష్యాన్ని 16 ఓవర్లలోనే ఉఫ్‌మని ఊదేసింది. మొదట బ్యాటింగ్ చేపట్టిన టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 200 పరుగుల భారీస్కోరు చేసింది. సాయి సుదర్శన్ (49 బంతుల్లో 84 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు), షారుఖ్ ఖాన్ (30 బంతుల్లో 58; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగారు. అనంతరం ఆర్‌సీబీ 16 ఓవర్లలోనే ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 206 పరుగులు చేసి ఘనవిజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విల్ జాక్స్ (41 బంతుల్లో 100 నాటౌట్; 5 ఫోర్లు, 10 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (44 బంతుల్లో 70 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) సిక్సర్లతో హోరెత్తించారు.

**జాక్స్ 2 ఓవర్ల విధ్వంసంతో...**

కోహ్లితో ఛేదన ప్రారంభించిన డుప్లెసిస్ (12 బంతుల్లో 24; 1 ఫోర్, 3 సిక్స్‌లు) నాలుగో ఓవర్లో నిష్క్రమించాడు. సాయికిశోర్ వేసిన ఆ ఓవరే వికెట్ దక్కించుకుంది. ఆ తర్వాత ఎవరూ బౌలింగ్‌కు దిగినా... పరుగులు, ఈ దశ దాటి మెరుపులు... దాన్ని మించి ఉప్పెనే! పవర్‌ప్లేలో బెంగళూరు 63/1 స్కోరు చేసింది. సగం ఓవర్లు ముగిసేసరికి 98/1 అంటే వంద కూడా చేయని జట్టు ఇంకో 6 ఓవర్లు ముగిసేసరికే 108 పరుగుల్ని చేసి మ్యాచ్‌నే ముగించింది. కోహ్లి 32 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నప్పుడు జాక్స్ 16 బంతుల్లో 16 పరుగులే చేశాడు. 14 ఓవర్లలో బెంగళూరు స్కోరు 148/1. ఈ దశలో మోహిత్ వేసిన 15వ ఓవర్లో, రషీద్ ఖాన్ వేసిన 16వ ఓవర్లో జాక్స్ విశ్వరూపం ప్రదర్శించడంతో ఆర్‌సీబీ 16 ఓవర్లలోనే లక్ష్యాన్ని అధిగమించి విజయతీరానికి చేరింది.



కోహ్లి, జాక్స్

### ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | పా | నె.ర.రే |
|---|---|---|---|---|---|
| రాజస్తాన్ | 9 | 8 | 1 | 16 | 0.694 |
| కోల్‌కతా | 8 | 5 | 3 | 10 | 0.972 |
| చెన్నై | 9 | 5 | 4 | 10 | 0.810 |
| హైదరాబాద్ | 9 | 5 | 4 | 10 | 0.075 |
| లక్నో | 9 | 5 | 4 | 10 | 0.059 |
| ఢిల్లీ | 10 | 5 | 5 | 10 | -0.276 |
| గుజరాత్ | 10 | 4 | 6 | 8 | -1.113 |
| పంజాబ్ | 9 | 3 | 6 | 6 | -0.187 |
| ముంబై | 9 | 3 | 6 | 6 | -0.261 |
| బెంగళూరు | 10 | 3 | 7 | 6 | -0.415 |

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

### ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా X ఢిల్లీ
వేదిక: కోల్‌కతా

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

### స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) కరణ్ శర్మ (బి) స్వప్నిల్ 5; గిల్ (సి) గ్రీన్ (బి) మ్యాక్స్‌వెల్ 16; సుదర్శన్ (నాటౌట్) 84; షారుఖ్ (బి) సిరాజ్ 58; మిల్లర్ (నాటౌట్) 26; ఎక్స్‌ట్రాలు 11; మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 200. వికెట్ల పతనం: 1-6, 2-45, 3-131. బౌలింగ్: స్వప్నిల్ 3-0-23-1, సిరాజ్ 4-0-34-1, యశ్ దయాళ్ 4-0-34-0, మ్యాక్స్‌వెల్ 3-0-28-1, కరణ్ శర్మ 3-0-38-0, గ్రీన్ 3-0-42-0. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (నాటౌట్) 70; డుప్లెసిస్ (సి) సబ్-శంకర్ (బి) సాయికిశోర్ 24; విల్ జాక్స్ (నాటౌట్) 100; ఎక్స్‌ట్రాలు 12; మొత్తం (16 ఓవర్లలో వికెట్ నష్టానికి) 206. వికెట్ల పతనం: 1-40. బౌలింగ్: అజ్మతుల్లా 2-0-18-0, సందీప్ 1-0-15-0, సాయికిశోర్ 3-0-30-1, రషీద్ ఖాన్ 4-0-51-0, నూర్ అహ్మద్ 4-0-43-0, మోహిత్ 2-0-41-0.

# ధీరజ్ బృందం సంచలనం

- ఒలింపిక్ చాంపియన్ దక్షిణ కొరియాపై విజయం
- 14 ఏళ్ల తర్వాత ఆర్చరీ ప్రపంచకప్ టోర్నీలో స్వర్ణం



స్వర్ణాలతో తరుణ్‌దీప్, ధీరజ్, ప్రవీణ్ (ఎడమ నుంచి)

షాంఘై (చైనా): సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్–1 టోర్నీలో భారత పురుషుల రికర్వ్ జట్టు స్వర్ణ పతకంతో మెరిసింది. టోక్యో ఒలింపిక్స్ చాంపియన్ దక్షిణ కొరియాతో ఆదివారం జరిగిన రికర్వ్ టీమ్ విభాగం ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాధవ్‌లతో కూడిన భారత జట్టు 5-1 (57–57, 57–55, 55–53)తో సంచలన విజయం సాధించింది. తద్వారా 14 ఏళ్ల తర్వాత ప్రపంచకప్ టోర్నీలో టీమ్ విభాగంలో పసిడి పతకం సొంతం చేసుకుంది. చివరిసారి భారత్ 2010 ఆగస్టులో షాంఘైలోనే జరిగిన ప్రపంచకప్ స్టేజ్–4 టోర్నీలో స్వర్ణం సాధించింది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో ధీరజ్ -అంకిత ద్వయం కాంస్య పతకం గెలిచింది. కాంస్య పతక మ్యాచ్‌లో ధీరజ్-అంకిత జోడీ 6-0 (35–31, 38–35, 39–37)తో వలెన్సియా-మతియాస్ (మెక్సికో) జంటపై నెగ్గింది. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో భారత స్టార్ దీపిక కుమారి 0–6 (26–27, 27–29, 27–28)తో ఆసియా క్రీడల చాంపియన్ లిమ్ సిహైన్ (కొరియా) చేతిలో ఓడిపోయి రజత పతకం దక్కించుకుంది.

# సన్‌రైజర్స్ తడబాటు...

### చెన్నై చేతిలో 78 పరుగులతో ఓటమి • చెలరేగిన రుతురాజ్, మిచెల్, తుషార్




చెన్నై: మొన్న బెంగళూరు బౌలర్లు... ఇప్పుడేమో చెన్నై బౌలర్లు... సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు బ్యాటర్ల ఆటల్ని సాగనివ్వలేదు. దీంతో 250 ప్లస్ స్కోర్లను అవలీలగా చేసిన హైదరాబాద్ తాజాగా 213 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక ఓడిపోయింది. సొంతగడ్డపై చెన్నై 78 పరుగుల తేడాతో హైదరాబాద్‌పై ఘనవిజయం సాధించింది. ముందుగా చెన్నై 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 212 పరుగుల భారీస్కోరు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (54 బంతుల్లో 98; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ అవకాశాన్ని చేజార్చుకున్నాడు. మిచెల్ (32 బంతుల్లో 52; 7 ఫోర్లు, 1 సిక్స్), శివమ్ దూబే (20 బంతుల్లో 39 నాటౌట్; 1 ఫోర్లు, 4 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ 18.5 ఓవర్లలో 134 పరుగులకే కుప్పకూలి ఓడిపోయింది. తుషార్ దేశ్ పాండే (4/27) సన్‌రైజర్స్ ను దెబ్బ కొట్టాడు.

**స్కోరు వివరాలు**

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రహానే (సి) షహబాజ్ (బి) భువనేశ్వర్ 9; రుతురాజ్ (సి) నితీశ్ (బి) నటరాజన్ 98; మిచెల్ (సి) నితీశ్ (బి) ఉనాద్కట్ 52; దూబే (నాటౌట్) 39; ధోని (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 212. వికెట్ల పతనం: 1-19, 2-126, 3-200. బౌలింగ్: భువనేశ్వర్ 4-0-38-1, నితీశ్ 1-0-8-0, షహబాజ్ 3-0-33-0, నటరాజన్ 4-0-43-1, ఉనాద్కట్ 4-0-38-1, కమిన్స్ 4-0-49-1. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (సి) మిచెల్ (బి) తుషార్ 13; అభిషేక్ (సి) మిచెల్ (బి) తుషార్ 15; అన్‌మోల్‌ప్రీత్ (సి) మొయిన్ అలీ (బి) తుషార్ 0; మార్క్‌రమ్ (బి) పతిరణ 32; నితీశ్ (సి) ధోని (బి) జడేజా 15; క్లాసెన్ (సి) మిచెల్ (బి) పతిరణ 20; సమద్ (సి) సబ్-రిజ్వీ (బి) శార్దుల్ 19; షహబాజ్ (సి) మిచెల్ (బి) ముస్తఫిజుర్ 7; కమిన్స్ (సి) మిచెల్ (బి) తుషార్ 5; భువనేశ్వర్ (నాటౌట్) 4; ఉనాద్కట్ (సి) మొయిన్ (బి) ముస్తఫిజుర్ 1; ఎక్స్‌ట్రాలు 3; మొత్తం (18.5 ఓవర్లలో ఆలౌట్) 134. వికెట్ల పతనం: 1-21, 2-21, 3-40, 4-72, 5-85, 6-117, 7-119, 8-124, 9-132, 10-134 బౌలింగ్: దీపక్ చహర్ 3-0-22-0, తుషార్ 3-0-27-4, ముస్తఫిజుర్ 2.5-0-19-2, జడేజా 4-0-22-1, శార్దుల్ 4-0-27-1, పతిరణ 2-0-17-2.

## మరింత అగ్నిగుండం!

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో అసాధారణ ఉష్ణోగ్రతలు జనాన్ని అల్లాడిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో వడగాడ్పులు విజృంభిస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం వీటినే భరించలేకపోతున్న తరుణంలో ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాడ్పులు మరింతగా ప్రతాపం చూపనున్నాయన్న సమాచారం ఆందోళన కలిగిస్తోంది. రానున్న ఐదురోజులు ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాడ్పులు మరింత పెరగ నున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల వరకు నమోదవుతు న్నాయి. మంగళవారం నుంచి ఇవి క్రమంగా పెరుగుతూ రాష్ట్రంలో 45–48 డిగ్రీలకు చేరుకునే అవకాశాలున్నాయి.

ప్రధాన నగరాలు, పట్టణాల్లో ఆదివారం నమోదైన ఉష్ణోగ్రతలు



| నగరం/పట్టణం | గరిష్టం | కనిష్టం |
|---|---|---|
| రెంటచింతల | 46.3 | 29.1 |
| కడప | 43.6 | 26.8 |
| కర్నూలు | 43.2 | 30.3 |
| విజయవాడ | 43.0 | 28.0 |
| మార్కాపురం | 43.0 | 28.0 |
| తిరుపతి | 43.0 | 25.0 |
| గుంటూరు | 42.0 | 29.0 |
| ఏలూరు | 42.0 | 28.0 |
| రాజమహేంద్రవరం | 42.0 | 26.0 |
| నెల్లూరు | 40.5 | 27.0 |
| విశాఖపట్నం | 38.2 | 28.0 |

# ఈ దుబాయ్ శ్రీను.. అక్కడ చేసిన పనేమిటి?

- జనసేన కాకినాడ ఎంపీ అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ వ్యవహారాలపై సందిగ్ధత
- టీటైమ్ అధినేత అయిన శ్రీనివాస్ ఇంజినీర్ అని ఆయన, పవన్ గొప్పలు
- దుబాయ్, లండన్‌లో పెద్ద ఉద్యోగాలు చేసినట్లు చెప్పుకొన్న నేతలు
- అఫిడవిట్‌లో ఇంటర్మీడియట్ అని చూపడంతో అవాక్కైన జనసేన శ్రేణులు
- సోషల్ మీడియాలోనూ ఆయనపై సంచలన పోస్టులు
- శ్రీనివాస్‌పై దుబాయ్‌లో బెట్టింగ్ కేసు ఉన్నట్లు పోస్టులు
- దుబాయ్ పోలీసులకు టోకరా వేసి పారిపోయి వచ్చినట్లు ఆరోపణ
- లుకౌట్ నోటీసులు కూడా జారీ అయినట్లు ప్రచారం
- ఆయనకు రెండు పాన్ కార్డులున్నాయంటున్న జనసేన నేతలు
- అఫిడవిట్‌లో ఒకటే పాన్ కార్డును చూపిన శ్రీనివాస్
- అసలు పోటీకి అర్హుడేనా అని ప్రశ్నిస్తున్న జనసేన నేతలు

పిఠాపురం: ఇంజినీరింగ్ చదివాడని, దుబాయ్‌లో అద్భుతమైన ఉద్యోగాలు చేసి, భారత దేశానికి తిరిగి వచ్చి ప్రజలకు సేవ చేస్తున్నాడంటూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆకాశానికి ఎత్తుతున్న ఆ పార్టీ కాకినాడ ఎంపీ అభ్యర్థి, టీ టైమ్ అధినేత తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్.. ఎన్నికల అఫిడవిట్‌లో మాత్రం ఇంటర్మీడియట్ వరకే చదివినట్లుగా చూపించారు. అంటే ఇంజినీరింగ్ చదివినట్లుగా ఆయనకు ఆయన చెప్పుకున్న గొప్పలు, ఆయనపై పవన్ కురిపించిన పొగడ్తలు అబద్ధాలేనా అని జనసేన పార్టీ నేతలే అనుమానపడుతున్నారు. ఇంతే కాదు.. సోషల్ మీడియాలో శ్రీనివాస్ వ్యవహారాలు అంటూ హల్‌చల్ చేస్తున్న పోస్టులు సంచలనం సృష్టిస్తున్నాయి. 2015లో ఆయనపై దుబాయ్‌లో కేసులున్నాయని, ఆ కేసుల నుంచి తప్పించుకొనేందుకే ఆయన అక్కడి పోలీసులకు టోకరా వేసి ఇండియాకు పారిపోయి వచ్చారని సోషల్ మీడియాలో పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. ఆయనపై లుకౌట్ నోటీసులు కూడా ఉన్నట్లు సమాచారం.


2015లో ఇండియా వచ్చేసిన శ్రీనివాస్ 2016లో రూ.5 లక్షలతో టీ టైమ్ సంస్థను ప్రారంభించి, దేశవ్యాప్తంగా 3 వేల వరకు అవుట్‌లెట్లతో రూ.కోట్లకు పడగలెత్తారు. ఆయన సొంత ఊరు తూర్పు గోదావరి జిల్లా కడియం. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌నని అందరికీ చెప్పుకొంటారు. పదో తరగతి కడియంలో, ఇంటర్ పుదుచ్చేరిలో చదివి, హైదరాబాద్‌లో ఎల్రక్టానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేసినట్లు చెప్పుకొంటారు. దుబాయ్, లండన్ వెళ్లి పెద్ద ఉద్యోగాలు చేసి రూ.కోట్లు గడించినట్లు చెప్పుకొంటారు. ఇందులో నిజమెంతో తెలియదని జనసేన నేతలు అంటుంటారు. కోట్లాది రూపాయలు సంపాదించినట్లుగా ఆయన విలాసవంతమైన జీవితం, లగ్జరీ కార్లు చెప్పకనే చెప్తుంటాయి. ఉదయ్ శ్రీనివాస్ ఇంజినీరింగ్ చదివాడని, చాలా ప్రతిభావంతుడని పవన్ కూడా అందరికీ చెప్తుంటారు. అయితే, ఉదయ్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో మాత్రం ఇంటర్ వరకే చదివినట్లు పేర్కొన్నారు. బీటెక్ చదువు మధ్యలోనే మానేసినట్లు వెల్లడించారు. దీంతో ఆయన ఇంజినీరింగ్ చదువులు వట్టిదేనని, విదేశాల్లో పెద్ద ఉద్యోగాలూ అనుమానమేనని జనసేన నేతలు అంటున్నారు. ఇంటర్‌తోనే చదువు ఆపేసి ఉంటే హైదరాబాద్ టీఆర్ఆర్ కాలేజీలో ఎల్రక్టానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో ఇంజినీరింగ్ చేశానని ఆయనే పలు ఇంటర్వ్యూల్లో ఎలా చెప్పారనేది ప్రశ్నార్థకంగా మారింది.

**దుబాయ్‌లో చేసిన ఉద్యోగమేమిటి?**

ఉదయ్ శ్రీనివాస్ ఇంటర్ అర్హతతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విదేశాల్లో ఎలా ఉద్యోగం చేశారనేది కూడా ప్రశ్నార్థకమే. దుబాయ్‌లో పలు కంపెనీల్లో పని చేసినట్లు చెప్పుకొంటున్నప్పటికీ, 2015లో హఠాత్తుగా ఇండియాకు వచ్చేశారు. ఉదయ్ శ్రీనివాస్‌పై దుబాయ్‌లో కేసులున్నాయని, అందుకే ఆయన 2015 సడెన్‌గా స్వదేశానికి వచ్చేశారని సోషల్ మీడియాలో కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. ఆయన అక్కడ క్రికెట్ బుకీగా పని చేసి, భారీగా ఆస్తులు కూడబెట్టారని, అక్కడ కొన్ని తేడాలు రావడంతో కేసుల్లో ఇరుక్కున్నారని ఆ కథనాలు చెబుతున్నాయి. ఆయనపై దుబాయ్ పోలీసులు 2015 మార్చి 11న కేసు నమోదు చేశారని, అరెస్టు వారెంటు సైతం జారీ అయ్యిందని ప్రచారం జరుగుతోంది. ఆయనపై లుకౌట్ నోటీసులు సైతం ఇచ్చినట్లు తెలుస్తోంది. అందువల్లే ఆయన దుబాయ్ పోలీసులకు టోకరా వేసి, అక్కడి నుంచి పారిపోయి, ఇండియాకు వచ్చేశారనే ప్రచారం జరుగుతోంది. ఆయనపై కేసులు, లుకౌట్ నోటీసు ఉంటే వాటినెందుకు అఫిడవిట్‌లో ప్రస్తావించలేదన్న ప్రశ్న కూడా ఇక్కడ ఉదయిస్తోంది.



పవన్‌తో ఉదయ్ శ్రీనివాస్



ఉదయ్‌పై దుబాయ్‌లో జారీ అయిన లుకౌట్ నోటీసులు

### రెండు పాన్ కార్డుల కథేమిటి?

ఉదయ్ శ్రీనివాస్‌కు రెండు పాన్ కార్డులు ఉన్నట్లు తెలియడంతో అందరూ అవాక్కవుతున్నారు. రెండు కార్డుల్లో ఒక్క దానిని మాత్రమే ఆయన అఫిడవిట్‌లో చూపారు. అయినా రెండు పాన్ కార్డులు ఉండటం నేరం అని ఆయనకి తెలియదా, ఆయన ఎందుకు రెండింటిని తీసుకున్నారని జనసేన నేతలు ప్రశ్నిస్తున్నారు.

### ష్.. గప్‌చుప్ అంటున్న పవన్

ఉదయ్ శ్రీనివాస్ పెద్ద చదువులు చదివాడని పార్టీ అధినేత మీటింగుల్లో ఊదరగొట్టినప్పటికీ, అఫిడవిట్‌లో ఇంటర్మీడియటేఅని తేలడంతో జనసేన నేతలు కంగుతిన్నారు. పైగా, ఆయనపై సోషల్ మీడియాలో వస్తున్న దుబాయ్ కేసుల కథలు వారిని మరింత కలవరపాటుకు గురిచేస్తున్నాయి. తమ పార్టీ అభ్యర్థి దుబాయ్‌లో చేసిన పని ఇదా అంటూ వారు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. ఇవన్నీ నిజమైతే ఆయన అసలు పోటీకే అర్హుడు కాదని అంటున్నారు. ఇదే విషయాన్ని కొందరు నేతలు పవన్ వద్ద ప్రస్తావించగా.. ఇవేమీ బయటకు మాట్లాడవద్దని, అందరూ కామ్‌గా ఉండాలని సూచించినట్లు చెబుతున్నారు. ఉదయ్ శ్రీనివాస్ పార్టీకి భారీగా ఆర్థిక సహాయం చేయడంతో పవన్ పూర్తిగా నమ్మారని, పెద్ద నేతలు వద్దంటున్నా వినకుండా కాకినాడ ఎంపీ టికెట్ ఇచ్చారని చెబుతున్నారు. ఇప్పుడిక ఏమీ చేయలేని పరిస్థితి కావడంతో బయటకు ఎవరూ మాట్లాడవద్దంటున్నారని పార్టీ నేతలు అంటున్నారు.

## డిగ్రీ, పీజీ కోర్సులను ఆఫర్‌చేస్తున్న హెచ్‌బీఎస్

సాక్షి, హైదరాబాద్: బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో వివిధ డిగ్రీ, పీజీ కోర్సులను విద్యార్థులకు అందజేస్తున్నట్లు హిందూస్థాన్ బిజినెస్ స్కూల్ (హెచ్‌బీఎస్) పేర్కొంది. ఏఐసీటీఈ, బెంగళూరు నార్త్ యూనివర్సిటీ అనుబంధ గుర్తింపుతో తమ విద్యాసంస్థలో బీబీఏ ఏవీయేషన్, బీఎస్సీ ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, బీకాం, బీసీఏ, ఎంబీఏ కోర్సులను అందజేస్తున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. అదేవిధంగా ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ భాగస్వామ్యంతో హిందూస్థాన్ ఏవియేషన్ అకాడమీ ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ కోర్సులనుకూడా అందిస్తున్నట్లు తెలిపింది. పాలిటెక్నిక్ కోర్సును కూడా అందజేస్తున్నట్లు హెచ్‌బీఎస్ తెలిపింది. తమ విద్యాసంస్థల్లో చదువుకుని శిక్షణ పూర్తి చేసుకున్న ఎంతోమంది విద్యార్థులు పలు అంతర్జాతీయ సంస్థల్లో ఉన్నతస్థానాల్లో ఉన్నారని వెల్లడించింది.

## సచివాలయంలో పోస్టల్ బ్యాలెట్ సెంట్రల్ ఎక్స్ఛేంజ్

### ఫారం–12 ద్వారా 80,111 మంది, ఫారం–12డి ద్వారా 10,123 మంది దరఖాస్తు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలో ఆదివారం పోస్టల్ బ్యాలెట్ల ఎక్స్ఛేంజ్ కార్యక్రమం నిర్వహించారు. తొలివిడతగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్నికల విధుల్లో ఉన్న 80,111 మంది ఫారం–12 ద్వారా, అత్యవసర సేవల్లో పనిచేసే ఉద్యోగులు 10,123 మంది ఫారం–12డి ద్వారా ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న రెగ్యులర్ ఉద్యోగులకు, అత్యవసర సేవల ఉద్యోగులకు వారు పనిచేసే జిల్లాలోనే పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారు. అదనపు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎం.ఎస్.హరింద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 26 జిల్లాలకు చెందిన పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు వారి జిల్లాలో సేకరించిన ఫారం–12, ఫారం–12డీలతో హాజరయ్యారు. వీటిని ఆయా జిల్లాల పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు మార్చుకున్నారు. ఈ దరఖాస్తులకు అనుగుణంగా ఆయా జిల్లాల పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు ఖాళీ పోస్టల్ బ్యాలెట్‌లతో మే 3వ తేదీన ఈ సెంట్రల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి హాజరై ఏ జిల్లాకు చెందిన పోస్టల్ బ్యాలెట్‌లను ఆ జిల్లా పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులకు అందజేస్తారు. ఈ విధంగా అందిన ఖాళీ పోస్టల్ బ్యాలెట్‌లను సంబంధిత ఉద్యోగులకు ఇచ్చి, వారు ఓటువేసిన తరువాత మే 10వ తేదీన సెంట్రల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం ద్వారా ఆయా జిల్లాలకు పంపుతారు. ఫారం–12కు సంబంధించి అత్యధికంగా విశాఖపట్నం జిల్లా నుంచి 5,625 దరఖాస్తులు రాగా, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 969 వచ్చాయి. ఫారం–12డీకి సంబంధించి ఎక్కువగా పల్నాడు జిల్లా నుంచి 999 దరఖాస్తులు రాగా, తక్కువగా శ్రీకాకుళం జిల్లా నుంచి 25 వచ్చాయి.

## తునిలో దాడిశెట్టి రాజా గెలుపే లక్ష్యం

- ఫలితాలు వెల్లడయ్యే వరకు నల్లదుస్తులే ధరిస్తా
- వైఎస్సార్‌సీపీ కోసం 24 గంటలూ పని చేస్తా
- యనమల కృష్ణుడి శపథం



మాట్లాడుతున్న యనమల కృష్ణుడు

తుని: ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో తుని నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దాడిశెట్టి రాజా గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని ఆ పార్టీ నాయకుడు యనమల కృష్ణుడు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యే వరకు నల్లదుస్తులే ధరిస్తానని ఆయన శపథం చేశారు. కాకినాడ జిల్లా ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం మంత్రి దాడిశెట్టి రాజాతో కలిసి కృష్ణుడు విలేకరులతో మాట్లాడారు. టీడీపీలో 40ఏళ్లు పనిచేసి, యనమల రామకృష్ణుడి విజయం కోసం పాటుపడ్డానని కృష్ణుడు చెప్పారు. టీడీపీని ముందుండి నడిపించినా తనకు రామకృష్ణుడు తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. చివరికి తనను కాదని రామకృష్ణుడు తన కుమార్తె దివ్యకు తుని టికెట్ ఇప్పించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో పార్టీలో చేర్చుకున్నందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఇక నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దాడిశెట్టి రాజా విజయం కోసం 24 గంటలూ పని చేస్తానని అన్నారు. తాను మాట ఇస్తే కట్టుబడి ఉంటానని, కష్టనష్టాలకు ఓర్చి రాజా విజయం కోసం పని చేస్తానని చెప్పారు. యువకుడైన దాడిశెట్టి రాజా నియోజకవర్గ అభివృద్ధి కోసం బాగా కృషిచేశారని, తన వర్గమంతా రాజా విజయం కోసం పని చేస్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో లోవ దేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ, ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళి, పోతల రమణ పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలి: పవన్‌కళ్యాణ్



ఏలేశ్వరం/గోకవరం/కిర్లంపూడి: రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధీ చేయని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం, కిర్లంపూడి, జగ్గంపేటలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. యువతను పట్టించుకోకుండా వంతాడ మైనింగ్ ద్వారా కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. 70 శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్టును జగన్ ఆపేసి, మెట్ట ప్రాంతానికి తీరని అన్యాయం చేశారన్నారు. ఇక తాను మాట్లాడుతుండగా వినే పరిస్థితిలో ఎవ్వరూలేరని పవన్ అసహనం వ్యక్తంచేశారు. మద్యం నిషేధిస్తామని చెప్పిన వ్యక్తి.. సారా అమ్మి రూ.40 వేల కోట్లు దోచారని ఆరోపించారు. జగన్ రక్తవ్యాపారి, సారా వ్యాపారి అని, మీ రక్తాన్ని అమ్ముకుంటూ సేవ అని చెబుతున్నారని పవన్ విమర్శించారు. మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి, జగన్, వైవీ సుబ్బారెడ్డి కలిసి ఈ దోపిడీ చేస్తున్నారన్నారు.

**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ ▽ | 609 | 73,730 |
| నిఫ్టీ ▽ | 150 | 22,420 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

| విదేశీ సూచీలు | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 15,928 | △ | 316 |
| డోజోన్స్ | 38,240 | △ | 154 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 8,140 | △ | 61 |
| డాక్స్ | 18,167 | △ | 250 |
| షాంఘై | 3,089 | △ | 36 |
| నికాయ్ | 37,944 | △ | 315 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ధామస్‌కుక్ | 84.14 | 85.17 |
| £ | బ్రిటన్ పౌండ్ | ధామస్‌కుక్ | 101.81 | 106.76 |
| € | యూరో | ధామస్‌కుక్ | 87.13 | 91.68 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ధామస్‌కుక్ | 41.00 | 66.00 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ధామస్‌కుక్ | 52.05 | 56.89 |
| S$ | సింగపూర్ డాలర్ | ధామస్‌కుక్ | 58.96 | 63.67 |
| SAR | సౌదీ రియాల్ | ధామస్‌కుక్ | 21.32 | 22.88 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | ధామస్‌కుక్ | 21.80 | 23.58 |
| ¥ | చైనా యువాన్ | ధామస్‌కుక్ | 10.38 | 12.45 |

# కేవైసీతోనే.. ఫండ్స్‌లో పెట్టుబడులు

- గతంలో ఎప్పుడో చేసి ఉన్నారా?
- కేవైసీ స్థితిని ఒకసారి చెక్ చేసుకోవాల్సిందే
- వ్యాలిడేటెడ్ అని ఉండాలి
- లేదంటే తిరిగి సమర్పించాల్సిన అవసరం
- ఆధార్ సాయంతో సుస్పష్ట కేవైసీ

KNOW YOUR CUSTOMER

మీరు మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారా..? గతంలో ఎప్పుడో కేవైసీ (నో యువర్ కస్టమర్) చేసి ఉన్నారా..? అయితే ఒక్కసారి మీరు మీ కేవైసీ స్థితిని తెలుసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టేవారు మరో విడత కేవైసీ అప్‌డేట్ చేసుకోవాల్సిన తరుణం వచ్చింది. ఇందుకు విధించిన ఏప్రిల్ 1 గడువు ఇప్పటికే ముగిసింది. దీంతో ఇప్పటి వరకు ఇన్వెస్ట్ చేస్తున్న పథకాలు కాకుండా.. కొత్త వాటిల్లో ఇన్వెస్ట్ చేయాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి ఉన్న ఏకైక పరిష్కారం కేవైసీని అప్‌డేట్ చేసుకోవడమే. దీన్ని ఎలా చేయాలో తెలుసుకుందాం.





మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులకు సంబంధించి తిరిగి కేవైసీ చేసే విషయంలో గందరగోళం నెలకొంది. కొంత మంది ఇన్వెస్టర్లు మినహా చాలా మందిలో దీనిపై స్పష్టత లేదు. కేవైసీ చేసేందుకు ప్రయత్నించకపోవడం, ఏ డాక్యుమెంట్లు కావాలో అవగాహన లేకపోవడమే ఈ అయోమయానికి కారణమని ఎడెల్‌వీజ్ మ్యూచువల్ ఫండ్, ఇన్వెస్టర్ సర్వీసెస్ హెడ్ అబ్దుల్లా చౌదరి అంటున్నారు. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల వెబ్‌సైట్ నుంచే ఆన్‌లైన్‌లో సులభంగా కేవైసీని మరోసారి చేసుకోవచ్చని తెలిపారు.

ప్రతి ఒక్క ఇన్వెస్టర్ తిరిగి కేవైసీ చేసుకోవాల్సిన అవసరం ఉందా..? అంటే లేదన్నదే సమాధానం. అసలు ఎవరు కేవైసీ ప్రక్రియను తిరిగి నిర్వహించుకోవాలో తెలుసుకోవాలంటే.. ఆన్‌లైన్‌లో తమ కేవైసీ స్థితిని ఒకసారి పరిశీలించుకుంటే కానీ తెలియదు. సాధారణంగా ఎక్కువ మంది ఇన్వెస్టర్లు సీవీఎల్‌ను కేవైసీ కోసం ఉపయోగిస్తుంటారు. కనుక సీవీఎల్‌కేఆర్‌ఏ డాట్ కామ్ సైట్‌కు వెళ్లాలి. లేదంటే ఎన్‌డీఎంఎల్ కేఆర్‌ఏ, క్యామ్స్ (సీఏఎంఎస్) కేఆర్‌ఏ లేదా కార్వీ కేఆర్‌ఏ ద్వారా తమ కేవైసీ స్థితిని తెలుసుకోవచ్చు. సీవీఎల్‌కేఆర్‌ఏ పోర్టల్‌కు వెళ్లి పైన కనిపించే మెనూ ఆప్షన్లలో కేవైసీ ఇంక్వైరీ సెలక్ట్ చేసుకోవాలి. తర్వాత వచ్చే విండోలో పాన్ నంబర్ నమోదు చేయాలి. ఐ యామ్ హ్యూమన్ పక్కన ఉన్న బాక్స్‌లో టిక్ చేసి సబ్‌మిట్ చేయాలి. అప్పుడు మీ కేవైసీ స్థితి అక్కడ కనిపిస్తుంది.

## చెక్ చేసుకోవాల్సిందే..

**కేవైసీ వ్యాలిడేటెడ్..** అని ఉంటే తిరిగి కేవైసీ చేయాల్సిన అవసరం లేదు. దీనర్థం మీరు అప్పటికే సమర్పించిన కేవైసీ ఆధార్ ఆధారితమైనది. మొబైల్, ఈమెయిల్ కూడా వ్యాలిడేట్ అయి ఉన్నట్టు. కనుక అన్ని మ్యూచువల్ ఫండ్స్ సంస్థల పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఉన్న పెట్టుబడులను వెనక్కి తీసుకోవచ్చు. మళ్లీ కేవైసీ అవసరం లేదు.

NOTE

ఇక్కడ కేవైసీ వ్యాలిడేటెడ్ అనే స్థితి ఉన్న వారు మినహా మిగిలిన ప్రతి ఒక్కరూ ఆధార్ ఆధారితంగా తాజా కేవైసీ సమర్పించడం మంచిది.

**కేవైసీ రిజిస్టర్డ్..** అని ఉంటే మీరు గతంలో అధికారికంగా చెల్లుబాటు అయ్యే డాక్యుమెంట్ (ఓవీడీ) ఆధారంగా కేవైసీ చేసినట్టు. అంటే ఆ సమయంలో ఆధార్ ధ్రువీకరణ చేయలేదు. మొబైల్, ఈ మెయిల్ ధ్రువీరణ చేసినట్టు. అప్పటికే పెట్టుబడులు కలిగిన మ్యూచువల్ ఫండ్స్ సంస్థల పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. వాటిని వెనక్కి తీసుకోవచ్చు. కానీ, ఇప్పటి వరకు పెట్టుబడులు లేని కొత్త సంస్థల పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవడానికి అనుమతి ఉండదు.

**ఆన్ హోల్డ్..** మొదట సమర్పించిన కేవైసీ ఓవీడీ ఆధారితం కాదని దీనర్థం. లేదంటే ఈ మెయిల్, మొబైల్ నంబర్ మనుగడలో లేవని అర్థం. ఈ స్థితి చూపిస్తుంటే, అన్ని రకాల మ్యూచువల్ ఫండ్స్ లావాదేవీల నిర్వహణకు అనుమతి లేదని తెలుసుకోవాలి. వీరు తాజాగా కేవైసీ సమర్పించాలి.

**రిజెక్టెడ్** ఆన్ హోల్డ్ 10–15 రోజుల పాటు ఉన్న తర్వాత రిజెక్టెడ్‌గా మారుతుంది. వీరు కూడా అన్ని రకాల మ్యూచువల్ ఫండ్స్ లావాదేవీలు నిర్వహించలేరు. అంటే తాజాగా ఇన్వెస్ట్ చేయలేరు. అప్పటికే ఉన్న పెట్టుబడులు వెనక్కి తీసుకోలేరు. తాజాగా కేవైసీ సమర్పించి, వ్యాలిడేట్ చేసుకోవాల్సి ఉంటుంది.

### ఎన్‌డీఎంఎల్ కేఆర్‌ఏ అయితే..

పాన్ నంబర్ నమోదు చేసి, క్యాపెచా కోడ్ తర్వాత సబ్‌మిట్ చేయాలి. ఆ తర్వాత కనిపించే ఆప్షన్లలో మీరు చేయాల్సినది ఎంపిక చేసుకుని ముందుకు వెళ్లాలి. ఎన్‌డీఎంఎల్ కేఆర్‌ఏ వద్ద కేవైసీ నమోదు చేయని వారు ఇక్కడ కేవైసీ చేయడానికి వీలు పడదు. అదే సీవీఎల్-కేఆర్‌ఏలో అయితే మీ వివరాలు సమర్పించిన అనంతరం.. కేవైసీ ఎక్కడ నమోదై ఉన్నది కూడా చూపిస్తుంది. అంటే సీవీఎల్ కేఆర్‌ఏ/ఎన్‌డీఎంఎల్ కేఆర్‌ఏ/ డాటెక్స్ కేఆర్‌ఏ/క్యామ్స్ కేఆర్‌ఏ/ కార్వీ కేఆర్‌ఏ వీటిల్లో ఎక్కడ నమోదైతే కేవైసీ స్టేటస్ కాలమ్‌లో అక్కడ వివరాలు కనిపిస్తాయి. మీ కేవైసీ ఎక్కడ నమోదై ఉందన్న విషయం ఇక్కడ తెలుస్తుంది. లేదంటే మీ పెట్టుబడులు కలిగిన ఫండ్ హౌస్ (ఏఎంసీ) పోర్టల్‌కు వెళ్లి కూడా తెలుసుకోవచ్చు. మ్యూచువల్ ఫండ్స్ సంస్థ లేదా సెబీ నమోదిత ఆర్‌టీఏ (రిజిస్ట్రార్, ట్రాన్స్‌ఫర్ ఏజెంట్) హెల్ప్‌లైన్‌కు కాల్ చేయవచ్చు.

కేవైసీ స్థితి తెలుసుకున్న తర్వాత ఏ మ్యూచువల్ ఫండ్ సంస్థ వెబ్‌సైట్‌కు అయినా వెళ్లి కేవైసీని అప్‌డేట్ చేసుకోవచ్చు. ఏదైనా మ్యూచువల్ ఫండ్ సంస్థ కార్యాలయానికి నేరుగా వెళ్లి ఫిజికల్ కేవైసీని సమర్పించొచ్చు. ఇలా ఒకసారి కేవైసీ అప్‌డేట్ అయితే అన్ని మ్యూచువల్ ఫండ్ సంస్థల పెట్టుబడుల్లోనూ అదే ప్రతిఫలిస్తుంది. ఉదాహరణకు ఎడెల్‌వీజ్ మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్ అయితే, సంస్థ పోర్టల్‌కు వెళ్లి తమ ఖాతాలోకి లాగిన్ అవ్వాలి. ప్రొఫైల్ సెక్షన్‌లో కేవైసీ స్టేటస్ తెలుసుకోవచ్చు.

## కేవైసీ అప్‌డేట్

'రిజిస్టర్డ్' లేదా 'ఆన్‌హోల్డ్' చూపిస్తుంటే ఎం-ఆధార్ లేదా డిజిలాకర్ ఖాతా నుంచి ఈ-ఆధార్ సమర్పించొచ్చు. దీంతో యూఐడీఏఐ ద్వారా వచ్చే ఓటీపీని సమర్పించిన అనంతరం కేవైసీ వ్యాలిడేట్ అవుతుంది. కేవైసీ రిజిస్టర్డ్ అనే స్థితితో ఉన్న వారు మరో సంస్థ పథకంలో ఇన్వెస్ట్ చేయాల్సి వస్తే, తాజాగా కేవైసీ సమర్పించేంత వరకు సాధ్యపడదు. అప్పటి వరకు పెట్టుబడులు లేని మరో సంస్థ పథకంలో ఇన్వెస్ట్ చేస్తున్నట్టు అయితే.. అప్పుడు ఆయా సంస్థ కేవైసీని పరిశీలిస్తుంది. వ్యాలిడేటెడ్ అని ఉంటేనే వారు ఆమోదిస్తారు. రిజిస్టర్డ్ అని ఉంటే మాత్రం కేవైసీ సమర్పించాలి. నేరుగా వెళ్లి ఫిజికల్ కేవైసీ సమర్పించే వారు ఆధార్ కాపీపై క్యూఆర్ కోడ్ స్పష్టంగా ఉండేలా చూసుకోండి. లేకపోతే దాన్ని సిస్టమ్ రీడ్ చేయలేదు. అలాంటప్పుడు అది వ్యాలిడేట్ కాదు. ఎప్పుడో ఆధార్ తీసుకున్న వారి డాక్యుమెంట్‌పై క్యూఆర్ కోడ్ మసకగా మారుతుండడాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

## మరి ఎన్‌ఆర్‌ఐల పరిస్థితి?

భారతీయులతో పోలిస్తే ప్రవాస భారతీయులకు (ఎన్‌ఆర్‌ఐ) కేవైసీ అంత సులభం కాదు. ఇతర దేశాల్లో నివసిస్తూ, భారత మొబైల్ నంబర్ కలిగి లేని వారు.. ఆధార్ ఆధారిత ఓటీపీ స్వీకరణ, నమోదు చేయలేరు. దీంతో ఎన్‌ఆర్‌ఐల కేవైసీ స్థితి 'రిజిస్టర్డ్'గానే కొనసాగొచ్చు. దీంతో అప్పటికే పెట్టుబడులు కలిగిన మ్యూచువల్ ఫండ్స్ సంస్థల పథకాల్లో ఇకమీదటా పెట్టుబడులను ఎన్‌ఆర్‌ఐలు కొనసాగించుకోవచ్చు. ఎన్‌ఆర్‌ఐలు భారత్‌లో జారీ అయిన మొబైల్ నంబర్ కలిగి ఉంటే, ఆన్‌లైన్‌లో ఆధార్ ఆధారితంగా కేవైసీని సమర్పించి, వ్యాలిడేట్ చేసుకోవచ్చు. లేదంటే వీరు కొత్త సంస్థలో పెట్టుబడులు పెట్టాల్సిన ప్రతి సందర్భంలోనూ అధికారికంగా చెల్లుబాటయ్యే ఇతర డాక్యుమెంట్ల సాయంతో కేవైసీ సమర్పించడమే మార్గం.

## తిరిగి కేవైసీ.. ఏ డాక్యుమెంట్?

అధికారికంగా చెల్లుబాటయ్యే ఏ డాక్యుమెంట్ (ఆధార్, పాస్‌పోర్ట్, ఓటర్ ఐడీ, ఎంఎన్‌ఆర్‌ఈజీఏ కార్డ్) సాయంతో తిరిగి కేవైసీ చేసుకోవచ్చు. కానీ, భవిష్యత్తులో మరోసారి ఇబ్బందులు రాకుండా ఉండాలంటే ఆధార్ సాయంతో కేవైసీ వ్యాలిడేట్ చేసుకోవడమే అత్యుత్తమం. ఇతర డాక్యుమెంట్‌తో కేవైసీ చేస్తే కనుక, కొత్త మ్యూచువల్ ఫండ్ సంస్థ పథకంలో ఇన్వెస్ట్ చేసిన ప్రతిసారి మళ్లీ కేవైసీ సమర్పించాల్సి వస్తుంది. అదే ఆధార్‌తో చేస్తే ఈ ఇబ్బంది ఉండదు.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 29-4-2024 ఫామ్ ధర... | |
|---|---|
| విశాఖ | 400-00 |
| చిత్తూరు | 453-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 350-00 |
| విజయవాడ | 350-00 |
| రిటైల్ ధర (డజను) | 48.00 |
| హైదరాబాద్ | 350-00 |
| వరంగల్ | 352-00 |
| రిటైల్ ధర | 4.10 |

# ఐసీఐసీఐ బ్యాంక్ లాభం అప్

- క్యూ4లో రూ. 11,672 కోట్లు
- షేరుకి రూ. 10 డివిడెండ్

ముంబై: ఐసీఐసీఐ బ్యాంక్ మార్చి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి (క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 18 శాతం పైగా ఎగసి రూ. 11,672 కోట్లను తాకింది. ప్రొవిజన్లు తగ్గడం ఇందుకు సహకరించింది. స్టాండెలోన్ లాభం సైతం 17 శాతం పుంజుకుని రూ. 10,708 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 8 శాతం బలపడి రూ. 19,093 కోట్లయ్యింది. ఇందుకు రుణాల్లో 17 శాతం వృద్ధి సహకరించింది. అయితే నికర వడ్డీ మార్జిన్లు 4.9 శాతం నుంచి 4.4 శాతానికి నీరసించాయి. ట్రెజరీ మినహా వడ్డీయేతర ఆదాయం 16 శాతం అధికమై రూ. 5,930 కోట్లను తాకింది. ప్రొవిజన్లు సగానికి తగ్గి రూ. 718 కోట్లకు పరిమితమయ్యాయి. డిపాజిట్లలో 19 శాతం వృద్ధిని సాధించింది. తాజా స్లిప్పేజీలు రూ. 5,139 కోట్లకు చేరగా.. రిటైల్ విభాగం నుంచి రూ. 4,900 కోట్లు నమోదయ్యాయి. ఎన్‌పీఏలు 2.3 శాతం నుంచి 2.16 శాతానికి తగ్గాయి. వాటాదారులకు షేరుకి రూ. 10 చొప్పున డివిడెండ్ ప్రకటించింది.




### పూర్తి ఏడాదికి సైతం

పూర్తి ఏడాదికి ఐసీఐసీఐ బ్యాంక్ స్టాండెలోన్ నికర లాభం రూ. 40,888 కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2022–23) రూ. 31,896 కోట్లు మాత్రమే ఆర్జించింది. కొత్తగా 623 బ్రాంచీలను తెరవడంతో వీటి సంఖ్య 6,500కు చేరింది.

| టాటా టెక్నాలజీస్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు |
|---|---|---|

ప్రస్తుత ధర: రూ. 1,071 టార్గెట్: రూ. 1,370

స్టాక్స్ వ్యూ

**ఎందుకంటే:** గ్లోబల్ ఆటో దిగ్గజం బీఎండబ్ల్యూ గ్రూప్‌తో భాగస్వామ్య సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేసేందుకు టాటా గ్రూప్ కంపెనీ టాటా టెక్నాలజీస్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. 1,000కిపైగా రిసోర్సెస్(నిపుణులు)తో కూడిన సాఫ్ట్‌వేర్ కేంద్రానికి(హబ్) జేవీ తెరతీయనుంది. తద్వారా బీఎండబ్ల్యూ గ్రూప్‌నకు ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, డిజిటల్ ఇంజినీరింగ్ సర్వీసులను అందించనుంది. తాజా అంచనాల ప్రకారం నిలకడైన పనితీరుతో జేవీ ప్రస్తుత ఆర్జనకు అదనంగా 4–5 శాతాన్ని జమ చేసుకునే అవకాశముంది. సమీపకాలంలో మెరుగుపడనున్న ఆర్జన అంచనాను పక్కనపెడితే.. ఈ డీల్ అత్యంత ప్రాధాన్యతను సంతరించుకోవడంతోపాటు కీలకంగా నిలవనుంది. సంప్రదాయ ఓఈఎం(ఆటో దిగ్గజాలు)ల నుంచి బిజినెస్‌ను పొందడంలో మాతృ సంస్థ(టాటా గ్రూప్) కారణంగా టాటా టెక్నాలజీస్ సవాళ్లు ఎదుర్కొంటుందన్న అంచనాలను తుడిచిపెట్టింది. అంతేకాకుండా బీఎండబ్ల్యూతో ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్ సంబంధ భాగస్వామ్యం కంపెనీకున్న బలిమిని ప్రస్ఫుటం చేస్తోంది. సాఫ్ట్‌వేర్ ఈఆర్అండ్‌డీ, వాహనాల పూర్తిస్థాయి ఇంజినీరింగ్ సామర్థ్యం కొత్త అవకాశాలకు తెరతీయనుంది. కీలక(యాంకర్) క్లయింట్ల నుంచేకాకుండా ఇతరత్రా ఆదాయం పొందడంలో కంపెనీ కృషికి తార్కాణంగా నిలవనుంది. ప్రధానంగా ఓఈఎంలు ఎదుర్కొంటున్న సాఫ్ట్‌వేర్ క్లిష్టతలుసహా వివిధ సవాళ్లకు పరిష్కారంగా మల్టీఇయర్ ఆఫ్‌షోర్ అవసరాలు పెరగవచ్చన్న అంచనాలను జేవీ ఏర్పాటు ధృవపరుస్తోంది. ఈ ట్రెండ్‌పై ప్రస్తుతం అంచనాలకు రాలేకపోయినప్పటికీ కొట్టిపారేయలేం.




# రిస్క్ తక్కువ.. రాబడి ఎక్కువ!

### ఎడెల్‌వీజ్ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్

లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లో రిస్క్ తక్కువ. అదే సమయంలో రాబడి మెరుగ్గా ఉంటుంది. మిడ్ క్యాప్ స్టాక్స్‌లో కొంచెం రిస్క్ ఎక్కువ, లాభాలు కూడా ఎక్కువగా ఉంటుంటాయి. ఈ రెండింటిలోనూ ఇన్వెస్ట్ చేయడం ద్వారా రిస్క్‌కు మించి రాబడులను ఇచ్చే విధంగా పనిచేసేదే ఎడెల్‌వీజ్ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్. ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటున్న కొద్దీ లార్జ్‌క్యాప్‌తో పాటు, మధ్య, చిన్న స్థాయి కంపెనీలు కూడా మంచి పనితీరు చూపిస్తుంటాయి. ఖానీ, రిస్క్ కాస్తంత తక్కువగా ఉండాలని కోరుకునే వారు.. లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్‌ను దీర్ఘకాలం కోసం ఎంపిక చేసుకోవచ్చు. ప్రధానంగా లార్జ్‌క్యాప్‌తో పోలిస్తే లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఎక్కువ రాబడులకు మార్గం అవుతుంది.

**రాబడులు**

ఎడెల్‌వీజ్ లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్ ఏడాది కాలంలో ఇన్వెస్టర్లకు 42 శాతం రాబడులను ఇచ్చింది. ఐదేళ్ల కాలంలో 19.5 శాతం, ఏడేళ్లలో 16.1 శాతం, పదేళ్లలో ఏటా 16.45 శాతం చొప్పున పెట్టుబడులపై ప్రతిఫలాన్ని తెచ్చి పెట్టింది. ఈ విభాగంలో మెరుగైన పథకాల్లో ఇదీ ఒకటి. లార్జ్‌అండ్‌మిడ్‌క్యాప్ విభాగం సగటు రాబడులతో పోలిస్తే ఈ పథకమే అధిక రాబడులను ఇచ్చింది. ప్రస్తుతం స్టాక్స్ విలువలు గరిష్టాలకు చేరి ఉన్నాయి. మార్కెట్లు ఇక్కడి నుంచి మరింత ముందుకు వెళతాయని, లేదంటే భారీగా పడిపోతాయని ఎవరూ నూరు శాతం కచ్చితంగా అంచనా వేయలేరు. కనుక ఏక మొత్తంలో కంటే సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) అనుకూల సాధనం. ప్రతీ నెలా ఎంపిక చేసుకున్నంత మేర సిప్ రూపంలో ఇన్వెస్ట్ చేస్తూ వెళ్లొచ్చు. దీంతో మార్కెట్లు మరింత ర్యాలీ చేసినా అప్పటికే ఉన్న పెట్టుబడులపై ప్రతిఫలాన్ని పొందొచ్చు. దిద్దుబాటుకు లోనైతే తక్కువ విలువల వద్ద ఎక్కువ యూనిట్లను సొంతం చేసుకోవచ్చు.

ఫండ్ రివ్యూ




**టాప్ ఈక్విటీ హోల్డింగ్స్**

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| ఐసీఐసీఐ బ్యాంక్ | 3.53 |
| ఎల్అండ్‌టీ | 3.01 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 2.94 |
| ఎస్‌బీఐ | 2.38 |
| పర్సిస్టెంట్ సిస్టమ్స్ | 2.21 |
| రిలయన్స్ ఇండస్ట్రీస్ | 2.20 |
| బిర్లాసాఫ్ట్ | 2.08 |
| మదర్సన్ సుమి | 2.01 |
| డిక్సన్ టెక్ | 2.01 |
| ఫెడరల్‌బ్యాంక్ | 1.91 |

నాణ్యమైన, బలమైన వ్యాపారాలను పెట్టుబడులకు ఈ పథకం ఎంపిక చేసుకుంటుంది. ఈ తరహా కంపెనీలు అయితే ఆర్థిక వ్యవస్థ రికవరీతో వేగంగా పుంజుకుంటాయన్నది ఫండ్ మేనేజర్ల అంచనా. బలహీనమైన యాజమాన్యాల చేతుల్లోని కంపెనీలకు దూరంగా ఉంటుంది. లిక్విడిటీ కూడా ప్రధానంగా చూస్తుంది. ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.2849 కోట్ల ఇన్వెస్టర్ల పెట్టుబడులున్నాయి.

### పెట్టుబడుల విధానం

ఇందులో 97.46 శాతం ఈక్విటీలకు కేటాయించింది. డెట్‌లో మూడు శాతం పెట్టుబడులు కలిగి ఉంది. ఈక్విటీల్లోనూ 57 శాతం వరకు లార్జ్‌క్యాప్ కంపెనీల్లో, 39.65 శాతం మిడ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. మరో 3.49 శాతం పెట్టుబడులను చిన్న కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 75 స్టాక్స్ ఉన్నాయి. పోర్ట్‌ఫోలియోని ఒకసారి గమనించినట్టయితే.. అత్యధికంగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్ల 24 శాతానికి పైగా పెట్టుబడులు ఈ రంగాల కంపెనీల్లోనే ఉన్నాయి. ఆ తర్వాత అత్యధికంగా ఇండస్ట్రియల్ రంగ కంపెనీల్లో 16 శాతం, కన్జ్యూమర్ డిస్క్రీషనరీ స్టాక్స్‌లో 16 శాతం, టెక్నాలజీ కంపెనీల్లో 12.56 శాతం, మెటీరియల్స్ కంపెనీల్లో 11.59 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి.

| హిండ్‌వేర్ హోమ్ | చాయిస్ ఇంటర్నేషనల్ | కొనొచ్చు |
|---|---|---|

ప్రస్తుత ధర: రూ. 367 టార్గెట్: రూ. 503

**ఎందుకంటే:** బిల్డింగ్ ప్రొడక్టుల కంపెనీ హిండ్‌వేర్ హోమ్ ఇన్నొవేషన్ లిమిటెడ్ 2019 ఆగస్టులో ఏజీఐ గ్రీన్‌ప్యాక్ లిమిటెడ్(గతంలో హెచ్‌ఎస్‌ఐఎల్) నుంచి విడివడింది. ఇంతక్రితం సొమానీ హోమ్ ఇన్నొవేషన్‌గా కార్యకలాపాలు నిర్వహించిన హిండ్‌వేర్ హోమ్ దేశీ కన్జూమర్ అప్లయెన్సెస్ రంగంలో వేగవంత వృద్ధిని సాధిస్తున్న సంస్థగా నిలుస్తోంది. వినియోగదారులకు ప్రత్యేకించిన సర్వీసులు సమకూర్చడంతోపాటు.. వివిధ ప్రొడక్టుల విభాగాలలో తయారీ, బ్రాండింగ్, మార్కెటింగ్, అమ్మకాలు, పంపిణీ తదితర పలురకాల సేవలు అందిస్తోంది. కంపెనీ ప్రధానంగా మూడు బిజినెస్ విభాగాలను ఏర్పాటు చేసుకుంది. ప్రతీ విభాగానికీ ఒక సీఈవో, సీవోవోను నియమించింది. వీటిని స్వతంత్రత కలిగిన వ్యూహాత్మక బిజినెస్ యూనిట్లు(ఎస్‌బీయూలు)గా ఏర్పాటు చేసింది. కంపెనీ బాత్‌వేర్ ప్రొడక్టుల విభాగంలో ప్రత్యేక దృష్టిని సారించి బిజినెస్‌ను వేగంగా విస్తరిస్తోంది. తద్వారా మరింత మార్కెట్ వాటాను సొంతం చేసుకోవడంతోపాటు.. లాభదాయకతను సైతం మెరుగుపరచుకుంటోంది. వృద్ధిలో ఉన్న ప్లాస్టిక్ పైపింగ్ బిజినెస్‌లోని అవకాశాలను అందిపుచ్చుకునేందుకు రూర్కీలో ఏడాదికి 12,500 ఎంటీ సామర్థ్యంతో కొత్తగా ప్లాంటును ఏర్పాటు చేసింది. మరోవైపు రుణభారాన్ని తగ్గించుకోవడం ద్వారా బ్యాలన్స్‌షీట్‌ను పటిష్టపరచుకుంటోంది. అంతేకాకుండా కొత్త బిజినెస్ విభాగాలలోకి ప్రవేశిస్తూ మార్కెట్ పరిమాణాన్ని పెంచుకుంటోంది. వెరసి 2023–26 కాలంలో వార్షికంగా ఆదాయం 7 శాతం, ఇబిటా 20 శాతం, నికర లాభం 40 శాతం చొప్పున పురోగతిని సాధించగలదని భావిస్తున్నాం.




**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

## క్లుప్తంగా...

### ఏపీసెట్‌కు 79.97 శాతం హాజరు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అర్హత పరీక్ష ఏపీసెట్–2024కు 79.97 శాతం హాజరు నమోదైందని ఏపీసెట్ మెంబర్ సెక్రటరీ ఆచార్య జి.ఎం.జె రాజు తెలిపారు. ఆదివారం ఉదయం 8 ప్రాంతీయ కేంద్రాల పరిధిలో 79 పరీక్ష కేంద్రాల్లో పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. 38,078 మంది దరఖాస్తు చేయగా 30,451 మంది పరీక్షకు హాజరయ్యారు. 7,627 మంది గైర్హాజరయ్యారు. అత్యధికంగా కడపలో 84.83 శాతం, అత్యల్పంగా గుంటూరులో 75.64 శాతం హాజరు నమోదైంది. పరీక్ష కేంద్రాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఆదివారం పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించారు.

### మెడ్‌టెక్ జోన్‌లో రష్యన్ సంస్థ నిర్మాణానికి శ్రీకారం

సాక్షి, విశాఖపట్నం: అంతర్జాతీయంగా వైద్య ఉపకరణాల తయారీ, ఎగుమతుల్లో నంబర్ వన్‌గా చరిత్ర సృష్టిస్తున్న విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌వైపు ప్రముఖ బయో సంస్థలన్నీ క్యూ కడుతున్నాయి. ఇందులో భాగంగా.. దేశంలోనే మొట్టమొదటి మైక్రోబయాలజీ ఉత్పత్తుల తయారీ సంస్థ మెడ్‌టెక్ జోన్‌లో ఏర్పాటు కానుంది. మెడ్విజ్ ఫార్మా సంస్థతో కలిసి రష్యాకు చెందిన రష్యన్ ఆంకాలజీ జెయింట్ సంస్థ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అడుగులు వేసింది. రెండు రోజుల క్రితమే మెడ్‌టెక్ జోన్ ప్రతినిధుల సమక్షంలో భూమి పూజ నిర్వహించారు. ఏడాదిలోగా మైక్రోబయాలజీ ఉత్పత్తులు తయారు చేయడమే లక్ష్యంగా చురుగ్గా పనులు సాగుతున్నాయి.

### ఆహార భద్రతా వ్యవస్థ మెరుగుకు చర్యలు

**ఫుడ్ సేఫ్టీ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్**

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆహార భద్రతను పెంచే లక్ష్యంతో భారత ఆహార భద్రత, నియంత్రణ శాఖ (ఎఫ్ఎస్ఎస్ఏఐ)తో అవగాహన ఒప్పందాన్ని(ఎంఓయూ) కుదుర్చుకున్నామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.80 కోట్ల నిధులతో రాష్ట్రంలో ఫుడ్ ల్యాబ్‌లు, మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు, ఆహార భద్రత పర్యావరణ వ్యవస్థను మెరుగుపరుస్తున్నామన్నారు. నిషేదిత ఫుడ్ కలర్స్, సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడకం, వంటనూనెల పునర్వినియోగంతో క్యాన్సర్ వస్తుందని ఈ క్రమంలో ఆహార తనిఖీల్లో ఆయా అంశాలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. ఆహార భద్రత చట్టం 2006ను సమర్థంగా అమలు చేయడం కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్‌యూసీఓ (వంటనూనె పునర్వినియోగం) కార్యక్రమాలు, అలాగే సింథటిక్ ఫుడ్ కలర్స్ కోసం ప్రత్యేక డ్రైవ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వంటనూనె పునర్వినియోగంపై 300లకు పైగా కేసులు నమోదు చేశామన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి వైజాగ్, గుంటూరు, తిరుపతిల్లో మూడు ఫుడ్ ల్యాబ్‌ల కార్యకలాపాలు మొదలవుతాయన్నారు. వైజాగ్‌లోని బేసిక్ ఫుడ్ ల్యాబ్ సేవలు జూన్/జూలై నాటికి అందుబాటులో తీసుకుని వస్తామన్నారు.

### వైఎస్సార్‌సీపీతోనే బ్రాహ్మణులకు మేలు

**దేవదాయ, ధర్మదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్**



మాట్లాడుతున్న జ్వాలాపురం శ్రీకాంత్, కామేశ్వరరావు తదితరులు

కడప కార్పొరేషన్: బ్రాహ్మణ సామాజిక వర్గానికి అన్ని విధాలుగా మేలు చేస్తోన్న వైఎస్సార్‌సీపీకి బ్రాహ్మణులు అండగా ఉంటారని దేవదాయ, ధర్మదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ శర్మ, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ కామేశ్వరరావు అన్నారు. కడపలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం వీరు విలేకరులతో మాట్లాడుతూ.. బ్రాహ్మణులకు వైఎస్సార్‌సీపీ చేసిన మేలు గూర్చి వివరించడానికి తాము రాష్ట్రమంతటా పర్యటిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు బ్రాహ్మణ ద్వేషి అని, ఆయన పాలనలో బ్రాహ్మణులను ఆర్థికంగా, రాజకీయంగా అణగదొక్కారని విమర్శించారు. టీడీపీ హయాంలో అర్చకులకు వంశపారంపర్య హక్కులను తొలగించి, వయోపరిమితి విధించడంతో బ్రాహ్మణులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. గతంలో వైఎస్సార్ మాత్రమే బ్రాహ్మణులకు ఎమ్మెల్యే సీట్లు ఇచ్చి మంత్రులను చేశారని, ఇప్పుడు వైఎస్ జగన్ అదే పంథాను కొనసాగిస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి బ్రాహ్మణులకు ఒక్క సీటు ఇవ్వలేదని.. వైఎస్ జగన్ 4 సీట్లు ఇచ్చారని గుర్తుచేశారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాల వల్ల బ్రాహ్మణులకు రూ.780 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు కుప్పం ప్రసాదరావు, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

మప్పితే తిప్పలేం...అలవాటు చేస్తే మాన్పించలేమన్నది దీనర్థం..ఉత్తరాంధ్రలో వాడుకలో ఉన్న సామెత ఇది... నిత్యం అబద్ధాలు రాయడం అలవాటైపోయి, నిజాలు రాయడమన్నది రామోజీ మరిచిపోవడాన్ని చూస్తే ఈ సామెతనే గుర్తు చేస్తున్నట్లుగా ఉంది...పాముకు కోరల్లో విషముంటే...తేలుకు కొండిలో ఉంటుందని అందరికీ తెలుసు...మరి ఈనాడు రాతల్లో నిలువెల్లా జగన్ ప్రభుత్వం పట్ల విషమేనని అచ్చోసిన అబద్ధాల రాతలు నిరూపిస్తున్నాయి..ఎప్పుడూ ఏడుపులు..పెడబొబ్బల కథనాలే...సానుకూలతను చూడగలిగే కళ్లు లేకపోతే రాతలు ఇలాగే అఘోరిస్తాయని జనం నవ్వుకుంటారన్న స్పృహలేకుండా తన వృద్ధ జంబూక పాత్రికేయాన్ని రామోజీ కొనసాగిస్తూ పోతున్నారు... ఈ దుష్ట పాత్రికేయ పరంపరలో భాగంగా ఆదివారం ఈనాడులో 'బ్రో..ఏ రాష్ట్రానికి పొమ్మంటావ్?' అంటూ ఓ దగుల్బాజీ కథనాన్ని అచ్చోశారు. రామోజీకి గ్రామ సచివాలయాలు కనిపించవు..అక్కడ ఉద్యోగాలు చేస్తున్న 1.25 లక్షల మంది కనిపించరు... విశాఖ, తిరుపతి, కడప, పులివెందులల్లో ఏర్పాటైన పరిశ్రమల్లో పనిచేస్తున్న యువత కనిపించదు... జగన్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ రంగంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలతో కలిపి భర్తీ అయిన 6.38 లక్షల ఉద్యోగాలు కనిపించవు... అయిదేళ్ల వ్యవధిలో ప్రయివేట్ రంగంలో వచ్చిన పెట్టుబడుల ద్వారా భర్తీ అయిన 28.89 లక్షల ఉద్యోగాలూ కనపడవు...నిద్ర పోయేవారిని లేపవచ్చు..నటించే వారిని లేపడం అసాధ్యం..రామోజీ రాతలూ అంతే...అబద్ధాలు, కపటబుద్ధితో మూసుకుపోయిన ఈ దగాకోరు పాత్రికేయ కళ్లను నిజాల రాతలతో తెరిపించడానికే ఈ ఫ్యాక్ట్‌చెక్...

## యువత ఆశలకు బాబు సమాధి...

# జగన్ పాలనలోనే ఉగాది!

### బాబు ఇచ్చింది కేవలం 37 వేల ఉద్యోగాలే

### జగన్ పాలనలో 2.3 లక్షల రెగ్యులర్ పోస్టుల భర్తీ

- అత్యధిక ఉద్యోగావకాశాల కల్పనలో దేశంలోనే ఏపీకి 4వ స్థానం
- బాబు హయాంలో నిరుద్యోగిత రేటు 5.3 శాతం
- జగన్ పాలనలో అది 4.1 శాతానికి తగ్గుదల
- నిరుద్యోగభృతి ఇస్తానని వంచించిన బాబు
- ఈ నిజాలకు రామోజీ దుష్ట రాతల గంతలు...





సాక్షి, అమరావతి: రామోజీ ...ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చి చూస్తే ఉద్యోగాల భర్తీలో నిజానిజాలేమిటో తెలుస్తాయి. అంతెందుకు.. మీకు జన్మనిచ్చిన కృష్ణాజిల్లా పెదపారుపూడికి వెళ్లండి... అక్కడి సచివాలయంలో అప్పుడే ఇంజనీరింగ్, డిగ్రీ పూర్తి చేసుకున్న యువత నవ్వుతూ పేద ప్రజలకు ఏ విధంగా సాయం చేస్తున్నారో కనిపిస్తుంది. లేదా మిమ్మల్ని ఉన్నత స్థితికి తీసుకెళ్లిన విశాఖ వెళ్లి చూడండి... అక్కడ జపాన్‌కు చెందిన యకహోమా టైర్స్‌లో పనిచేస్తున్న స్థానిక యువత, విశాఖ ఇన్ఫోసిస్‌లో రాష్ట్రానికి చెందిన యువత కనిపిస్తారు. పోనీ బద్వేల్ సెంచురీ ప్యానల్స్, కడప డిక్సన్, పులివెందుల ఆదిత్య బిర్లా గార్మెంట్స్, తిరుపతి బ్లూస్టార్, డైకిన్, మునోత్ వంటి కంపెనీలకు వెళ్లి చూడండి.. చదువు పూర్తికాగానే వేరే రాష్ట్రాలకు వెళ్లే అవసరం లేకుండా స్థానికంగా పనిచేస్తున్న యువత కనిపిస్తుంది. ఎన్నికలు దగ్గరకు వచ్చేస్తున్నాయి కాబట్టి అబద్ధాలతో అడ్డగోలు రాతలు రాయాలనుకుంటే నిజాలు మిమ్మల్ని నిలదీస్తాయని తెలుసుకోవాలి.

**నిరుద్యోగ భృతిపైనా మోసగించిన బాబు...**

రామోజీ శిష్యుడు చంద్రబాబే 2014 ఎన్నికల ముందు జాబు రావాలంటే బాబు రావాలంటూ ఊరూరా ప్రచారం చేశారు. జాబ్ ఇవ్వకపోతే ప్రతీ ఇంటికి నెలకు రూ. రెండు వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానంటూ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి మరీ నిరుద్యోగులను చంద్రబాబు మోసం చేశారు. ఆ విషయం అప్పుడు–ఇప్పుడూ ఈనాడు కు కనిపించదు. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేసినా, ఈనాడు ఒక్క ముక్కా రాయలేదు. ఉన్న రెగ్యులర్ ఉద్యోగాలను బాబు రద్దు చేసినా ఆ దురన్యాయాన్నీ నిగ్గదీయదు. దీనికి భిన్నంగా గత అయిదేళ్లలో జగన్ ప్రభుత్వం రాష్ట్రంలోకి భారీ పరిశ్రమలను ఆకర్షిస్తూ రూ.85,543 కోట్ల పెట్టుబడులను వాస్తవ రూపంలోకి తెచ్చింది. తద్వారా 28.89 లక్షల ఉద్యోగాలు ప్రైవేటు రంగంలో వచ్చినా ఈనాడుకు కనిపించదు గాక కనిపించదు.

### వంచించింది బాబు... ఉద్యోగాలిచ్చింది జగన్...

బాబు వస్తేనే జాబు అంటూ నిరుద్యోగులను నిలువునా చంద్రబాబు వంచించారు. చంద్రబాబు తమ వాడు కాబట్టి ఆ తప్పులన్నీ ఒప్పులుగా ఈనాడు భావిస్తుంది. కానీ.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేవలం నాలుగు నెలల్లోనే కొత్తగా 1.25 లక్షల గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాలను సృష్టించిన విప్లవాత్మక సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి... ఈ నిజం రాష్ట్రంలోని ప్రతీ ఒక్కరికి కనిపిస్తున్నా రామోజీ మాత్రం ఆ నిజాన్ని ఉద్దేశపూర్వకంగానే దాచేస్తూ... జగన్ సర్కారుపై అక్కసు రాతలు రాస్తున్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కొత్తగా 2.3 లక్షల రెగ్యులర్ ఉద్యోగాలను భర్తీ చేశారు. చంద్రబాబు జమానాలో భర్తీ చేసింది కేవలం 37 వేలు మాత్రమే. మరో పక్క 43,923 కాంట్రాక్టు ఉద్యోగాలు, 3.73 లక్షల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలతో కలిపి మొత్తం 6.38 లక్షల ఉద్యోగాలను వైఎస్.జగన్ సర్కారు ఇస్తే వీటన్నింటినీ మరుగునపరిచి పచ్చి అబద్ధాలతో ఈనాడు కథనాన్ని వండి వార్చింది.

**నైపుణ్య శిక్షణతో ఉపాధి..**

- రాష్ట్రంలో 191 స్కిల్ హబ్స్, 26 స్కిల్ కాలేజీల ద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే విధంగా వివిధ కోర్సులను జగన్ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.
- శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత అదే కంపెనీలో వారికి ఉపాధి కల్పించే విధంగా ఆయా కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందమూ చేసుకుంది. దానికి నిదర్శనమే రాష్ట్రంలో పెరుగుతున్న క్యాంపస్ నియామకాలు.
- బాబు హయాంలో 2018–19లో క్యాంపస్ నియామకాలు 37 వేలుగా ఉంటే, జగన్ పాలనలో 2022–23లో ఈ సంఖ్య 1.20 లక్షలు దాటింది.
- అత్యధిక ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న రాష్ట్రాల్లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉందని కేంద్రం విడుదల చేసిన 2023 –స్కిల్ రిపోర్ట్ స్పష్టం చేసింది.
- బాబు హయాంలో నిరుద్యోగిత రేటు 5.3 శాతం ఉండగా, జగన్ హయాంలో ఇది 4.1 శాతానికి తగ్గింది.
- 2018–19లో 44.85 లక్షల ఈపీఎఫ్ ఖాతాలుంటే, 2022–23 నాటికి ఈపీఎఫ్ ఖాతాల సంఖ్య 60.73 లక్షలకు పెరిగినట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ పేర్కొంది. అంటే 35 శాతం మేర ఈపీఎఫ్ ఖాతాలు పెరగడాన్ని చూస్తే ఉద్యోగావకాశాలు ఆ మేర పెరిగాయి.
- సీఎం వైఎస్.జగన్ సర్కారు తీసుకుంటున్న చర్యలతో రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు పెరిగినట్లు ఇటీవల కేంద్ర కార్మిక ఉపాధి కల్పన మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## సీఎం వైఎస్ జగన్‌కే క్షత్రియుల మద్దతు

- క్షత్రియ హక్కుల సాధన సమితి నేతల ప్రకటన
- విజయవాడ సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లితో ముఖాముఖి
- మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రావాలని ఆకాంక్ష



క్షత్రియ హక్కుల సాధన సమితి ప్రతినిధులతో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్రంలోని క్షత్రియులు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సీఎం జగన్ పాలనలో లక్షలాది పేద క్షత్రియ కుటుంబాలకు ఆర్థికంగా, ఆరోగ్య పరంగా మేలు జరిగిందని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే తిరిగి అధికారంలోకి రావాలని వారు ఆకాంక్షించారు. శనివారం విజయవాడ లెనిన్ సెంటర్‌లోని ఓ హోటల్‌లో క్షత్రియ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్‌తో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. క్షత్రియ పెద్దలతో వెలంపల్లి మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్షత్రియుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపించిందన్నారు. పార్టీ, ప్రభుత్వ పోస్టుల్లో క్షత్రియులకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

**'జగన్ ప్రభుత్వమే రావాలని కోరుకుంటున్నాం'**

క్షత్రియ హక్కుల సాధన సమితి అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు మాట్లాడుతూ.. క్షత్రియుల్లో ఎక్కువ మంది పేద, మధ్యతరగతి వారే ఉన్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల అత్యధికంగా లబ్ధి పొందిన వారిలో క్షత్రియులు కూడా ఉన్నారని చెప్పారు. తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావాలని క్షత్రియులంతా కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. స్థూల దేశీయోత్పత్తిలోనూ, ఇన్‌ఫ్రా పనుల్లోనూ, డీబీటీ, పౌరసేవలు వంటి ప్రతి విషయంలోనూ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా మారిందన్నారు. సమన్వయకర్తగా వ్యవహరించిన సునీత లఖంరాజు మాట్లాడుతూ.. క్షత్రియులు సీఎం జగన్ పాలన పట్ల పూర్తి సంతృప్తితో ఉన్నారన్నారు. జగన్ ప్రభుత్వం క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకుందన్నారు. ఈ సందర్భంగా వెలంపల్లికి ఆంగ్ల మాసపత్రిక ఆధ్వర్యంలో బెస్ట్ లెజిస్లేచర్ అవార్డును అందజేశారు. వీవీఆర్ కృష్ణంరాజు రచించిన క్షత్రియులు పుస్తకాన్ని వెలంపల్లి ఆవిష్కరించారు. కార్పొరేటర్ పెన్మత్స శిరీష, వెంకటేశ్వర రాజు, అడ్వకేట్ శివప్రసాదరాజు, సామంతపూడి చిన్నా, పెన్మత్స పట్టాభి, మురళి, గొట్టుముక్కల వెంకటేశ్వరరాజు, సాగి వెంకటేశ్వరరాజు, జంపన లక్ష్మి, కాకర్లపూడి శ్రీనివాసరాజు, శివాజీరాజు, చంద్రశేఖరరాజు, వేగేశ్న సత్యనారాయణరాజు, మున్సుబ్‌రాజు పాల్గొన్నారు.

## విశాఖ పోర్టుకు తొలిసారి 'ది వరల్డ్'

- 80మంది ప్రయాణికులతో ఆదివారం పోర్టు ఇంటర్నేషనల్ క్రూయిజ్ టెర్మినల్‌కు చేరుకున్న నౌక
- సంప్రదాయ పద్ధతిలో పోర్టు అధికారుల స్వాగతం
- సోమవారం రాత్రి పోర్ట్ బ్లెయిర్‌కు పయనం



వరల్డ్ క్రూయిజ్ షిప్

సాక్షి, విశాఖపట్నం: విశాఖ పోర్టులో అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ నిర్మించిన తర్వాత మొట్టమొదటి అంతర్జాతీయ క్రూయిజ్ నౌక ఆదివారం విశాఖ చేరుకుంది. లగ్జరీ విభాగానికి చెందిన ది వరల్డ్ ఇంటర్నేషనల్ క్రూయిజ్ షిప్ విశాఖలో బెర్తింగ్ అయ్యింది. తూర్పు తీరంలో అంతర్జాతీయ క్రూయిజ్ నౌకలకు విశాఖపట్నం క్రూయిజ్ టెర్మినల్ గమ్యస్థానంగా మార్చుతామనే తమ విధానానికి ఇది నిదర్శనమని పోర్టు అధికారులు వెల్లడించారు. అద్భుతమైన ఆతిథ్యానికి మారుపేరైన 'ది వరల్డ్' షిప్ ద్వారా ప్రపంచం నలుమూలల నుంచి సుమారు 80 మంది పర్యాటకులు విశాఖ చేరుకున్నారు. వీరందరికీ సంప్రదాయ పద్ధతిలో ఆత్మీయ స్వాగతం పలికారు. షిప్‌లో వచ్చిన పర్యాటకులు విశాఖ చుట్టూ పక్కల ఉన్న ప్రసిద్ధి చెందిన సందర్శన ప్రదేశాలు, ప్రకృతి రమణీయతను చూసేందుకు ఉత్సాహం చూపించారు. టెర్మినల్‌కు చేరుకున్న ఇంటర్నేషనల్ క్రూయిజ్‌కు సాదరంగా ఆహ్వానం పలికామని పోర్టు చైర్ పర్సన్ డా॥ఎం.అంగముత్తు వెల్లడించారు. క్రూయిజ్ టెర్మినల్‌ను రూ.96 కోట్లతో ప్రపంచంలోనే అత్యంత ప్రత్యేకమైన క్రూయిజ్ షిప్పుల రాకపోకలకు అనువుగా నిర్మించారు. అలాగే పర్యాటకులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు, వారికి సౌకర్యవంతమైన అనుభూతి కల్పించే ఏర్పాట్లు చేశారు. దేశంలోని ఇతర పోర్టులతో పోల్చుకుంటే ఇమ్మిగ్రేషన్ ప్రక్రియను విశాఖపట్నం పోర్టు 45 నిముషాల లోపే పూర్తి చేయడంపై షిప్ కెప్టెన్ సంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలోని ప్రముఖ బీచ్‌లు, చారిత్రక ప్రాధాన్యత కలిగిన పర్యాటక ప్రదేశాలు, స్థానికంగా ప్రసిద్ధి చెందిన మార్కెట్‌లు ఉన్నాయనీ.. క్రూయిజ్ రాక విశాఖ స్థానిక పర్యాటక అభివృద్ధికి దోహదపడుతుందని చైర్మన్ డా॥ అంగముత్తు తెలిపారు. సోమవారం రాత్రి ఇక్కడి నుంచి షిప్ పోర్టుబ్లెయిర్‌కు బయల్దేరి వెళ్లనుంది.

## పరిశ్రమల ఏర్పాటుకు శ్రీసిటీ అనువైన ప్రదేశం

**జపాన్‌లోని భారత రాయబారి సిబి జార్జ్**



సిబి జార్జ్‌కు స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ప్రతినిధులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): తిరుపతి జిల్లాలోని శ్రీసిటీ పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలతలు అద్భుతమని జపాన్‌లోని భారత రాయబారి సిబి జార్జ్ అన్నారు. ఆదివారం ఆయన శ్రీసిటీని సందర్శించగా శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ ఆయనకు స్వాగతం పలికి, పారిశ్రామికవాడ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. ప్రపంచవ్యాప్తంగా 30 దేశాలకు చెందిన 220 పరిశ్రమలు ఏర్పాటైనట్లు ఆయనకు వివరించారు. ఇక్కడ జపాన్ కంపెనీలు ఎక్కువగా ఉన్నాయని, భారత్‌లోనే రెండవ అతిపెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా శ్రీసిటీ మారిందన్నారు. 220 మంది జపాన్ ప్రతినిధులు ఇక్కడ నివసిస్తున్నట్లు తెలిపారు. జపనీస్ పెట్టుబడులను ఆకర్షించడానికి ఆ దేశ సంస్కృతి, సంప్రదాయాలకు దీటుగా పలు సదుపాయాలను శ్రీసిటీలో కల్పిస్తున్నట్లు తెలిపారు. శ్రీసిటీ పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, సామాజిక వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన సిబి జార్జ్ దేశంలో ఇదొక ప్రధాన వ్యాపార గమ్యస్థానంగా అభివర్ణించారు. శ్రీసిటీలో నెలకొల్పిన పర్యావరణ వ్యవస్థను ఆయన ప్రశంసించారు. సిబి జార్జ్ పర్యటనపై శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి 2024

# జైత్రయాత్ర

సోమవారం
ఏప్రిల్, 29


## గుసగుస

### తోలు తీస్తాం



పాలమ్మిన.. పూలమ్మిన.. కష్టపడ్డ.. సక్సెసయిన.. తెలంగాణ నేత మల్లారెడ్డి ఫేమస్ డైలాగ్‌ను కాస్త అటూ ఇటుగా లోకేశం భార్య బ్రాహ్మణి, తల్లి భువనేశ్వరి చెప్తున్నారట. ప్రజలతో అనుకుంటే పొర పాటే.. మన లోకేశానికే వాళ్లు చెప్పేది! గత ఎన్నికల్లో మంగళగిరి ఓటర్లను, కార్యకర్తలను ఏసీలు, ఫ్రిజ్‌లు తదితర ఎలక్ట్రానిక్ గూడ్స్‌తో ప్రలోభపెట్టారు. ఫలితం మాత్రం ఫ్! ఈసారి నాలుగైదు ఓట్లున్న కుటుంబానికి హీనపక్షంగా రూ.లక్ష, అపార్ట్‌మెంట్లకు ఉమ్మడి డిమాండ్ మేరకు ఎంతైనా ఇవ్వాలనుకున్నారట. అయితే తమ కష్టార్జితం హెరిటేజ్ డబ్బులపై చేయి వేస్తే తోలు తీస్తామని హెచ్చరించారట. దీంతోపాటు పార్టీ టికెట్ల పేరిట వసూలు చేసి, తమకు అప్పగించిన నోట్ల కట్టలపైనా ఆశలు వదులుకోవాలన్నారట. పాపం.. లోకేశం!

### అకటకటా!



జనసేన అధినేత పవన్ పరిస్థితి పగవాడికి కూడా రాకూడదనుకుంటున్నారు ఆయన అభిమానులు. తమ హీరో రాజకీయాల్లోకి వస్తే.. ఆయన పేరు చెప్పుకుని ఈజీగా ఎమ్మెల్యే/ఎంపీ అయిపోవచ్చని కలలుగన్నారట చాలా మంది. ఇపుడు ఆయన గెలవడమే కష్టమన్న విషయం అర్థమైందట. తన వెంట వచ్చిన వారిని డామ్ ష్యూర్‌గా గెలిపిస్తారనుకుంటే.. ఇప్పుడు ఆయనే తన గెలుపును టీడీపీ నేత వర్మ దయాదాక్షిణ్యాలపై పెట్టడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. పైపెచ్చు పిఠాపురంలో ఆయన కోసం జబర్దస్త్ టీం, బుల్లితెర నటులు, తన మేనల్లుళ్లు, కొడుకులు, అన్నయ్యలు గుంపులుగా కదిలిరావడాన్ని అవమానంగా భావిస్తున్నారట. పొత్తులు కట్టినా.. ఇంత దౌర్భాగ్యమా? అని వాపోతున్నారట.

### అయ్యో వీవీ



సీబీఐ మాజీ జేడీ, జై భారత్ నేషనల్ పార్టీ అధినేత వీవీ లక్ష్మీనారాయణ పరిస్థితిని చూసి విశాఖ వాసులు జాలిపడుతున్నారట. గత ఎన్నికల్లో జనసేన తరఫున విశాఖ లోక్‌సభ బరిలో దిగి మూడో స్థానంలో నిలిచారు. గాజువాకలో జనసేనాని పవన్ కంటే ఎక్కువ ఓట్లే తెచ్చుకున్నారు. ఓటమి తర్వాత ఏడాదిలోపే జనసేనను వీడారు. ఇపుడు సొంత పార్టీని పెట్టి, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీకి దిగారు. అంతా బాగానే ఉన్నా.. తనకు ప్రాణహాని ఉందంటూ కొత్తగా సానుభూతి పల్లవి అందుకున్నారు. విశాఖ నడి రోడ్లపై ఆయన ఒంటరిగానే తిరుగాడతారు. రాన్రాను పట్టించుకునే వారే లేని పరిస్థితి. అలాంటి వీవీని టార్గెట్ చేసే అమాయకులెవరబ్బా అని జనాల గుసగుసలు.

### మాటిచ్చేశాం 'నాయన'

విజయనగరం జిల్లా బొబ్బిలి అసెంబ్లీ స్థానానికి వైఎస్సార్‌సీపీ తరఫున శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, టీడీపీ నుంచి బేబినాయన బరిలో ఉన్నారు. బొబ్బిలి పూర్తిగా బీసీల నియోజకవర్గం. అక్కడ బీసీలను కాదని ఓసీ వర్గానికి చెందిన బేబినాయనకు టీడీపీ టికెట్ ఇవ్వడంపై స్థానిక టీడీపీ శ్రేణులతోపాటు, బీసీలు కన్నెర్ర చేస్తున్నారు. ఆయన ఏ గ్రామానికి వెళ్లినా మా బీసీ నాయకుడు శంబంగికే ఈసారి ఓటు వేస్తామని మాట ఇచ్చాం 'నాయనా'అని మొహం మీదే చెబుతున్నారట. దీంతో దొరవారు ఉక్కిరిబిక్కిరై కోటకు పరుగు తీసి, కుయ్యోమొర్రో అంటూ సన్నిహితుల వద్ద తన గోడు వెళ్లబోసుకున్నారట.

## ఆర్థిక కేటుగాళ్లకు టీడీపీ

# అడ్డా

**మాల్యా, నీరవ్ మోదీ వారసులు సుజనా, రఘురామకృష్ణరాజు, సీఎం రమేశ్, గంటా**



బ్యాంకులకు దాదాపు రూ.

# 4,563

### కోట్లు ఎగ్గొట్టిన వైనం

వీళ్లు ఎక్కడున్నా చంద్రబాబు మనుషులే.. ఆయన కోసం పనిచేయడమే లక్ష్యం

తన బినామీలను బీజేపీలోకి పంపి టికెట్లు ఇప్పించుకున్న చంద్రబాబు

ప్రజల సొమ్మును దోచుకుని.. అందులో టీడీపీకి కొంత వాటా

ప్రతిఫలంగా వారికి, వారు సూచించిన వారికి టికెట్లు ఇస్తున్న చంద్రబాబు

ఇలాంటి నేతలతో సమాజానికి తీవ్ర ప్రమాదం అంటున్న బ్యాంకింగ్ నిపుణులు

సాక్షి, అమరావతి:

ఈ ఎన్నికలు పెత్తందారులు, పేదలకు మధ్య పోటీ.. ఆర్థిక నేరగాళ్లతో నిండిన టీడీపీ కూటమికి.. పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా జైత్రయాత్ర చేస్తున్న ఈ ప్రభుత్వానికి మధ్య పోటీ..

ఈ ఎన్నికల్లో ఆర్థిక నేరగాళ్లకు చంద్రబాబు టికెట్లు కట్టబెట్టడమే కాకుండా..తన బినామీలను పక్క పార్టీలోకి పంపి అక్కడ కూడా వారిని బరిలో నిలిపారు. వ్యాపార వేత్తల ముసుగులో బ్యాంకుల నుంచి వందల కోట్ల రుణాలు తీసుకుని ఎగ్గొట్టిన ఈ వైట్‌కాలర్ ఆర్థిక నేరగాళ్లు సూచించిన వారికీ చంద్రబాబు టికెట్లిచ్చారు. రుణాల పేరుతో బ్యాంకులకు కన్నం పెట్టిన ఈ కేటుగాళ్లలో భీమిలి నుంచి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఉండి నుంచి రఘురామకృష్ణరాజు టీడీపీ నుంచి పోటీ చేస్తుండగా.. 2019 వరకు టీడీపీ రాజ్యసభ ఎంపీగా ఉన్న సీఎం రమేశ్, సుజనా చౌదరిలను బీజేపీలోకి పంపిన చంద్రబాబు.. వారికి టికెట్లు దక్కేలా ప్లాన్ చేశారు. అనకాపల్లి పార్లమెంటు నుంచి సీఎం రమేశ్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి సుజనా చౌదరి పోటీ చేస్తున్నారు. ఈ నలుగురు బ్యాంకుల నుంచి సుమారు రూ.4,563 కోట్ల రుణాలు ఎగ్గొట్టి, సీబీఐ ఈడీ, బ్యాంకు జప్తు కేసులు ఎదుర్కొంటున్నారు.

### మోసాల్లో దిట్ట రఘురామకృష్ణరాజు

రుణాల ఎగవేతలో విజయ్ మాల్యా, నీరవ్‌మోదీ సరసన నిలిచే కేటుగాడు రఘురామకృష్ణరాజు. ఇండ్ భారత్ థర్మల్ పవర్ లిమిటెడ్ పేరుతో రఘురామకృష్ణరాజు వివిధ బ్యాంకుల నుంచి సుమారు రూ.1,383 కోట్ల రుణాలు తీసుకున్నాడు. వీటిని కంపెనీ అవసరాలకు వాడకుండా వేరే ఖాతాల్లోకి మళ్లించి బ్యాంకుల్ని మోసగించాడు. పంజాబ్ నేషనల్ బ్యాంకు, దాని అనుబంధ బ్యాంకుల నుంచి ఇండ్–భారత్ థర్మల్ పవర్ పేరిట తీసుకున్న రూ.826.17 కోట్ల రుణాన్ని పక్కదారి పట్టించాడు. వడ్డీ కూడా చెల్లించలేదు. దీంతో బ్యాంకులు సీబీఐని ఆశ్రయించడంతో అతని మోసాలు వెలుగులోకి వచ్చాయి. తనఖాగా పెట్టిన భూముల్ని మోసపూరితంగా అమ్మేశాడని, 95 శాతం బొగ్గు తరిగిపోయిందని చెప్పి దాన్ని తగలబెట్టేశారని పంజాబ్ నేషనల్ బ్యాంకు ఫిర్యాదుతో సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. 2020 అక్టోబర్‌లో రఘురామకృష్ణరాజుకు చెందిన ఇళ్లు, కంపెనీలు, కార్యాలయాల్లో 11 సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందాలు సోదాలు నిర్వహించి పలు ఫైళ్లు, హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకున్నాయి. కంపెనీకి చైర్మన్‌గా ఉన్న రఘురాజుతో పాటు ఆయన భార్య, కుమార్తె ఇతర డైరెక్టర్లపై కేసులు నమోదు చేశారు. ఇండ్–భారత్ సన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట విదేశాల్లో తీసుకున్న రుణాల్ని భారత్‌కు అక్రమంగా తరలించడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. 2011లో మారిషస్‌కు చెందిన స్ట్రాటజిక్ ఎనర్జీ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ అనే కంపెనీ నుంచి రూ.202 కోట్లు రుణం తీసుకున్నారు. ఆ నిధులు అందిన మరుసటి రోజే రూ.200 కోట్లను ఇండ్ – భారత్ ఎనర్జీ లిమిటెడ్(ఉత్కళ్)కు తరలించేశారు. ఈ వ్యవహారం మొత్తం ఫారెన్ ఎక్స్ఛేంజ్ మెయింటెనెన్స్ యాక్ట్(ఫెమా) దృష్టిలో పడింది. ఫెమా అధికారులు మారిషస్ కంపెనీ నుంచి రూ.202 కోట్లు ఇండ్ భారత్ సన్ ఎనర్జీకి అందినట్లు గుర్తించారు. మరుసటి రోజే బదిలీ చేసినట్లు నిర్ధారించారు. ఫెమా నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ కావడంతో ఈడీ రఘురామ కంపెనీకి రూ.40 కోట్లు పెనాల్టీ విధించింది.

### సుజనా చౌదరి.. ఎగవేతలో నంబర్ వన్

బ్యాంకుల నుంచి రూ. వేల కోట్ల రుణాలు తీసుకుని మోసగించిన ఘనుడు సుజనా చౌదరి. ఈ కేసులో ఈడీ దర్యాప్తుతో అతని మోసాలు వెలుగులోకి వచ్చాయి. రూ.1,289 కోట్ల జీఎస్టీ ఎగవేతతో పాటు రూ.700 కోట్ల బ్యాంకు రుణాల ఎగవేత కేసులున్నాయి. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత అనేక డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసి ఎలాంటి వ్యాపారాలు చేయకుండానే రూ.1,289 కోట్ల ఇన్వాయిస్‌లు సుజనా కంపెనీలు తయారుచేశాయి. ఈ మొత్తంపై రూ.224 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ తీసుకున్నారు. దొంగ ఇన్వాయిస్‌లు చూపి బ్యాంకుల నుంచి రూ.700 కోట్ల రుణాలు తీసుకున్నారు. జీఎస్టీ విభాగం దర్యాప్తులో ఈ మోసం బయటపడటంతో గ్రూపునకు చెందిన డైరెక్టర్లను అరెస్ట్ చేశారు. బ్యాంకు రుణాలు తీర్చడం లేదని నల్లగొండ జిల్లాలో ఉన్న స్టీల్ ప్లాంటును బ్యాంకులు సీజ్ చేశాయి. విదేశీ బ్యాంకులకు కూడా సుజనా టోపీ పెట్టారు. మారిషస్ బ్యాంక్ నుంచి రూ.100 కోట్ల రుణం తీసుకొని చెల్లించకపోవడంతో ఆ బ్యాంక్ హైదరాబాద్ కోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో కోర్టు ఏకంగా అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. బ్యాంకుల నుంచి రుణాలు ఎగ్గొట్టిన వారికి కేంద్ర మంత్రి వర్గంలో చోటు ఇవ్వడానికి ప్రధాని మోదీ నిరాకరించినా చంద్రబాబు అతనికే ఇవ్వాలని పట్టుబట్టారు. బీజేపీ తీర్థం పుచ్చుకొని విజయవాడ పశ్చిమ నుంచి పోటీ చేస్తున్నారు. రూ. 500 కోట్లు ఎగవేతకు సంబంధించి ఎన్‌సీఎల్టీ(నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్)లో ఎస్‌బీఐ 2021లో దివాలా పిటిషన్ దాఖలు చేసింది. దీనిని పరిశీలించిన ఎన్‌సీఎల్‌టీ ఆ పిటిషన్‌కు అనుమతిస్తూ తాజాగా ఉత్తర్వులిచ్చింది.

-మిగతా III లో

మరిన్ని పేజీల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

- రైతుల కోసం సీఎం జగన్ సర్కారు అత్యుత్తమ విధానాలు
- ఇతర రాష్ట్రాలూ అనుసరించదగిన విధానాలివి
- కొత్త పథకాల అమలులో ముందంజలో ప్రభుత్వం
- వైఎస్సార్ సున్నా వడ్డీతో అప్పుల నుంచి విముక్తి
- పంటకు రక్షణ కల్పించమే లక్ష్యంగా ఉచిత పంటల బీమా
- పగటి పూట 9 గంటలు నిరంతరాయంగా ఉచిత విద్యుత్
- ఇందు కోసం ఏడాదికి రూ.8,400 కోట్లు చెల్లింపు
- వ్యవసాయ **విద్యుత్ నగదు బదిలీ పథకం..**
- బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ
- సేద్యంలో పెట్టుబడికి వైఎస్సార్ రైతు భరోసా పథకం
- ఏడాదికి 3 విడతల్లో రూ.13,500 రైతు ఖాతాల్లోకి నగదు..
- ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కౌలు రైతులకు అధిక ప్రాధాన్యం
- నాణ్యమైన ఇన్‌పుట్స్, సామర్థ్యం పెంపుదలకు ఆర్‌బీకేల సేవలు
- వికసిత్ భారత్ దిశగా ప్రోత్సాహానికి **ఇవన్నీ ఉత్తమ విధానాలు**

**వ్యవసాయ రంగంలో ఏపీ పథకాలపై నీతి ఆయోగ్ కితాబు**

# సేద్యంలో సేవలకు సలాం



సాక్షి, అమరావతి: రైతుల సంక్షేమం, వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొత్త పథకాలు, ఉత్తమ విధానాలు అమలు చేస్తోందని నీతి ఆయోగ్ స్పష్టం చేసింది. వ్యవసాయ రంగంలో ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు ఇతర రాష్ట్రాలు అనుసరించి ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సూచించింది. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం అమలు చేయడంతో అప్పుల వలయం నుంచి రైతాంగం విముక్తి పొందుతున్నారనీ, ఆర్‌బీకేలు పారదర్శకంగా ఉంటూ రైతాంగానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని కితాబిచ్చింది. వికసిత్ భారత్ దిశగా ప్రోత్సాహానికి వివిధ రాష్ట్రాలు అమలు చేస్తున్న ఉత్తమ విధానాలు, ఆచరణలతో నీతి ఆయోగ్ నివేదిక విడుదల చేసింది. ఇందులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతుల కోసం కొత్తగా అమలు చేస్తున్న పథకాలు.. ఉత్తమ విధానాలు, ఆచరణలను ప్రముఖంగా ప్రస్తావించింది. వీటిని ఇతర రాష్ట్రాలు నేర్చుకోవడానికి, భాగస్వామ్యం చేయడానికి నివేదికను విడుదల చేసినట్లు పేర్కొంది. ఈ నివేదికలో నీతి ఆయోగ్ పేర్కొన్న అంశాలివే..

### వడ్డీ భారం మొత్తం ప్రభుత్వమే చెల్లింపు

**వైఎస్సార్ సున్నా వడ్డీతో రుణ భారం నుంచి రైతులు విముక్తి పొందారు. వారి సంక్షేమం, ప్రయోజనాలే లక్ష్యంగా ఈ పథకాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రారంభించారు.** సకాలంలో పంట రుణాలు చెల్లించే రైతులకు సున్నా వడ్డీ పథకాన్ని ప్రభుత్వం వర్తింప చేస్తోంది. వడ్డీ రాయితీ మొత్తాన్ని రైతుల బ్యాంకుల ఖాతాల్లోనే నేరుగా జమ చేస్తోంది. వడ్డీ భారాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ..లబ్ధిదారులు సకాలంలో రుణాన్ని చెల్లిస్తే ప్రభుత్వం వడ్డీని తిరిగి చెల్లిస్తోంది. పంటలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా రైతుల ప్రయోజనాల కోసం సీఎం వైఎస్ జగన్ ఉచిత పంటల బీమా కొత్త పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకం కింద రైతుల నమోదును సులభతరం చేయడంతో పాటు కేవలం టోకెన్‌గా ఒక రూపాయి మాత్రమే వసూలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులందరికీ ఉచిత పంటల బీమాను వర్తింప చేయడంతో రైతులకు వరంగా మారింది. వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు లాంటి సమయాల్లో పంటలు దెబ్బతిన్న రైతులకు ఆయా సీజన్‌లోనే క్లెయిమ్‌లను నేరుగా రైతుల ఖాతాలకే జమ చేస్తున్నారు. దీంతోపాటు పంటల భౌతిక ధ్రువీకరణ

-మిగతా III లో

### రైతు భరోసా అందించే ఏకైక రాష్ట్రం

వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాలను ఏపీ ప్రభుత్వం మాత్రమే అమలు చేస్తోందని నీతి ఆయోగ్ పేర్కొంది. రైతులకు ఆర్థిక సాయం గ్రాంట్‌గా అందిస్తున్నారని తెలిపింది. ఏడాదిలో మూడు విడతల్లో రైతులకు రూ.13,500 చొప్పున అందిస్తున్నారని, సీజన్ ప్రారంభంలో భూమిని సిద్ధం చేసి, విత్తనాలు కొనుగోలు చేయడం, ఎరువులు, కూలీల చార్జీల నిమిత్తం రైతులకు ఉపయోగపడేలా ఈ పథకాలను అమలు చేస్తున్నారని నివేదిక వివరించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కౌలు రైతులకు ఈ పథకంలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొంది.

### ఉచిత విద్యుత్ కోసం ఏటా రూ.8,748 కోట్లు

వ్యవసాయంలో ఉచిత విద్యుత్ కోసం రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి సుమారు రూ.8,748 కోట్లు చెల్లిస్తోందని నీతి ఆయోగ్ నివేదికలో తెలిపింది. దీన్ని మరింత పటిష్టపరిచేందుకు వచ్చే 30 ఏళ్ల పాటు నిరంతరాయంగా కొనసాగించేందుకు ముందస్తు చర్యలను ప్రభుత్వం చేపట్టిందని నివేదిక స్పష్టం చేసింది. దీంతో పాటు వ్యవసాయ విద్యుత్‌కు నగదు బదిలీ పథకాన్ని అమలు చేస్తోందని, ఇందుకోసం అన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల బిల్లులకు ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తుందని పేర్కొంది. ఉచిత విద్యుత్ బిల్లు సొమ్మును రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపింది. కేంద్రం సూచించిన సంస్కరణల్లో భాగంగా నగదు బదిలీ పథకాన్ని అమలు చేయనుందని, ఈ పథకంలో వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ అందించడంతో రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని తెలిపింది. వచ్చే 30 ఏళ్లపాటు ఉచిత విద్యుత్ అందించడానికి 10,000 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను అభివృద్ధి చేయనుందని తెలిపింది. రైతుల వ్యవసాయానికి ఉచితంగా పగటి పూట 9 గంటలపాటు విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు రూ.1,700 కోట్లను ప్రభుత్వం వ్యయం చేసిందని నివేదిక తెలిపింది.

# అక్రమాల ప్రియ



పేరేమో అందరికీ 'ప్రియం'గా అనిపిస్తుంది.. వ్యవహార శైలి చూసినా, విన్నా అన్నీ అప్రియాలే... టీడీపీ హయాంలో మంత్రిగా అవకాశం లభించేసరికి దోపిడీకి లైసెన్సు పొందినట్లయింది.

ఈమె గారి పతి పేరులోనే దేవుడు... లీలల్లో రావణుడే... ఈ సతీపతుల విచ్చలవిడి దోపిడీకినంద్యాల సమీపంలోని ఓ నియోజకవర్గం అడ్డాగా మారింది. నీరు-చెట్టు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, తాగునీటి పేరిట వీరి అక్రమాలు లెక్కలేనన్ని ఉన్నాయి. వీరి దోపిడీని లెక్కగడితే రూ.వంద కోట్లు దాటి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ దంపతుల కంటికి నదురుగా ఎవరి స్థలమైనా కనిపించినా.. లేదా.. స్థల వివాదాల్లో న్యాయం చేయాలని ఎవరైనా వీరి వద్దకు వచ్చినా.. పిట్టపోరు.. పిట్టపోరు.. పిల్లి తీర్చిందన్న చందంగా ఆ స్థలాలను కాజేసే దాకా వీరు నిద్రపోరు.

**మాయ మాటలతో రైతులను వంచించడంలో ఈ దంపతులను మించిన వారు లేరని వీరిఅఘాయిత్యాలే చెబుతాయి..**

ఎవరైనా వీరి అన్యాయాలనుప్రశ్నించారో వారిపై విరుచుకుపడతారు. డబ్బుల కోసం ఏమైనా చేయడానికి వెనుకాడరనివీరి చరిత్ర చెబుతోంది. జైలుకెళ్లి వచ్చినా పద్ధతి మార్చుకోకపోవడం వీరికే చెల్లింది.

-వివరాలు III లో

ఎవరీ అక్రమార్కులు?

# చేతులెత్తేసిన ఎల్లో గ్యాంగ్

ఓటమి తప్పదని దూషణల పర్వం

సీఎం జగన్‌పై దుష్ప్రచారం చేస్తూ వాయిస్ కాల్స్

అన్‌నోన్ కాల్స్‌తో బెంబేలెత్తుతున్న ప్రజలు

షార్ట్‌ఫిలిమ్స్‌తో సీఎం, వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు ప్రచారం

ఈ ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని స్పష్టం కావడంతో చంద్రబాబు అండ్ గ్యాంగ్ బెంబేలెత్తుతోంది. ఎలాగైనా సరే ప్రజలను తప్పుదారి పట్టించాలని తప్పుడు మార్గాలు ఎంచుకుంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేస్తూ పచ్చ సోషల్ మీడియా రెచ్చిపోతోంది. స్పామ్ కాల్స్ పేరుతో జనాలకు ఫోన్‌లు చేసి విసిగిస్తోంది. ఫోన్ ఎత్తితే చాలు.. సీఎం జగన్‌పై అసభ్య పదజాలంతో దూషణలు వినిపిస్తోంది. నోటికి వచ్చిన మాటలతో తిట్ల దండకం అందుకుంటోంది. అబద్ధాలను ప్రచారం చేస్తూ బురద జల్లుతోంది. ఎవరో ఫోన్ చేస్తున్నారనుకుని ఆ ఫోన్ ఎత్తితే చాలు.. ఆ వాయిస్ కాల్‌లో సీఎం జగన్‌ను బండ బూతులు తిడుతున్నారు. పదే పదే కాల్స్ చేసి జనాలను సతాయిస్తున్నారు. ఈ క్రమంలో జనాలు అలాంటి స్పామ్ కాల్స్‌ను ఎత్తకపోవడంతో చివరికి ఎంతకు తెగించారంటే.. ఆ కాల్స్‌పై ట్రూకాలర్‌లో యువర్ జగన్, జగన్ లీడర్, మాస్ లీడర్ జగన్.. అంటూ పేర్లు వచ్చేలా చేసి.. జగన్‌ను అభిమానించే వారు ఫోన్‌లు తీసేలా చేస్తున్నారు. మరోవైపు షార్ట్‌ఫిలిమ్స్‌తో సీఎం జగన్, వైఎస్సార్‌సీపీ నేతలను దూషిస్తూ పోస్టులు పెడుతున్నారు. జగన్‌పై దుష్ప్రచారం చేయడం, టీడీపీకి ఓటు వేయాలని కోరుతుండటంతో వాటిని టచ్ చేయాలంటేనే జనాలు భయపడిపోతున్నారు. ఎలాగైనా వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి రానీయకుండా అడ్డుకునేందుకు టీడీపీ శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తోంది. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టుగా చిత్రీకరించి.. దుష్ప్రచారం చేస్తున్నాయి. ఈ విషయమై రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ఉండే మీడియా సర్టిఫికేషన్ ఆఫ్ మానిటరింగ్ కమిటీలు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఖనిజం ఎవరికి సొంతం?!

## గత ఎన్నికల్లో బీజేపీదే ఆధిపత్యం

నిలువరించేందుకు కాంగ్రెస్ యత్నం

స్టేట్ స్కాన్

హంగ్ ప్రభుత్వాలు. పదేపదే సీఎంల మార్పు, రాష్ట్రపతి పాలన. నేతల అరెస్టులు. ఇలాంటి పరిణామాలతో రాజకీయ అస్థిరతకు నెలవుగా మారింది జార్ఖండ్. దేశ ఖనిజ వనరుల్లో 40 శాతానికి నెలవైనా, అపారమైన సహజ వనరులున్నా 40 శాతం ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారు. భారీ అటవీ సంపద ఉండటంతో మావోయిస్టుల ప్రాబల్యమూ ఎక్కువే. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలు, కాంగ్రెస్ మెరుగైన ప్రదర్శన చేస్తున్నా లోక్‌సభకు వచ్చేసరికి జార్ఖండ్‌లో పదేళ్లుగా కమనాథులే సత్తా చాటుతున్నారు. ఈసారి క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన బీజేపీని అడ్డుకోవడానికి కాంగ్రెస్ సారథ్యంలో ఇండియా కూటమి సర్వశక్తులూ ఒడ్డుతోంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

జార్ఖండ్ రాజకీయాల్లో నిత్యం ఏదో అలజడి రేగుతూనే ఉంటుంది. జార్ఖండ్ ముక్తి మోర్చా చీఫ్ హేమంత్ సోరెన్ మనీ లాండరింగ్ కేసులో అరెస్టవడంతో ఆయన అనుచరుడు చంపయ్ సోరెన్ సీఎంగా పగ్గాలు చేపట్టారు. బీజేపీ ఇక్కడ పదిహేనేళ్లుగా లోక్‌సభ ఎన్నికల్లో బలం పెంచుకుంటూ వస్తోంది. గత ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమి హవాయే సాగింది. 14 స్థానాలకు గాను బీజేపీ 13 చోట్ల పోటీ చేసి 11 సీట్లు చేజిక్కించుకుంది. భాగస్వామ్య పక్షం ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజేఎస్‌యూ) ఒకచోట పోటీ చేసి గెలిచింది. కాంగ్రెస్ ప్రాభవం అంతకంతకూ మసకబారుతోంది. 2004లో 12 లోక్‌సభ సీట్ల నుంచి 2009లో ఒక్క సీటుకు దిగజారింది. 2014లోనైతే ఏకంగా సున్నా చుట్టింది! 2019లో జేఎంఎం, జార్ఖండ్ వికాస్ మోర్చా (జేవీఎం)తో కలసి పోటీ చేసినా లాభం లేకపోయింది. కాంగ్రెస్ 7, జేఎంఎం 4 చోట్ల పోటీ చేసి చెరో సీటు గెలచుకున్నాయి. జేవీఎం ఖాతా తెరవలేదు.



### కుర్చీలాట...

జార్ఖండ్ రాష్ట్ర రాజకీయాల్లో తొలి నుంచీ కుర్చీలాట సర్వసాధారణంగా మారింది. 2000 సంవత్సరంలో బిహార్ నుంచి విడిపోయి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డాక బీజేపీ సారథ్యంలోనే తొలి ప్రభుత్వం కొలువుదీరింది. ఎన్డీఏ కూటమి తరఫున బాబూలాల్ మరాండీ తొలి సీఎం అయ్యారు. పదిహేనేళ్ల లోపే 9 సంకీర్ణాలు ఏర్పడ్డాయి. ఐదుగురు సీఎంలు మారారు. రెండుసార్లు రాష్ట్రపతి పాలన విధించారు. 2014లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ మెజారిటీ దక్కించుకుంది. బీజేపీ నేత రఘుబర్ దాస్ ఐదేళ్లు సుస్థిర సర్కారు నడిపారు. 2019 ఎన్నికల్లో హేమంత్ సోరెన్ సారథ్యంలో జేఎంఎం అత్యధిక సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్, ఆర్జేడీ తదితర యూపీఏ పక్షాల మద్దతుతో హేమంత్ మళ్లీ సీఎం అయ్యారు. ముగ్గురు సీఎంలు శిబు సోరెన్, హేమంత్ సోరెన్, మధు కోడా మనీ లాండరింగ్, హత్య కేసుల్లో జైలుపాలవడం విశేషం. బీజేపీ నుంచి విడిపోయి 2006లో జార్ఖండ్ వికాస్ మోర్చా (జేవీఎం) స్థాపించిన బాబూలాల్ మరాండీ 2020లో దాన్ని బీజేపీలో విలీనం చేశారు.

### ఉప ఎన్నికల బరిలో కల్పన...

హేమంత్ సోరెన్ అరెస్టుతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఆయన భార్య కల్పన ఎన్నికల సమరానికి సై అంటున్నారు. గాండే అసెంబ్లీ స్థానానికి మే 20న జరిగే ఉప ఎన్నికల్లో జేఎంఎం తరఫున ఆమె పోటీ చేయనున్నారు. జేఎంఎం సిట్టింగ్ ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామాతో ఇక్కడ ఉప ఎన్నిక జరుగుతోంది. కల్పనను ఎమ్మెల్యేను చేసి సీఎం సీట్లో కూర్చోబెట్టేందుకే అహ్మద్‌తో రాజీనామా చేయించారని బీజేపీ ఆరోపిస్తోంది. ఇండియా కూటమి తరఫున కల్పన జోరుగా ప్రచారం చేస్తున్నారు.

### ఇండియా కూటమి సై...

రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వ భాగస్వాములైన కాంగ్రెస్, జేఎంఎం, ఆర్జేడీ, సీపీఐ(ఎంల్) ఇండియా కూటమిగా బరిలోకి దిగాయి. కాంగ్రెస్ 7, జేఎంఎం 5, ఆర్జేడీ, సీపీఐ (ఎంఎల్) ఒక్కో స్థానంలో పోటీలో ఉన్నాయి. విపక్షాలపై మోదీ సర్కారు వేధింపులు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తదితరాలను ప్రధానాంశాలుగా ఇండియా కూటమి ప్రచారం చేస్తోంది. కేంద్రంలో అధికారంలోకి వస్తే జార్ఖండ్‌లో ఉద్యోగ కల్పనతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని హామీలిస్తోంది. కాంగ్రెస్ జాతీయ మేనిఫెస్టోలోని 6 న్యాయాలు, 25 గ్యారంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తోంది.




పోలింగ్ తేదీలు: మే 13, 20, 25, జూన్ 1

### బీజేపీ పట్టు నిలుపుకుంటుందా?

లోక్‌సభ ఎన్నికల తర్వాత ఈ ఏడాది చివర్లో జార్ఖండ్ అసెంబ్లీకి కూడా ఎన్నికలున్నాయి. దాంతో రెండింటిపైనా బీజేపీ గురిపెడుతోంది. అవినీతి నాయకుల వల్లే అభివృద్ధి జరగడం లేదంటూ జోరుగా ప్రచారం చేస్తోంది. మోదీ హయాంలో అభివృద్ధి, అయోధ్య రామమందిరం తదితరాలను ప్రధానంగా ప్రస్తావిస్తోంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలిచిన సింగ్భూమ్ ఎంపీ గీతా కోరా తాజాగా బీజేపీలోకి జంప్ చేశారు. అక్కడి నుంచే బరిలో దిగుతున్నారు. జేఎంఎం అధ్యక్షుడు శిబు సోరెన్ కోడలు, సిట్టింగ్ ఎమ్మెల్యే సీతా సోరెన్ కూడా బీజేపీ తీర్థం పుచ్చుకోవడంతో ఎన్నికల వేళ ఇండియా కూటమికి షాక్ మీద షాక్ తగిలింది. ఈసారి కూడా బీజేపీ 13 చోట్ల, మిత్రపక్షం ఏజేఎస్‌యూ 1 స్థానంలో పోటీ చేస్తున్నాయి.

**సర్వేలు ఏం చెబుతున్నాయి...**

జార్ఖండ్‌లో బీజేపీ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంటుందని సర్వేలు అంటున్నాయి. ఎన్డీఏ కూటమికి 12 సీట్లు దక్కుతాయని, కాంగ్రెస్, జేఎంఎం ఒక్కో సీటుకు పరిమితం కావచ్చని అంచనా వేస్తున్నాయి.



అభివృద్ధికి పర్యాయపదం బీజేపీ. జార్ఖండ్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నాం. సింద్రీ ఎరువుల ప్లాంటు పునాదిపడ్డ ఏడేళ్లలోనే ఉత్పత్తి కూడా ప్రారంభించింది. మోదీ గ్యారంటీకి ఇదే నిదర్శనం. కాంగ్రెస్, జేఎంఎం అభివృద్ధి నిరోధక పార్టీలు. అవినీతి–వారసత్వ–బుజ్జగింపు రాజకీయాలకు మారుపేరు. జనం సొమ్ము దోచుకు తింటున్నాయి. గిరిజనులను లూటీ చేస్తూ వారిని ఓటు బ్యాంకులుగా మార్చుకున్నాయి.

- ధన్‌బాద్ సభలో ప్రధాని మోదీ



రాష్ట్రంపై మోదీ సర్కారుది సవతి తల్లి ప్రేమ. అరచేతిలో స్వర్గం చూపిస్తూ ప్రజలను వంచిస్తోంది. యువత, మహిళలు, గిరిజనులను మోదీ మోసం చేస్తున్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. బీజేపీయేతర ప్రభుత్వాలపై మోదీ కక్షగట్టారు. ప్రతిపక్షాల గొంతు నులిమేస్తున్నారు. మేం మా హక్కుల కోసం డిమాండ్ చేస్తుంటే జైల్లో పెడుతున్నారు.

- రాంచీ సభలో హేమంత్ సోరెన్ భార్య కల్పన

## ఒడిశా ప్రచారంలో 'లుంగీ' లొల్లి!



ఒకపక్క, భానుడి భగభగ. మరోపక్క ప్రచార సెగ. పానకంలో పుడకలా ఒడిశాలో లుంగీ వివాదం రాజుకుంది. బిజూ జనతా దళ్ చీఫ్, సీఎం నవీన్ పట్నాయక్ ముదురు రంగు లుంగీ ధరించి రెండు చేతుల్లో పార్టీ గుర్తు శంఖాన్ని రెండు చేతులతో పట్టుకున్న రీల్‌ను ఇన్‌స్టాలో అప్‌లోడ్ చేశారు. రాష్ట్రంలో లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలూ జరుగుతున్నందున, 'ఈసారి జోడు శంఖాలు. ఒకటి ఎమ్మెల్యే, ఇంకొకటి ఎంపీ. రెండు ఓట్లూ మన పార్టీకే వేసి ఆశీర్వదించండి' అంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. ఒడిశా సంస్కృతిలో ధోతీ ఉంది కానీ లుంగీ ఎక్కడిదంటూ బీజేపీ విమర్శలు ఎక్కుపెట్టింది. దక్షిణాది వ్యక్తులు, బెంగాలీ ముస్లింల్లా విచిత్రంగా లుంగీలో దర్శనమివ్వడం బాలేదంటూ దుయ్యబట్టింది. ''సీఎంతో ఇలాంటి విచిత్ర వేషధారణ చేయిస్తున్న చేతిలో ప్రభుత్వం బందీగా మారింది. ఒడిశా గుర్తింపును చెడగొడుతున్నారు'' అంటూ కేంద్ర మంత్రి, బీజేపీ అగ్ర నేత ధర్మేంద్ర ప్రధాన్ విమర్శించడంతో వివాదం పెద్దదైంది. బీజేపీవి చిల్లర వేశాలంటూ బీజేడీ నేతలు లుంగీలు ధరించి మరీ కౌంటరిచ్చారు. ''సంభాల్‌పురీ చేనేత లుంగీ ప్రాధాన్యాన్ని తెలియజేసేందుకే సీఎం అలా చేశారు. బీజేపీ వ్యాఖ్యలు లక్షలాది నేతన్నలను, ప్రజలను అవమానించడమే'' అన్నారు. బీజేపీ తగ్గకపోగా, బయటి సంస్కృతికి పట్టం కడుతున్నారంటూ డోసు పెంచింది. దాంతో లుంగీ–ధోతీ వార్ వైరల్‌గా మారింది.

---

# మోదీ 1.0

## ఒంటి చేత్తో బీజేపీకి విజయం

- 282 స్థానాలతో సొంతంగానే మెజారిటీ
- 44 సీట్లతో కాంగ్రెస్ ఘోర పరాజయం

భారీ కుంభకోణాలు, అవినీతి ఆరోపణలు, ధరల పెరుగుదల. పదేళ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి. వీటికి తోడు మోదీ మేనియా. అన్నీ కలిసి యూపీఏ కూటమి పుట్టిముంచాయి. 2014లో జరిగిన 16వ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాభవం మూటగట్టుకుంది. కనీసం ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు. లోక్‌సభలో సంపూర్ణ మెజారిటీ సాధించిన ఏకైక కాంగ్రెసేతర పార్టీగా బీజేపీ చరిత్ర సృష్టించింది. భారత రాజకీయాల్లో మోదీ శకం మొదలైంది...

- సాక్షి, నేషనల్ డెస్క్

2014లో ఏప్రిల్ 7 నుంచి మే 12 వరకు తొమ్మిది దశల్లో ఎన్నికలు జరిగాయి. బీజేపీ ఏకంగా 282 స్థానాలు కైవసం చేసుకుంది. ప్రభుత్వ ఏర్పాటుకు సొంతగానే సంపూర్ణ మెజారిటీ సాధించింది. మోదీ వారణాసి నుంచి పోటీ చేయడం యూపీలో బాగా కలిసొచ్చింది. ఏకంగా 70 స్థానాలు ఒడిసిపట్టింది. గుజరాత్, రాజస్తాన్‌ల్లోనూ క్లీన్ స్వీప్ చేసింది. ఎన్డీఏకు 353 స్థానాలు దక్కాయి. 2014 మే 26న 15వ ప్రధానిగా మోదీ ప్రమాణం చేశారు.



### కాంగ్రెస్ కకావికలు

గతం

2009 లోక్‌సభ ఎన్నికల్లో 206 స్థానాలు నెగ్గిన కాంగ్రెస్ 2014లో ఏకంగా 162 సీట్లు కోల్పోయింది. తన చరిత్రలోనే అత్యల్పంగా 44 స్థానాలకు పరిమితమైంది! దాంతో లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు! యూపీఏ కూటమి 78 సీట్లతో కుదేలైంది. యూపీలోనైతే సోనియా, రాహుల్ పోటీ చేసిన రాయ్‌బరేలీ, అమేథీ మినహా ఎక్కడా గెలవలేకపోయింది. వామపక్షాలకూ కోలుకోలేని దెబ్బ తగిలింది. సీపీఎం 9, సీపీఐ ఒక్క స్థానానికి పరిమితమయ్యాయి.

### ప్రచారంలో బీజేపీ మార్కు...

మోదీ సారథ్యంలో ఎన్నికల ప్రచారాన్ని బీజేపీ కొత్త పుంతలు తొక్కించింది. సంప్రదాయ ప్రసార సాధనాలతో పాటు సామాజిక మాధ్యమాలు, డిజిటల్ చానళ్లు... ఇలా ప్రతి మార్గంలోనూ ప్రజలకు చేరువైంది. ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్ తదితరాలను పూర్తిగా వాడుకుంది. ప్రచారమంతా మోదీ చుట్టే సాగేలా వ్యూహాలు అమలు చేసింది. 11.7 కోట్ల కొత్త ఓటర్లను విపరీతంగా ఆకట్టుకుంది. నిరాసక్త ఓటర్లను కూడా బూత్‌లకు రప్పించగలిగింది. కాంగ్రెస్ సంప్రదాయ ఓటర్లలోనూ మూడింట ఒక వంతు బీజేపీ వైపు మొగ్గినట్టు అంచనా! 'మోదీ చాయ్‌లు అమ్ముకునేవా'డన్న కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్ వ్యాఖ్యలను రెండు చేతులా అందిపుచ్చుకుంది. 'చాయ్ పే చర్చ'తో హోరెత్తించింది.

### రాహుల్ వర్సెస్ మోదీ

ప్రధాని అభ్యర్థిత్వానికి తాను దూరమని మన్మోహన్‌సింగ్ ముందే ప్రకటించడంతో 2009లో కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సారథిగా రాహుల్ వ్యవహరించారు. భావి సారథి ఆయనేనని సంకేతాలిచ్చింది. నాటి గుజరాత్ సీఎం నరేంద్ర మోదీని బీజేపీ ప్రధాని అభ్యర్థిగా ప్రకటించడంతో అద్వానీ మనస్తాపం చెందారు. పార్టీ పదవులన్నింటికీ రాజీనామా చేసినా మర్నాడే వెనక్కు తీసుకున్నారు. నాలుగుసార్లు గుజరాత్ సీఎంగా చేసిన మోదీ విషయ పరిజ్ఞానం ముందు ప్రచార పర్వంలో రాహుల్ పూర్తిగా తేలిపోయారు.

**16వ లోక్‌సభలో పార్టీల బలాబలాలు**

(మొత్తం స్థానాలు 543)

| పార్టీ | స్థానాలు |
|---|---|
| బీజేపీ | 282 |
| కాంగ్రెస్ | 44 |
| అన్నాడీఎంకే | 37 |
| టీఎంసీ | 34 |
| బీజేడీ | 20 |
| శివసేన | 18 |
| ఇతరులు | 108 |

### హజారే దీక్ష

యూపీఏ–2 పాలనలో అగస్టా, కామన్వెల్త్, బొగ్గు, 2జీ తదితర కుంభకోణాలు వెలుగు చూశాయి. అవినీతికి వ్యతిరేకంగా ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే చేపట్టిన ఆందోళనలు కాంగ్రెస్‌ను కోలుకోలేని దెబ్బ తీశాయి. అరవింద్ కేజ్రీవాల్ రాజకీయ రంగప్రవేశానికి కూడా ఆ ఆందోళనలే వేదికగా మారడం విశేషం! పప్పులు, వంట నూనెలు, ఉల్లిగడ్డల ధరలు గరిష్ట స్థాయికి చేరాయి. ఇతర నిత్యావసరాల ధరలూ అడ్డగోలుగా పెరిగాయి. యూపీఏ పాలనపై తీవ్ర ఆగ్రహంతో ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పట్టారు.

### విశేషాలు...

- ఈవీఎంలకు ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీప్యాట్) అనుసంధానాన్ని ప్రయోగాత్మకంగా 8 లోక్‌సభ స్థానాల్లో అమలు చేశారు.
- తొలిసారిగా నోటా ఆప్షన్ అమల్లోకి వచ్చింది.
- 2014 ఎన్నికల ముందు హడావుడిగా చేసిన ఆంధ్రప్రదేశ్ విభజనతో అక్కడ కాంగ్రెస్ చావుదెబ్బ తిన్నది.

---

రోహిణీ ఆచార్య. ఆర్జేడీ దిగ్గజం లాలుప్రసాద్ కూతురు. బిహార్ రాజకీయాల్లో ఇప్పుడు చర్చనీయంగా మారిన పేరు. రెండేళ్ల కింద తండ్రికి కిడ్నీ ఇచ్చి వార్తల్లో నిలిచిన ఆమె పట్నా ర్యాలీలో వేదిక ఎక్కినప్పుడే రాజకీయ అరంగేట్రంపై వార్తలొచ్చాయి. వాటిని నిజం చేస్తూ ఇప్పుడు తండ్రి నియోజకవర్గమైన సరన్ నుంచి లోక్‌సభకు పోటీ చేస్తున్నారు...

- సాక్షి, నేషనల్ డెస్క్

పరిచయం

### లాలు కుటుంబం నుంచి ఆరో నేత...

ఆర్జేడీ వ్యవస్థాపకుడు లాలుప్రసాద్ రాజకీయ ఉద్దండుడు. బిహార్ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని కుటుంబం. భార్య రబ్రీదేవి కూడా మూడుసార్లు బిహార్ సీఎంగా చేశారు. ప్రస్తుతం శాసనమండలిలో విపక్ష నేతగా ఉన్నారు. పెద్ద కూతురు మీసా భారతి రాజ్యసభ ఎంపీ. రెండుసార్లు పాటలీపుత్ర లోక్‌సభ స్థానంలో ఓడిన ఆమె ఈసారి మళ్లీ అదృష్టం పరీక్షించుకుంటున్నారు. లాలు కొడుకులు తేజ్ ప్రతాప్, తేజస్వీ ఎమ్మెల్యేలు. తేజస్వీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత కూడా. లాలు కుటుంబం నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్న ఆరో వ్యక్తి రోహిణి. ఆమె ఎంబీబీఎస్ చదివినా వైద్య వృత్తి చేపట్టలేదు. తండ్రి స్నేహితుడైన రాయ్ రణవిజయ్‌సింగ్ కుమారుడు సమ్రేశ్‌ను పెళ్లి చేసుకుని అమెరికాలో స్థిరపడ్డారు. భర్త ఉద్యోగరీత్యా సింగపూర్‌కు మారారు. ఇద్దరు పిల్లలతో ప్రస్తుతం అక్కడే ఉంటున్నారు.

# • రోహిణీ ఆచార్య


# లాలు హృదయకాలేయం

### 'కిడ్నీ టికెట్' విమర్శలకు దీటుగా జవాబు

రోహిణికి టికెటివ్వగానే బీజేపీ విమర్శల దాడికి దిగింది. కిడ్నీ ఇచ్చినందుకు కూతురికి లాలు లోక్‌సభ టికెట్ అమ్ముకున్నారంటూ ఎద్దేవా చేసింది. అందుకు రోహిణి గట్టిగానే బదులిచ్చారు. ''నాన్నకు కిడ్నీ ఇవ్వడం నా బాధ్యత. అయితే బిహార్ కోసం ప్రాణాలిచ్చేందుకైనా సిద్ధం. అల్పబుద్ధులు దీన్ని అర్థం చేసుకోలేరు'' అన్నారు. రోహిణిని 2017లోనే రాజ్యసభకు పంపుతారని వార్తలొచ్చినా ఆమె క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఐదేళ్లుగా సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ వస్తున్నారు. ఇటీవల బిహార్ సీఎం, జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్ ఆర్జేడీ కూటమికి చెయ్యిచ్చి మళ్లీ ఎన్డీఏ గూటికి చేరినప్పుడు, 'చెత్త ఎప్పుడూ డస్ట్‌బిన్‌కే చేరుతుంది' అంటూ ఆమె చేసిన వ్యాఖ్య సంచలనం రేకెత్తించింది. సామాజిక సమస్యల పైన రోహిణి నిత్యం సోషల్ మీడియాలో చురుగ్గా స్పందిస్తారు.

### ఇంటి పేరు ఆసక్తికరం...

లాలుప్రసాద్, రబ్రీ దేవిలకు రోహిణి రెండో కూతురు. ఆమె పేరు వెనుక ఆసక్తికరమైన కథే ఉంది. ఆమె 1979లో పుట్టారు. పట్నాకు చెందిన గైనకాలజిస్ట్ డాక్టర్ కమలా ఆచార్య ప్రసవం చేశారు. వైద్యానికి ఫీజు తీసుకోవడానికి నిరాకరించారు. లాలు పట్టుబట్టడంతో పాపకు తన ఇంటి పేరు పెట్టమని అడిగారు. అందుకు లాలు అంగీకరించారు. పాప జన్మనక్షత్రం రోహిణి. దానికి డాక్టర్ ఇంటిపేరు కలిపి రోహిణీ ఆచార్యగా పేరు పెట్టారు. మీసా చట్టం వచ్చిన 1971లో పుట్టిన పెద్ద కూతురుకు మీసా భారతి అని లాలు పేరు పెట్టుకోవడం తెలిసిందే!



# ఇదీ నవరత్నాల వెలుగులు



మంచి ప్రభుత్వం అధికారం చేపడితే... మనసున్న నేత ముఖ్యమంత్రి పదవిలో ఉంటే కుటుంబాలు దశ ఏ విధంగా తిరగనుందోన నడానికి ఉదాహరణ

కొవ్వూరు మండలం వేములూరుకి చెందిన మారిశెట్టి సత్యనారాయణ బతుకు చిత్రం. పూరి పాకలోనే తుదివరకూ జీవితం కొడిగట్టిపోవల్సిందేమోననే వేదనతో ఆ కుటుంబం విచారవదనంతో ఉండేది. కానీ ఆ పాకలో క్రమేపీ వెలుతుర్లు విరజిమ్మాయి. ఆ మోములో చిరునవ్వులు చిందాయి. దీనికంతటికీ కారణం జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నవ వసంతాలు పూయించాయి. అదెలానో చూద్దాం.

- కొవ్వూరు, తూర్పుగోదావరి జిల్లా

**వైఎస్సార్‌సీపీ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి**

| | |
|---|---|
| వైఎస్సార్ పింఛన్ కానుక | రూ.1,40,750. |
| వైఎస్సార్ చేయూత | రూ.56,250 |
| ఇంటి స్థలం విలువ | రూ.2,00,000 |
| ఇంటినిర్మాణానికి ఆర్థిక సాయం | రూ.1,80,000 |
| మొత్తం లబ్ధి | రూ.5,77,000 |

## దశాబ్దాల కల నెరవేరిన వేళ...

మూడు దశాబ్దాలకు పైగా రోడ్డు మార్జిన్‌లో పూరిపాకలోనే సత్యనారాయణ కుటుంబ నివాసం. సొంత ఇల్లంటూ వీరికి లేదు. ఓ గూడు కల్పించాలంటూ ఎంతో మంది నాయకుల చుట్టూ తిరిగి విసిగిపోయారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన అనంతరం సొంతింటి కల సాకారమైంది. ఎవరి సిఫార్సులు లేకుండానే వలంటీర్ ఇంటికి వచ్చి వివరాలు తీసుకుని వెళ్లారు. ఆ వెంటే ఇంటి స్థలం మంజూరైంది. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షల సాయం అందించారు. జీవితంలో సొంతంటి కల నెరవేరుతుందా అనుకున్న వారి బతుకుల్లోకి ముప్పై ఏళ్ల తర్వాత ఓ పొదిరిల్లు పలకరించింది. గీత కార్మిక వృత్తి చేసుకున్న ఆ ఇంటి యజమానికి రూ.3 వేలు గీత కార్మిక పింఛన్ మంజూరైంది. వయస్సు మీద పడిన సమయంలో ఆ సొమ్ము వారి కుటుంబానికి ఎంతో ఊరటనిస్తోంది. ఇప్పటి వరకూ రూ.1,40,750 అందుకున్నారు. సత్యనారాయణ భార్య గన్నెమ్మకి చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,500 చొప్పున బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ.56.250 అందాయి. ఇంటి స్థలం, ఇంటి రుణం అన్నీ కలిపి రూ.5.77 లక్షల లబ్ధి చేకూరింది. వారి మనవరాలికి అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.15 వేలు అందుతోంది. జగన్‌మోహన్‌రెడ్డి మేలు ఎప్పటికీ మరిచిపోలేమని వారు సంతోషంగా చెబుతున్నారు.



జగనన్న కాలనీలో నిర్మించుకున్న నూతన గృహం వద్ద మారిశెట్టి సత్యనారాయణ, గన్నెమ్మ దంపతులు

### చేయూత అందించారు



ప్రభుత్వం 45 ఏళ్లు పైబడిన మహిళలకు అందించే చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,500 అందిస్తున్నారు. ఈ సొమ్ము నా కుటుంబానికి ఎంతో ఉపకరిస్తుంది. నా భర్త గీత కార్మికుడు. వయస్సు మీదపడడంతో పనులకు వెళ్లలేకపోతున్నాం. ఈ సొమ్ముతో ఏటా అందించడంతో మా కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది. సంక్షేమ పథకాల ద్వారా పేదల బతుకుల్లో భరోసా కల్పించారు.

– మారిశెట్టి గన్నెమ్మ,
వేములూరు, జగనన్న కాలనీ,
కొవ్వూరు మండలం

---

- నంద్యాలకు ఆనుకుని ఉన్న నియోజకవర్గంలోని మూడు మండలాల గుండా ప్రవహించే వక్కిలేరులో అప్పటి టీడీపీ మంత్రి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి దాదాపు మూడేళ్ల పాటు ఏటా నీరు–చెట్టు పేరిట పనులు చేస్తున్నట్లు హడావుడి చేశారు. ఒకటి రెండు కాదు.. ఏకంగా 350 పనులుగా దీన్ని విభజించి తన బంధువులైన రామతీర్థ పుట్టాలమ్మ ఆలయ అప్పటి చైర్మన్ (ప్రస్తుత బీజేపీ నాయకుడు), అప్పటి సహకార సంఘం చైర్మన్, కోటకందుకూరు మాజీ సర్పంచికి అప్పగించారు. వారు వాగులో అరకొర పనులు చేసి ఏకంగా రూ.3 కోట్లకు పైగా నిధులు కొల్లగొట్టారు. ఇందులో నాటి మంత్రికి సగం ముట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం నుంచి వర్క్ ఆర్డర్ లేకపోయినా అధికారులను బెదిరించి బిల్లులు చేయించుకున్నట్లు సమాచారం.

- రుద్రవరం మండలం నాగులవరం సమీపంలోని టీజీపీ పంట కాలువలో పూడిక తీసినట్లు అధికారులు బిల్లులూ మంజూరు చేశారు. ఇదే గ్రామానికి చెందిన నాటి మంత్రి అనుచరుడు ఇలాంటి పది పనులు సుమారు రూ.కోటితో చేసినట్లు తెలుస్తోంది. ఇందులో నాలుగు పనులు నాసిరకంగా చేపట్టగా, ఆరు పనులను అసలు చేయకుండానే బిల్లులు ఆమోదింపజేసుకుని రూ.60 లక్షలు మింగేశారని సమాచారం. ఇలా పైపై పనులు చేపట్టి దాదాపు రూ.130 కోట్ల మేర నాటి మంత్రి, జన్మభూమి కమిటీలు, వారి అనుచరులు బొక్కేశారు. రైతులకు ఉచితంగా ఇచ్చే శనగ విత్తనాల నుంచి **మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని ఇతర రాష్ట్రాల నుంచి మినుములను రప్పించి ఇక్కడి రైతులవే అని చెప్పి కొల్లగొట్టేశారు.**



### తాగునీటి సరఫరా పేరుతో దోపిడీ...

చంద్రబాబు ఐదేళ్ల పాలనలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ సమస్యను తమకు అనుకూలంగా మార్చుకుని అప్పటి మంత్రిగా అడ్డంగా దోచేశారు. పట్టణంలో ట్యాంకరుకు రూ.500 నుంచి రూ.750 వరకు ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. మంత్రి అనుచరులు ట్యాంకర్లను కొని మున్సిపాలిటీకి అద్దెకిచ్చారు. నీటిని వారు తరలించకుండానే కోట్లాది రూపాయలు దోపిడీ చేశారు.

### ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ వేషంలో వెళ్లి కిడ్నాప్..

హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లిలో 40 ఎకరాల భూమి ఆక్రమించుకునేందుకు మాజీ మంత్రి, ఆమె వర్గీయులు చేసిన కిడ్నాప్ సినిమాను తలపించింది. ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ల వేషంలో వెళ్లి కిడ్నాప్ చేయడంతో అప్పట్లో సంచలనమైంది. అయితే తీరా కిడ్నాప్ చేసిన మనుషులు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బంధువులు కావడంతో కథ అడ్డం తిరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి కిడ్నాప్ చేసిన వ్యవహారంలో మాజీ మంత్రిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆమె ఏ1 నిందితురాలు. నెలల తరబడి జైలు జీవితం గడిపారు. కిడ్నాప్ కేసులో ఓ మహిళా మాజీ మంత్రి జైలుకు వెళ్లడం అదే తొలిసారి.

# అక్రమాల ప్రియ

**కబ్జాలు, దౌర్జన్యాలు, దోపిడీలకు నిలువుటద్దం**

- టీడీపీ హయాంలో 'నీరు–చెట్టు' పేరుతో రూ.కోట్ల దందా
- టెండర్‌తో పనిలేకుండా రూ.200 కోట్ల స్వాహా
- ఖాళీ స్థలాలు కనిపిస్తే దర్జాగా కబ్జా
- హైదరాబాద్‌లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడి జైలు శిక్ష
- అయినా పద్ధతి మార్చుకోక స్వస్థలంలోనూ దౌర్జన్యాలు
- పంచాయితీకొచ్చిన ఓ వ్యక్తి నుంచి రూ.1.30 కోట్లు లాక్కున్న వైనం
- తప్పుడు పత్రాలతో బ్యాంకులకూ బురిడీ

### సతి ఆదేశం.. పతి దౌర్జన్యం..

చింతకుంట గ్రామానికి చెందిన గూడా నరసింహుడు భార్య వెంకట లక్ష్మమ్మకు ఆళ్లగడ్డ పట్టణ శివారులో 25 సెంట్ల స్థలముంది. ఆ స్థలాన్ని మహమ్మద్‌హుసేన్, నూర్ అహమ్మద్‌ల నుంచి 1995 మార్చి 27న కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రూ.2 కోట్ల విలువ చేసే ఈ స్థలం ఖాళీగా ఉండటాన్ని గమనించిన ఈ దంపతులు ఓ సర్వేయర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ద్వారా 1952లో అల్లిసా పేరిట రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను బయటకు తీశారు. అవుకు మండలం సంగపట్నంలో నివసించే వారి మనవడు నూర్‌బాషాకు నచ్చజెప్పి మూడు భాగాలుగా చేసి 2022 డిసెంబర్1న అనుచరుల పేరున రిజిస్ట్రేషన్ చేయించేశారు. ఇప్పుడు 'గూడా' దంపతులు లబోదిబోమంటున్నారు. ఈ అరాచక దంపతుల దౌర్జన్యంలో ఇది మరో కోణం.

సాక్షి, టాస్క్‌ఫోర్స్:

గత ప్రభుత్వంలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన **యువ మహిళా మంత్రి అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా** మారారు. అక్రమాలను అవలీలగా చేసేశారు. ఇప్పుడామె అధికారంలో లేకున్నా... కబ్జాలకు కొదవలేదు. ఎదిరించేవారిపై దౌర్జన్యాలకూ వెనుకాడటం లేదు. ఆమెతోపాటు ఆమె రెండో భర్త చేసిన అరాచకాలు అన్నీఇన్నీకావు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏ పనిచేసినా వారికి వాటాలు ముట్టజెప్పాల్సి వచ్చేది. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నియామకాల్లోనూ ఈ సతీపతుల వసూళ్ల దందా సాగింది. అభివృద్ధి పనుల్లోనూ ఆ దంపతులు రూ.కోట్లలో పర్సంటేజీలు మూటగట్టుకున్నారు. చివరకు పారిశుద్ధ్య కార్మికుల నియామకంలోనూ వసూళ్లు కొనసాగించారు. వివిధ పనుల్లో టెండర్లతో పని లేకుండా రూ.200 కోట్ల వరకూ స్వాహా చేశారు. అధికారం కోల్పోయినా తమ దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది.

**అభివృద్ధి పేరుతో అక్రమాలు...**


ఆమె టీడీపీ హయాంలో నియోజకవర్గంలో వివిధ పనుల కోసం కోట్లాది రూపాయలు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించుకుని వాటిని పక్కదారి పట్టించారు. అధికారులను బెదిరించి పనులు చేయకుండానే బిల్లులు చేయించుకున్నారు. నియోజకవర్గ పరిధిలో జరిగిన ప్రతి పనినీ తన అనుయాయులకే టెండర్‌తో ప్రమేయం లేకుండా కట్టబెట్టించి వారి వద్ద పర్సంటేజీలు నొక్కేశారు.

**దౌర్జన్యాలకు నిదర్శనాలెన్నో..**

- తాజాగా ఓ పంచాయితీ కోసం ఇంటికొచ్చిన ఓ ముస్లిం మైనార్టీ నాయకుడిని అందరూ చూస్తుండగానే మాజీ మంత్రి దంపతుల ఆదేశాల మేరకు అనుచరులు చితకబాది వారి వద్దనున్న రూ.1.30 కోట్లు దోచేయడం ఇప్పుడు సంచలనమైంది.
- జగత్ డెయిరీకి చెందిన అమాయక రైతుల పేర్లపై బ్యాంకు రుణాలు తీసుకుని మంత్రి తిరిగి చెల్లించకపోవడంతో ఆ రైతులు డిఫాల్టర్లుగా మారి పంట రుణాలూ పొందలేక అల్లాడిపోయారు.
- మంత్రిగా ఉన్నప్పుడు కమీషన్లకు ఆశపడి మున్సిపల్ శానిటరీ, స్వీపర్ పోస్టులతోపాటు టూరిజం శాఖలో విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఉద్యోగాలను అమ్ముకున్నారు.
- నీరు చెట్టు పనుల్లో అడిగినంత కమీషన్ ఇవ్వలేదని భాచాపురం గ్రామ నాయకుడి చెక్‌బుక్ దొంగిలించి అతనిపై చెక్‌బౌన్స్ కేసు పెట్టి వేధించారు.
- మాజీ మంత్రి ప్రస్తుత భర్త ద్వారా ఖాళీ స్థలాలపై కన్నేసి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు. భూ కబ్జాలకు పాల్పడి బాధితులను చంపుతామని బెదిరించారు. వ్యాపారవర్గాలను భయభ్రాంతులకు గురి చేశారు.
- అవసరమైనప్పుడు అప్పులిచ్చి ఆదుకున్న స్నేహితులు, శ్రేయోభిలాషులను మోసం చేశారు. రుణాలు ఎగ్గొట్టారు. వారిని ఇంట్లోకీ రానివ్వకుండా అవమానించారు.
- తండ్రి ఇంటిపేరును దుర్వినియోగం చేయడంతో విసిగిపోయిన బంధువులు ఆమెకు దూరమయ్యారు. ఆమెను, ఆమె భర్తను బహిష్కరించారు. ఎన్నికల్లో పోటీ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నారు.
- నాలుగేళ్లుగా హైదరాబాద్‌కే పరిమితమైన మాజీ మంత్రి దంపతులు ఇప్పుడు ఎన్నికలు రావడంతో పదవి కోసం మళ్లీ నియోజకవర్గంలో తిష్టవేశారు.

---

# ప్రజల మనిషి జగన్



- పాలనపట్ల విజన్ ఉన్న నాయకుడు
- ఆయన దృష్టి అంతా రాష్ట్ర భవిష్యత్ పైనే...
- ప్రజల కోసం ఏదో ఒకటి చేయాలన్నదే ఆయన తపన
- కొన్ని తరాలపాటు ఆయన పేరు నిలిచిపోవాలన్నదే ఆకాంక్ష
- సాక్షితో ప్రసిద్ధ సినీ నటుడు భానుచందర్ ఇంటర్వ్యూ

'రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. నిరంతరం ప్రజల మనిషిగా నిలిచిపోవాలన్నదే ఆయన ఆకాంక్ష. గత ఎన్నికల సమయంలోనే ఆయనలో ఉన్న గొప్ప ప్రజాసేవకుడిని గుర్తించాను. ఆయన తన ఆకాంక్షలు అంచనాలకు మించి జగన్ పనిచేస్తున్నారు' అని ప్రముఖ చలన చిత్ర నటుడు భాను చందర్ అన్నారు. జగన్ పాలనా దక్షతపై 'సాక్షి'తో ప్రత్యేకంగా ఆయన మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...




నిస్సందేహంగా జగన్ ఒక బ్రిలియంట్ గై. ఆయన ఏది చేసినా ప్రజల గురించి చేస్తున్నారు. ఆయనో అసలు సిసలు యువ నేత. ఆయనది నవ యువ భావజాలం. ఆయన రాష్ట్ర భవిష్యత్తు గురించి ప్రతీ నిమిషం ఆలోచన చేస్తున్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ ఎలాగైతే భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పని చేస్తున్నారో... అలాగే జగన్ బాబు కూడా అదే ఆలోచనతోనే ప్రయాణం చేస్తున్నారు. ఆయన ప్రజల కోసం ఏదో ఒకటి చేయాలనే సంకల్పంతో ముందుకు వెళుతున్నారు. ప్రజల మేలు కోరి చేసే ఆయన ఆలోచనలు, ప్రణాళికలు... అన్నీ సాకారం కావాలని నేను కోరుకుంటున్నాను.

### వైఎస్సార్‌లాగా కాదు... అంతకు మించి

ఈ భూమ్మీద ఎవరూ శాశ్వతం కారు. బతికినంత కాలం మనం నలుగురికి ఏం మంచి చేశామనేదే ముఖ్యం. కొన్ని తరాల పాటు మన పేరు ప్రజలకు గుర్తుండిపోవాలి. దివంగత వైఎస్సార్ విషయంలో అదే జరిగింది కదా. ఆరోగ్యశ్రీ అనే ఒక్క పథకం వల్ల వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇప్పటికీ జనం గుండెల్లో శాశ్వతంగా బతికున్నారు. అలాగే జగన్‌బాబు కూడా అంతకు మించి అనేక మంచి పనుల ద్వారా ప్రజలకు గుర్తుండిపోవాలి అని ఆశపడుతున్నారు. నిజంగా యుక్త వయసులోనే ఇలాంటి ఆలోచనా ధోరణి రావడం చాలా గొప్ప విషయం. అది సాధించే శక్తి కూడా ఆయనకు ఉంది.

–సాక్షి, అమరావతి

### మంచికే మద్దతు పలకాలి

మోదీ నుంచి జగన్ బాబు దాకా ప్రజలకు మంచి చేసే వారికి మద్దతివ్వాలి అనేది నా మనస్తత్వం. విమర్శలు చేసేవాళ్లు ఎప్పుడూ ఉంటారు. మన దేశంలో గాంధీజీ మీద కూడా విమర్శలు చేస్తారు. ఎవరి విమర్శల వెనక ఏముందో ప్రజలకు బాగా తెలుసు. అయితే అవన్నీ పక్కనబెట్టి మనం ప్రజలకు ఏం చేస్తున్నాం? మన వల్ల ప్రజలకు కలుగుతున్న లాభమేమిటి? అనేది జగన్ బాబుకు ముఖ్యం. తను నమ్ముకున్న అదే పంథాలో ఆయన వెళుతున్నారు. కచ్చితంగా ఆయనకు అంతా శుభమే జరగాలి. జరుగుతుంది కూడా. నేను గత ఎన్నికల ముందు కూడా జగన్ ఆలోచనలు అద్భుతంగా ఉన్నాయని, ఆయన గొప్ప పాలన అందిస్తారని అప్పుడే చెప్పాను. ఇప్పుడు అదే జరుగుతోంది. గెలిచిన తర్వాత ఒక్కసారి కూడా జగన్‌ను నేను కలవలేదు. అయితే అది ముఖ్యం కాదు. ఆయన ప్రజలకు మంచి చేయడం నాకు ముఖ్యం. అలాంటి ముఖ్యమంత్రికి నాలా ప్రజల మంచి కోరుకునే ప్రతీ ఒక్కరూ మద్దతివ్వాలి. ఇస్తారనే నేను నమ్ముతున్నాను. తమకెవరు మంచి చేశారనేది ప్రజల్లో ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. తమ గురించి నిరంతరం ఆలోచించే మంచి చేసిన వారినే జనం గెలిపిస్తారు. జనం గురించి ఎప్పుడూ ఆలోచించే నాయకుడు జగన్. నా ఉద్దేశం ప్రకారం మళ్లీ జగన్ గెలవడం... ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగడం ఖాయం.

# సంక్షేమ సిరిమల్లిక

**జగనన్న ప్రభుత్వంలో ఆర్థిక బాసట**
**పది మందికి ఉపాధినిచ్చేలా ఎదుగుదల**

**మదనపల్లె పట్టణం సుభాష్‌రోడ్డు వీధికి చెందిన రాజేంద్రప్రసాద్, నాగమల్లిక భార్యభర్తలు. చిన్నపాటి వ్యాపారం ద్వారా వచ్చే చాలీచాలనీ ఆదాయంతో కుటుంబాన్ని గడపాల్సి వచ్చేంది. వీరికి అమృత, వర్షిత ఇద్దరు కుమార్తెలు. పిల్లలను చదివించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. రేషన్‌కార్డు తప్ప ఎటువంటి పథకాలు అందేవి కావు. నాగమల్లిక తెలిసిన వారి దగ్గర అప్పు చేసి సుభాష్‌రోడ్డులోనే చిరుతిళ్ల దుకాణం ప్రారంభించారు. వచ్చే అరకొర ఆదాయంతో కుటుంబ పోషణ కష్టంగానే ఉండేది. దీనికి తోడు పిల్లల్ని గొప్పగా చదివించాలన్న కోరిక తీరేనా? అన్న బెంగ వెంటాడేది. ఇదంతా 2019కి ముందు పరిస్థితి.**

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమలు చేసిన సంక్షేమ పథకాలలతో ఆ కుటుంబానికి భరోసా కలిగింది. వైఎస్సార్ ఆసరా, ఇద్దరు పిల్లలకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి వస్తోంది. రూ.6 లక్షలు విలువ చేసే ఇంటి స్థలం ఇచ్చారు. ప్రస్తుతం పెద్ద కుమార్తె అమృత బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. చిన్న కుమార్తె హర్షిత డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. గతంలో కష్టాలు పడిన నాగమల్లిక కుటుంబం ప్రభుత్వ పథకాల ద్వారా సుభాష్‌రోడ్డులోనే ఓ షాపు పెట్టి అందులో చిరుతిళ్లు తయారు చేస్తున్నారు. నిప్పట్లు, చెక్కిలాలు, అత్తిరాసలు, మిక్చర్ వంటివి తయారు చేస్తూ హోల్‌సేల్‌గా అమ్ముతున్నారు. చిరుతిళ్ల తయారీలో 10 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. వీటిని తయారు చేసి షాపులో రిటైల్ అమ్మకాలతో పాటు పరిసర ప్రాంతాలకు హోల్‌సేల్ ధరకు సరఫరా చేస్తున్నారు. దీంతో వారి కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకుంది.

–మదనపల్లె

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కలిగిన లబ్ధి**

| | |
|---|---|
| వైఎస్సార్ ఆసరా | రూ.32,328 |
| జగనన్న వసతి దీవెన | రూ.23,350 |
| జగనన్న విద్యాదీవెన | రూ.41,201 |
| సున్నా వడ్డీ | రూ.2,850 |
| అమ్మ ఒడి | రూ.45,000 |
| ఇంటి స్థలం | రూ.6,00,000 |



చిరు తిండ్లు తయారు చేస్తున్న నాగమల్లిక, ఉపాధి పొందుతున్న మహిళలు

### జీవన ప్రమాణాలు పెరిగాయి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో చాలా మందిలో జీవన ప్రమాణాలు పెరిగాయి. తలసరి ఆదాయం పెరిగింది. ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా బలహీన వర్గాలకు అందిస్తున్న నిధులతో వారు సొంతంగా వ్యాపారం చేసుకునేందుకు వీలవుతుంది. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెనతో పేద పిల్లలు కూడా ఉన్నత చదువులు చదువుకుని స్థిరపడ్డారు. ఇది చాలా శుభపరిణామం.

– జీఆర్ రుక్మిణి, పూర్వ ప్రిన్సిపాల్, మహిళా డీగ్రీ కళాశాల, మదనపల్లె

# సేద్యంలో సేవలకు సలాం

▶ మొదటి పేజీ తరువాయి

పత్రం కూడా రైతులకు అందిస్తోంది. రైతాంగానికి బీమా నమోదు రసీదులను కూడా పంపిణీ చేస్తున్నారు. ఉచిత పంటల బీమా నమోదు ప్రక్రియ వీలైనంత సరళంగా, అవాంతరాలు లేకుండా చేస్తున్నారు. ఈ పథకం విజయవంతంగా అమలయ్యే తీరు వ్యవసాయ అభివృద్ధిని సూచిస్తోంది.

**అందివచ్చిన ఆర్‌బీకేలు:** వ్యవసాయంలో సవాళ్లను పరిష్కరించేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఇది ఉత్తమ ఆచరణగా నీతి ఆయోగ్ కితాబు ఇచ్చింది. రైతులకు నాణ్యమైన ఇన్‌పుట్‌లు, సేవలు అందించడంతోపాటు సామర్థ్యం పెంపుదల, విజ్ఞాన వ్యాప్తిని ఆర్‌బీకేలు అందిస్తున్నాయని తెలిపింది. ఇవి పంటల సేకరణ కేంద్రాలుగా పని చేస్తూ రవాణా ఖర్చులను తగ్గించడం ద్వారా పారదర్శకంగా రైతాంగానికి భరోసా ఇస్తున్నాయని వ్యాఖ్యానించింది. ఈ కేంద్రాలు అధిక దిగుబడి సాధించడంలోను, పంటల నాణ్యతను మెరుగుపరిచేందుకు సహాయపడటంలో విజయవంతమయ్యాయని నివేదిక తెలిపింది. ఆర్‌బీకేలను పంటల కొనుగోలు కేంద్రాలుగా ప్రకటించిన తరువాత రైతులు తమ ఉత్పత్తులను గ్రామంలోనే విక్రయించుకునే వీలు కలిగింది. వీటి ద్వారా రైతాంగం ప్రభుత్వ పథకాలు నేరుగా పొందుతున్నారు. ముందుగా పరీక్షించడం ద్వారా నకిలీ విత్తనాలను నిరోధించడంతో పాటు ప్రైవేట్ అవుట్‌లెట్లలో అధిక ధరలను నిరోధిస్తున్నాయి. వ్యవసాయ యాంత్రీకరణ, ఉచిత పంటల బీమా నమోదు కార్యక్రమాలు ఆర్‌బీకేలు నిర్వహిస్తున్నాయి. రైతులకు కావాల్సిన సలహాలు, సూచనలు శాస్త్రవేత్తలు అందిస్తున్నారు.

# ఆర్థిక కేటుగాళ్లకు టీడీపీ అడ్డా

▶ మొదటి పేజీ తరువాయి

**బినామీ 'బాబు'..సీఎం రమేశ్**

చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు, బినామీ సీఎం రమేశ్.. అతని అక్రమ లావాదేవీలను ఆదాయపన్ను శాఖ వెలికి తీసింది. సబ్ కాంట్రాక్టర్ల ముసుగులో పనులు చేయకుండానే చేసినట్లు చూపి రూ.800 కోట్ల నిధులు సొంత ఖాతాల్లోకి మళ్లించారు. పనులు చేయకుండానే చేసినట్లు బిల్లులు తీసుకుని వాటిని చిరునామా లేని కంపెనీల్లోకి మళ్లించి ఆ కంపెనీల నుంచి సీఎం రమేశ్ సంస్థ నగదును వెనక్కి తీసుకుంది. అతనికి చెందిన నిర్మాణ రంగ కంపెనీ రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సుమారు రూ.800 కోట్ల నిధులను వివిధ కంపెనీల ద్వారా దారి మళ్లించినట్లు ఐటీ శాఖ అధికారులకు ఆధారాలు లభించాయి. గత ఆరేళ్లలో ఎడ్కో(ఇండియా) అనే సబ్‌కాంట్రాక్టర్‌కు రూ.12 కోట్లు చెల్లించినట్లు పుస్తకాల్లో చూపారు. రికార్డుల్లో పేర్కొన్న నాలుగు చిరునామాల్లో ఆ కంపెనీ ఆనవాళ్లు ఎక్కడా కనిపించలేదు. రిత్విక్ ప్రాజెక్టులో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న సాయిబాబా వద్ద ఎడ్కో కంపెనీకి చెందిన స్టాంపులు, సీల్ దొరకడంతో గుట్టు రట్టయ్యింది. దొంగ వ్యాపారాల ద్వారా సంపాదించిన మొత్తాన్ని పార్టీకి ఇచ్చి వరుసగా రెండుసార్లు రాజ్యసభ సీటు దక్కించుకున్నారనేది అందరికీ తెలిసిందే. కేసుల నుంచి తప్పించుకోవడానికి బీజేపీలో చేరి.. ఇప్పుడు ఆ పార్టీ నుంచి అనకాపల్లి ఎంపీగా పోటీ చేస్తున్నారు.

**గంటా శ్రీనివాసరావు..**
**రూ.390.7 కోట్ల ఎగవేత**

టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్న గంటా శ్రీనివాసరావు బ్యాంకుల నుంచి భారీగా రుణాలు తీసుకొని తిరిగి చెల్లించకుండా ముప్పతిప్పలు పెడుతున్నారు. ప్రభుత్వ బ్యాంకుల నుంచి సుమారు రూ.390.7 కోట్ల రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో అతని ఆస్తులను స్వాధీనం చేసుకోవడానికి బ్యాంకులు ఐదేళ్లుగా పోరాడుతున్నాయి. గంటాకు సంబంధించిన ప్రత్యూష గ్రూపు కంపెనీలు వివిధ బ్యాంకులకు వడ్డీతో కలిపి రూ.390.7 కోట్లకు పైగా రుణం తీసుకొని ఇంతవరకు ఒక్క వాయిదా కూడా చెల్లించలేదు. ఆస్తుల స్వాధీనానికి ఇండియన్ బ్యాంకు రంగంలోకి దిగింది. ఈ రుణానికి గంటా హామీ ఉండడంతో ఆయనకు చెందిన ఆస్తులు స్వాధీనం చేసుకుంటున్నట్లు పత్రికా ప్రకటనలు జారీ చేసింది. గత నెలలో ఇండియన్ బ్యాంకు విశాఖలోని బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని గంటా స్థలాన్ని వేలం వేసేందుకు పత్రికా ప్రకటన ఇచ్చింది.

## మీకు తెలుసా?

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న అమ్మ ఒడి పథకం ద్వారా తల్లుల ఖతాల్లో ఇప్పటివరకూ జమచేసిన మొత్తం రూ.**25,809.5**కోట్లు

మనబడి నాడు-నేడు పథకం ద్వారా రెండు దశల్లో మొత్తం 38,059 పాఠశాలల అభివృద్ధికి చేసిన ఖర్చు రూ.**11,669**కోట్లు




### ఈ ఊరికి ఇద్దరు ఎమ్మెల్యేలు!

అనంతపురం జిల్లాలోని కొండేపల్లిది విచిత్రమైన పరిస్థితి. గ్రామం ఒక్కటే అయినా రెండు నియోజకవర్గాలు(శింగనమల, తాడిపత్రి), పుట్లూరు, తాడిపత్రి మండలాల పరిధిలో ఉంది. తాడిపత్రి పరిధిలో 70, పుట్లూరు పరిధిలో 75 కుటుంబాలున్నాయి. గ్రామం రెండు పంచాయతీల పరిధిలో ఉంది. ఊరి ఓటర్లు ఇద్దరు ఎమ్మెల్యేలను ఎన్నుకుంటారు. 2009కి ముందు గ్రామస్థులు ఇద్దరు ఎంపీలను కూడా ఎన్నుకునేవారు. అప్పట్లో పుట్లూరు మండల పరిధిలోని ఓటర్లు హిందూపురం లోక్‌సభ, ధర్మవరం అసెంబ్లీ స్థానాల పరిధిలో ఉండేవారు. పునర్విభజన తర్వాత వీరిని శింగనమల సెగ్మెంట్‌లోకి తెచ్చారు. శింగనమల.. అనంతపురం లోక్‌సభ స్థానం పరిధిలోనే ఉండటంతో ప్రస్తుతం ఒకే ఎంపీని ఎన్నుకుంటున్నారు.

### చెంగాళమ్మను విస్మరిస్తే పదవి గల్లంతే!

నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరీ దేవి ఆలయం వైపుగా వెళ్తూ అమ్మవారిని దర్శించుకోకపోతే ప్రజాప్రతినిధులకు పదవీ గండం తప్పదనే నమ్మకం ఉంది. చెంగాళమ్మను విస్మరించి వెళ్లిన ఇందిరాగాంధీ, ఐకే గుజ్రాల్, జయలలిత, ఎన్టీ రామారావు పదవీచ్యుతులయ్యారని అక్కడివారు నమ్ముతారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు ఆలయం దారి గుండా కారులో ప్రయాణించారు. ఈ తర్వాత 1977లో పదవీచ్యుతులయ్యారు. ఐకే గుజ్రాల్ ప్రధానిగా శ్రీహరికోటకు వచ్చి ఆలయం దారి గుండానే తిరిగి వెళ్లి...1998లో పదవి కోల్పోయారు. తమిళనాడు సీఎం జయలలిత, ఎన్టీఆర్‌కు కూడా ఇలాగే పదవీగండం కలిగిందనేది స్థానికుల నమ్మకం.



### అయ్యో కృష్ణా! ఎంత పనిచేశావు

సహజంగా టీడీపీ అభ్యర్థులు ఎన్టీఆర్ ఫొటో పెట్టుకునే ప్రచారం చేసుకుంటారు. కానీ ఎన్టీఆర్ కృష్ణుడి వేషధారణలో ఉన్న ఫొటోను పెట్టుకుని ఓ వ్యక్తి ఎమ్మెల్యే పదవిని కోల్పోవాల్సి వచ్చింది. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నుంచి 1989 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కలమట మోహనరావు, కాంగ్రెస్ అభ్యర్థిగా ధర్మాన నారాయణరావు పోటీపడ్డారు. కలమట మోహనరావు గెలుపొందారు. ఆయన ఎన్టీఆర్ కృష్ణుడి వేషంలోని బొమ్మతో ప్రచారం చేసి ఓటర్లను ఆకర్షించారని, ఆ ఎన్నిక రద్దు చేయాలని నారాయణరావు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తీర్పు తనకు వ్యతిరేకంగా రావడంతో మోహనరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోర్టు తీర్పు వెలువడక ముందే 1994లో శాసనసభ ఎన్నికలొచ్చాయి. ఆ ఎన్నికల్లోనూ కలమట మోహనరావు గెలుపొందారు. ఎన్టీఆర్ కటౌట్ ప్రచారం కేసుకు సంబంధించి 1996లో సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది. కలమటపై అనర్హత వేటు వేసింది. ఎమ్మెల్యే పదవిని కోల్పోయారు.

### పేదల బతుకులు మారాయి



ప్రభుత్వం అందించే ఉచిత పథకాల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బ తింటుందన్న ప్రతిపక్ష పార్టీల ఆరోపణలు వాస్తవం కాదు. ఈ పథకాల వల్లే రాష్ట్రంలోని చాలా మంది పేద ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగయ్యాయి. సీఎం జగన్ పాలనలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఓ భరోసా దక్కింది. మూడు పూటలా తృప్తిగా తినగలుగుతున్నారు. ఈ పథకాల విలువ గురించి వాస్తవ లబ్ధిదారుల్ని అడిగితే వారే చెప్తారు.. తమ బతుకులు ఎలా మారాయో..!

- ఏఎస్‌బీ ప్రసాద్, ముక్తేశ్వరం, పి.గన్నవరం, డా బీఆర్ అంబేద్కర్ కోనసీమ

### విద్య, వైద్యానికి పెద్ద పీట



పేదింటి పిల్లలు గొప్పవాళ్లు కావాలన్నా, పేదరికాన్ని జయించాలన్నా చదువు ఒక్కటే మార్గం. విద్యా రంగం అభివృద్ధితోనే అన్ని రంగాలూ అభివృద్ధి చెందుతాయన్నది సీఎం జగన్ ఆలోచన. అందుకే నాడు–నేడులో స్కూళ్ల అభివృద్ధితోపాటు, అమ్మఒడి, విద్యా దీవెన తదితర పథకాలను అమలు చేస్తున్నారు. నిరుపేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించే దిశగా ఆరోగ్యశ్రీని రూ.25 లక్షలకు పెంచారు. ఆస్పత్రుల్ని అభివృద్ధి చేశారు. అవినీతి రహిత పాలనకు జగనన్నే సీఎం కావాలి.


- జనార్దన్ పురియా, పాత వరక, కవిటి, శ్రీకాకుళం

### ఇది పేదల ప్రభుత్వం



చంద్రబాబు ప్రభుత్వంతో సీఎం జగన్ ప్రభుత్వాన్ని పోలిస్తే నక్కకీ–నాకలోకానికి ఉన్నంత తేడా ఉంది. స్వాతంత్ర్య తర్వాత ఇన్నేళ్లలో ఎవరికీ సాధ్యం కాని, ఏ ప్రభుత్వమూ సాహసించలేని గొప్ప అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. పైసా అవినీతికి తావులేకుండా నేరుగా సంక్షేమ లబ్ధిని ప్రజల ఖాతాల్లోకి జమ చేశారు. ఇన్నాళ్లూ ఈ డబ్బంతా పెత్తందారులు, దోపిడీ దొంగల జేబుల్లోకి వెళ్లినట్లు తేటతెల్లమయింది. పేదలు బతకాలంటే జగన్ గెలవాలి.

- పి.జనార్దనరావు, రిటైర్డ్ టీచర్, కస్పా, విజయనగరం




# గంగపుత్రుల జీవితాల్లో మీన రాశులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గంగపుత్రుల జాతకాలు మారిపోయాయి. గత ప్రభుత్వ కాలంలో వారు పడిన కష్టాలు తొలగిపోయాయి. ఈ ఐదేళ్ల కాలంలో వారింట అన్నీ మీన రాశులే. వ్యయాలన్నీ ఆదాయాలుగా మారాయి. అవమానాల స్థానంలో రాజపూజ్యాలు ఎదురయ్యాయి. ఆక్వా రైతుల జీవన ప్రమాణాలు సైతం మెరుగుపడ్డాయి. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఆటుపోట్లు ఎదుర్కొన్న మత్స్యకారులు, సంక్షోభంలో చిక్కుకున్న ఆక్వా రైతులకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అండగా నిలిచింది.

(పంపాన వరప్రసాద రావు, సాక్షి ప్రతినిధి, అమరావతి)

## గత ప్రభుత్వంలో వేట నిషేధ భృతి రూ.4 వేలే

## వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా రూ.10 వేలు

- డీజిల్ సబ్సిడీ రూ.6.03 నుంచి రూ.9కి పెంపు
- మత్స్యకార కుటుంబాలకు చేయూత, ఆసరా, అమ్మఒడి, ఇంటి స్థలాలు
- 50 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికి సామాజిక పింఛన్లు
- ఆక్వా రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్.. బీమా సౌకర్యం
- ప్రతి కౌంట్‌కు గిట్టుబాటు ధర..15 రోజులకోసారి సమీక్ష
- కంపెనీలు పెంచిన ఆక్వా ఫీడ్ ధరలు మూడుసార్లు ఉపసంహరణ
- స్థానిక వినియోగం పెంపునకు ఫిష్ ఆంధ్రా పేరిట డొమెస్టిక్ మార్కెటింగ్ వ్యవస్థ
- మత్స్యకారులు, ఆక్వా రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు




గ్రేడింగ్ చేసిన రొయ్యలు

### రికార్డు స్థాయిలో దిగుబడులు..ఎగుమతులు

మత్స్య ఉత్పత్తుల దిగుబడులు గణనీయంగా పెరిగాయి. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో రొయ్యల ఉత్పత్తి 1.74 లక్షల టన్నులు ఉంటే.. ఈ 5 ఏళ్లలో 7.47 లక్షల టన్నులకు పెరిగింది. మంచినీటి రొయ్యల దిగుబడులు 10.04 లక్షల టన్నులు, ఉప్పునీటి రొయ్యల దిగుబడులు 7.06 లక్షల టన్నులకు చేరాయి. జాతీయ స్థాయిలో 77.55 శాతం ఏపీలోనే ఉత్పత్తి అవుతోంది. గ్రోత్ రేట్ జాతీయ స్థాయిలో 19.37శాతం ఉంటే, ఏపీలో 23.28 శాతంగా నమోదైంది. 2018–19లో రూ.16,825 కోట్ల విలువైన 3.13 లక్షల టన్నుల మత్స్య ఉత్పత్తులు ఎగుమతి అయితే, 2022–23లో రూ.19,847 కోట్ల విలువైన 3.29 లక్షల టన్నులు ఎగుమతయ్యాయి.






### చినలక్ష్మి సంతోషం



ఈమె పేరు కారే చినలక్ష్మి. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం కోనపాపపేటకు చెందిన ఈమె కుటుంబానికి చేపల వేటే జీవనాధారం. వేట నిషేధ సమయంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కేవలం రూ.2 వేలు మాత్రమే భృతిగా ఇచ్చేవారు. 2019లో ఎన్నికలకు కొద్ది రోజుల ముందు దాన్ని రూ.4 వేలకు పెంచారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏకంగా ఆ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచింది. బోటులో ఆయిల్ నింపే ప్రతిసారీ సబ్సిడీ వస్తోంది. ఆమె కుమార్తెకు నాలుగేళ్లపాటు అమ్మఒడి అందింది. ఈ ఏడాది డిగ్రీలో చేరడంతో జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనకు దరఖాస్తు చేసింది. చేయూత కింద రూ.18,750, ఆసరా కింద రూ.10 వేలు చినలక్ష్మికి జమ అవుతోంది. భర్తకు మత్స్యకార పింఛన్ మంజూరైంది. పొన్నాడ జగనన్న లేఅవుట్‌లో సెంటున్నర స్థలమూ ఇచ్చారు. అక్కడ సెంటు రూ. 2 లక్షలకు పైగా పలుకుతోంది. ఇంటి నిర్మాణం శరవేగంగా పూర్తవుతోంది. ఇలా గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ లబ్ధి పొందలేదని.. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలోనే తమకు మేలు జరిగిందని చిన లక్ష్మి సంతోషంతో చెబుతోంది.

### ఆయిల్ సబ్సిడీ

**టీడీపీ హయాంలో..**

| సంవత్సరం | బోట్లు | మొత్తం(రూ.కోట్లల్లో) |
|---|---|---|
| 2014-15 | 460 | 2.96 |
| 2015-16 | 460 | 8.02 |
| 2016-17 | 460 | 10.23 |
| 2017-18 | 1100 | 7.94 |
| 2018-19 | 1100 | 30.27 |
| మొత్తం | | 59.42 |

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో**

| సంవత్సరం | బోట్లు | మొత్తం(రూ.కోట్లల్లో) |
|---|---|---|
| 2019-20 | 14,229 | 15.41 |
| 2020-21 | 17,504 | 33.28 |
| 2021-22 | 17,770 | 21.85 |
| 2022-23 | 20,034 | 27.50 |
| 2023-24 | 23,209 | 50.00 |
| మొత్తం | | 148.04 |

**ఆక్వా సబ్సిడీ లబ్ధి**

| సంవత్సరం | కనెక్షన్స్ | సబ్సిడీ (రూ.కోట్లల్లో) |
|---|---|---|
| 2019-20 | 54,142 | 577.03 |
| 2020-21 | 57,882 | 843.90 |
| 2021-22 | 61,682 | 956.59 |
| 2022-23 | 29,324 | 393.48 |
| 2023-24 | 54,072 | 726.87 |

### వైఎస్సార్ మత్స్యకార భరోసా (వేట నిషేధ భృతి)

**గత ప్రభుత్వ హయాంలో...వేట నిషేధ భృతి**

| సంవత్సరం | లబ్ధిదారులు | లబ్ధి(రూ.కోట్లల్లో) |
|---|---|---|
| 2014-15 | 12,178 | 2.43 |
| 2015-16 | 66,941 | 13.39 |
| 2016-17 | 68,957 | 27.59 |
| 2017-18 | 73,017 | 29.21 |
| 2018-19 | 80,000 | 32.00 |
| మొత్తం | | 104.62 |

**వైఎస్ జగన్ ప్రభుత్వంలో**

| సంవత్సరం | లబ్ధిదారులు | లబ్ధి(రూ.కోట్లల్లో) |
|---|---|---|
| 2019-20 | 1,02,478 | 102.48 |
| 2020-21 | 1,09,231 | 109.23 |
| 2021-22 | 97,619 | 97.62 |
| 2022-23 | 1,05,161 | 105.16 |
| 2023-24 | 1,23,519, | 123.52 |
| మొత్తం | | 538.01 |

### భరోసా..భద్రత

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న వేట నిషేధ భృతి (మత్స్యకార భరోసా), ఆయిల్ సబ్సిడీల కారణంగా రాష్ట్రంలో వేటకు వెళ్లే బోట్ల సంఖ్య పెరిగింది. భృతి రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెరిగింది. మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లకే కాకుండా తెప్పలు ఇతర సంప్రదాయ నావలపై వేట సాగించే వారికి సైతం ఈ సాయాన్ని వర్తింపజేసింది. బాబు హయాంలో ఏటా సగటున 60 వేల మంది లబ్ధి పొందితే జగన్ హయాంలో ఈ సంఖ్య 1.16 లక్షలు. డీజిల్‌పై లీటర్‌కు రూ.6.03 చొప్పున ఉన్న సబ్సిడీ రూ.9కు పెరిగింది. 50 ఏళ్లు పైబడిన మత్స్యకారులకు ఇస్తున్న పింఛన్‌దారులు 2018–19 నాటికి 42,729 మంది ఉండగా, ప్రస్తుతం 69,741 మంది అందుకుంటున్నారు. దీని కోసం రూ.759.47 కోట్లు ఖర్చు చేస్తోంది. బాబు హయాంలో ఇది రూ.51.57 కోట్లే.



బోట్ల నుంచి చేపల అన్‌లోడింగ్

### ఐదేళ్లలో మత్స్యకారులకు రూ.4913 కోట్ల లబ్ధి

చేపల వేట సమయంలో ప్రమాదవశాత్తూ మృతి చెందిన 175 మందికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున రూ.17.50 కోట్ల పరిహారాన్ని ఈ ప్రభుత్వం అందజేసింది. చంద్రబాబు పాలనలో 300 మందికి అందిన సాయం కేవలం రూ.11.43 కోట్లు మాత్రమే. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో జీఎస్‌పీసీ తవ్వకాల వల్ల జీవనోపాధి కోల్పోయిన 16,554 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.78.22 కోట్లు, ఓఎన్జీసీ పైపులైన్ తవ్వకాల వల్ల జీవనోపాధి కోల్పోయిన 23,458 మంది కుటుంబాలకు ఐదు విడతల్లో రూ.647.44 కోట్లు సాయాన్ని ప్రభుత్వం అందించింది. వివిధ పథకాల ద్వారా ఈ 5 ఏళ్లలో రూ.4913 కోట్ల లబ్ధి నేరుగా మత్స్యకారులకు అందించింది.

### అప్సడా చట్టాలతో ఆక్వా రైతుకు రక్షణ

ఆక్వా కల్చర్ వ్యాపార కార్యకలాపాల పర్యవేక్షణ, నియంత్రణ, ప్రోత్సాహానికి వీలుగా ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ–2020, ఏపీ ఫిష్ ఫీడ్ (క్వాలిటీ కంట్రోల్) యాక్ట్–2020(అప్సడా)లను అమలులోకి తీసుకొచ్చింది. ఇవి నేడు ఆక్వా రైతులకు రక్షణ కవచాలుగా నిలిచాయి. తీర ప్రాంత జిల్లాల్లో 35 ఆక్వా ల్యాబ్స్ ఏర్పాటుతో ఇన్‌పుట్ టెస్టింగ్, వ్యాధి నిర్ధారణ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. తీర గ్రామాల్లోని ఆర్బీకేల్లో 732 ఫిషరీస్ అసిస్టెంట్లను నియమించారు. ఆర్బీకేల ద్వారా నాణ్యమైన సీడ్, ఫీడ్ సప్లిమెంట్స్, మందులు, వలలు, ఇతర ఇన్‌పుట్స్ పంపిణీ చేస్తున్నారు. ప్రతి 15 రోజులకోసారి సమీక్షించి అంతర్జాతీయ మార్కెట్‌లో రొయ్యల ధరల హెచ్చు తగ్గులను 'అప్సడా' ద్వారా మద్దతు ధర దక్కేలా చేస్తోంది. ఐదేళ్లలో 3 సార్లు కంపెనీలు పెంచిన ఫీడ్ ధరలను వెనక్కి తీసుకునేలా చేసింది. దేశంలో మరెక్కడా లేని విధంగా ఆక్వా రైతులకు బీమా సౌకర్యం కల్పించింది. ప్రభుత్వ చర్యల ఫలితంగా డొమెస్టిక్ ఫిష్ మార్కెటింగ్‌కు స్కోచ్ అవార్డుతో పాటు 2021–22, 2023–24లలో బెస్ట్ మెరైన్ స్టేట్ అవార్డులు దక్కాయి.

### ఆక్వా రైతుకు రెట్టింపు ఆనందం

ఆక్వా రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా సాగు విస్తీర్ణం, దిగుబడులు, ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. బాబు హయాంలో ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ పరిధి నోటిఫై చేయడంలో జరిగిన నష్టాన్ని ఈ ప్రభుత్వం గుర్తించి రీ సర్వే చేయించింది. దీంతో 3,56,278 ఎకరాల విస్తీర్ణం పెరిగింది. విద్యుత్ కనెక్షన్ల సంఖ్య 54072కు చేరింది. జోన్ పరిధిలోకి వచ్చిన 10 ఎకరాలలోపు సాగుదారులందరికీ యూనిట్ విద్యుత్ రూ.1.50కే అందించడంతో మెజార్టీ ఆక్వా రైతులకు లబ్ధి చేకూరింది. గత ప్రభుత్వం ఎగ్గొట్టిన విద్యుత్ బకాయిలు రూ.340 కోట్లు సహా ఈ ఐదేళ్లలో రూ.3497 కోట్ల సబ్సిడీ అందుకున్నారు.

### దేశానికే ఆదర్శంగా ఫిష్ ఆంధ్ర

స్థానిక వినియోగం పెంచడం లక్ష్యంగా ఫిష్ ఆంధ్రా బ్రాండింగ్‌తో డొమెస్టిక్ మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నాణ్యమైన మత్స్య ఉత్పత్తులను హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో 40–60 శాతం సబ్సిడీతో జిల్లా స్థాయిలో ఆక్వా హబ్‌లు(రూ.కోటి), వాటికి అనుబంధంగా మినీ రిటైల్ అవుట్‌లెట్స్ (రూ.3లక్షలు), డెయిలీ (రూ.10లక్షలు), సూపర్(రూ. 20లక్షలు), లాంజ్ (రూ.50 లక్షలు) యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో 2 ఆక్వా హబ్‌లతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా 2,630 మినీ, 113 డెయిలీ, 66 సూపర్, 31 లాంజ్, 76 త్రీ వీలర్, 179 ఫోర్ వీలర్ యూనిట్లు మంజూరయ్యాయి. ప్రత్యక్షంగా 6941 మందికి, పరోక్షంగా 13,146 మందికి ఉపాధి లభిస్తోంది.

### కాకినాడ హార్బర్ ఓ ఉదాహరణ

కాకినాడ ఫిషింగ్ హార్బర్‌లో 2018–19లో మెకనైజ్డ్, మోటరైజ్డ్, నాన్ మోటరైజ్డ్ బోట్లు 503 ఉండగా, వాటి సంఖ్య ప్రస్తుతం 578కు చేరింది. మెకనైజ్డ్ బోట్లు 398 నుంచి ఏకంగా 451కి పెరిగాయి. 2018–19 నాటికి వేటకు వెళ్లే వారి సంఖ్య 4,149 ఉంటే ప్రస్తుతం 4,763కు పెరిగింది. మెకనైజ్డ్ బోట్లపై వేటకు వెళ్లే వారి సంఖ్య 3,582 నుంచి 4,059 మందికి చేరింది. గతంలో బోట్లపై ఆధారపడి జీవనోపాధి పొందే వారి సంఖ్య 11,971 మంది ఉండగా, ప్రస్తుతం వారి సంఖ్య 14,541 మందికి పెరిగింది. మత్స్య దిగుబడులు 2018–19లో రూ.677 కోట్ల విలువైన 22,592 టన్నులు వస్తే 2023–24లో రూ.890.12 కోట్ల విలువైన 25,153 టన్నులు వచ్చాయి.



### నర్సాపురం వద్ద దేశంలోనే మూడో మత్స్య యూనివర్సిటీ

నర్సాపురం సమీపంలో రూ.332 కోట్లతో 40 ఎకరాల్లో ఆంధ్రప్రదేశ్ మత్స్య యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారు. రూ.100 కోట్లతో పరిపాలనా భవనం, అకడమిక్ బ్లాక్, బాలుర, బాలికల హాస్టల్స్, రైతు శిక్షణ కేంద్రం, వైస్ చాన్సలర్ బంగ్లా, మల్టీపర్పస్ బిల్డింగ్ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. యూనివర్సిటీ కోసం 140 పోస్టులు మంజూరు చేశారు. కార్యకలాపాలు 2023–24 విద్యాసంవత్సరం నుంచి ప్రారంభమయ్యాయి. దీనికి అనుబంధంగా బీఎఫ్ఎస్సీ కోర్సుతో 60 సీట్లతో కొత్తగా నర్సాపురం ఫిషరీస్ కళాశాలను ఏర్పాటు చేశారు. తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. ముత్తుకూరు మత్స్య కళాశాలలో సీట్ల సంఖ్యను 40 నుంచి 60కి పెంచారు. విశాఖ జిల్లా నక్కపల్లి మండలం బంగారమ్మ పేట వద్ద రూ.36.55 కోట్ల అంచనాతో 30 ఎకరాల్లో ఆక్వాటిక్ క్వారంటైన్ ఫెసిలిటీ సెంటర్ (ఏక్యూ ఎఫ్‌సీ)ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. చెన్నై నుంచి కార్యకలాపాలు నిర్వహించే కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ (సీఏఏ) ప్రాంతీయ కార్యాలయాన్ని విజయవాడలో ఏర్పాటు చేశారు. సిబాతో పాటు మరికొన్ని కేంద్ర కార్యాలయాలను కూడా ఏపీకి తీసుకొచ్చేందుకు అడుగులు వేశారు.

### ఆక్వా రంగానికి జవసత్వాలు



ఆక్వా రంగం నిలదొక్కుకోవడానికి సీఎం వైఎస్ జగన్ చొరవ, కృషి ఎంతగానో ఉపయోగపడింది. ధరలు పతనమైన సమయంలో ఏ ఒక్క ఆక్వా రైతు నష్టపోకుండా చర్యలు తీసుకున్నాం. ప్రాసెసింగ్ సంస్థలు 3 సార్లు పెంచిన ఆక్వా ఫీడ్ ధరలను ఉపసంహరించేలా చేయగలిగాం. ప్రభుత్వం నిర్దేశించిన గిట్టుబాటు ధరకే రొయ్యల కొనుగోలు చేయించగలిగాం. జోన్ పరిధిలో 10 ఎకరాల్లోపు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ విద్యుత్ సబ్సిడీ వర్తింప చేసాం.

-వడ్డి రఘురాం, వైస్ చైర్మన్, ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ



